గురువారం
17•08•2017
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 71
• పేజీలు : 16 + 24

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



## చిక్కుల్లేకుండా నోటిఫికేషన్లు

**శాఖలవారీగా కార్యాచరణ.. ప్రతివారం సమీక్ష**

**85 వేల నియామకాలపై సీఎం కేసీఆర్ ఆదేశం**



- అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు సిద్ధంగా ఉన్నాయి
- నోటిఫికేషన్లకు ముందే న్యాయశాఖతో చర్చించాలి
- ఎవరైనా కేసులు వేస్తే సమర్థవంతంగా ఎదుర్కోవాలి
- అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి
- డిప్యూటీ సీఎం, సీఎస్, టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌తో సీఎం

నెలలో ముగియనున్న 12 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ

సీఎంకు వివరించిన టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి

నియామకాల రోడ్‌మ్యాప్‌పై డిప్యూటీ సీఎం కడియం సమీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలో కొత్తగా 85 వేలకుపైగా ఉద్యోగ నియామకాలు చేపట్టాల్సి ఉన్నందున శాఖలవారీగా కార్యాచరణను రూపొందించుకొని అమలుచేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. న్యాయపరమైన చిక్కులకు అవకాశం లేకుండా నోటిఫికేషన్లు జారీచేసి, నియామకాలు చేపట్టాలని చెప్పారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) చైర్మన్ ఘంటా చక్రపాణి నేతృత్వంలోని అధికారులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలోని అధికారులు కనీసం వారానికి ఒకసారి సమావేశమై, ఉద్యోగ నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ, గురుకుల పాఠశాలల్లోనూ వేల మంది ఉపాధ్యాయులను నియమించాల్సి ఉన్నందున దానికి సంబంధించి వెంటనే కార్యాచరణ రూపొందించాలని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరిని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం కేసీఆర్ ఉద్యోగ నియామకాలకు సంబంధించి కీలకమైన ప్రకటన చేశారు. ఆ మరుసటి రోజు బుధవారం డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ తదితరులతో సీఎం మాట్లాడారు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఖాళీలను భర్తీ చేయడంతోపాటు కొత్త ఉద్యోగాల నియామక ప్రక్రియను వెంటనే చేపట్టాలని ఆదేశించారు.


**ప్రతిపక్షాలు కాచుకుని ఉన్నాయి..**

రాష్ట్రంలో ప్రభుత్వం ఏ పని చేపట్టినా అడ్డుకోవడానికి కొన్ని ప్రతిపక్షాలు కాచుకొని కూర్చున్నాయని, ఉద్యోగ నియామక ప్రక్రియను కూడా కోర్టు కేసుల ద్వారా అడ్డుకుంటున్నాయని సీఎం కేసీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తంగా

మిగతా 2వ పేజీలో



మనోజ్ సి మనూ   సావంత్



## బ్లూ వేల్‌కు మరో ఇద్దరు బలి!

**కేరళలో పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు ▪ ఆ గేమ్ వల్లే మా పిల్లలు ఆత్మహత్య చేసుకున్నారని వెల్లడి**

**నివ్వెరపరిచే విషయాలను బయటపెట్టిన కుటుంబసభ్యులు ▪ గేమ్‌ను నిషేధించడం సాధ్యం కాదంటున్న సైబర్ నిపుణులు**

**తిరువనంతపురం, ఆగస్టు 16 :**

బ్లూవేల్ చాలెంజ్.. ఇప్పుడు రోజుకోచోట పంజా విసురుతున్న ప్రాణాంతక క్రీడ. ఈ గేమ్ ఉచ్చులోపడిన 14 ఏండ్ల విద్యార్థి ముంబైలో అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి చనిపోవడం భారత్‌లో బ్లూవేల్‌కు సంబంధించి వెలుగుచూసిన తొలి ఘటన. అనంతరం డెహ్రాడూన్, పశ్చిమ మిడ్నాపూర్, పుణెలో మూడు ఘటనలు వెలుగుచూసినా, బ్లూవేల్ కారణంగానే అవి జరిగినట్లు నిర్దిష్ట ఆధారాలు మాత్రం దొరుకలేదు. కానీ, ఈ ఘటనలన్నింటిలోనూ చనిపోయిన పిల్లలు ఏదో ఒక సందర్భంలో బ్లూవేల్ గేమ్ గురించి సన్నిహితుల వద్ద ప్రస్తావించడం గమనార్హం. ఇక షోలాపూర్, ఇండోర్‌లలో ఇద్దరు విద్యార్థులు బ్లూవేల్ టాస్క్‌లతో ఆత్మహత్యకు ప్రయత్నించగా, సహచరులు, పోలీసులు అడ్డుకోగలిగారు. తాజాగా కేరళలో రెండు ఉదంతాలు వెలుగు చూశాయి. బ్లూవేల్ చాలెంజ్ గేమ్ వల్లే ఇద్దరు పిల్లలు ప్రాణాలు కోల్పోయారని వారి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. గతనెలలో వేర్వేరుగా జరిగిన ఈ రెండు ఆత్మహత్యలపై తల్లిదండ్రులు ఇప్పుడు అనుమానం వ్యక్తంచేస్తుండగా,

మిగతా 5వ పేజీలో

# రాష్ట్రంలో స్వర్ణయుగం

## స్ఫూర్తిదాయకంగా సంక్షేమ పథకాలు

ఏడాదిలో లక్ష డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టి తీరుతాం

కోటి ఎకరాల మాగాణే సీఎం కేసీఆర్ లక్ష్యం

రాజధాని శివారు పర్యటనలో మంత్రి కేటీఆర్

**183** ఔటర్ లోపలి గ్రామాల్లో తాగునీటి పథకం ప్రారంభం

డీ పోచంపల్లిలో **1600** డబుల్ బెడ్ రూం ఇండ్లకు శంకుస్థాపన

**అధికారం దక్కలేదన్న బాధలో కాంగ్రెస్ ▪ అందుకే నోటికొచ్చినట్టు మాటలు**

**మేం ప్రజలకే జవాబుదారీ.. ప్రతిపక్షాలకు కాదు ▪ మా బాసులు ఢిల్లీలో లేరు.. మీరే మా బాసులు**



రాజధాని శివారు ప్రాంతం షాపూర్‌లో బుధవారం మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించి స్థానిక మహిళకు మంచినీళ్ల బిందెను అందిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఉన్నారు.

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:**

సంక్షేమ రంగంలో భారతదేశంలోనే ఎక్కడాలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో స్వర్ణయుగం నడుస్తున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి కే తారక రామారావు చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో విద్యుత్ సరఫరా బాగుపడిందని, ఇక మంచి నీటి సరఫరా కూడా మెరుగుపడనుందని అన్నారు. మరోవైపు రహదారులు బాగు చేసుకుంటున్నామని చెప్పారు. షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి, పరిమితి లేకుండా పేదవారి కోసం తలా ఆరు కిలోల చొప్పున రేషన్ బియ్యం, హాస్టళ్ల విద్యార్థులకు సన్నబియ్యం, ఒక్కో విద్యార్థికి రూ.25వేలు ఖర్చుచేస్తూ గురుకుల పాఠశాలల ఏర్పాటు.. ఇలా అన్ని వర్గాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. కుల వృత్తులకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. నగరంలో బుధవారం మంత్రి మహేందర్‌రెడ్డి, మేయర్ బొంతు రామ్మోహన్, ఎంపీలు మల్లారెడ్డి, బూర నర్సయ్యగౌడ్, కొండా విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, వివేకానంద, తీగల కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి మంత్రి కేటీఆర్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనచేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని, రూ.628 కోట్లతో ఔటర్ లోపలి గ్రామాల తాగునీటి పథకం పనులకు సంబంధించిన పైలాన్‌ను కొంపల్లిలో ఆవిష్కరించారు. అనంతరం డీ పోచంపల్లిలో 1600 డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అక్కడి నుంచి షాపూర్‌నగర్‌లో 6 మిలియన్ గ్యాలన్ల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెబ్బై ఏండ్ల స్వతంత్ర భారతదేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా, ఏ ముఖ్యమంత్రి ఆలోచించని రీతిలో సీఎం కేసీఆర్ సారథ్యంలో అభివృద్ధి కార్యక్రమాలు దూసుకుపోతున్నాయని చెప్పారు. దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా ఇంటింటికీ నల్లాద్వారా సురక్షిత మంచినీరు అందిస్తున్నామన్నారు. సామాన్య, దిగువ మధ్య తరగతి ప్రజలకు ఏ అవసరాలు ఉంటాయో వాటన్నింటినీ తీర్చుతున్నామని చెప్పారు. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన నాయకుడు కాబట్టే సీఎం కేసీఆర్ ప్రజా అవసరాల మేరకు బృహత్తర కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు.

**ప్రతి గడపకు తాగునీరు**

ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఇంటింటికీ తాగునీరందించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని మంత్రి కేటీఆర్ అన్నారు. ఇంటింటికీ నల్లా నీరు ఇవ్వకుంటే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడుగబోమని ప్రకటించిన ఏకైక సీఎం కేసీఆరేనని చెప్పారు. జీహెచ్ఎంసీలో

మిగతా 2వ పేజీలో

## నేటి నుంచి భారీ వర్షాలు

**ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో చురుకుగా కదులుతున్న రుతుపవనాలు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

వానలు మళ్లీ జోరందుకోనున్నాయి. సాగు పనుల్లో రైతులకు అండగా నిలువనున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా చాలాచోట్ల గురు, శుక్ర, శనివారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాయలసీమ, తెలంగాణ మీదుగా దక్షిణ తమిళనాడు వరకు విస్తరించి ఉన్న ద్రోణి, ఒడిశా తీరం వెంబడి బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మూడురోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నది. ద్రోణి, ఉపరితల ఆవర్తనాలతో నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయని, ఈ ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారులు

మిగతా 2వ పేజీలో



## కన్నపేగు కన్నీరు!



**వృద్ధాశ్రమాల్లో తల్లిదండ్రులు బందీ**

**భారంగా భావించి వదిలేస్తున్న పుత్రరత్నాలు**

**నిర్లక్ష్యం వహించేవారిలో విద్యావంతులే అధికం**

బతుకు మొదలుపెట్టగానే బాధ్యతలు మరిచిన పుత్రరత్నాల నిర్వాకానికి అవి నిదర్శనాలు! అవసాన దశలో ప్రేమానురాగాలు, ఆప్యాయతలే ఔషధాలుగా బతుకుతూ రోజులు లెక్కపెట్టుకునే పండుటాకులకు అవి బందిఖానలు! నాన్నా అంటూ తన బిడ్డలను గోముగా నిదుర లేపిన అమ్మ.. ఇప్పుడు ఓ వృద్ధాశ్రమంలో లేవలేని స్థితిలో ఆసరాకోసం తపించిపోతున్నది! మా బంగారు కొండ.. అంటూ చేయి పట్టుకుని కొడుకును నడిపించిన నాన్న.. జీవిత చరమాంకంలో నాలుగడుగులు వేసేందుకు కొడుకు కొనిచ్చి వెళ్లిన చేతికర్రను వెతుక్కుంటున్నాడు! ఏసీ గదులున్నాయి.. కొడుకులు, కోడళ్లు వినోదయాత్రకో విహార యాత్రకో వెళ్లి సంతోషంగా గడుపుతున్న సందర్భాలను ఫొటోలుగా పంపిస్తే వాటిని ఫోన్‌లో చూసుకునేందుకు వైఫై సదుపాయాలున్నాయి! క్లబ్‌హౌస్‌లు.. స్విమ్మింగ్ పూల్స్.. ఒకటేమిటి అన్ని అధునాతన సదుపాయాలతో కట్టిపడేసే చెరసాలలవి! కానీ.. ఆప్యాయత లేదు.. అనురాగం లేదు.. ప్రేమ లేదు! ఆఖరి దశలో మనుమలు, మనుమరాళ్లతో ముచ్చట్లు పెట్టుకునే కనీస ముచ్చట కూడా తీరని వ్యథతో ఆ కన్నపేగులు ఇప్పుడు కన్నీరు పెడుతున్నాయి! ఆ కన్నీరును తుడిచి.. వారికి న్యాయ సహాయం అందించేందుకు హెల్పేజ్ ఇండియా వంటి సంస్థలు ముందుకొస్తున్నాయి!!

వివరాలు 6వ పేజీలో

## జూన్‌నాటికి ఎస్సారెస్పీ రెండో దశ

- వేగంగా తుపాకులగూడెం పనులు
- ప్రగతిపై ఇక ప్రతివారం సమీక్ష
- ఎస్సారెస్పీ చివరి భూములకూ నీరందాలి
- ప్రజాప్రతినిధుల సహకారంతో అడ్డంకులు అధిగమించండి
- అధికారులకు మంత్రి హరీశ్ ఆదేశం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

శ్రీరాంసాగర్ రెండో దశ పనులను 2018 జూన్ నాటికి పూర్తిచేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి టీ హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. దీనితోపాటు తుపాకులగూడెం బరాజ్ పనుల్లో కూడా వేగం పెంచాలన్నారు. బుధవారం జలసౌధలో ఈ రెండు ప్రాజెక్టుల పనుల పురోగతిపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఇకపై ప్రతి వారం పనుల పురోగతిని సమీక్షించాలని ఉన్నతాధికారులకు స్పష్టంచేశారు. తుపాకులగూడెం పూర్తయితేనే ఏడాదిలో పది నెలలపాటు దేవాదుల పంపులు నిరంతరాయంగా పనిచేస్తాయన్నారు. తుపాకులగూడెం బరాజ్ వల్ల దేవాదుల ప్రాజెక్టులో ఆరు లక్షల ఎకరాల స్థిరీకరణ జరుగుతుందన్నారు. ఎస్సారెస్పీ రెండో దశ నుంచి పూర్వ నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోని కరువుపీడిత ప్రాంతాల్లో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పనులు జరుగుతున్నాయన్నారు. ఇందుకుగాను రూ.1321 కోట్లతో పనులు చేపడుతున్నట్టు చెప్పారు. 2005 నుంచి 2014 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎస్సారెస్పీ రెండో దశ పరిధిలో 2.25 లక్షల ఎకరాలు స్థిరీకరించిందని చెప్తూ.. మరో 1.75 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నారు. కాకతీయ

మిగతా 2వ పేజీలో

### మున్సిపాలిటీల్లో తిష్ఠవేసిన అధికారులకు బదిలీలు

- చరిత్రలో మొదటిసారి!
- మొత్తం 28 మందికి స్థానభ్రంశం
- జీహెచ్ఎంసీ నుంచి ఇతర మున్సిపాలిటీలకు అధికారులు
- ఇతర మున్సిపాలిటీల నుంచి జీహెచ్ఎంసీకి
- మంత్రి కేటీఆర్ పట్టుదలతో ప్రక్షాళన ప్రారంభం

2

### అందుబాటు ధరలో మోకాలి పరికరాలు

ధరలు రూ.54వేల నుంచి 1.14లక్షల మధ్య ఉండాల్సిందే : కేంద్రం

70% వరకు తగ్గనున్న శస్త్రచికిత్స వ్యయం

5

## పీఎంకేఎస్‌వై ప్రాజెక్టులకు నాబార్డు రుణం

**ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.9,020 కోట్లు**

**మూడేండ్లలో 11 తెలంగాణ ప్రాజెక్టులకు ప్రయోజనం ▪ తొలివిడుతలో ఆరు ప్రాజెక్టులకు నిధులు**


**ఈశాన్య రాష్ట్రాల్లో పరిశ్రమలకు పన్ను మినహాయింపు ▪ ఉన్నత, మాధ్యమిక విద్య సెస్‌కు ఒకే కార్పస్ ఫండ్**

**కేంద్ర మంత్రివర్గం నిర్ణయం ▪ కొత్త మెట్రోరైల్ పాలసీకి ఓకే**

పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై) కింద నాబార్డు ద్వారా రుణాలందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం ఢిల్లీలో జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈమేరకు పలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. పీఎంకేఎస్‌వై కింద మూడేండ్లలో పూర్తిచేసేందుకు దేశవ్యాప్తంగా 99 ప్రాజెక్టులను కేంద్రం ఎంపిక చేసింది. వీటిలో 11 తెలంగాణ ప్రాజెక్టులు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.9020 కోట్ల మేర నాబార్డు రుణాలను ఆరుశాతం వడ్డీపై రాష్ట్రాలకు ఇచ్చేందుకు కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఫలితంగా తొలివిడుతలో ఆరు తెలంగాణ నీటిపారుదల ప్రాజెక్టులకు నిధులు సమకూరనున్నాయి. దీంతోపాటు ప్రభుత్వరంగ సంస్థల్లో వ్యూహాత్మక వాటాల విక్రయానికి ప్రత్యేక కమిటీ, ఈశాన్య రాష్ట్రాల్లోని పరిశ్రమలకు పన్ను మినహాయింపు, కొత్త మెట్రోరైల్ పాలసీ వంటి పలు ప్రతిపాదనలకూ కేంద్ర క్యాబినెట్ పచ్చజెండా ఊపింది.

వివరాలు 5వ పేజీలో

### స్వల్పకాలిక పంట రుణాలకూ ఆధార్!



సకాలంలో చెల్లించే రైతులకు 4% వడ్డీకే

13

## 21న ఉపరాష్ట్రపతి వెంకయ్యకు పౌరసన్మానం

### ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్ణయం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు ఈ నెల 21న పౌరసన్మానం చేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. తెలంగాణ ప్రజలు, ప్రభుత్వం తరపున రాజ్‌భవన్‌లో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఉపరాష్ట్రపతి గౌరవార్థం దిల్‌ఖుష్ అతిథిగృహం ప్రాంగణంలో విందు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు ఘనంగా ఏర్పాట్లుచేయాలని అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించారు.

## నేటి నుంచి చిన్నారులకు టీకాలు

### తట్టు, రూబెల్లా వ్యాధుల నివారణకు చర్యలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచి తట్టు (మీజిల్స్), రూబెల్లా వ్యాధుల నివారణ కోసం చిన్నారులకు టీకాలు వేసే కార్యక్రమం ప్రారంభమవుతుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు రాజ్‌భవన్ స్కూల్‌లో టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని, 11 గంటలకు పూల్‌బాగ్‌లోని మైనారిటీ పాఠశాలలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, 11.30 గంటలకు జామై నిజామియా స్కూల్ పిల్లలకు డిప్యూటీ సీఎం మహమూద్ అలీ టీకాలు వేస్తారని చెప్పారు. రూబెల్లా టీకాలను వేయడం వల్ల ఎలాంటి సమస్యలు రావని, ప్రాణాంతకమైన జబ్బుల నుంచి పిల్లలను కాపాడుకోవచ్చని మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాదాపు ఐదు వారాలపాటు జరిగే ఈ కార్యక్రమంలో 9 నెలల నుంచి పదిహేనేండ్లలోపు వయసు గల పిల్లలకు టీకాలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తిచేశారు. స్కూలులో ఉండే విద్యార్థులే కాకుండా బడిబయట ఉన్న పిల్లలకూ వైద్యసిబ్బంది టీకాలు వేస్తారని చెప్పారు. టీకాలు వేయించలేకపోయిన పిల్లల కోసం.. తమ సిబ్బంది ఐదోవారంలో ఇంటింటికీ తిరిగి టీకా వేస్తారని లక్ష్మారెడ్డి వివరించారు.

## నాలుగు గ్రామాల్లో భూ సర్వే పూర్తి

### ప్రయోగాత్మకంగా చేపట్టిన ప్రత్యేక కమిటీ

### నివేదిక రూపకల్పనలో నిమగ్నం.. 19న సీఎం సమీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సమగ్ర భూసర్వే కోసం సర్కారు సన్నద్ధమయింది. ఇందులోభాగంగా ప్రయోగాత్మకంగా నాలుగు గ్రామాల్లో ప్రత్యేక కమిటీతో భూ సర్వే చేపట్టింది. ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లా తుర్కగూడ, ఎర్రకుంట, చింతపల్లిగూడ, సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ గ్రామాల్లో అధికారులు భూ సర్వే చేశారు. ఒక్కో గ్రామంలో 5 డీజీపీఎస్ పరికరాలను వినియోగించి 300 ఎకరాల వరకు సర్వేచేశారు. సర్వే ఎలా చేయాలన్నదానిపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్ చైర్మన్‌గా రూపొందించిన కమిటీ బుధవారం రాజేంద్రనగర్‌లోని టీఎస్ఐపార్డ్‌లో సమావేశమైనట్టు సమాచారం. సర్వేపై నివేదికను రూపొందిస్తున్నట్టు తెలిసింది. గతంలో భూభారతి ప్రాజెక్టు కింద నిజామాబాద్ జిల్లాలో ప్రయోగాత్మకంగా చేపట్టిన సర్వే సరైన ఫలితాలను ఇవ్వలేదు. సర్వేచేసి ఎనిమిదేండ్లు అవుతున్నా రికార్డులను తయారుచేయలేకపోయారు. ఫొటోగ్రఫీ విధానంలో జరిగిన ఈ సర్వేపై, ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న సర్వే విధానాలపై కమిటీ సుదీర్ఘంగా చర్చించింది. ఈ సమావేశంలో రంగారెడ్డి, ఖమ్మం, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లతోపాటు ముగ్గురు ఆర్డీవోలు, సర్వే సెటిల్‌మెంట్ శాఖ, రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు పాల్గొన్నారు. సర్వేపై రూపొందించిన తుది నివేదికను 19వ తేదీలోపు ముఖ్యమంత్రికి అందజేయనున్నట్టు తెలిసింది. 19న జరిగే రెవెన్యూ శాఖ సమీక్షలో సర్వే ఎలా చేయాలన్న దానిపై సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోనున్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన అనంతరం హైదరాబాద్ శివారులోని కొంపల్లిలో జరిగిన సభలో మాట్లాడుతున్న మంత్రి కే తారకరామారావు. చిత్రంలో ఎంపీలు బూర నర్సయ్యగౌడ్, మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు నరేందర్‌రెడ్డి, శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు వివేకానంద, సుధీర్‌రెడ్డి, తీగల కృష్ణారెడ్డి, జలమండలి ఎండీ దాన కిశోర్ తదితరులు కూడా ఉన్నారు.

# రాష్ట్రంలో స్వర్ణయుగం

మొదటిపేజీ తరువాయి...

విలీనమైన 12 మున్సిపాల్టీల్లో రూ.1900కోట్లు ఖర్చు పెట్టి రికార్డు సమయంలో ఆ పనులను పూర్తిచేశామని కేటీఆర్ తెలిపారు. ఇదే స్ఫూర్తితో 158 కిలోమీటర్ల మేర ఔటర్ లోపలి గ్రామాలకు తాగునీరందించేందుకు పట్టణ భగీరథ పథకం కింద రూ.628 కోట్లతో పనులు చేపట్టినట్టు వివరించారు. మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో 183 గ్రామాలు, ఏడు మున్సిపాల్టీల్లో 285 కిలోమీటర్లు ట్రంక్‌మెయిన్స్, 1200 కిలోమీటర్ల డిస్ట్రిబ్యూషన్ పైపులైన్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ఏడాదిలో ఈ పనులను పూర్తిచేసి, ప్రతి మనిషికి 135 లీటర్ల తాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. ఈ గ్రామాలలో ప్రస్తుతం రోజూ సరఫరా అవుతున్న ఏడు మిలియన్ గ్యాలన్ల నీటి స్థానంలో 33 మిలియన్ గ్యాలన్ల నీటిని ఈ ప్రాజెక్టు ద్వారా అందించడంతోపాటు అదనంగా 1.50 లక్షల మందికి కొత్తగా నల్లా కనెక్షన్లు మంజూరు చేస్తామన్నారు. ఈ పథకం పూర్తయితే 10 లక్షల జనాభాకు లబ్ధి కలుగుతుందని కేటీఆర్ తెలిపారు. సురక్షిత మంచినీరు అందించగలిగితే పేద ప్రజలు వైద్యం మీద పెడుతున్న ఖర్చు 70-80శాతం తగ్గిపోతుందని చెప్పారు.

**కేశవపూర్‌లో భారీ రిజర్వాయర్**

హైదరాబాద్ రోజురోజుకు ఎదుగుతున్న మహా నగరమని కేటీఆర్ అన్నారు. శివారు ప్రాంతాలు, ఔటర్ రింగు రోడ్డు లోపలి గ్రామాలను కలుపుకొంటే కోటి పైచిలుకు జనాభా ఉంటుందన్నారు. రాష్ట్రంలో మూడో వంతు జనాభా కలిగిన ఈ ప్రాంత మంచినీటి అవసరాలను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని కేటీఆర్ విమర్శించారు. నాగార్జునసాగర్, ఎల్లంపల్లి నుంచి హైదరాబాద్‌కు తాగునీటిని సరఫరా చేయాల్సి వస్తున్నదన్నారు. మహారాష్ట్ర, కర్ణాటకల్లో వర్షాలు సరిగ్గా లేకపోయినా, ఎల్లపల్లికి నీరు రాకపోయినా, వందల కిలోమీటర్ల పొడవైన పైపులైన్‌లో ఏదైనా ఇబ్బంది తలెత్తినా హైదరాబాద్ తాగునీటి వ్యవస్థ అతలాకుతలం అవుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే కరువు వచ్చి, రెండు మూడేండ్లు ఇబ్బంది కలిగినా నగర తాగునీటికి ఎలాంటి ఢోకా ఉండొద్దన్న ఉద్దేశంతోనే సీఎం కేసీఆర్ సాగునీటికి సంబంధం లేకుండా భారీ రిజర్వాయర్‌కు శ్రీకారం చుట్టారని తెలిపారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం కేశవపూర్‌లో ఏర్పాటుచేయనున్న భారీ రిజర్వాయర్.. విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.

**కోటి ఎకరాల మాగాణే లక్ష్యం**

నా తెలంగాణ కోటి రతనాల వీణ అని ప్రజాకవి దాశరథి అంటే.. ఈ రోజు ముఖ్యమంత్రి కేసీఆర్ నా తెలంగాణ.. కోటి ఎకరాల మాగాణి కూడా కావాలని చెప్తున్నారని కేటీఆర్ అన్నారు. ఈ క్రమంలోనే కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా తెలంగాణలోని బీడు భూములకు సాగునీరిందించే ప్రయత్నంచేస్తూనే మరోవైపు ఇంటింటికీ తాగునీరందించేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. పేదలు ఆత్మగౌరవంతో బతుకాలన్న లక్ష్యంతో రూ.18వేల కోట్లతో డబుల్ బెడ్ రూం ఇండ్ల పథకం, రూ.5వేల కోట్లతో గొర్రెల పంపిణీ, రూ.2వేల కోట్లతో మత్స్యకారులకు.. ఇలా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలు చేపడుతున్నారని వివరించారు.

**ఏడాదిలో లక్ష డబుల్ బెడ్ రూం ఇండ్లు**

పేదలు ఆత్మగౌరవంతో నివసించాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్దేశమని కేటీఆర్ తెలిపారు. ఇందుకోసం డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలను అద్భుతంగా చేపడుతున్నట్టు చెప్పారు. 'గత కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పేరిట ఒక్క గది కట్టి అందరినీ సంసారం చేయమన్నది. కొన్ని డబ్బులు మేం ఇస్తాం.. కొన్ని డబ్బులు మీరు కట్టాలి.. అంటూ మూడు రంగులు వేసి, వాటిని కేటాయించేందుకు ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించింది. కానీ టీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.8.65లక్షలు ఖర్చు చేస్తున్నది. మార్కెట్లో దీని విలువ రూ.25నుంచి రూ.30 లక్షలు ఉంటుంది' అని కేటీఆర్ వివరించారు. ఈ ఇండ్లను పూర్తి ఉచితంగా కట్టించి ఇస్తున్న విషయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. ఒక్క సంవత్సరంలోనే లక్ష ఇండ్లు కట్టించి తీరుతామని స్పష్టంచేశారు. ఇది ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేసే కార్యక్రమం కాదని, పేదలందరికీ ఇండ్లు అందే వరకూ కొనసాగుతుందని చెప్పారు.



కొంపల్లిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న మంత్రి కే తారక రామారావు. చిత్రంలో మంత్రి మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కూడా ఉన్నారు.

### ప్రతిపక్షాలకు పనిలేకుండా పోయింది

గతంలో శివారు మున్సిపాల్టీల్లో 10 నుంచి 15 రోజులకొకసారి నీటి సరఫరా ఉండేదని కేటీఆర్ గుర్తుచేశారు. ఎండాకాలం వచ్చిందంటే చాలు పేద మహిళలను వెంటబెట్టుకుని ఖైరతాబాద్ జలమండలి ప్రధాన కార్యాలయం ముందు ఖాళీ కుండలతో ప్రతిపక్షాలు ధర్నాలు చేసేవని కేటీఆర్ చెప్పారు. 'టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినాక నెత్తిన కుండలు లేవు.. ధర్నాలు లేవు.. అసలు ప్రతిపక్షాలకు పనిలేకుండా పోయింది' అని ఎద్దేవాచేశారు. పట్టణంలో సకాలంలో మంచినీటి సరఫరా చేస్తున్నామని, శివార్లలోనూ ఇదే దృశ్యాన్ని ఆవిష్కస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. నాణ్యమైన నీటిని సరఫరా చేస్తూ ఐఎస్‌వో సర్టిఫికెట్ సాధించిన జలమండలిని ఈ సందర్భంగా మంత్రి ప్రశంసించారు. శివారులో చాలా కాలనీలు, అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలకు బాసటగా నిలిచి తాగునీరందించాలని, ఈ బాధ్యత జలమండలి తీసుకుని కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి కేటీఆర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డైరెక్టర్లు సత్యనారాయణ, సూర్యనారాయణ, సీజీఎం రాంచంద్రారెడ్డి, జీఎం శివరాజు తదితరులు పాల్గొన్నారు.

**ఈ సమస్యలన్నింటికీ కాంగ్రెస్ కారణం కాదా?**

స్వాతంత్య్రం వచ్చి డెబ్బై ఏండ్లు అవుతున్నా ఇంకా చాలా గ్రామాల్లో కరెంట్, రోడ్లు, ప్రజలకు కనీసం మంచినీళ్లు అందించలేని పరిస్థితులు ఉన్నాయంటే గత పాలకులు ఎంత గొప్పగా పాలించారో అర్థం చేసుకోవచ్చని కేటీఆర్ ఎద్దేవాచేశారు. 50-55 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ఈ సమస్యలన్నింటికీ కారణం కాదా? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం మూడున్నరేండ్లలోనే ఒకవైపు మౌలిక వసతులు, మంచినీరు, రహదారులు, ఇతర సౌకర్యాలు ఏర్పాటుచేస్తూ, మరోవైపు సంక్షేమ కార్యక్రమాల అమలులో దూసుకుపోతున్నదని అన్నారు. మూడున్నరేండ్ల క్రితం తెలంగాణ ఏర్పడక ముందు చాలా రకాల భయాలు, మనలో మనకే అపోహలు సృష్టించారని కేటీఆర్ అన్నారు. 'తెలంగాణ వస్తే ఇక్కడ మొత్తం చీకటి అయితది.. ఉన్న పరిశ్రమలు వెళ్లిపోతాయి.. అని అప్పుడున్న పాలకులు భయపెట్టారు. కానీ తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎర్రటి ఎండకాలంలో కూడా ఇండ్లకు, పరిశ్రమలకు 24 గంటల కరెంట్ ఇస్తున్న ఘనత మన సీఎం కేసీఆర్‌దే. కొన్ని జిల్లాల్లో వ్యవసాయానికి కూడా 24 గంటలు కరెంటు ఇస్తున్నం' అని కేటీఆర్ తెలిపారు.

**మా బాసులు ఢిల్లీలో లేరు.. మీరే..**

టీఆర్ఎస్ ప్రభుత్వానికి బాసులు ఢిల్లీలో లేరని, ప్రజలే తమ బాసులని మంత్రి కేటీఆర్ స్పష్టంచేశారు. 'ఒకటి తర్వాత ఒకటి బాగుపడుతుంటే కొందరు నిరాశ నిస్పృహల్లో ఉన్నారు. అధికారం దూరమైపోయిందన్న బాధలో రకరకాలుగా మాట్లాడుతున్నరు.. వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదు. మాకు ఢిల్లీలోనో.. మరెక్కడనో బాసుల్లేరు. గల్లీల్లో ఉన్న మీరే మాకు బాసులు. మేం మీకే జవాబుదారీ. మీరు తిరస్కరించిన ప్రతిపక్షాలకు సమాధానం చెప్పాల్సిన అక్కర లేదు' అని కేటీఆర్ అన్నారు. 'మేం సరిగా పనిచేయకపోతే 2019లో శిక్షించే అధికారం మీకు ఉంటది.. కానీ పని చేసిన ప్రభుత్వాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత మీకు ఉంటది' అని కేటీఆర్ చెప్పారు.




### లోకం పోకడ



ప్రభుత్వం మీద బురద చల్లడానికి, కోర్టులో కేసులు వేయడానికి మరింత స్వేచ్ఛ కావాలట!

### ముహూర్తం



సూర్యోదయం: 6.03 గంటలకు



సూర్యాస్తమయం: 6.37 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం, దశమి మధ్యాహ్నం 12.45 వరకు, తదుపరి ఏకాదశి. నక్షత్రం: రోహిణి, మధ్యాహ్నం 12.51 వరకు, తదుపరి మృగశిర. అమృత ఘడియలు: మధ్యాహ్నం 2.53 నుంచి 4.29 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.54 నుంచి 3.28 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.16 నుంచి 4.56 వరకు, వర్జ్యం: ఉదయం 6.01 నుంచి 7.37 వరకు.

# చిక్కుల్లేకుండా నోటిఫికేషన్లు

మొదటిపేజీ తరువాయి...

ఉండాలన్నారు. న్యాయపరమైన చిక్కులకు అవకాశం లేకుండా నోటిఫికేషన్లు ఇచ్చి, నియామక ప్రక్రియ చేపట్టాలని సీఎం సూచించారు. నోటిఫికేషన్లు ఇవ్వడానికి ముందే న్యాయశాఖతో చర్చించాలని చెప్పారు. ఎవరైనా కోర్టు కేసులు వేస్తే వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ మేరకు అధికారులంతా సమన్వయంతో పని చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాతనే శాఖల వారీగా ఖాళీలను భర్తీచేయడానికి, కొత్త నియామకాలను చేపట్టడానికి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పడిందని, దీని ద్వారా ఇప్పటికే 58 నోటిఫికేషన్లు జారీ చేసి, నియామక ప్రక్రియను ముందుకు తీసుకుపోతున్నామని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి సీఎం కేసీఆర్‌కు వివరించారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా ఇప్పటి వరకు ఐదువేల మంది నియమితులయ్యారని, మరో నెల వ్యవధిలో 12 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ముగుస్తుందని సీఎంకు తెలిపారు. న్యాయపరమైన వివాదాలు కూడా కొలిక్కి వచ్చాయని, త్వరలోనే గ్రూప్-1, గ్రూప్-2 ఫలితాలు ప్రకటిస్తామని సీఎంకు ఘంటా వివరించారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి, భవిష్యత్తులో సుమారు 85వేల ఉద్యోగాలను భర్తీ చేయాల్సి ఉన్నందున టీఎస్‌పీఎస్సీ గురుతరమైన బాధ్యత పోషించాలని సీఎం కోరారు. టీఎస్‌పీఎస్సీకి పని భారం పెరిగినందున కొత్తగా 90 మందిని కమిషన్‌లో నియమించడానికి సీఎం అంగీకరించారు.

**అధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష**

సీఎం ఆదేశాల నేపథ్యంలో ఉద్యోగాల భర్తీకి అనుసరించాల్సిన రోడ్‌మ్యాప్‌పై డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, న్యాయ శాఖ కార్యదర్శి నిరంజన్‌రావు, టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీ ప్రసాద్, జీఏడీ ముఖ్యకార్యదర్శి అధర్‌సిన్హా తదితరులు బుధవారం సచివాలయంలో సమావేశమయ్యారు. ఉద్యోగ నియామకాల ప్రక్రియకు అవలంబించాల్సిన వ్యూహంపై చర్చించారు. శాఖల వారీగా ఉద్యోగాల భర్తీకి వెంట వెంటనే నోటిఫికేషన్లు జారీచేయాలని, వచ్చే ఏడాది ఏర్పడే ఖాళీలను ముందుగానే తీసుకొని నియామకాలు చేపట్టాలని నిర్ణయించారు. సీఎం కేసీఆర్ ఆదేశించిన విధంగా 1.12 లక్షలకు పైగా నియామకాల లక్ష్యాన్ని అధిగమించేందుకు నిరంతరం కృషి చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే కొన్ని నోటిఫికేషన్లపై కొందరు కోర్టుకు వెళ్లినందున ఆ కేసులకు సంబంధించి కూడా న్యాయస్థానంలో సమర్థవంతంగా వాదనలు వినిపించాలని నిర్ణయించారు. నియామకాలను వివాదాస్పదం చేయాలని కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండి తెలంగాణ యువతకు న్యాయం చేయడం లక్ష్యంగా పని చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం త్వరితగతిన ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాల్సిన బాధ్యత మనపై ఉందని చెప్పారు. నోటిఫికేషన్లు జారీచేసే క్రమంలో ఎదురవుతున్న న్యాయపరమైన, ఇతర ఇబ్బందులను అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలు కూడా సమావేశంలో చర్చకు వచ్చాయి. ఇప్పుడు అమలులో ఉన్న రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు పాత పది జిల్లాల ప్రకారం నోటిఫికేషన్లను జారీచేయాలా? లేక కొత్తగా ఏర్పాటు చేసుకున్న 31 జిల్లాల ప్రకారం జారీచేయాలా? అన్న అంశంపై ప్రతిపాదనలను వెంటనే తమకు అందజేయాలని న్యాయశాఖ సెక్రటరీని డిప్యూటీ సీఎం కోరారు. ఈ ఖాళీల భర్తీలో జాప్యం జరుగకుండా శాఖల వారీగా ఖాళీలను గుర్తించి, వాటి భర్తీలో అభ్యర్థులకు కావాల్సిన విద్యార్హతలు, రోస్టర్ పాయింట్లను కూడా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై ఈ నెల 21న సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు.



ఉద్యోగ నియామకాలపై బుధవారం సచివాలయంలో సమీక్షిస్తున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి. చిత్రంలో సీఎస్ ఎస్పీ సింగ్, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి తదితరులు

# చరిత్రలో మొదటిసారి!

### మున్సిపాలిటీల్లో తిష్ఠవేసిన అధికారులకు బదిలీలు

### మొత్తం 28 మందికి స్థానభ్రంశం

### జీహెచ్ఎంసీ నుంచి ఇతర మున్సిపాలిటీలకు అధికారులు

### ఇతర మున్సిపాలిటీల నుంచి జీహెచ్ఎంసీకి

### మంత్రి కేటీఆర్ పట్టుదలతో ప్రక్షాళన ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పురపాలకశాఖ చరిత్రలో మొదటిసారిగా జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బందిని ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు బదిలీ చేశారు. ఏండ్లతరబడి మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో పాతుకుపోయిన ఉద్యోగులు, అధికారుల పీఠాలు కూడా కదిలాయి. మున్సిపల్‌శాఖ మంత్రి కే తారకరామారావు ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీలో తిష్ఠవేసిన అధికారులను ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు.. ఆయా మున్సిపాలిటీల అధికారులను జీహెచ్ఎంసీకి బదిలీ చేశారు. ఈ మేరకు పురపాలకశాఖ కార్యదర్శి నవీన్ మిత్తల్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. జీహెచ్ఎంసీ నుంచి బదిలీ అయిన వారిలో 10 మంది ఏసీపీలు, ఇద్దరు టీపీవోలు, ఇద్దరు టీపీఎస్‌లు ఉన్నారు. అలాగే ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీల నుంచి జీహెచ్ఎంసీకి బదిలీపై వచ్చేవారిలో 10 మంది ఏసీపీలు, ఇద్దరు టీపీవోలు, ఇద్దరు టీపీఎస్‌లు ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏకీకృత సర్వీసు నిబంధనలపై దృష్టి సారించింది. ఒకేచోట అధికారులు పాతుకుపోవడంవల్ల అవినీతి, అక్రమాలు, అవకతవకలకు ఆస్కారం ఏర్పడుతుందని భావించి, ఏకీకృత సర్వీసు నిబంధనలను రూపొందించింది. దానిని చట్టంగా తీసుకొచ్చింది. దీంతో జీహెచ్ఎంసీతోపాటు, రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఉన్న అధికారులు, ఉద్యోగులను ఎక్కడికైనా బదిలీచేసే అవకాశం ఏర్పడింది. తద్వారా మున్సిపల్‌శాఖలో జవాబుదారీతనం, పారదర్శకత నెలకొంటుందనేది ప్రభుత్వ యోచన. ఈ నేపథ్యంలోనే ఇప్పటివరకు ఎన్నడూ లేని విధంగా మొదటిసారి 28 మంది మున్సిపల్‌శాఖ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులకు స్థానచలనం కలిగింది. త్వరలోనే మరో విడుత కూడా బదిలీలు ఉండే అవకాశం ఉన్నట్టు సమాచారం.

**జీహెచ్ఎంసీ నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన అధికారులు**

| అధికారిపేరు | పోస్టు | ప్రస్తుతం పనిచేస్తున్న స్థానం | బదిలీ అయిన స్థానం |
|---|---|---|---|
| బీ చంద్రశేఖర్ | ఏసీపీ | జీహెచ్ఎంసీ | ఏసీపీ నిజామాబాద్ |
| కే సాంబయ్య | ఏసీపీ | జీహెచ్ఎంసీ | ఏసీపీ వరంగల్ |
| సీవీ పురుషోత్తమ్‌రావు | ఏసీపీ | జీహెచ్ఎంసీ | ఏసీపీ రామగుండం |
| బీ శ్రీమన్నారాయణగౌడ్ | ఏసీపీ | జీహెచ్ఎంసీ | హెచ్ఎం ఆర్ఎల్ |
| కే శ్రీనివాస్ | ఏసీపీ | జీహెచ్ఎంసీ | ఏసీపీ నల్లగొండ |
| ఎం శేఖర్‌రెడ్డి | ఏసీపీ | జీహెచ్ఎంసీ | ఏసీపీ/ఆర్డీటీపీ వరంగల్ |
| వీ ప్రసాద్ | ఏసీపీ | జీహెచ్ఎంసీ | డీటీపీసీవో కరీంనగర్ |
| జే క్రిష్టోఫర్‌రాజ్ | ఏసీపీ | జీహెచ్ఎంసీ | ఏసీపీ ఖమ్మం |
| ఎం నరహరినాయక్ | ఏసీపీ | జీహెచ్ఎంసీ | డీటీసీపీవో మంచిర్యాల్ |
| కే మహిపాల్‌రెడ్డి | ఏసీపీ | జీహెచ్ఎంసీ | ఏసీపీ వరంగల్ |
| పీ జగన్‌మోహన్ | టీపీవో | జీహెచ్ఎంసీ | టీపీవో జగిత్యాల |
| ఎస్ రాజశేఖర్ | టీపీవో | జీహెచ్ఎంసీ | టీపీవో భూపాల్‌పల్లి |
| వీబీ శ్రీనివాస్ | టీపీఎస్ | జీహెచ్ఎంసీ | టీపీఎస్ మహబూబ్‌నగర్ |
| పీ అశోక్ | టీపీఎస్ | జీహెచ్ఎంసీ | టీపీఎస్ ఖమ్మం |

**ఇతర ప్రాంతాల నుంచి జీహెచ్ఎంసీకి బదిలీ అయిన అధికారులు**

| | | | |
|---|---|---|---|
| ఎం శైలజ | ఏసీపీ | గ్రేటర్ వరంగల్ | జీహెచ్ఎంసీ |
| కే మల్లికార్జునరావు | ఏసీపీ | నిజామాబాద్ | జీహెచ్ఎంసీ |
| వీ ప్రవీణ్‌కుమార్ | ఏసీపీ | హెచ్ఎం ఆర్ఎల్ | జీహెచ్ఎంసీ |
| బీ వెంకన్న | ఏసీపీ | డీటీసీపీవో కరీంనగర్ | జీహెచ్ఎంసీ |
| ఎం శ్యామ్‌కుమార్ | ఏసీపీ | రామగుండం | జీహెచ్ఎంసీ |
| ఆర్ శ్రీనివాసరావు | ఏసీపీ | ఖమ్మం | జీహెచ్ఎంసీ |
| ఎం నర్సింహరాములు | ఏసీపీ | ఏడీటీపీ, ఆర్డీడీటీపీ హైదరాబాద్ | జీహెచ్ఎంసీ |
| ఎ అశోక్‌కుమార్ | ఏపీసీ | నల్లగొండ | జీహెచ్ఎంసీ |
| వీ మైఖేల్ | ఏసీపీ | డీటీసీపీవో, మంచిర్యాల్ | జీహెచ్ఎంసీ |
| కే రవి | ఏపీసీ | గ్రేటర్ వరంగల్ | జీహెచ్ఎంసీ |
| ఎండీ ఖలీలుద్దీన్ | టీపీవో | భూపాల్‌పల్లి | జీహెచ్ఎంసీ |
| కే కరుణాకర్ | టీపీవో | జగిత్యాల | జీహెచ్ఎంసీ |
| ఎల్ఎస్ కల్యాణ్ చక్రవర్తి | టీపీఎస్ | ఖమ్మం | జీహెచ్ఎంసీ |
| పీ అశోక్ | టీపీఎస్ | మహబూబ్‌నగర్ | జీహెచ్ఎంసీ |



హైదరాబాద్‌లోని జలసౌధలో అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి హరీశ్‌రావు

## జూన్ నాటికి ఎస్సారెస్పీ రెండో దశ

మొదటిపేజీ తరువాయి...

ప్రధాన కాల్వలో లైనింగ్ దెబ్బతినడం, పూడిక వంటి కారణాలతో వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లోని కరువు పీడిత ప్రాంతాల్లో భూములకు నీరందడం లేదని మంత్రి చెప్పారు. ఆయా ప్రాంతాల్లో సాగునీటిని అందించేందుకు ఈ మరమ్మతు పనులను పూర్తిచేసి, ఫీల్డ్ చానల్స్ అన్నింటినీ వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఈ పథకంతో పూర్వ నల్లగొండ జిల్లాలో తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2,13,175 ఎకరాలు, ఖమ్మం జిల్లాలో పాలేరు, మధిర అసెంబ్లీ నియోజకవర్గాల్లో 75,262 ఎకరాలు, వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట, పాలకుర్తి, డోర్నకల్ నియోజకవర్గాల్లో 1,09,512 ఎకరాలకు సాగునీరు అందుతుందని మంత్రి గుర్తుచేశారు.

**చివరి భూములకూ నీరందాలి..**

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు చివరి భూములకూ సాగునీరు అందించాలని సీఎం కేసీఆర్ నడుం బిగించారని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే, ఎంపీల సహకారం తీసుకొని అడ్డంకులను పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. వచ్చే ఏడాది కాళేశ్వరంతో ఎస్సారెస్పీని అనుసంధానం చేస్తున్నందున ఈలోగా శ్రీరాంసాగర్ రెండో దశ పనులు పూర్తికావాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎల్ఎండీకి ఎగువ, దిగువ ప్రాంతాల్లోని కాల్వల్లో నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని కోరారు. శ్రీరాంసాగర్ నీరు ఇప్పటిదాకా చూడని జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, డోర్నకల్ ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ఈఎన్సీలు మురళీధర్, నాగేందర్‌రావు (పరిపాలన), వివిధ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేటి నుంచి భారీ వర్షాలు

మొదటిపేజీ తరువాయి...

తెలిపారు. మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి బుధవారం ఉదయం 8.30 గంటల వరకు ములుగులో 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు పేర్కొన్నారు. సుల్తానాబాద్, జూలపల్లిలో 3 సెంటీమీటర్ల చొప్పున, మణుగూరు, ఉట్నూరు, గోవిందరావుపేటల్లో 2 సెంటీ మీటర్లు, నందిపేట, జగిత్యాల, అలంపూర్, మక్తల్, మోర్తాడ్, తిమ్మాపూర్‌లో ఒక సెంటీమీటర్ చొప్పున వర్షపాతం నమోదయిందని అధికారులు వెల్లడించారు.

## పీజీఈసెట్‌లో తొలివిడుత సీట్ల కేటాయింపు పూర్తి

### కళాశాలల్లో రిపోర్ట్‌కు 19 వరకు గడువు

### 1,056 సీట్లు మిగులు.. 22 నుంచి తుదివిడుత కౌన్సెలింగ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ఎంటెక్, ఎంఫార్మసీ కళాశాలల్లో సీట్ల భర్తీకోసం ఈ నెల 5 నుంచి 12 వరకు నిర్వహించిన పీజీఈసెట్-2017 తొలివిడుత కౌన్సెలింగ్‌లో సీట్ల కేటాయింపు పూర్తయింది. కౌన్సెలింగ్‌లో 7,096 సీట్లు అందుబాటులో ఉండగా.. 6,040 సీట్లు నిండాయని, ఇంకా 1,056 సీట్లు మిగిలాయని సెట్ కో కన్వీనర్ ప్రొఫెసర్ రమేశ్‌బాబు బుధవారం తెలిపారు. ఈసారి అన్ని ఎంటెక్, ఎంఫార్మసీ కళాశాలల్లో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని కచ్చితంగా అమలుచేస్తున్న నేపథ్యంలో నాన్ సీరియస్ విద్యార్థులు సీట్లు పొందడానికి ముందుకురాలేదని అభిప్రాయపడ్డారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 19లోపు కళాశాలల్లో రిపోర్టు చేయాలని గడువు విధించారు. తుదివిడుత కౌన్సెలింగ్ కోసం ఈ నెల 21న షెడ్యూల్ విడుదల చేస్తామని తెలిపారు. ఈ నెల 22, 23 తేదీల్లో కొత్తవారికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని, 23, 24 తేదీల్లో తుదివిడుత వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని రమేశ్‌బాబు వివరించారు. ఈ నెల 28 నుంచి 31 మధ్య సీట్లు కేటాయిస్తామని చెప్పారు. పూర్తి వివరాల కోసం www.pgecetadm.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

## టీచర్లకు డీఎడ్ లేదా బీఎడ్ తప్పనిసరి

### రాష్ట్రాలకు కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశవ్యాప్తంగా అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బీఎడ్ లేదా డీఎడ్ కచ్చితంగా ఉండాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ అన్ని రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులను ఆదేశించారు. వారితోనే పిల్లలకు పాఠాలను బోధించేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. బుధవారం అన్ని రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులతో కేంద్రమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలతోపాటు ప్రైవేటు పాఠశాలల్లో బోధిస్తున్న టీచర్లు కూడా బీఎడ్ లేదా డీఎడ్ లేదా సంబంధిత ఉపాధ్యాయ విద్యాకోర్సులను పూర్తిచేసి ఉండాలన్నారు. పాఠశాల విద్య పురోగతిపై రాష్ట్రాలవారీగా చర్చించారు. పాఠశాలల్లో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో తెలంగాణ నుంచి డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, డైరెక్టర్ జీ కిషన్, ఎస్ఎస్ఏ ఎస్‌పీడీ భాస్కర్‌రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.



బుధవారం హైదరాబాద్‌లోని మన్సూరాబాద్ కేబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, మహేందర్‌రెడ్డి దంపతుల కుమార్తె అంజనీ-అక్షయ్‌రెడ్డిల వివాహానికి హాజరైన సీఎం కే చంద్రశేఖర్‌రావు దంపతులు. చిత్రంలో మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, జగదీశ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీ వినోద్, టీఎస్ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, శంకర్‌నాయక్ తదితరులు

## 22న రెడ్డి హాస్టల్ శతాబ్ది ఉత్సవాలు

### బుద్వేల్‌లో రెడ్డి ఎడ్యుకేషనల్ క్యాంపస్‌కు శంకుస్థాపన చేయనున్న సీఎం

### పదెకరాల భూమి, రూ.10 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం

### హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఈ నెల 22న కొత్వాల్ వెంకటరామారెడ్డి జయంతి సందర్భంగా రెడ్డి హాస్టల్ శతాబ్ది ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తున్నట్లు హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి పేర్కొన్నారు. నిజాంకాలంలో విద్యా వికాసం కోసం బాటలు వేసిన రాజ బహద్దూర్ వెంకటరామారెడ్డికి ఘనంగా నివాళులు అర్పించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని బుధవారం సచివాలయంలో మీడియాకు తెలిపారు. ప్రస్తుతమున్న రెడ్డి హాస్టల్ క్యాంపస్ సరిపోవడం లేదని.. అందుకే ప్రత్యేకంగా కొంత స్థలాన్ని కేటాయించాలని రెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్టు ప్రతినిధులు ముఖ్యమంత్రిని కోరారని వివరించారు. తెలంగాణలో విద్యావ్యాప్తి కోసం వెంకటరామారెడ్డి చేసిన సేవలను గుర్తించిన సీఎం.. బుద్వేల్‌లో రెడ్డి ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మాణానికి పదెకరాల స్థలం, రూ.10 కోట్లను మంజూరు చేశారని వెల్లడించారు. ట్యాంక్‌బండ్ మీద ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. రాజేంద్రనగర్ మండలంలోని బుద్వేల్‌లో రెడ్డి ఎడ్యుకేషనల్ హాస్టల్ క్యాంపస్, ఇతర నిర్మాణ పనులకు ఈ నెల 22న సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఎంవో ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, హాస్టల్ కమిటీ ప్రెసిడెంట్ డాక్టర్ రఘుపతిరెడ్డి, కమిటీ సభ్యులు, రెడ్డి జనసంఘం అధ్యక్షుడు వీ నర్సింహారెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు జగదీశ్వర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.



బుధవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతున్న హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి. చిత్రంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సీఎంవో ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్ తదితరులు

## పదిమంది సచివాలయ ఉద్యోగులకు పదోన్నతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సచివాలయంలోని వివిధశాఖల్లో పనిచేస్తున్న పదిమంది సహాయ కార్యదర్శుల(ఏఎస్)కు ఉప కార్యదర్శులు(డీఎస్)గా ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ పరిపాలనశాఖలో పనిచేస్తున్న ఎంఏ రషీద్, ఎం శారదాబాయ్, ఎంవీ పద్మావతి, జీ దేవేందర్‌రావు, ఉన్నత విద్యాశాఖలో పనిచేస్తున్న బీ రాంజీ, వ్యవసాయశాఖలో పనిచేస్తున్న టీ గోపాల్‌రావు, పంచాయతీరాజ్‌శాఖకు చెందిన జే అరుణ్‌కుమార్, పరిశ్రమలు-వాణిజ్యశాఖకు చెందిన కేవీ లలిత, పురపాలకశాఖకు చెందిన జీ లక్ష్మీనారాయణ, ఎస్సీ అభివృద్ధిశాఖకు చెందిన బీ ప్రసాద్‌కు పదోన్నతులు లభించాయి.



మన సైన్యం, వారి ధైర్యసాహసాలు మన దేశ రక్షణకు పెట్టని కోటలా ఉన్నాయి. మనకు భద్రతే ముఖ్యం. అది సరిహద్దు భద్రతైనా, అంతర్గత భద్రత అయినా అధిక ప్రాధాన్యమిస్తాం. ఎవరి బెదిరింపులకు భయపడేది లేదు. ఇంచు భూమిని వదిలేది లేదు.

**నరేంద్రమోదీ, ప్రధాని**

బీహార్‌లో నితీశ్‌కుమార్ బీజేపీతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పర్చిన తర్వాత ప్రజల ఆకాంక్షలు పెరిగిపోయాయి. మోదీ ఇచ్చిన అభివృద్ధి ప్యాకేజీ కూడా దానికి అనుగుణంగానే ఉన్నది. ఈ పరిస్థితులను చూస్తుంటే బీహార్‌కు రాబోయేవి మంచి రోజులే.

**కేసీ త్యాగి, జేడీయూ అధికార ప్రతినిధి**



**చరిత్రలో నేడు**



1870

అమెరికాలో మొట్టమొదటి మహిళా న్యాయమూర్తిగా ఈస్టర్ మోరిస్.

1982

మొదటిసారి 'కంపాక్ట్ డిస్క్స్' (సీడీ)లను తయారు చేసిన జర్మనీ.





1988

పాకిస్థాన్ అధ్యక్షుడు జియా ఉల్ హక్ విమాన ప్రమాదంలో దుర్మరణం.

కోర్టు కార్యకలాపాలన్నింటినీ సీసీ టీవీ కెమెరాలతో ఆడియో, వీడియో రికార్డింగ్ చేయాలన్న సుప్రీంకోర్టు నిర్ణయం ఆహ్వానించదగింది. దీనికి సంబంధించి గత మార్చిలోనే రాష్ర్టాల హైకోర్టులకు సూచించింది. రాష్ట్రంలోని రెండు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలుచేసిన తర్వాత సాధకబాధకాలు, పరిణామాలు పరిశీలించిన తర్వాత దేశవ్యాప్తంగా అన్ని కోర్టులను సీసీ టీవీ పరిధిలోకి తెచ్చి అమలుచేయాలని భావిస్తున్నది. దీంతో కోర్టుల పని విధానంలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందని ఆలోచిస్తున్నది. సీసీ టీవీల పరిధిలోకి కోర్టులను తేవటం విప్లవాత్మకం.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

తమిళనాడులోని ఏఐఏడీఎంకే రెండు వర్గాలు ఏకం కావాలన్న దిశగా ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే ఈ ఐక్యత ఆ పార్టీ వర్గాలకన్నా బీజేపీకే ఎక్కువ అవసరం అన్న రీతిలో రాజకీయాలు సాగుతున్నాయి. ఇరు వర్గాల నాయకులతో సంబంధాలు కొనసాగిస్తున్న బీజేపీ నాయకత్వం ఐక్యతకు పట్టుబడుతున్నది. శశికళ, ఆమె మేనల్లుడు దినకరన్ మూలంగా పార్టీ చీలిపోయింది. ఇప్పుడు వారు లేని పరిస్థితుల్లో పార్టీ ఏకం కావటానికి ఆటంకాలేమీ లేవు. ప్రభుత్వంలో మంత్రి పదవుల పంపకం పేచీ తేలితే రెండు వర్గాలు ఐక్యం కావటం సాధ్యమే.

**ది హిందూ**



# శ్వేత దురహంకారం

అమెరికాలో శ్వేత దురహంకారం పెచ్చరిల్లిపోతున్నది. కొన్ని తెల్లజాత్యహంకార సంస్థలు విద్వేషాలను రగిలించడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ విద్వేష భావజాలానికి వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు ఉద్యమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శ్వేత ఆధిపత్య భావజాలాన్ని నిస్సంకోచంగా ఖండించడానికి బదులు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరుపక్షాలను ఒకే గాటన కడుతూ మాట్లాడటం ఆశ్చర్యంగా ఉన్నది. వర్జీనియాలోని చార్లొట్స్‌విల్లేలో చెలరేగిన హింసను ఖండించడానికి కూడా ట్రంప్ మొదట తాత్సారం చేశారు. ఆ తరువాత శ్వేత దురహంకారులను వెనకేసుకొస్తూ మాట్లాడారు. తప్పనిసరై విద్వేషాలను ఖండించినా, ట్రంప్ మొగ్గు శ్వేత దురహంకారుల వైపే ఉండటం గమనార్హం. అబ్రహాం లింకన్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అమెరికాలో బానిసత్వాన్ని రద్దు చేయాలనే ప్రతిపాదన ముందుకు వచ్చింది. అభివృద్ధి చెందిన ఉత్తరాది రాష్ర్టాలకు భిన్నంగా, వ్యవసాయం ప్రధాన ఆర్థిక వనరుగా ఉన్న దక్షిణాది రాష్ర్టాల పాలకవర్గాలు బానిసత్వాన్ని రద్దు చేయడాన్ని వ్యతిరేకించాయి. ఈ రాష్ర్టాలు అమెరికా నుంచి విడిపోవడానికి యత్నించడంతో అంతర్యుద్ధం జరిగింది. దక్షిణాది రాష్ర్టాల (కాన్ఫెడరేట్) సైన్యాలకు నాయకత్వం వహించిన సైన్యాధిపతులు రాబర్ట్ ఇ లీ, స్టోన్‌వాల్ జాక్సన్‌లను శ్వేత దురహంకారులు ఇప్పటికీ జాతి హీరోలుగా భావిస్తుంటారు. చార్లొట్స్‌విల్లేలో ఎంతోకాలంగా ఉంటున్న రాబర్ట్ ఇ లీ విగ్రహాన్ని తొలిగించాలని నిర్ణయించడంతో వివాదం మొదలైంది.

చార్లొట్స్‌విల్లేలో రాబర్ట్ ఇ లీ విగ్రహం తొలిగింపునకు వ్యతిరేకంగా శ్వేత దురహంకారులు ఊరేగింపు తీశారు. ఈ విద్వేష భావజాలాన్ని వ్యతిరేకిస్తూ లౌకిక, ప్రజాస్వామిక శక్తులు కదిలి వచ్చాయి. ఈ ఉద్రిక్త పరిస్థితులలో ఘర్షణలు చోటు చేసుకున్నాయి. శ్వేతదురహంకార వర్గానికి చెందిన ఒకరు తన కారును వ్యతిరేకవర్గం వారిపైకి నడుపడంతో పౌరహక్కుల కార్యకర్త ఒకరు మరణించారు. ఇంతగా తెగించినప్పటికీ శ్వేత దురహంకారులను ఖండించడానికి ట్రంప్‌నకు మనసొప్పడం లేదు. 'ఒకవైపు చెడ్డవారున్నారు. మరోవైపు కూడా హింసాపరులు ఉన్నారు... తెల్లజాతీయవాదులను వ్యతిరేకించేవారు ఆయుధాలతో వచ్చారు. వారికి అక్కడికి రావడానికి అనుమతి లేదు... కాగడాలు పట్టుకొని వచ్చిన వారంతా నాజీలు, తెల్లజాత్యహంకారులు అనుకోవద్దు'అంటూ ట్రంప్ ఇరు పక్షాలను ఒకే గాటన కట్టి మాట్లాడారు. రాబర్ట్ ఇ లీ విగ్రహాన్ని ఈ వారం కూలగొడతారు. స్టోన్‌వాల్ జాక్సన్ విగ్రహాన్ని కూడా కూలదోస్తున్నారని తెలిసింది. వచ్చే వారం జార్జి వాషింగ్టన్ విగ్రహాన్ని కూడా కూలదోస్తారా? ఆ తరువాత వారం థామస్ జెఫర్సన్ విగ్రహమా? అని ట్రంప్ అన్నారు. రాబర్ట్ ఇ లీ, స్టోన్‌వాల్ జాక్సన్ దేశాన్ని ముక్కలు చేయడానికి యుద్ధానికి దిగినవారు కాగా, జార్జి వాషింగ్టన్ అమెరికా జాతిపిత. థామస్ జెఫర్సన్ అమెరికా స్వాతంత్ర్య ప్రకటనను లిఖించిన మహానేత. ఇరువురూ దేశాన్ని పాలించి దిశానిర్దేశం చేసిన వారు. అంతర్యుద్ధ కాలం నాటి శ్వేత దురహంకార సైనికాధిపతులను అమెరికా జాతి నిర్మాతలతో పోల్చడాన్ని విజ్ఞతగల వారెవరూ జీర్ణించుకోలేకపోతున్నారు. ట్రంప్ అధికారానికి వచ్చిన నాటినుంచి అనేక తప్పటడుగులు వేస్తున్నప్పటికీ, సామాజిక అశాంతి పేట్రేగిపోయే విధంగా వ్యాఖ్యలు చేయడం తీవ్ర వ్యతిరేకతను సృష్టిస్తున్నది. ఆయన వ్యాఖ్యల పట్ల దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా తీవ్ర స్పందన కనబడుతున్నది.

> **ట్రంప్ విధానాలకు అమెరికా సమాజంలో మద్దతు లేదని స్పష్టమవుతున్నది. బహుళ సమాజాలలో ఒక్కోసారి విద్వేషాలు ప్రబలవచ్చు. కానీ పాలకులు రాగద్వేషాలకు అతీతంగా ఉండి అందరి మన్ననలు పొంది, వ్యవస్థ మీద నమ్మకం పెంచాలె. కానీ దేశాధినేతలే పరోక్షంగా ఉసిగొలిపితే దేశం కక్షలూ కార్పణ్యాలకు నిలయమవుతుంది. ప్రపంచం ఇప్పటికే విద్వేష పునాదులపై చెలరేగిన యుద్ధాలను చవి చూసింది. జాత్యహంకార నీడలో సమాజాలు నలిగిపోయాయి. ఈ విద్వేషాలకు, నిరంకుశత్వాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించిన నేపథ్యంలోనే ఉదారవాద ప్రజాస్వామిక వ్యవస్థలు స్థిరపడ్డాయి.**

ట్రంప్ వ్యాఖ్యలను ప్రతిపక్షాల వారే కాదు, ఆయన సొంత రిపబ్లికన్ పార్టీకి చెందిన పెద్దలు కూడా సమర్థించకపోవడం గమనార్హం. ట్రంప్ మొదటి నుంచీ విద్వేషాలను, జాతి వివక్షను ఉసిగొలుపుతున్నారని ప్రతినిధుల సభలోని డెమొక్రాటిక్ పార్టీ నాయకురాలు నాన్సీ పెలోసీ విమర్శించారు. 'శ్వేత దురహంకార మూకలు దారుణాలకు పాల్పడుతూ హత్యలు చేస్తుంటే, అమెరికా అధ్యక్షుడు దానిని అర్థం చేసుకోగలిగి ఉండాలె' అని ఆమె వ్యాఖ్యానించారు. జాతి విద్వేషవాదులను, వారిని వ్యతిరేకిస్తున్న వర్గాన్ని ఒకే నైతిక కోణంలో చూడకూడదని మరో నాయకుడు హితవు చెప్పారు. మనం ఏ పక్షమో తేల్చుకోవలసిన తరుణమిది అని మాజీ అటార్నీ జనరల్ ఎరిక్ హోల్డర్ అన్నారు. 'శ్వేత దురహంకారం విభేదాలకు దారితీస్తుంది. దేశ విలువలకు విరుద్ధమైనది. ఈ విషయంలో నైతిక సందిగ్ధతకు తావు లేదు' అని రిపబ్లికన్ పార్టీకే చెందిన స్పీకర్ పాల్ ర్యాన్ స్పష్టం చేశారు. దీనిని బట్టి ట్రంప్ విధానాలకు అమెరికా సమాజంలో మద్దతు లేదని స్పష్టమవుతున్నది. బహుళ సమాజాలలో ఒక్కోసారి విద్వేషాలు ప్రబలవచ్చు. కానీ పాలకులు రాగద్వేషాలకు అతీతంగా ఉండి అందరి మన్ననలు పొంది, వ్యవస్థ మీద నమ్మకం పెంచాలె. కానీ దేశాధినేతలే పరోక్షంగా ఉసిగొలిపితే దేశం కక్షలూ కార్పణ్యాలకు నిలయమవుతుంది. ప్రపంచం ఇప్పటికే విద్వేష పునాదులపై చెలరేగిన యుద్ధాలను చవి చూసింది. జాత్యహంకార నీడలో సమాజాలు నలిగిపోయాయి. ఈ విద్వేషాలకు, నిరంకుశత్వాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించిన నేపథ్యంలోనే ఉదారవాద ప్రజాస్వామిక వ్యవస్థలు స్థిరపడ్డాయి. చరిత్రను వెనక్కు తిప్పడం సాధ్యం కాదు. ఆ దిశగా అడుగులు వేయడమంటే మళ్ళా మారణహోమాలను కోరుకోవడమే.

**ఆలోకన**



**టంకశాల అశోక్**

# మోదీకి యాంటీ-థీసిస్ ఏమిటి?

ప్రధాని మోదీ జగన్నాథరథాన్ని ఆపగల ప్రతిపక్షాలు ప్రస్తుతానికి కనిపించటం లేదన్నది వాస్తవం. దాని అర్థం ఆయనకు యాంటీ-థీసిస్ లేనే లేదని కాదు. తక్కిన దేశాన్ని అట్లుంచి తెలంగాణకు పరిమితమై ఆలోచిస్తే, గరిష్ఠ స్థాయిలో రాష్ట్ర అభివృద్ధి, తెలంగాణ జాతి భావనలతో కూడిన ఫెడరలిస్టు తత్త్వం బలపడటం, మోదీ పాలనలో ప్రజలకు హానీకరమవుతున్న అంశాలపై నిరంతర ప్రచారం అనే త్రిముఖ్య వ్యూహం అటువంటి యాంటీ-థీసిస్, లేదా విరుగుడు కాగలదు.

తెలంగాణను 'జయించటం' తమ లక్ష్యమని బీజేపీ బాహాటంగా ప్రకటిస్తున్నందున, ఈ విషయమై ఇక ఎటువంటి శషభిషలు ఉండనక్కరలేదు. తమ 'దుర్గాన్ని' తాము కాపాడుకునేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధం కావలసి ఉంటుంది. నరేంద్ర మోదీ గానీ, బీజేపీ గానీ ఈ దేశానికి బయటి శక్తులు కావన్నది నిజమే. కనుక 'జయించటం', 'దుర్గం' అనే మాటలను ఇక్కడ 'శత్రుత్వశక్తి' అర్థంలో గాక రాజకీయంగానే ఉపయోగిస్తున్నాం. అదే సమయంలో గమనించవలసిన కీలకమైన అంశాలు కొన్ని ఉన్నాయి. అనేక వైవిధ్యాలతో కూడిన మన దేశంలో తెలంగాణకు తన ప్రత్యేక గుర్తింపులు, అభివృద్ధి అవసరాలు ఉన్నాయి. ఆ గుర్తింపులు కొనసాగి బలపడాలన్నా, తన ప్రత్యేక అభివృద్ధి అవసరాలు తీరాలన్నా అది ఫెడరలిస్టు వ్యవస్థను పటిష్ఠం చేసుకోవటంతోనే సాధ్యపడుతుంది తప్ప, బీజేపీ రూపంలో ఒక సెంట్రలిస్టు శక్తి ఇక్కడ అధికారానికి రావటం వల్ల కాదు.

తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ అనే సెంట్రలిస్టు శక్తిని దశాబ్దాల పాటు భరించి చాలా నష్టపోయారు. తాను ఫెడరలిస్టు శక్తినంటూ ముందుకు వచ్చిన టీడీపీ ఒక సబ్-సెంట్రలిస్టు శక్తిగా మారి సీమాంధ్ర ధనిక వర్గాల ప్రయోజనాల కోసం తెలంగాణను అంతర్గత కాలనీగా మార్చుకున్నది. వీరందరిని దశాబ్దాల పాటు ఎదుర్కొని పోరాడిన తెలంగాణ ప్రజలు చివరికి తమ అస్తిత్వానికి ఒక స్వరూపాన్ని సాధించుకున్నారు. స్వీయ భౌగోళికతలో స్వీయ పరిపాలన ఏర్పడింది. ఇక ఇందుకు సార్థకత కలిగేది ఏ విధంగా? తన ప్రత్యేక గుర్తింపులను నిలబెట్టుకొని, తన నిర్దిష్టమైన అభివృద్ధిని తన ఆలోచనల ప్రకారం తాను చేసుకోవటం ద్వారానా, లేక ఏదో ఒక పేరిట మరొక సెంట్రలిస్టు శక్తి మాయవలలో చిక్కుకోవటం వల్లనా? అన్ని సెంట్రలిస్టు పార్టీల అన్ని రికార్డులను ఒకసారి తరచి చూడండి. భారతదేశపు సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ వైవిధ్యం దృష్ట్యా ఇక్కడ సమాఖ్య వ్యవస్థ తప్పనిసరి అని నాయకులు స్వాతంత్రోద్యమ కాలంలోనే గుర్తించి ఆ లక్షణాలను 'సహకార ఫెడరలిజం' పేరిట నేరుగా రాజ్యాంగంలోనే చేర్చారు. తర్వాత కాలంలో సెంట్రలిస్టు రాజకీయ, ఆర్థిక శక్తులు దానిని స్వప్రయోజనాల కోసం ఒక పద్ధతి ప్రకారం దెబ్బతీస్తూపోయాయి. కాంగ్రెస్, బీజేపీలు రెండూ నోటితో సహకార ఫెడరలిజం అంటూ నొసటితో దాన్ని వెక్కిరిస్తూ పోయాయి. ఈ ద్వంద్వ నీతి మోదీ హయంలోనూ కొనసాగుతున్నది.

ఈ దేశ వాస్తవిక స్థితిగతుల దృష్ట్యా, ప్రత్యేక గుర్తింపులూ అభివృద్ధి అవసరాలను బట్టి, మొదటినుంచి సహకార ఫెడరలిజాన్ని అనుసరించి ఉంటే, సెంట్రలిస్టు రాజకీయ-ఆర్థిక శక్తుల దోపిడీకి పాల్పడకుండా ఉండి ఉంటే, తెలంగాణకు ఇంత అన్యాయం జరిగేది కాదు. తెలంగాణ ప్రత్యేక భావనలు విస్తరించేవి కావు. అంతేకాదు, మొత్తం దేశంలోనే 1980లు వచ్చేసరికి ప్రాంతీయ భావనలు, పార్టీలు బలపడి దేశ రాజకీయాలు వాటిచుట్టూ తిరిగే పరిస్థితి వచ్చేదికాదు. తెలంగాణ ప్రస్తుత స్థితిని, 2014లో రాష్ట్రం అవతరించినప్పటి నుంచి మొదలైన కొత్త దశను, ఇటువంటి నేపథ్యం నుంచి చూడవలసి ఉంటుంది. ఈ దశనుంచి తెలంగాణ తన ప్రత్యేక సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక గుర్తింపులను కాపాడుకుంటూ, మరింత బలపడి సుస్థిరం చేసుకుంటూ, కొత్త ఔన్నత్యాలకు చేరాలి తప్ప, తిరిగి సెంట్రలిస్టు రాజకీయ-ఆర్థిక శక్తులకు బలి కాకూడదు. ఇది చాలదన్నట్లు బీజేపీకి ఒక సెంట్రలిస్టు సాంస్కృతిక అజెండా సైతం ఉండటం గుర్తించవలసిన విషయం. ఇవన్నీ కలిసి తెలంగాణకు ప్రమాదకరం కాగలవు. తన ప్రత్యేక స్వభావాలు, వాటితో పాటు స్వీయ ప్రయోజనాలు కూడా భంగపడగలవు.

మోదీకి యాంటీ-థీసిస్, లేదా విరుగుడు కాగల మూడు అంశాలంటూ మొదట పేర్కొన్న వాటిని ఇప్పుడు ఒకటొకటిగా చూద్దాం. వాటిలో మొదటిది గరిష్ఠస్థాయిలో అభివృద్ధి. తక్కిన విషయాలు ఏవి ఎట్లున్నా, అన్నిరకాల గుర్తింపులకు కూడా వస్తుగతమైన ప్రాతిపదిక (మెటీరియల్ బేసిస్) ఒకటి తప్పక ఉంటుంది. వ్యక్తిగత సంబంధాలు, కుటుంబ సంబంధాలు మొదలుకొని ఒక ప్రాంత ప్రజల, జాతి ప్రజల ఏకీభావనల వరకు ఇది ఉంటుంది. అదేవిధంగా ఆ ప్రజలు తమను తాము తమ పాలకులతో గుర్తుంచుకోవటం నుంచి బయటిశక్తులతో ఏకీభవించటం వరకు కూడా ఈ ప్రాతిపదిక ఏదో ఒక మేరకు పనిచేస్తుంది. ఆ విధంగా తెలంగాణ విషయానికి వస్తే, తమ గుర్తింపులు, ప్రయోజనాల పరిరక్షణకు ఇంతటి ఉద్యమాలు చేసిన ప్రజలను ఆ ప్రయోజనాలు నెరవేరటమే తమ నాయకత్వాలతో నిలబెట్టి ఉంచుతుంది. ఇది మౌలికం. ఆ తర్వాత ఇతర సొంత గుర్తింపులు, ఫెడరలిస్ట్ భావనలు అందుకు సమాంతరంగా బలపడుతాయి.

పైన చెప్పుకున్నట్లు దేశంలో సెంట్రలిస్టుశక్తులు దెబ్బతిని ఫెడరలిస్టు శక్తులు పెరుగటం సుమారు మూడు దశాబ్దాల క్రితం మొదలుకాగా, ఆ శక్తులు రకరకాలుగా విఫలం కావటం వల్లనే తిరిగి ఇప్పుడు బీజేపీ రూపంలో మరొక సెంట్రలిస్టు శక్తి ఆ శూన్యంలోకి ప్రవేశించగలుగుతున్నది. వేర్వేరు నినాదాలతో ముందుకు వచ్చిన ఫెడరల్ శక్తుల వైఫల్యాలలో అన్నింటికన్నా ముఖ్యమైనది తమ రాష్ర్టాల ప్రజలను సంతృప్తిపరుచగల అభివృద్ధిని సాధించలేకపోవటం. మరొక మాటలో చెప్పాలంటే, మెటీరియల్ బేసిస్‌ను సృష్టించలేకపోవటం. అది జరుగనందున కేవలం ప్రాంతం, కులం, జాతి, భాష వంటి నినాదాలు గాలిలో నిలువలేకపోయాయి. అవి తేలిపోవటంతో, ఆ ప్రజలకు మెటీరియల్ బేసిస్‌ను సృష్టించగలననే హామీని నమ్మకంగా ఇస్తూ, ఆ శూన్యంలోకి నరేంద్ర మోదీ ప్రవేశిస్తున్నారు. తెలంగాణలో ఇందుకు తొలి అడుగునుంచే ఆస్కారం లభించకూడదనుకుంటే మొట్టమొదట జరుగవలసింది వీలైనంత అధికస్థాయిలో అభివృద్ధి. ఈ రహస్యం సెంట్రలిస్టు శక్తులకు తెలుసుగనుకనే, తమను బలపరిచిన రాష్ర్టాలకే అభివృద్ధిలో సహకరిస్తామంటూ గతంలో కాంగ్రెస్ బ్లాక్‌మెయిల్ చేసింది. ఇప్పుడు మోదీ ప్రభుత్వం బెదిరిస్తున్నది. ఇదీ వీరి సహకార ఫెడరలిజం నీతి అన్నది దీన్నిబట్టి తేలికగా గ్రహించవచ్చు.

ఇక రెండవది తెలంగాణ జాతి భావనలతో కూడిన ఫెడరలిస్టు తత్త్వం బలపడటం. ఈ రాష్ట్రంలో ఇది ఉద్యమకాలమంతా గణనీయంగా జరిగింది. ఒకవైపు కాంగ్రెస్, మరొకవైపు టీడీపీ తీరు తన ప్రయోజనాలను, ఫెడరలిస్టు ధర్మాన్ని కాలరాయటంతో పాటు తెలంగాణ సంస్కృతిని, జాతి గుర్తింపును ఉపేక్షించటం, అణచివేయటం ఇక్కడి జాతి భావనలను బాగాప్రేరేపించాయి. ఇది ఫెడరల్ భావనకు రెండవ పార్శ్వం అయింది. ఆ విధంగా రూపు తీసుకున్న భావజాలం స్వరాష్ట్రంలో మరింత పెరిగి, అభివృద్ధితో కలగలసి జాతిని నిలబెట్టాలి. అది సహజంగానే సెంట్రలిస్టు శక్తుల ప్రమాదాన్ని నిలువరించగలదు. కనుక, ఈ భావనలు తత్త్వాలను పెంపొందించే ప్రయత్నాలు నిరంతరం సాగాలి.

> మోదీ పరిపాలనలో అన్నీ కాకపోయినా ప్రజలకు హానీ చేయగల అంశాలు తగినన్ని ఉన్నాయి. కొన్ని దేశానికంతా వర్తించేవి కాగా కొన్ని నిర్దిష్టంగా తెలంగాణకు సంబంధించినవి. ఉదాహరణకు ఆయన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పట్ల పక్షపాతంగా ఉంటూ, విభజన చట్టంలో పేర్కొన్నవి కూడా తెలంగాణకు ఎట్లా చేయటం లేదో తెలిసిన విషయమే. ఆయన నోట్ల రద్దు చర్య ఇక్కడ అధిక సంఖ్యలో గల బడుగు వర్గాల రైతులు, వ్యాపారులు, చిన్న పరిశ్రమల వారికి చేటు చేసింది. ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి పథకాలపై అధిక మొత్తం జీఎస్టీ ప్రభావంతో ఆ ప్రజలు నష్టపోనున్నారు.

చివరగా, మోదీ పరిపాలనలో అన్నీ కాకపోయినా ప్రజలకు హానీ చేయగల అంశాలు తగినన్ని ఉన్నాయి. కొన్ని దేశానికంతా వర్తించేవి కాగా కొన్ని నిర్దిష్టంగా తెలంగాణకు సంబంధించినవి. ఉదాహరణకు ఆయన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పట్ల పక్షపాతంగా ఉంటూ, విభజన చట్టంలో పేర్కొన్నవి కూడా తెలంగాణకు ఎట్లా చేయటం లేదో తెలిసిన విషయమే. ఆయన నోట్ల రద్దు చర్య ఇక్కడ అధిక సంఖ్యలో గల బడుగు వర్గాల రైతులు, వ్యాపారులు, చిన్న పరిశ్రమల వారికి చేటు చేసింది. ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి పథకాలపై అధిక మొత్తం జీఎస్టీ ప్రభావంతో ఆ ప్రజలు నష్టపోనున్నారు. ఇవి రెండు ఉదాహరణలు మాత్రమే. ఇటువంటివారు ఇక్కడ పెరిగితే ఏమయ్యేదీ ఊహించవచ్చు.

# మానవీయ పాలనకు దర్పణం

**తెలంగాణం**



**గడ్డం సతీష్**

చికిత్స కోసం ప్రభుత్వ దవాఖానలకు వస్తున్నవారంతా పేద ప్రజలే. అలాంటి వారి కోసమే ఈ దవాఖానలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకుంటున్నా అమల్లో ఆచరణకు నోచుకోలేకపోతున్నాయి. 'దవాఖాననే మాకు గుడి, అందులో డాక్టరే మా దేవుడు' అంటూ ఎందరో పేద ప్రజలు దవాఖానల్లో అడుగుపెడుతున్నారు. అయినా ఆఖరికి వాళ్లకు మిగిలేవి రోదనలే, ఆక్రందనలే. కనీసం శవాలను కూడా తరలించేందుకు అంబులెన్స్‌లు లేక తమ తమ సంబంధీకులు భుజాలపై, తోపుడు బండ్లపై తీసుకోవాల్సిన దీన పరిస్థితులను చూస్తుంటే మన దేశం ఎటుపోతున్నదో అర్థం కాని పరిస్థితి.

పోయినేడాది ఇదే ఆగస్టులో ఒక విషాద సంఘటన యావత్ దేశాన్ని కంటతడి పెట్టించింది. ఒడిషా రాష్ట్రంలోని భవానీపట్న సర్కార్ దవాఖానలో క్షయవ్యాధితో ఓ మహిళ మృతిచెందింది. ఆమె శవాన్ని మారుమూల కలహండి గ్రామానికి తరలించేందుకు పన్నేండ్ల కూతురితో కలిసి ఆమె భర్త మాఝీ పడని పాట్లు లేవు. సొంతూరులో తమ భార్య శవాన్ని ఖననం చేయాలనే తపనతో ఆయన పడిన బాధ వర్ణనాతీతం. దవాఖాన యాజమాన్యం ప్రభుత్వ అంబులెన్స్‌ను పంపి సహకరించమని ఎంత బతిమిలాడినా ఫలితం శూన్యం. రెక్కాడితేగానీ డొక్కాడని జీవితానికి ప్రైవేట్ అంబులెన్స్‌లో తన భార్య శవాన్ని తరలించే పరిస్థితి మాఝీకి లేదు. దారిన పోయేవారి కాళ్లా వేళ్లా పడినా అయ్యో అనే వారే కానీ, అంబులెన్సుకు కావలసిన ఆర్థిక సాయం దొరుకలేదు. మాఝీ చేసేదేం లేక తన భార్య శవాన్ని భుజంపై వేసుకొని కలహండికి నడక ప్రారంభించాడు. భుజాలపై భార్య శవం, వెంట తన కూతురుతో పదుల కిలోమీటర్లు ఆయన ప్రయాణం చేయాల్సి వచ్చింది. డెబ్బై ఏండ్ల స్వాతంత్ర్యానంతరం కూడా పేదల కష్టాలకు ప్రతీకగా నిలిచింది. ఆ దృశ్యం దేశవ్యాప్తంగా ప్రచార, ప్రసార సాధనాల్లో పెద్ద సంచలనమే సృష్టించింది.

ఈ ఘటన జరిగిన కొన్ని రోజులకే ఒడిశా రాష్ట్రంలోనే మరో హృదయవిదారక ఘటన చోటుచేసుకున్నది. మల్కాన్‌గిరి జిల్లాలోని గూసాపల్లికి చెందిన బర్షాఖేముడు అనే ఏడేండ్ల బాలిక అనారోగ్యానికి గురైంది. ఈ పాపను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయింది. మానవత్వం మరిచిపోయిన ఆ అంబులెన్స్ డ్రైవర్ ఆ పాప శవంతో పాటు తల్లిదండ్రులను నడిరోడ్డుపై వదిలేసి వెళ్లిపోయాడు. చేసేదేం లేక తండ్రి దీనబంధు ఖేముడు ఆ పాప శవాన్ని చేతుల్లో మోసుకుంటూ పోతే ఆమె తల్లి గుండెలవిసేలా రోదిస్తూ వెంట నడిచింది.

గత సెప్టెంబర్‌లో బీహార్ పోలీసులు మానవత్వాన్ని మరిచి ప్రవర్తించారు. బీహార్‌లోని వైశాలి జిల్లాలోని గంగానది లో ఓ మృతదేహం కొట్టుకువచ్చినట్లు గ్రామస్థుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆ నది నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. ఆ సమయంలో అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో మృతదేహం మెడకు తాడు కట్టి కిలోమీటర్ల మేర గుంజుకుపోయారు.

గత సెప్టెంబర్‌లో యూపీలోని ఫిలిబిత్ జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానలో తులసీరామ్ అనే వ్యక్తి మృతిచెందాడు. మృతదేహాన్ని తరలించేందుకు అంబులెన్స్‌ను సమకూర్చాలని తులసీరామ్ కొడుకు సూరజ్ కోరగా దానికి ఆస్పత్రి వర్గాలు తిరస్కరించాయి. ప్రైవేట్ అంబులెన్స్‌లో శవాన్ని తరలించాలని ఉచితంగా సలహా ఇచ్చారు. చేసేదేం లేక తన తండ్రి శవాన్ని తోపుడు బండిపై వేసుకొని సూరజ్ నెట్టుకెళ్ళాడు.

ఈ ఘటనలను ఇప్పుడెందుకు చెప్పాల్సివచ్చిదంటే.. ఈ నెల 3న నా జర్నలిస్టు మిత్రుని వాళ్ల బాపు జగదీశ్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడని తెలిసి నేను, ఇంకో ఇద్దరు జర్నలిస్టు మిత్రులు గాంధీ దవాఖానకు చేరుకున్నాం. పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నదంటూ డాక్టర్లు చెబితే మా మిత్రుడిని ఓదార్చుకుంటూ రెండు రోజులు గాంధీ దవాఖానలోనే గడపాల్సి వచ్చింది. ఆగస్టు 4న సాయంత్రం ఆయన మరణించాడన్న వార్త అక్కడున్న మమ్మల్ని హతాశుల్ని చేసింది. తదుపరి కార్యక్రమంలో భాగంగా వైద్యులు శవాన్ని గాంధీ దవాఖానలోని మార్చురీకి తరలించారు. మా లాంటివారు చాలామంది మార్చురీ బయట రోదిస్తూ కూర్చున్నారు.

> పేదోళ్ల పట్ల మానవీయంగా స్పందిస్తున్న ప్రభుత్వానికీ, సీఎం కేసీఆర్‌కు మనలాంటోళ్లమంతా రుణపడి ఉండాలెనని చెప్పిన. కండ్లపొంటి ధారలా కన్నీళ్లు కారుస్తున్న ఆయన తువ్వాలతో కండ్లు తూడ్చుకొని.. కేసీఆర్ గొప్పోడు, పేదల పాలిట దైవం అంటూ.. సూర్య, చంద్రులున్నంత కాలం కేసీఆర్ సల్లంగా ఉండాలెనని సూర్యుని వైపు చేతులెత్తి మొక్కిండు.

మధ్యాహ్నం పన్నెండుకల్లా పోస్టుమార్టం పూర్తవుతుందని డాక్టర్లు చెప్పారు. శవాన్ని ఊరికి ఎలా తీసుకెళ్లాల్నో పెద్ద సమస్య. ఊరికి తీసుకుపోయేందుకు అంబులెన్స్ మాట్లాడుదామని దవాఖాన ఆవల ఉన్న అంబులెన్స్ వారితో మాట్లాడాం. ఊరి అడ్రస్ చెప్పాం. 'తొమ్మిది వేలకు తక్కువకు రానని మొఖం మీద గుద్దినట్టే చెప్పి మొఖం తిప్పుకున్నాడు. దీంతో వేరే అంబులెన్స్ వాహన డ్రైవర్ దగ్గరికి పోతే, ఆయనైతే ఏకంగా 'నాది కొత్త బండి పది వేలకు ఒక్క పైసా కమ్మి అయినా రాన'ంటూ ఖరాకండిగా చెప్పేసిండు. ఉన్న పైసలన్ని ఒడిసినయ్. తొమ్మిది కొడుతున్నది పన్నెండుకల్లా పోస్టుమార్టం పూర్తయితే శవాన్ని ఎట్లా తీసుకపోవుడో అర్థం కాలేదు. వెంటనే ఆ మధ్యనే మన తెలంగాణ ప్రభుత్వం మార్చురీ నుంచి శవాలను తమ తమ ఇళ్లకు తరలించేందుకు 'పార్థీవ వాహనాల'ను ఏర్పాటుచేసిన విషయం యాదికొచ్చింది. వెంటనే దవాఖానలోనే వైద్యుల సాయంతో ఆ వాహనం గురించి తెలుసుకొని వారికి విషయం తెలియజేశాం. అంతే.. వారు తమ బాధ్యత అన్నట్లుగా చేయాల్సిన ప్రాసెస్‌ను చెప్పారు. తొలుత మేం వెళ్లి ఇక్కడి ఆర్ఎంఒకు దరఖాస్తు పెట్టుకున్నం. పార్థీవ శవాన్ని తరలించే వాహనదారులు చాలా బాధ్యతాయుతంగా సమయానికి మార్చురీ దగ్గరికి వచ్చి నిలుచున్నారు. శవాన్ని తరలించడంలో వారు సాయపడిన తీరు మానవీయమైనది.

ఈ క్రమంలోనే సూర్యాపేట జిల్లా కోదాడ దగ్గరి ఓ పల్లెటూరికి చెందిన వారు కూడా తమ బంధువు శవాన్ని తరలించేందుకు అనేక అవస్థలు పడుతున్నరు. అంత దూరం అంబులెన్స్‌కు పదిహేను వేల పైచిలుకు అడిగిండ్రని ఒకాయన తలకు చేతులు పెట్టుకొని ఏడుస్తున్నడు. ఆయన పరిస్థితిని చూసి, ఎందుకు ఏడుస్తున్నవ్ పెద్దాయన అని, ప్రభుత్వం శవాలను తరలించేందుకు ప్రత్యేకంగా వాహనాలను కేటాయించిన విషయాన్ని చెప్పిన. ఆయన నేను చెప్పిన సంగతి విని నమ్మలేనన్నట్లుగా నా మొఖంలోకి చూసిండు. నిజమే పెద్దాయనా.. ప్రభుత్వం ప్రత్యేక పథకమే ప్రవేశపెట్టి శవాలను ఇంటి దగ్గరికి చేర్చేందుకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటుచేసిందని వివరించి దానికి ఏం చేయాల్నో చెప్పిన. అంతే ఆయనకు పోయిన పానం లేసొచ్చినట్లయ్యింది.. దవాఖాన ఆర్ఎంఒ దగ్గరికి ఉరికిండు. చూస్తుండగనే ఆర్ఎంఒ సంతకంతో ఓ కాగితాన్ని చేతిలో పట్టుకొని భరోసాగా మార్చురీ దగ్గరికి చేరుకున్నడు.

ఇంతలో 'సుంకరి జగదీష్' పోస్టుమార్టం పూర్తయ్యింది. సంబంధీకులు వచ్చి శవాన్ని తీసుకుపోవాలి' అంటూ మాకు పిలుపు. మేం ఇబ్రహీంపట్నం దగ్గరలోని లోయపల్లి గ్రామానికి బయల్దేరుతుండగానే, కోదాడ దగ్గరికి పోవాల్సిన పెద్దాయన నా దగ్గరికి వచ్చి నా రెండు చేతులు ఆయన చేతుల్లోకి తీసుకొని చేసిన సాయానికి చేతులెత్తి మొక్కుతున్న బిడ్డా అంటూ ఏడ్వసాగిండు. పెద్దాయనా.. నేను చేసిన సాయమేం లేదు. మన ప్రభుత్వం పేదల కోసం అనేక సౌకర్యాలను ప్రవేశపెట్టింది. శవాలను వారి సొంత ఇండ్లకు చేర్చేది కూడా ఇందులో భాగమే. పేదోళ్ల పట్ల మానవీయంగా స్పందిస్తున్న ప్రభుత్వానికీ, సీఎం కేసీఆర్‌కు మనలాంటోళ్లమంతా రుణపడి ఉండాలెనని చెప్పిన. కండ్లపొంటి ధారలా కన్నీ ళ్లు కారుస్తున్న ఆయన తువ్వాలతో కండ్లు తూడ్చుకొని.. కేసీఆర్ గొప్పో డు, పేదల పాలిట దైవం అంటూ.. సూర్య, చంద్రులున్నంత కాలం కేసీఆర్ సల్లంగా ఉండాలెనని సూర్యునివైపు చేతులెత్తి మొక్కిండు.

**జనగళం**

### దోమలను నివారించాలె

వానకాలంలో దోమల తీవ్రత పెరిగే అవకాశం ఉంటుంది. గ్రామాల నుంచి మొదలుకొని పట్టణాల వరకు దోమలను నివారించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. దోమలద్వారా మలేరియా, డెంగ్యూ లాంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయి. మున్సిపల్, గ్రామ పంచాయతీ సిబ్బంది, అధికారులు దోమల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలి. చెత్తకుండీలను, మురుగుకాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. సాయంత్రం వేళల్లో నగర,గ్రామాల్లో ఫాగింగ్ యంత్రాల ద్వారా దోమల నివారణ చర్యలు చేపట్టాలి

**- నందగిరి కమలాకర్, బీబీనగర్, భువనగిరి**

### ప్రతిపక్షాల తీరు మారాలె

ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే ఏ పథకాన్ని ప్రారంభించినా, ప్రజల మేలు కోరి ఏ మంచి నిర్ణయం తీసుకున్నా వాటిని వ్యతిరేకించడం ప్రతిపక్షాలకు అలవాటైపోయింది. నిరాధారమైన ఆరోపణలు చేస్తూ ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రతిపక్షాలు ఈ తీరును మార్చుకోవాలె. వట్టి మాటలను ప్రజలు నమ్మరని తెలుసుకోవాలి.

**- జడల రమేశ్, బేగంపేట, హైదరాబాద్**

### హర్షణీయం

'బ్లూవేల్' ఆన్‌లైన్ గేమ్‌ను నిలిపేయాలంటూ ఫేస్‌బుక్, గూగుల్, మైక్రోసాఫ్ట్ కంపెనీలకు కేంద్రం ఆదేశాలు జారీ చేయడం హర్షణీయం. ఈ గేమ్‌తో ఎంతోమంది చిన్నారులు ఆత్మహత్యలకు పాల్పడటం విచారకరం. చిన్నపిల్లల ప్రాణాలతో చెలగాటమాడే ఆన్‌లైన్ ఆటలను పూర్తిగా నిషేధించాలి.

**- బోడపట్ల కిషన్, కురిక్యాల, కరీంనగర్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@namasthetelangaana.com Fax-040-23291118

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

# మా సైనికులు చొచ్చుకొచ్చారా?

■ ఆ సంగతే తమకు తెలియదన్న చైనా

**బీజింగ్, ఆగస్టు 16:** తమ సైన్యం లడఖ్‌లోని పాంగోంగ్ సరస్సు తీరం వెంట భారత భూభాగంలోకి ప్రవేశించేందుకు చేసిన ప్రయత్నం గురించి తెలియదని చైనా పేర్కొంది. చైనా సైనికులు మంగళవారం భారత భూభాగంలోకి చొరబడేందుకు ప్రయత్నించారని, తమ దేశ సైనికులు వారిని అడ్డుకున్నారని భారత్ తెలిపింది. ఈ సందర్భంగా రెండు దేశాల సైనికులు పరస్పరం రాళ్లురువ్వుకోవడంతో ఇరువైపులా పలువురు గాయపడ్డారని పేర్కొంది. భారత సైనికులు మానవహారంలా ఏర్పడి చైనా సైనికులను అడ్డుకున్నారని తెలిపింది. భారత్ ప్రకటనపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి హు చున్‌యింగ్ బుధవారం స్పందిస్తూ 'ఈ సమాచారం గురించి నాకు తెలియదు' అన్నారు. వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) వెంట తమ దేశ సైనికులు నిత్యం గస్తీ తిరుగుతుంటారని చెప్పారు. భారత్-చైనా సరిహద్దు వెంట తాము శాంతికి కట్టుబడి ఉన్నామని ఆమె అన్నారు. భారత్ కూడా ఎల్‌ఏసీకి, ఉభయ దేశాల మధ్య కుదిరిన ఒప్పందాలకు కట్టుబడి ఉండాలని సూచించారు. దీనిపై 'ఇది ప్రభుత్వం వ్యాఖ్యానించదగిన అంశం కాదు' అని రక్షణమంత్రి అరుణ్‌జైట్లీ అన్నారు. ఇంతకుముందు కూడా పలుమార్లు చైనా సైనికులు భారత భూభాగంలోకి చొచ్చుకొచ్చినప్పుడు వారు గస్తీ తిరుగుతున్నారనే ఆ దేశం వాదించింది. సరిహద్దు వివాదానికి తెరదించేందుకు రెండు దేశాల మధ్య సరిహద్దు గీతను ఇంకా గీయాల్సి ఉన్నదని చెప్పింది. తాజా వివాదం నేపథ్యంలో బుధవారం సాయంత్రం లడఖ్‌లోని భారత్, చైనాకు చెందిన సీనియర్ సైన్యాధికారులు సమావేశమయ్యారు. మంగళవారం చోటు చేసుకున్న పరిణామాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ఇదిలాఉండగా, భారత్, అమెరికా మధ్య సంబంధాలు ప్రాంతీయ శాంతి, అభివృద్ధికి దోహదపడగలవని హు చున్‌యింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు.



రోజువారీ నిర్వహించే కవాతు అనంతరం పాంగోంగ్ సరస్సు వద్ద 'ఈ ప్రదేశం మాది' అని చైనా భాషలో రాసిన బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న భారత భద్రతాదళ సిబ్బంది

## ఎన్‌ఐఏకు కేరళ 'లవ్ జిహాద్' కేసు

**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** 'లవ్ జిహాద్'లో భాగంగా కేరళలో హిందు యువతి - షఫీన్ జహాన్ అనే ముస్లిం యువకుడి వివాహాన్ని రాష్ట్ర హైకోర్టు రద్దు చేయడానికి గల కారణాలపై దర్యాప్తు చేయాలని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ)ను చీఫ్‌జస్టిస్ జేఎస్ ఖేహర్, జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. ఈ కేసును సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ఆర్‌వీ రవీంద్రన్ పర్యవేక్షణలో దర్యాప్తు చేయాలని పేర్కొన్నది. ఈ కేసులో పూర్తి పరిస్థితిని తెలుసుకునేందుకు తటస్థ సంస్థగా 'ఎన్‌ఐఏ'ను పరిగణిస్తున్నామని సుప్రీం వివరించింది. 'లవ్ జిహాద్'లో భాగంగానే జరిగిన ఈ వివాహాన్ని రద్దు చేస్తున్నట్లు ఇంతకుముందే కేరళ హైకోర్టు తీర్పు చెప్పింది. ఈ నేపథ్యంలో దర్యాప్తు పూర్తి కాగానే నివేదిక సమర్పించాలని ఎన్‌ఐఏను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఎన్‌ఐఏ దర్యాప్తు నివేదిక, కేరళ పోలీసుల నుంచి సమాచారం, సదరు యువతితో చర్చించిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని సుప్రీం ధర్మాసనం తెలిపింది. ఈ కేసుకు సంబంధించిన సమాచారాన్ని ఎన్‌ఐఏతో పంచుకోవాలని ఈ నెల 10న కేరళ పోలీసులను సుప్రీంకోర్టు ఆదేశించింది.

## అందుబాటు ధరలో మోకాలి పరికరాలు

- రూ.54వేల నుంచి 1.14లక్షల మధ్య ఉండాల్సిందే : కేంద్రం

**న్యూఢిల్లీ, ఆగస్టు 16 :** కీళ్లనొప్పులతో బాధపడుతున్నవారికి ఇది నిజంగా తీపికబురే. ఇప్పటికే స్టెంట్స్ ధర తగ్గించి హృద్రోగులకు ఊరటనిచ్చిన కేంద్ర ప్రభుత్వం తాజాగా మోకాలికి అమర్చే పరికరాల ధరను అందుబాటులోకి తీసుకువచ్చింది. వాటి ధర కచ్చితంగా రూ.54వేల నుంచి లక్షా 14వేల మధ్యలోనే ఉండాలని స్పష్టంచేసింది. ప్రస్తుతమున్న కీళ్ల శస్త్రచికిత్స వ్యయం 70శాతం వరకు తగ్గనుంది. మోకాలితో బాధపడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతూ, వాటి శస్త్రచికిత్సలు భారంగా పరిణమించిన దశలో కేంద్ర నిర్ణయం లక్షలాదిమందికి స్వాంతన చేకూర్చనుంది. మోకాలి సర్జరీకి రూ.లక్షల్లో వసూలు చేసే ప్రైవేటు దవాఖానల దోపిడీ నుంచి సామాన్యుడిని కాపాడేందుకు తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా ఏడాదికి రూ.1500 కోట్ల మేర రోగులకు ఆదా కానుంది.'ప్రభుత్వం ప్రేక్షకునిలా చూస్తూ ఉండిపోదల్చుకోలేదు. అన్యాయంగా, అనైతికమైన ఈ దోపిడీని ఇక అనుమతించబోము' అని ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి అనంత్‌కుమార్ తెలిపారు. క్యాన్సర్, ట్యూమర్ల శస్త్రచికిత్సలో ఉపయోగించే ప్రత్యేకమైన పరికరాల ధర ప్రస్తుతం రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలుండగా, అది ఇక రూ1,13,950 వరకు దిగిరానుందని సమాచారం. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 1.5-2 లక్షలమంది మోకాలి శస్త్రచికిత్స కోసం ఎదురుచూస్తున్నారని ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మనదేశంలో సంవత్సరానికి 1.2లక్షల నుంచి 1.5లక్షల వరకు మోకాలి ఆపరేషన్లు జరుగుతున్నాయి. గత ఫిబ్రవరిలో గుండె శస్త్రచికిత్సకు సంబంధించిన పరికరాలు స్టెంట్స్ ధరను 85శాతం వరకు కేంద్ర ప్రభుత్వం తగ్గించిన విషయం తెలిసిందే.



## ఆక్సిజన్ కొరతే కారణం

- గోరఖ్‌పూర్ ఘటనలో తేల్చిన విచారణ బృందం

**గోరఖ్‌పూర్, ఆగస్టు 16 :** గోరఖ్‌పూర్‌లోని బీఆర్‌డీ వైద్యకళాశాలలో చిన్నారులు మృత్యువాత పడడానికి ఆక్సిజన్ కొరతే కారణమని విచారణ బృందం తేల్చింది. వారంరోజుల్లో 60మందికిపైగా చిన్నారులు మృతిచెందిన ఘటన దేశవ్యాప్తంగా కలకలం సృష్టించింది. ఈ ఉదంతంపై యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విచారణకు ఆదేశించారు. చిన్నారుల మృతికి దారితీసిన పరిస్థితులను పరిశీలించిన విచారణ బృందం రెండు పేజీల నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఆక్సిజన్ కొరత కారణంగానే పిల్లలు మృతిచెందారని విచారణ బృందం స్పష్టంచేసింది. నిధులు సక్రమంగా అందకపోవడం వల్లే ఆక్సిజన్ కొరత ఏర్పడిందని తేల్చింది. ఈ ఘటనకు ఆరుగురు సిబ్బంది బాధ్యులని వెల్లడించింది. ప్రిన్సిపాల్ రాజీవ్ మిశ్రా, అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ సతీశ్, చీఫ్ ఫార్మాసిస్ట్ గజానన్ అగర్వాల్ పనితీరు సంతృప్తికరంగా లేదని, డాక్టర్ కఫీల్ అహ్మద్ సమాచారం అందించినప్పుడే వీరు స్పందించి ఉంటే ఈ దుర్ఘటన సంభవించేదికాదని విచారణ బృందం అభిప్రాయపడింది. ఇక గోరఖ్‌పూర్ బీఆర్‌డీ దవాఖానలో బుధవారం మెదడువాపుతో బాధపడుతున్న మరో ఐదుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఆగస్టు ఏడవ తేదీనుంచి చనిపోయిన చిన్నారుల సంఖ్య 71కి చేరింది.



ఉత్తరప్రదేశ్‌లోని ఓ మదర్సాలో జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న బాలికలు

## జాతీయ గీతం పాడని మదర్సాలపై చర్యలు

- జాతీయ భద్రత చట్టం కింద చర్యలు చేపడుతామన్న యూపీ సర్కార్

**లక్నో, ఆగస్టు 16:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ గీతం పాడని మదర్సాలపై జాతీయ భద్రత చట్టం (ఎన్ఎస్ఏ) కింద చర్యలు తీసుకొనేందుకు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం సిద్ధమవుతున్నది. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి యూపీలోని కొన్ని మదర్సాలలో జాతీయగీతాన్ని మరికొన్నింటిలో సారే జహా సే అచ్చా గీతాన్ని ఆలపించారు. కానీ బరేలీలోని మదర్సాలలో మాత్రం ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించి జాతీయ గీతాన్ని పాడలేదని వార్తలు వచ్చాయి. అటువంటి మదర్సాలను గుర్తించి చర్య తీసుకుంటామని బరేలీ డివిజనల్ కమిషనర్ పీవీ జగన్‌మోహన్ బుధవారం చెప్పారు. జాతీయ గీతం ఆలపించలేదని తమ దర్యాప్తులో తేలినప్పుడు, ఆ విషయాన్ని మదర్సాల యాజమాన్యాలు రాతపూర్వకంగా అంగీకరించినప్పుడు వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. తగిన సాక్ష్యాధారాలు లభిస్తే వారిపై జాతీయ భద్రత చట్టం కింద చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అన్ని మదర్సాలలో జాతీయ గీతం పాడాలని, ఆ దృశ్యాలను వీడియో తీయాలని ఉత్తర్‌ప్రదేశ్ మదర్సా బోర్డు ఆదేశించింది. అయితే జన గణ మన పాడటం ఇస్లామ్‌కు వ్యతిరేకమని, జాతీయ గీతంలోని కొన్ని పదాలు ఇస్లామ్‌లో 'నిషిద్ధం' అని బరేలీ నగర ఖాజీ మౌలా అస్జాద్ రజా ఖాన్ పేర్కొన్నారు.

## ఎన్‌ఐఏ అదుపులో కశ్మీర్ వ్యాపారవేత్త

- ఉగ్రవాదులకు నిధులు సమకూర్చుతున్నాడని ఆరోపణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు సమకూర్చుతున్నాడనే ఆరోపణలపై శ్రీనగర్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త జహూర్ వతాలిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) అదుపులోకి తీసుకున్నది. అనంతరం అతడి కుటుంబసభ్యులతోపాటు బంధువులు, ప్రధాన అనుచరుల ఇండ్లపై బుధవారం దాడులు నిర్వహించింది. ఈ కేసుకు సంబంధించిన కీలక ఆధారాలు రాబట్టేందుకు ఢిల్లీలో అతడిని విచారిస్తున్నది. జహూర్ వతాలి కుటుంబసభ్యులు, బంధువులు, అనుచరులు ఇండ్లపై ఏకకాలంలో ఎన్‌ఐఏ తనిఖీలు చేపట్టింది. కశ్మీర్‌లో హింసాత్మక చర్యల కోసం నిధుల అందజేతకు సంబంధించిన కీలక పత్రాలు లభించినట్టు ఎన్‌ఐఏ వర్గాలు తెలిపాయి.

## 1984 అల్లర్లపై దాఖలైన కేసుల సంగతి తేల్చండి

- ఇద్దరు మాజీ జడ్జీల పర్యవేక్షణ కమిటీకి సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** ఇందిరాగాంధీ హత్యానంతరం 1984లో ఢిల్లీ తదితర ప్రాంతాల్లో జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్లకు సంబంధించి నమోదైన 241కేసులను మూసేయాలన్న సిట్ నిర్ణయాన్ని పరిశీలించేందుకు సుప్రీంకోర్టు బుధవారం ఇద్దరు సభ్యుల పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేసింది. సిట్ నిర్ణయం సహేతుకమా? కాదా? అన్న విషయాన్ని కూడా పరిశీలించాలని కమిటీని జస్టిస్ దీపక్‌మిశ్రా నేతృత్వంలోని అత్యున్నత న్యాయస్థానం ధర్మాసనం ఆదేశించింది.



ఇందిర క్యాంటీన్‌ను ప్రారంభించిన అనంతరం అక్కడే భోజనం చేస్తున్న రాహుల్‌గాంధీ, కర్ణాటక సీఎం సిద్దరామయ్య తదితరులు

## మోదీ వల్లే.. కశ్మీర్‌లో హింస!

- బెంగళూరులో 'ఇందిర' క్యాంటీన్ ప్రారంభోత్సవంలో రాహుల్

**బెంగళూరు, ఆగస్టు 16:** ప్రధాని నరేంద్రమోదీ కశ్మీర్‌లో ద్వేషంతో కూడిన ఆగ్రహ పూరిత వాతావరణం సృష్టించారని కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ మండిపడ్డారు. కశ్మీర్ పట్ల మోదీ ప్రభుత్వ విధానం పాకిస్థాన్ అనుచితంగా ప్రవర్తించడానికి వీలు కల్పించిందన్నారు. బుధవారం కర్ణాటక రాజధాని బెంగళూరులో 'ఇందిర క్యాంటిన్'ను రాహుల్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో సభలో మాట్లాడుతూ, కశ్మీర్ లోయలో కొద్దిమంది వేర్పాటువాదులు విభిన్న పద్ధతుల్లో సమస్యలు సృష్టిస్తున్నారని అన్నారు.వాజపేయి ప్రభుత్వ హయాంలో కశ్మీర్ లోయ ఆందోళనలతో భగ్గుమంటుంటే 2004లో కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శాంతి నెలకొల్పామని చెప్పారు. ఇందిర క్యాంటిన్లలో అల్పాహారం రూ.5, మధ్యాహ్నం / రాత్రి భోజనం రూ.10లకు సరఫరా చేస్తారు. బెంగళూరు నగర పాలక సంస్థ పరిధిలో 198 డివిజన్ల పరిధిలో ఈ క్యాంటిన్లు పని చేస్తాయి.

# పీఎంకేఎస్‌వై ప్రాజెక్టులకు నాబార్డు రుణం

**న్యూఢిల్లీ/ హైదరాబాద్, నమస్తే తెలంగాణ :** దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి పీఎంకేఎస్‌వై (ప్రధానమంత్రి కృషి సించాయి యోజన) పథకం కింద రాష్ట్రాలకు నాబార్డు ద్వారా రుణాల మంజూరుకు కేంద్రం నిర్ణయించింది. ప్రధాని అధ్యక్షతన ఢిల్లీలో బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈమేరకు ఆమోదముద్ర లభించిందని కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ మీడియాకు వెల్లడించారు. ఆరుశాతం వడ్డీపై రాష్ట్రాలకు ఇచ్చే నాబార్డు రుణాలను కేంద్ర ప్రభుత్వం బాండ్ల రూపంలో జారీ చేయనుంది. నాబార్డు ద్వారా మొత్తం రూ. 29 వేల కోట్ల రుణాలు అవసరం కాగా, తొలి విడుతలో రూ. 9,020 కోట్లను విడుదల చేసేలా కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది. దీని ఫలితంగా ఈ సంవత్సరాంతానికి పూర్తికావాల్సిన 33 సాగునీటి ప్రాజెక్టులకు నిధులు సమకూరనున్నాయి. ఇందులో తెలంగాణకు చెందిన ప్రాజెక్టులు ఆరు ఉన్నాయి. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు వీలుగా కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ మూడేండ్ల కాలంలో పూర్తి చేసే పద్ధతిలో 99 ప్రాజెక్టులను గతేడాది పీఎంకేఎస్‌వై పథకం కిందికి తీసుకొచ్చింది. ఈ ప్రాజెక్టులన్నింటికీ గతంలో ఏఐబీపీ కింద కేంద్రం నుంచి ఆర్థిక సహకారం లభిస్తూ వచ్చింది. అయితే రాష్ట్రాలు వాటి వాటాగా నిధుల్ని విడుదల చేయడానికి బడ్జెట్ సమస్యలు ఉన్నందువల్ల నాబార్డు ద్వారా రుణాలను సమకూర్చి వాటికి చెల్లించే వడ్డీని పూర్తిగా కేంద్రమే భరించేలా పీఎంకేఎస్‌వై పథకానికి శ్రీకారం చుట్టింది. తెలంగాణకు చెందిన దేవాదుల, శ్రీరాంసాగర్ రెండవదశ, రాజీవ్ భీమా, కొమురంభీం, పాలెంవాగు, మత్తడివాగు, గొల్లవాగు, ర్యాలివాగు, నీలవాయి, జగన్నాథపూర్ కాల్వ, ఇందిరమ్మ వరదనీటి కాల్వ.. మొత్తం 11 ప్రాజెక్టులకు ఈ పథకంలో స్థానం లభించింది. మొత్తం మూడు దశల్లో 2019 చివరికల్లా ఈ ప్రాజెక్టులు పూర్తికావాల్సి ఉంది. తొలి దశలో పూర్తి కావాల్సిన గొల్లవాడు, మత్తడివాగు, ర్యాలివాగు ప్రాజెక్టులు ఆశించిన విధంగానే గడువులోగానే పూర్తయ్యాయి. ఇప్పుడు రెండవ దశలో జగన్నాథపూర్ కాల్వ, నీలవాయి, పాలెంవాగు, రాజీవ్ భీమా, కొమురంభీం, శ్రీరాంసాగర్ రెండవ దశ ప్రాజెక్టులు ఈ సంవత్సరాంతానికి లేదా వచ్చే సంవత్సరం మార్చి నాటికి పూర్తి కావాల్సి ఉంది. వీటిని పూర్తి చేయడానికి అవసరమైన నిధుల్లో కేంద్ర ఆర్థిక సాయంగా, ఏఐబీపీ గ్రాంట్ల రూపంలో మొత్తం 60% లభిస్తుంది. మిగిలిన 40% నిధుల్ని రాష్ట్రం భరించాల్సి ఉంటుంది. అయితే రాష్ట్రాల దగ్గర నిధులు లేనందువల్ల కేంద్ర ప్రభుత్వమే నాబార్డు ద్వారా రుణాల రూపంలో అందిస్తుంది. రానున్న పదిహేనేండ్ల కాలంలో వీటిని తిరిగి రాష్ట్రాలు నాబార్డుకు చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు నాబార్డు వసూలుచేసే 6% వడ్డీని కేంద్రమే భరిస్తుంది. మూడుదశల్లో కలిపి మన రాష్ట్రం నుంచి ఎంపిక చేసిన 11 ప్రాజెక్టులకుగాను సుమారు రూ.1060 కోట్ల మేర కేంద్రం నుంచి గ్రాంటు రావాల్సి ఉండగా, దాదాపు రూ.650 కోట్ల వరకు నిధులు విడుదలయ్యాయి. మిగిలిన మొత్తాన్ని ఇవ్వాల్సి ఉంది.ఈ ఏడాదికిగాను అధికారులు ఐదు ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాల్సిందిగా ఇప్పటికే కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. దేవాదుల ఎత్తిపోతల పథకానికి రూ.496 కోట్లు, రాజీవ్ భీమాకు రూ.107.49 కోట్లు, ఎస్సారెస్పీ రెండో దశకు రూ.31.34 కోట్లు, జగన్నాథపూర్ ప్రాజెక్టుకు రూ.3.19 కోట్లు, గొల్లవాగు ప్రాజెక్టుకు రూ.8.23 కోట్లు ఇవ్వాల్సిందిగా ప్రతిపాదనల్లో కోరారు.



కేంద్రమంత్రివర్గ నిర్ణయాలను మీడియాకు వెల్లడిస్తున్న మంత్రులు అరుణ్ జైట్లీ, రవిశంకర్ ప్రసాద్

పీఎంకేఎస్‌వై పథకం కింద దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన మొత్తం 99 ప్రాజెక్టుల్లో తొలి దశలో ఈ సంవత్సరం మార్చి నాటికి 23 ప్రాజెక్టులు పూర్తికావాల్సి ఉండగా 18 ప్రాజెక్టులు పూర్తయ్యాయి. మిగిలినవి దాదాపు ముగింపు దశలో ఉన్నాయి. తొలి దశ ప్రాజెక్టుల కోసం నాబార్డు గత ఆర్థిక సంవత్సరంలో రూ. 9086 కోట్లను విడుదల చేసింది. ఇందులో ఒక్క పోలవరం ప్రాజెక్టుకే రూ. 2414.16 కోట్లను విడుదల చేసింది. పీఎంకేఎస్‌వైలోని తొలి దశలోని మిగిలిన ప్రాజెక్టులకు రూ. 6,671.86 కోట్లను, కేంద్ర ప్రభుత్వం బాండ్ల రూపంలో రూ. 2187 కోట్లను నాబార్డు అక్టోబర్, డిసెంబర్ మాసాల్లో రెండు విడతలుగా విడుదల చేసింది. పైనిధులకు అదనంగా కేంద్ర ప్రభుత్వం తన వంతు ఆర్థికసాయంగా రూ. 924 కోట్లను విడుదల చేసింది. రెండవ దశలో తొలి విడతగా రూ. 9,020 కోట్లను విడుదల చేయడానికి మంత్రివర్గం ఆమోదం తెలుపగా మిగిలిన సుమారు రూ.20వేలకోట్ల మొత్తాన్ని మరో విడతలో నాబార్డు విడుదల చేయాల్సి ఉంటుంది. రెండవ దశలో 31 ప్రాజెక్టులు పూర్తికావాల్సి ఉండగా తొలి దశలోని రెండు ప్రాజెక్టులు పూర్తికావడానికి మరికొంత సమయం పడుతుండడంతో వాటినీ రెండవదశ జాబితాలో చేర్చింది. ఇక చివరి దశలోని 45 ప్రాజెక్టులను 2019కల్లా పూర్తి చేయాలన్నది పీఎంకేఎస్‌వై లక్ష్యం కనుక నాబార్డు వచ్చే ఆర్థిక సంవత్సరానికి కూడా రుణం సమకూర్చాల్సి ఉంటుంది. అయితే తొలివిడుతగా విడుదల చేయనున్న రూ. 9,020 కోట్లను నిధుల్లో ఏ ప్రాజెక్టుకు ఎంత మొత్తం అనేది, నాబార్డు రుణాల్లో ఏ రాష్ట్రానికి ఎంత అనేది కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ నిర్ణయిస్తుంది. మూడవ దశలో మన రాష్ట్రానికి చెందిన దేవాదుల, ఇందిరమ్మ వరదనీటి కాల్వ ప్రాజెక్టులు ఉన్నాయి.

**పీఎస్‌యూల్లో వ్యూహాత్మక వాటాల విక్రయానికి ప్రత్యేక కమిటీ**

ప్రభుత్వ రంగ సంస్థల్లో (పీఎస్‌యూ) వ్యూహాత్మక వాటాల విక్రయ ప్రక్రియను వేగవంతం చేసేందుకు కేంద్రమంత్రులు సభ్యులుగా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. పీఎస్‌యూల్లో వాటా విక్రయం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.72,500 కోట్లు సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో రూ.46,500 కోట్లు మైనారిటీ వాటాల విక్రయం ద్వారా, రూ.15 వేల కోట్లు వ్యూహాత్మక వాటాల విక్రయం ద్వారా, మరో రూ.11 వేల కోట్లు ప్రభుత్వ బీమా సంస్థల లిస్టింగ్ ద్వారా సమీకరించాలని అనుకుంటున్నది.

**నూతన మెట్రో రైల్‌పాలసీకి ఆమోదం**

దేశంలోని పలు నగరాల్లో చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణంలో అడ్డంకులను తొలగించేందుకు వీలుగా నూతన మెట్రోరైల్ పాలసీకి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నిబంధనల స్థిరీకరణ, భూసేకరణ అభివృద్ధి విధానాలు కొత్త పాలసీలో సులభతరం కానున్నాయి. మెట్రోరైల్ ప్రాజెక్టు నిధులు, రుణాలను ఈ పాలసీలో ప్రస్తావించారని అధికారులు తెలిపారు. ఢిల్లీ, బెంగళూరు, కోల్‌కతా, చెన్నై, కొచ్చి, ముంబై, జైపూర్, గురుగ్రామ్ నగరాల్లో 350 కిలోమీటర్ల మేర మెట్రోరైల్ ప్రాజెక్టులు పూర్తయ్యాయి. ఇక హైదరాబాద్, నాగ్‌పూర్, అహ్మదాబాద్, పుణె, లక్నో నగరాల్లో నిర్మాణంలో ఉన్నాయి.

**మాధ్యమిక, ఉన్నత విద్య సెస్ కోసం ఒకే కార్పస్ ఫండ్**

ఉన్నత, మాధ్యమిక విద్య సెస్‌ను ఒకే కార్పస్‌ఫండ్ కిందకు తీసుకువచ్చే ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 'మాధ్యమిక, ఉచ్ఛతరహా శిక్షా కోశ్' (ఎంయుఎస్‌కే)గా పిలిచే ఈ కార్పస్‌ఫండ్ నిధుల్ని విద్యారంగంలో ప్రభుత్వ కార్యక్రమాలకు ఖర్చు చేయనున్నారు. ఇక ఏపీ ఎన్‌ఐటీకి డైరెక్టర్, మూడు నాన్‌టీచింగ్ పోస్టుల్ని కేటాయిస్తూ క్యాబినెట్ తీర్మానించింది.

**ఈశాన్యరాష్ట్రాల్లో పరిశ్రమలకు పన్ను మినహాయింపు**

ఈశాన్య, హిమాలయ పర్వత రాష్ట్రాల్లోని పరిశ్రమలకు 2027 మార్చ్ వరకు పన్ను మినహాయింపునిస్తూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నది. జీఎస్టీ చట్ట పరిధిలోనే ఈ రాష్ట్రాల్లోని పరిశ్రమలకు పన్ను మినహాయింపు వర్తిస్తుందని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. జమ్ముకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌తోపాటు ఈశాన్య రాష్ట్రాలు పన్ను మినహాయింపు నుంచి ప్రయోజనం పొందనున్నాయి.మరోవైపు మేధోసంపత్తి హక్కులకు సంబంధించి భారత్, స్వీడన్ మధ్య కుదురనున్న అవగాహన ఒప్పందానికి కేంద్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది

**నార్త్ కోయెల్ రిజర్వాయర్ పూర్తికి కేంద్రం నిర్ణయం**

జార్ఖండ్, బీహార్ సరిహద్దుల్లో రూ.1622 కోట్లతో చేపట్టిన నార్త్ కోయెల్ రిజర్వాయర్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని కేంద్రం నిర్ణయించింది. 1993లో అటవీశాఖ అనుమతులు లేని కారణంగా ఈ ప్రాజెక్టు నిర్మాణం నిలిచిపోయింది. ఈ రిజర్వాయర్ పూర్తయితే మావోయిస్టులపై తిరుగులేని ఆయుధమవుతుందని కేంద్ర మంత్రి ఉమాభారతి తెలిపారు.

# బ్లూవేల్‌కు మరో ఇద్దరు బలి!

మొదటిపేజీ తరువాయి

బుధవారం ఒకేరోజు ఆ రెండు ఫిర్యాదులు వెలుగులోకి వచ్చాయి. తిరువనంతపురంలోని పెరుంకులంకు చెందిన మనోజ్ సి మనూ (16) ఈ సైకోగేమ్‌కి బానిసై జూలై 26న ఇంట్లో ఫ్యాన్‌కి ఉరేసుకున్నట్లు ఆయన తల్లి అనూ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. '2016 నవంబర్‌లో ఈ గేమ్‌ను మనోజ్ డౌన్‌లోడ్ చేసుకున్నాడు. నాకూ చూపించి, ఆ గేమ్ గురించి చెప్పాడు. అప్పుడే నేను వారించాను. అలాంటి గేమ్ ఆడబోనంటూ ప్రామిస్ కూడా చేశాడు. కానీ నాకు తెలియకుండానే ఆడటం మొదలుపెట్టాడు. ఆ సమయంలో చాలావింతగా ప్రవర్తించేవాడు. రాత్రిపూట ఒంటరిగా బయటకూర్చునేవాడు. ఒసారి చేతిపై రక్తం వచ్చేలా 'ఏబీఐ'అనే అక్షరాలను చెక్కుకున్నాడు. తర్వాత కొద్దిరోజులకు తనకు ఈతరాకపోయినా నదిలో దూకాడు. అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. తోడు లేకుండా ఎప్పుడూ బయటకు వెళ్లనివాడు బీచ్‌లకు ఒంటరిగా వెళ్లడం ప్రారంభించాడు. ఒక్కోసారి ఎవరినైనా చంపాలి లేదా తాను చనిపోవాలి అంటుండేవాడు. ఆ తర్వాత గేమ్ గురించి తెలుసుకుని ఆరా తీశాను. ఆడట్లేదంటూ మనూ అప్పుడూ అబద్ధం చెప్పాడు. నేను సీరియస్‌గా చెప్పడంతో తన మొబైల్ నుంచి గేమ్‌ను తొలగించాడు. తర్వాత ఏం జరిగిందో తెలీదుకానీ, కొద్దిరోజులకే ఇంట్లో ఫ్యాన్‌కి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు' అని మనూ తల్లి ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పోలీస్ అధికారి మనోజ్ అబ్రహం స్పందిస్తూ.. 'మనూ బ్లూవేల్ గేమ్ కారణంగానే చనిపోయినట్లు ఆధారాలేమీ లేవు. అయినా కుటుంబసభ్యుల సమాచారం ఆధారంగా విచారణ జరుపుతున్నాం' అని చెప్పారు.

**కన్నూర్‌లో మరో ఘటన**

బ్లూవేల్‌పై మరో ఫిర్యాదు కూడా పోలీసులకు అందింది. కేరళలోని కన్నూర్‌కు చెందిన ఐటీఐ విద్యార్థి సావంత్ (22) గతనెల ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన ఆత్మహత్యకు బ్లూవేల్ గేమ్ కారణమని భావిస్తున్నట్లు సావంత్ తల్లిదండ్రులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సావంత్ తల్లి మాట్లాడుతూ.. 'మా అబ్బాయి ల్యాప్‌టాప్‌లో హారర్ సినిమాలు చూసేవాడు. ఓసారి బ్లేడుతో చేతిపై చెక్కుకున్నాడు. తర్వాత కంపాస్‌తో ఛాతిపై 'ఎస్‌ఏ' అనే అక్షరాలను చెక్కుకున్నాడు. డిప్రెషన్‌లోనే ఇలా చేశాడని భావించాం. పలుమార్లు డాక్టర్ల వద్దకు తీసుకెళ్లాం. కానీ వాడి అసాధారణ ప్రవర్తనలో మార్పు రాలేదు. ఒక్కోసారి రాత్రంతా ల్యాప్‌టాప్‌లో గేమ్స్ ఆడుకుంటూ ఉండి తెల్లవారుజామున నిద్రపోయేవాడు. తర్వాత కొద్దిరోజులకే సావంత్ ఇంట్లో ఉరివేసుకుని చనిపోయాడు. ఇవన్నీ చూస్తుంటే మా బాబు బ్లూవేల్ గేమ్ కారణంగానే చనిపోయినట్లు అనిపిస్తున్నది' అని మీడియాకు వివరించారు.

**కేంద్రానికి కేరళ సీఎం లేఖ**

బ్లూవేల్ చాలెంజ్ గేమ్‌ను నిషేధించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కేరళ సీఎం పినరాయి విజయన్ ఈ నెల12న కేంద్రానికి లేఖ రాశారు.

**లింకులు తొలగించకపోతే కఠిన చర్యలు : కేంద్రం**

ఇంటర్నెట్, సోషల్ మీడియా ద్వారా విస్తరిస్తున్న బ్లూవేల్ చాలెంజ్ లింకుల్ని తొలగించకపోతే కఠినచర్యలు తీసుకుంటామని కేంద్ర న్యాయ, ఐటీశాఖల మంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పష్టంచేశారు. ఆన్‌లైన్ సాంకేతిక వేదికలన్నింటికీ ఈమేరకు ఆదేశాలను జారీ చేశామని, వీటిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ఈ ప్రమాదకర ఆటపై లెక్కలేనన్ని ఫిర్యాదులు అందుతున్నాయని, టీనేజర్ల ప్రాణాలతో ఎవరు చెలగాటమాడినా సహించబోమని రవిశంకర్‌ప్రసాద్ తెలిపారు.

**'బ్లూవేల్'పై ఢిల్లీ హైకోర్టులో పిల్**

బ్లూవేల్ చాలెంజ్‌కు సంబంధించిన లింకులను తొలగించేలా గూగుల్, ఫేస్‌బుక్, యాహూ వంటి ఇంటర్నెట్ సంస్థలను ఆదేశించాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టులో మంగళవారం ఓ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. దీనిపై గురువారం విచారణ చేపడుతామని ధర్మాసనం ప్రకటించింది. గేమ్‌కు బానిసలై టీనేజర్లు మృతిచెందడం ఆందోళన కలిగిస్తున్నదని పిటిషనర్ గుర్మీత్ సింగ్ చెప్పారు.



### సైకో డెవలపర్.. బుడేకిన్

బ్లూవేల్ ప్రాణాంతక క్రీడను రూపొందించింది రష్యాకు చెందిన 22 ఏండ్ల ఫిలిప్ బుడేకిన్. భయం ఆధారంగా గేమ్‌ను తయారు చేయాలనుకున్నానని, దీంట్లో భాగంగానే 'బ్లూవేల్ చాలెంజ్'ను సృష్టించానంటాడీ సైకో డెవలపర్. రష్యాలో 130మందికి పైగా టీనేజర్లు ఈ గేమ్ కారణంగా ఆత్మహత్య చేసుకోవడంతో బుడేకిన్‌ను గత మేనెలలో పోలీసులు అరెస్టు చేశారు. బుడేకిన్ నేరుగా కొంతమంది చిన్నారులకు క్యురేటర్‌గా టాస్కులు ఇచ్చాడని దర్యాప్తులో తేలింది. విచారణ సందర్భంగా ఆయన మానసిక స్థితి సరిగాలేదని తేలింది. వైద్యులు ఆయనకు చికిత్స అందించారు. 'ఇలాంటి గేమ్ తయారు చేసినందుకు నేను ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నాను. రష్యాలో 117మంది టీనేజర్లు ఆత్మహత్య చేసుకోవడానికి నేను బాధ్యుడిని' అని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో బుడేకిన్ బాధపడ్డాడు. విచారణ అనంతరం రష్యా కోర్టు ఆయనకు మూడేండ్ల కారాగారశిక్ష విధించింది.

### 'బ్లూవేల్'పై నిషేధం సాధ్యమేనా?



బ్లూవేల్ చాలెంజ్‌ను అడ్డుకోవాలన్న డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో దాని నిషేధంకానీ, బ్లాక్ చేయడం కానీ సాధ్యమేనా? అంటే.. అది దాదాపు అసాధ్యమని నిపుణులు చెప్తున్నారు. 130మందికి పైగా టీనేజర్లు మృతి చెందిన రష్యాలోనే నిషేధం సాధ్యపడలేదు. బ్లూవేల్ చాలెంజ్ అనేది కేవలం యాప్ గేమ్ కాదు. అది ఆన్‌లైన్ ద్వారా అందే సూచనల సమాహారం. బ్లూవేల్ గేమ్ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, స్నాప్‌చాట్ చివరకు వాట్సప్ వంటి సోషల్‌మీడియా వేదికల ద్వారా విస్తరిస్తున్నది. క్యురేటర్లు అనే వ్యక్తులు చాటింగ్‌ల ద్వారా ఈ చాలెంజ్‌లకు దిగుతారు. ఇక్కడ రకరకాల హ్యాష్‌టాగ్‌ల ద్వారా బ్లూవేల్ గేమ్‌లోకి టీనేజర్లను క్యురేటర్లు లాగుతారు. వారే ఆ పిల్లలకు ప్రతిరోజు తెల్లవారుజామున 4.30 గంటలకు టాస్కులను కేటాయిస్తారు. వారి ఫోన్‌నెంబర్లను తెలుసుకుంటారు. స్కైప్‌లోనూ మాట్లాడుతారు. న్యూడ్ ఫొటోలతో సహ పలు రహస్యాలను టాస్కుల్లో భాగంగా సేకరిస్తారు. ఒకవేళ గేమ్‌ను మధ్యలో వదిలేసి వెళ్లేందుకు టీనేజర్ ప్రయత్నిస్తే ఆ రహస్యాలను చూపించి బెదిరిస్తారు. బ్లూవేల్ చాలెంజ్ అనేది ఒక హ్యాష్‌ట్యాగ్, ఒక లింక్, ఒక యాప్‌కు పరిమితమై లేనప్పుడు దానిని అడ్డుకోవాలంటే సోషల్ మీడియాను పూర్తిగా నిలిపివేయాలి. అది అసాధ్యం. ఇక ప్రభుత్వం కోరుతున్నట్లు బ్లూవేల్ చాలెంజ్ లింకుల్ని తొలగించినా, దాని విస్తరణ ఆగదని సైబర్ నిపుణులు స్పష్టంచేస్తున్నారు.

## ట్రంప్ వైఖరిపై నిరసనల వెల్లువ

- అధ్యక్ష సలహా మండలులకు మరికొందరి రాజీనామా



**వాషింగ్టన్, ఆగస్టు 16:** వర్జీనియాలోని చార్లొటెస్‌విల్లే ర్యాలీలో హింస నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్రమైన విమర్శలను ఎదుర్కొంటున్నారు. జాత్యహంకార ర్యాలీని ఖండించకపోవడంపై తమ పార్టీతోపాటు, ప్రతిపక్షం కూడా దుయ్యబడుతున్నా ఆయన వైఖరి మార్చుకోకుండా తన వాదనే సరైనదంటున్నారు. ఆయన ధోరణిని వైట్‌హౌస్ వర్గాలు సైతం నిరసిస్తున్నాయి. ఇప్పటికే ఈ విషయమై వైట్‌హౌస్ సలహామండలి నుంచి మెర్క్, ఇంటెల్, అండర్ అర్మర్ సంస్థల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు వైదొలిగారు. మంగళవారం ఉత్పత్తుల రంగానికి సంబంధించిన ట్రంప్ సలహా మండలి నుంచి అమెరికాలోని ప్రధాన కార్మిక సంఘం అధ్యక్షుడు రిటర్డ్ ట్రమ్కా తప్పుకొన్నారు. జాత్యహంకార, ప్రజాస్వామిక ఉగ్రవాదాల్ని సహించే అధ్యక్షునికి సలహాదారుగా తానుండలేనంటూ ట్రమ్కా వైట్‌హౌస్ మండలి పదవికి రాజీనామా చేశారు. 'జాత్యహంకార ధోరణిని ట్రంప్ ఖండించడం లేదు, సరికదా తన వాదనను సమర్థించుకుంటున్నారు. జాత్యహంకార వాదులకు చట్టబద్ధత ఉన్నదనే వైఖరితో మాట్లాడుతున్నారు. ఇందుకు రాజీనామాలతో అమెరికా కార్మికవర్గం తరపున మనం నిరసన తెలుపాలి' అని పేర్కొంటూ ట్రమ్కా ప్రకటన చేశారు. ఈయనతో ట్రంప్ విధానాలకు నిరసనగా రాజీనామా చేసిన ప్రముఖుల సంఖ్య ఎనిమిదికి చేరింది. గత శనివారం వర్జీనియాలో 'యునైట్ ది రైట్' అనే పేరిట శ్వేతజాతీయులు, నయా నాజీలు కలిసి జాత్యంహకార ర్యాలీ నిర్వహించడం, వారిని వ్యతిరేకిస్తూ ఉదారవాదులు పోటీ ర్యాలీ తీయడం.. ఒక వర్గానికి చెందిన వారు మరోవర్గంపైకి కారుతో దూసుకువెళ్లడంతో ఒక మహిళ చనిపోగా 19 మంది గాయపడిన సంగతి విదితమే. ఈ హింసకు శ్వేతజాతి ఆధిపత్యవాదులతోపాటు, వారిని వ్యతిరేకించేవారు కూడా కారణమన్న తన వాదనను అధ్యక్షుడు ట్రంప్ సమర్థించుకుంటున్నారు.ట్రంప్ వైఖరిని అమెరికాలోని భారతీయులు కూడా ఖండిస్తున్నారు. ఆయన వ్యాఖ్యలు దేశానికి అవమానకరమైనవని అమెరికా చట్టసభ సభ్యులు రాజా కృష్ణమూర్తి, అమీ బెరా అన్నారు.

**ఒబామా ట్వీట్లకు నెటిజన్ల నుంచి భారీ స్పందన**

ఈ నెల 12న వర్జీనియాలో జాత్యహంకార ర్యాలీల నేపథ్యంలో హింసకు వ్యతిరేకంగా అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా చేసిన ట్వీట్లకు పెద్ద ఎత్తున ప్రజా స్పందన లభిస్తున్నది. ఇప్పటివరకు ఆయన ట్వీట్లకు 30 లక్షల మందికి పైగా స్పందించారు. నెటిజన్లు 28 లక్షలసార్లు వాటిని సోషల్ మీడియాలో లింక్ చేశారు. 11 లక్షలసార్లు రీట్వీట్ చేశారు. రీట్వీట్లలో ఇది అతి పెద్ద రికార్డుగా భావిస్తున్నారు. గాంధేయ మార్గంలో శాంతియుతంగా ఉద్యమించి దక్షిణాఫ్రికాను శ్వేతజాతీయుల పాలన నుంచి విముక్తం చేసిన ఆ దేశ మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా సందేశాన్ని ఉటంకిస్తూ ఒబామా ట్వీట్ చేశారు. 'ఇతరుల శరీరవర్ణాన్ని, నేపథ్యాన్ని, మతాన్ని ద్వేషిస్తూ ఎవరూ జన్మించరు' అన్న మండేలా సందేశం వాటిలో ఒకటి.

## ఉపరాష్ట్రపతి కార్యదర్శిగా ఐవీ సుబ్బారావు

**న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ:** రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఐవీ సుబ్బారావును ఉపరాష్ట్రపతి కార్యాలయ కార్యదర్శిగా కేంద్ర సిబ్బంది శిక్షణా వ్యవహారాల మంత్రిత్వ శాఖ (డీవోపీటీ) నియమించింది. ఈ మేరకు కేంద్ర నియామకాల కమిటీ నిర్ణయం తీసుకున్నదని బుధవారం జారీచేసిన ఆదేశాల్లో పేర్కొన్నది. రెండేండ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. 1979 ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన ఐవీ సుబ్బారావు ప్రకాశం జిల్లా వాసి. ఆయన ఉమ్మడి రాష్ట్రంలో వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రెండేండ్ల క్రితం పదవీ విరమణ చేశారు. తర్వాత యునెస్కోలో కొంతకాలం పని చేసిన ఐవీ సుబ్బారావు.. అంతకుముందు ఉమ్మడి ఏపీ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా, టీటీడీ ఈవోగా, విద్య, వైద్య శాఖల ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు.

### వృద్ధాశ్రమాల్లో తల్లిదండ్రులు బందీ
### భారంగా భావించి వదిలేస్తున్న పుత్రరత్నాలు
### నిర్లక్ష్యం వహించేవారిలో విద్యావంతులే అధికం
### గ్రేటర్ హైదరాబాద్‌లో పెరుగుతున్న ఆశ్రమాలే నిదర్శనం
### వృద్ధులకు బాసటగా హెల్పేజ్ ఇండియా
### టోల్‌ఫ్రీ నంబర్, యాప్‌లతో భరోసా



# కన్నపేగు కన్నీరు!


(శిరందాస్ ప్రవీణ్‌కుమార్)
హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

పిల్లలు ప్రయోజకులై జీవితంలో స్థిరపడాలని తపించే తల్లిదండ్రులు వృద్ధాప్యంలో కోరుకునేది ఒక్కటే.. ఆదరణ, ఆత్మీయత. మనుమలు, మనుమరాళ్లతో కాలక్షేపం చేస్తూ.. కృష్ణారామా అంటూ శేషజీవితాన్ని గడుపాలనేది ప్రతి ఒక్కరి కోరిక. కానీ కాసుల గలగలల మధ్య కన్నతల్లిదండ్రుల జ్ఞాపకాలు కనుమరుగవుతున్నాయి. తల్లిదండ్రులను భారంగా భావిస్తున్న కొడుకులు.. వారిని వృద్ధాశ్రమాల్లో చేర్పిస్తున్న ఉదంతాలు నానాటికీ పెరుగుతున్నాయి. ప్రత్యేకించి విదేశాల్లో ఉంటున్నవారు తల్లిదండ్రులను తమతో తీసుకువెళ్లేందుకు ఇష్టపడక.. ఖరీదైన ఓల్డేజ్ హోమ్‌లలో చేర్పిస్తూ బరువు దించుకుంటున్నారు. ఫలితంగా వృద్ధాశ్రమాలు కుప్పలు తెప్పలుగా పుట్టుకొస్తున్నాయి. సామాజిక బాధ్యతతో ఆశ్రమాలను నిర్వహిస్తున్న కొందరు మినహాయిస్తే అత్యధికం వ్యాపారాత్మక ధోరణితో ఉన్నవే కావడం గమనార్హం. రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్, యాదాద్రి, సంగారెడ్డి జిల్లాల్లో 3, 5 స్టార్ల హోటళ్లను తలపించే వృద్ధాశ్రమాలే దీనికి నిదర్శనం. 'ఉచిత వైఫై, డబుల్ బెడ్ ఇండిపెండెంట్ కాటేజీలు, డీలక్స్ గదులు, క్లబ్‌హౌస్, స్విమ్మింగ్‌పూల్స్, బ్యాంకింగ్, పోస్టల్ సర్వీసు.. అంతే కాదు.. రెస్టారెంట్, థియేటర్, తల్లిదండ్రులను ప్రత్యక్షంగా చూసుకొనేందుకు అందుబాటులో 24/7 వెబ్ కెమెరాలు.. వీటన్నింటికీ నెలకు రూ.33 వేలే! ఇదొక వృద్ధాశ్రమం ప్రకటన! నెలకు రూ.5 వేల నుంచి రూ.33 వేల వరకు చార్జీలు తీసుకొనే ఆశ్రమాలు నగర శివార్లలో చాలానే ఉన్నాయి.



#### తెగుతున్న పేగు బంధాలు

**పొద్దున** పేపర్ తిరగేస్తే, కనికరం లేకుండా కన్నవాళ్లను గెంటేశారంటూ కోకొల్లలుగా కథనాలు! ఎవరూ పట్టించుకోవడం లేదని 60, 70 ఏండ్ల వయసులో ఆత్మహత్య చేసుకుంటున్న వార్తలు! సమాజంలో పలుచబారుతున్న కుటుంబసంబంధాలకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. హైదరాబాద్ శివారు బొల్లారం ప్రాంతానికి చెందిన నాగమణికి ఇద్దరు కొడుకులు, ఇద్దరు బిడ్డలు. భర్త చనిపోయినా, ఒంటరిగా పెంచి పెండ్లిళ్లు చేసి ఆస్తి పంచింది. చిన్నకొడుకు ఇల్లు అమ్ముకొని తల్లి ఇంట్లోనే మకాంవేశాడు. కిరాయిలు తీసుకొని ఇంటిని తన పేరిట రాయించుకొని తల్లిని వెళ్లగొట్టాడు. తల్లి హెల్పేజ్ ఇండియా సహకారంతో మల్కాజిగిరి ఆర్డీవోకు మొరపెట్టుకోగా కొడుకుకు ఇల్లు ఖాళీ చేయాలంటూ ఆదేశాలు జారీ అయ్యాయి. కానీ, అతడు హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నాడు. తల్లి మాత్రం ప్రభుత్వ పింఛన్‌తో కాలం వెళ్లదీస్తున్నది.




#### దుబాయ్‌లో వదిలేసిన కర్కోటకుడు

ఒక్కగానొక్క కొడుకును బాగా చదువిస్తే అమెరికాలో స్థిరపడ్డాడు. తండ్రి చనిపోయాక తల్లిని తీసుకెళ్లాడు. రక్షణ ఉండదని, అమెరికాలో బంగారం వేసుకోరని నమ్మించి.. అన్నీ అమ్మేసి సొమ్ము చేసుకున్నాడు. ఆస్తి చేతికి చిక్కాక అమెరికా వెళ్తున్నామని విమానంలో దుబాయ్ వరకు తీసుకెళ్లి 70 ఏండ్ల తల్లిని వదిలేసిపోయాడు. భాష రాక, ఆకలితో అలమటించిన తల్లి, అధికారుల దయాదాక్షిణ్యాలతో తిరిగొచ్చి కేసుపెట్టింది. అమెరికా పౌరసత్వం పొందిన కర్కోటకుడిపై చర్యలు తీసుకోలేకపోతున్నారు.

#### కర్మకాండలు చేయకుండానే పలాయనం

తల్లి చనిపోయిందని తెలిసి అమెరికా నుంచి వచ్చిన కొడుకు, దహన సంస్కారాలు పూర్తయ్యాక... ఫ్లైట్‌కు టైం అయ్యిందని శ్మశానవాటిక నుంచే విమానాశ్రయానికి వెళ్లిపోయాడు. కర్మకాండల సంగతేంటని తండ్రి ప్రశ్నిస్తే, ఆస్తి కూడా అవసరం లేదంటూ చెప్పి ఒంటరిని చేశాడు. మరో ఘటనలో హైదరాబాద్‌లోని సైనిక్‌పురికి చెందిన రిటైర్డ్ కర్నల్ ఒక్కగానొక్క కూతురిని బాగా చదివించి పెండ్లి చేస్తే ముంబైలో స్థిరపడింది. 80, 75 ఏండ్ల వయసున్న తల్లిదండ్రులను గాలికొదిలేసింది. అనారోగ్యంతో మంచం పట్టిన భార్యే తనకంటే ముందు పోవాలంటున్న ఆయన మాటలు కంటతడి పెట్టిస్తున్నాయి.

#### తాత ఆస్తి కావాలని దౌర్జన్యం

సికింద్రాబాద్ ప్యాట్నీ ప్రాంతానికి చెందిన రఘురాంకు కొడుకు, కూతురు ఉన్నారు. ఆస్తులు అమ్మి అమెరికాలో కొడుకును ఎంఎస్ చేయించాడు. కూతురుకు పెండ్లిచేశాడు. బెంగళూరులో నెలకు రూ.1.50 లక్షల జీతంతో స్థిరపడిన కొడుకు, తల్లిదండ్రులకు చెప్పకుండానే పెండ్లి చేసుకొని మాట్లాడడమే మానేశాడు. తండ్రికి గుండె ఆపరేషన్ అయినా వచ్చి చూడలేదు. అతికష్టంగా బెంగళూరు అడ్రస్ వెతుక్కుంటూ తల్లిదండ్రులు వెళ్తే, అపాయింట్‌మెంట్ లేకుండా ఎలా వస్తారంటూ సెక్యూరిటీతో గెంటేయించాడు. హెల్పేజ్ సహకారంతో కేసు వేస్తే సికింద్రాబాద్ ఆర్డీవో కార్యాలయానికి పిలిపించగా అడ్వకేట్‌తో వచ్చిన కొడుకు, తాత ఆస్తి(ఇల్లు) కావాలని పట్టుబట్టాడు. అధికారుల నిలదీత, కౌన్సెలింగ్ తర్వాత నెలకు రూ.10 వేలు తిండికి, రూ.4 వేలు మందులకు ఇచ్చేందుకు ఒప్పుకొన్నాడు. రూ.లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. అదంతా బలవంతంగానే! కానీ ప్రేమ, ఆప్యాయతలను మరిచిన ఆ కొడుక్కి బాధ్యత గుర్తొచ్చేదెప్పుడు?

#### రేమండ్ రారాజుకూ కష్టాలే

వస్త్రప్రపంచంలో రేమండ్‌ను విశ్వవ్యాప్త బ్రాండ్‌గా మలిచిన పారిశ్రామిక దిగ్గజం విజయ్‌పథ్ సింఘానియా(78)కు సైతం కష్టాలు తప్పడంలేదు. ముంబైలోని మలబార్‌హిల్స్‌లోని 36 అంతస్తులతో సొంతంగా నిర్మించిన జేకే హౌజ్‌లో వాటా కోసం కొడుకు పైనే కోర్టుకెక్కాడు. రేమండ్ సంస్థలో రూ.వెయ్యి కోట్ల విలువైన షేర్లన్నీ కొడుకు పరమవడంతో సిరిసంపదలు అనుభవించిన సింఘానియా కిరాయి ఇంట్లో కాలం వెళ్లదీస్తున్నాడు. ఈ నెల 22న ముంబై కోర్టు కేసును విచారించనుంది.

#### ఎందుకీ ధోరణి?

**90 శాతం** జంటలు పెండ్లి కాగానే పిల్లలను కనేందుకు ఇష్టపడడం లేదు. జీవితంలో స్థిరపడటం, ఎంజాయ్ కోసం కాలయాపన చేస్తున్నారు. తర్వాత సంతానం కలుగకపోతే ఆ చిరాకును కూడా వృద్ధులపై ప్రదర్శిస్తున్నారని హెల్పేజ్ ఇండియా డిప్యూటీ డైరెక్టర్ యతీంద్ర తెలిపారు. సంపాదనకు మించిన కలలుకంటూ తల్లిదండ్రులపై ఒత్తిడికి చేస్తున్నారని, ఆర్థిక వనరులుగా, లేదంటే మానవ వనరులుగా పరిగణిస్తున్నారని చెప్పారు. భార్య ప్రసవ సేవల కోసం తల్లిని తీసుకెళ్లి, తర్వాత వదిలించుకుంటున్నారని ఆయన అన్నారు. ఒక విధంగా వృద్ధులు తమ అవసాన దశలో కట్టుబానిసలుగా మారడమో.. లేదా అనాథలుగా బతుకీడ్చమో జరుగుతున్నది. ఈ నేపథ్యంలో వృద్ధ తల్లిదండ్రులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని హెల్పేజ్ ఇండియా అడ్వకసీ ఆఫీసర్ పీ శ్యాంకుమార్ సూచించారు. పక్కింట్లో, ఎదురింట్లో ఎక్కడైనా వృద్ధులను వేధించినా, ఆదరించకపోయినా ప్రతిఒక్కరూ ప్రశ్నించాలని హెల్పేజ్ ఇండియా తెలంగాణ, ఏపీ విభాగం ప్రతినిధి మహ్మద్ రజా మహ్మద్ అన్నారు. అటువంటి ఉదంతాలపై తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్, పోలీసులకు, హెల్పేజ్ ఇండియా టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.



మహ్మద్ రజా మహ్మద్

#### హెల్పేజ్ ఇండియా జూన్ సర్వే ఫలితాలు

| | |
|---|---|
| 45% | బహిరంగ ప్రదేశాల్లోనూ వేధింపులకు గురవుతున్న వృద్ధులు |
| 53% | సమాజం వేరుగా చూస్తున్నదంటున్న వృద్ధులు |
| 64% | అనుచితంగా ప్రవర్తిస్తున్నారంటున్న వృద్ధులు |
| 65% | బస్సుల్లో కేటాయించిన సీట్లు పొందుతున్నవారు |
| 57% | బ్యాంకుల్లో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నవారు |
| 70% | దవాఖానల్లో ప్రత్యేక శ్రద్ధ పొందుతున్నవారు |
| 61% | వృద్ధాప్యంలో నెమ్మదితనాన్ని అంగీకరించనివారు |
| 52% | బిల్లులు కట్టేటప్పుడు సాయం పొందుతున్న వృద్ధులు |



**పట్టణాల్లో వృద్ధులపై వేధింపులు:**
ఢిల్లీ- 23%, బెంగళూరు-70%, హైదరాబాద్-60%, గౌహతి-50%, కోల్‌కతా-52%, చెన్నై- 49%, ముంబై- 33%.

**రోడ్లపై అభద్రతకు గురవుతున్న వృద్ధులు**
ఢిల్లీ-48%, బెంగళూరు-73%, లక్నో- 66%, ముంబై-59%.



#### ఇవీ చట్టాలు.. హెల్పేజ్ సాయం

**'తల్లిదండ్రులు,** వృద్ధుల పోషణ, సంక్షేమచట్టం-2007' ప్రకారం 60 ఏండ్లకు పైబడిన వాళ్లు పోషణ బాధ్యతను డిమాండ్ చేయవచ్చు. ఆస్తులు రాయించుకొని గాలికొదిలేస్తే సెక్షన్ 23 ప్రకారం తిరిగి పొందే వీలుంది. రిజిస్ట్రేషన్ కూడా రద్దు చేయవచ్చు. తక్షణ సాయం అందించేందుకు హెల్పేజ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ సిద్ధంగా ఉన్నది. www.helpageindia.orgలో ఫిర్యాదు చేయవచ్చు. హెల్పేజ్ SOS యాప్‌లో ఎరుపు రంగులో ఉన్న గుర్తుపై క్లిక్ చేస్తే దగ్గరలోని హెల్పేజ్ ఇండియా ప్రతినిధులకు కనెక్ట్ అవుతుంది. దేశవ్యాప్తంగా హెల్పేజ్ ఇండియా కార్యాలయాలు ఉన్నాయి. టోల్‌ఫ్రీ నం.1800 180 1253కి కాల్ చేసి కూడా ఫిర్యాదు చేయొచ్చు.






## రికార్డుస్థాయిలో ధాన్యం ఉత్పత్తి

- ఆహారధాన్యాలు 275.68 మిలియన్ టన్నులు
- ఐదేండ్లతో పోలిస్తే ఉత్పత్తిలో 7.27 శాతం వృద్ధిరేటు
- 4వ ముందస్తు అంచనాలు వెల్లడించిన కేంద్రవ్యవసాయశాఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జాతీయస్థాయిలో 2016-17 సంవత్సరానికిగాను అన్ని ఆహారధాన్యాల ఉత్పత్తి రికార్డుస్థాయిలో పెరిగినట్టు కేంద్ర వ్యవసాయశాఖ వెల్లడించింది. వానాకాలం, యాసంగి సీజన్లలో కలిపి రికార్డుస్థాయిలో 275.68 మిలియన్ టన్నుల ఆహారధాన్యాలు ఉత్పత్తి అయినట్టు తెలిపింది. జాతీయస్థాయిలో అన్ని పంటల ఉత్పత్తులకు సంబంధించి నాలుగో ముందస్తు అంచనాలను కేంద్రప్రభుత్వం బుధవారం ఢిల్లీలో విడుదల చేసింది. గతేడాది దేశవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురువడంతో పంటల ఉత్పత్తి పెరిగినట్టు నివేదికలో పేర్కొన్నది. దేశవ్యాప్తంగా అన్నిరాష్ట్రాల నుంచి వేర్వేరుగా సేకరించిన నాలుగో ముందస్తు అంచనాలను క్రోడీకరించి ఈ నివేదిక రూపొందించింది. గత ఐదేండ్ల ఉత్పత్తితో పోలిస్తే ఈ ఏడాది 7.27 శాతం వృద్ధిరేటుతో దేశవ్యాప్తంగా 18.67 మిలియన్ టన్నుల ఆహారధాన్యాలు అధికంగా ఉత్పత్తి అయ్యాయి. వరిధాన్యం 110.15 మిలియన్ టన్నులు ఉత్పత్తికావడం మరో రికార్డుగా పేర్కొన్నది. గోధుమ 98.38 మిలియన్ టన్నులు, మక్కజొన్న 26.26 మిలియన్ టన్నులు, పప్పుధాన్యాలు 22.95 మిలియన్ టన్నులు, పత్తి 33.09 మిలియన్ బేల్స్ (ఒక్కోబేల్‌లో170 కేజీల పత్తి ఉంటుంది), సోయాబీన్ 13.79 మిలియన్ టన్నులు ఉత్పత్తి అయినట్టు వెల్లడించింది.

## శ్రీశైలం నుంచి 2.75 టీఎంసీలు సేకరించాలి

- ఏ ప్రాజెక్టు నీటి లభ్యతకూ ఇబ్బంది రావద్దు
- పాలమూరు, డిండి ప్రాజెక్టులపై రిటైర్డ్ ఇంజినీర్ల సూచన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శ్రీశైలం ఫోర్‌షోర్ నుంచి రోజుకు 2.75 టీఎంసీల నీటిని సేకరిస్తే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలతోపాటు డిండి ఎత్తిపోతల పథకం నీటి లభ్యతకు ఎలాంటి ఢోకా ఉండదని రిటైర్డ్ ఇంజినీర్లు అభిప్రాయపడ్డారు. 2.75 టీఎంసీల్లో రెండు టీఎంసీలను పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు, మిగిలిన 0.75 టీఎంసీలను డిండి ఎత్తిపోతలకు ఇవ్వాలని సూచించారు. తద్వారా డిండి ప్రాజెక్టు ద్వారా రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మహేశ్వరం పరిధిలోని చెరువులకు నీరందించడంతోపాటు మహబూబ్‌నగర్ జిల్లాలోనే లక్ష ఎకరాలకు సాగునీరు అందించవచ్చని పేర్కొన్నారు. బుధవారం ఖైరతాబాద్‌లోని కార్యాలయంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆధ్వర్యంలో పాలమూరు, డిండి ప్రాజెక్టులపై జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఈ మేరకు వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రధానంగా పాత మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలకు సాగునీరు అందించేందుకే రెండు ప్రాజెక్టులను ప్రభుత్వం చేపడుతున్నదని చెప్పారు. ఈ నేపథ్యంలో ఏ ఒక్క ప్రాజెక్టు నీటి లభ్యతకు కూడా ఇబ్బంది రాకుండా ఉండాలన్నారు.

## నీటి విడుదలపై కర్ణాటక సానుకూలం!

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ నగరంతోపాటు నల్లగొండ జిల్లాలోని ఫ్లోరైడ్‌పీడిత ప్రాంతాల తాగునీటి అవసరాలకు నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి 15 టీఎంసీల నీటిని విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కర్ణాటక సానుకూలంగా స్పందించినట్టు తెలుస్తున్నది. కృష్ణ భాగ్య జల నిగమ్ బోర్డు రెండురోజుల కిందట కర్ణాటక ప్రభుత్వానికి ఈ మేరకు ప్రతిపాదనలు పంపించింది. ఇదే విషయాన్ని అక్కడి అధికారులు తెలంగాణ అధికారులకు చెప్పారని తెలిసింది. ముఖ్యంగా ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల్లో పూర్తిస్థాయి నీటిమట్టం ఉన్న నేపథ్యంలో తెలంగాణ అడిగిన 15 టీఎంసీలు కాకున్నా కొంతమేర నీటిని వదిలేందుకు కర్ణాటక ప్రభుత్వం అంగీకరిస్తుందని అధికారవర్గాలు ఆశిస్తున్నాయి.

# అభివృద్ధిపథాన.. తెలంగాణ

దేశంకన్నా.. రాష్ట్రవృద్ధి రేటు అధికం • తెలంగాణ సామాజిక ఆర్థిక ముఖచిత్రంపై తెలుగులో పుస్తకం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

బంగారు తెలంగాణ దిశగా రాష్ట్రం ఏవిధంగా అభివృద్ధి పయనంలో ముందుకు సాగుతున్నదో అంకెలతోసహా వివరిస్తూ సామాజిక ఆర్థిక ముఖచిత్రం-2017ను రాష్ట్ర ప్రణాళికశాఖ తెలుగులో విడుదల చేసింది. పోటీ పరీక్షలు రాసే నిరుద్యోగ యువకులకు దిక్సూచిగా ఉపయోగపడే ఈ పుస్తకానికి 25 వేల కాపీలను ముద్రించింది. ఈ నెల 19 నుంచి హైదరాబాద్‌లోని అర్థగణాంకశాఖ కార్యాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి మినహా మిగిలిన అన్ని జిల్లాకేంద్రాల్లో ఈ పుస్తకాలను విక్రయించాలని ఆశాఖ నిర్ణయించింది. సమైక్యపాలనలో రాష్ట్ర వృద్ధిరేటు భారతదేశ వృద్ధి రేటుకన్నా చాలా తక్కువగా ఉండగా తెలంగాణ ఏర్పడిన మూడేండ్లలో గణనీయమైన అభివృద్ధిని సాధించింది. రాష్ట్రం ఏర్పడిన తొలి ఐదు నెలల్లోనే విద్యుత్ చీకట్లను పారదోలింది. మూడేండ్లలోనే 24 గంటలు నిరాటంకంగా విద్యుత్‌ను సరఫరా చేసే స్థితికి చేరుకున్నది. మిగులు విద్యుత్ రాష్ట్రంగా సాగుతూ అదేస్థాయిలో అన్నిరంగాల్లోనూ అగ్రభాగాన దూసుకెళ్తున్నది. దేశ వృద్ధిరేటు 2016-17లో 7.1 శాతం ఉంటే తెలంగాణ వృద్ధిరేటు 10. 1శాతానికి పెరిగింది. దేశవృద్ధి రేటు కంటే మూడుశాతం అదనంగా పెరిగింది. ప్రాథమిక రంగమైన పంటలు, పశుసంపద, ఆటవీ సంపద, ఫిషింగ్, అక్వాకల్చర్, మైనింగ్, క్వారీ రంగాల్లో దేశ వృద్ధిరేటు 3.8 శాతం ఉండగా తెలంగాణ వృద్ధిరేటు 12.8 శాతం ఉన్నది. ద్వితీయ రంగమైన ఉత్పత్తి, విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, నిర్మాణ రంగాల్లో 6,3 శాతం వృద్దే రేటుతో దేశంతో సమానంగా ఉన్నది. తృతీయ రంగమైన వాణిజ్యం, మరమ్మతు సర్వీసులు, హోటళ్లు, రెస్టారెంట్లు, రైల్వేలు, రహదారులు, జల, గగనతల రవాణా, రవాణాతో ముడిపడిన సేవలు, గిడ్డంగులు, కమ్యూనికేషన్, ప్రసార సేవలు, ఆర్థిక సర్వీసులు, రియల్‌ఎస్టేట్, నివాస యజమాన్యం, ప్రొఫెషనల్ సేవలు, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఇతర సేవల్లో దేశ వృద్ధిరేటు 7.9 శాతం ఉంటే రాష్ట్ర వృద్ధిరేటు 8.2 శాతం ఉన్నది. వ్యవసాయంతోపాటు దాని అనుబంధ రంగాల్లో ఉత్పత్తి, ఆదాయం పెరిగింది. టీఎస్ ఐపాస్ చట్టం ద్వారా పారిశ్రామికాభివృద్ధి వేగంగా అభివృద్ధి చెందుతున్నది. పలు కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయి. ఇంకా వస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న ఫ్యాక్టరీల్లో ఆరు శాతం ఫ్యాక్టరీలు తెలంగాణలోనే ఉన్నాయి. రాష్ట్రంలోని మొత్తం పెట్టుబడుల్లో కార్పొరేట్ రంగంలో 88 శాతం పెట్టుబడులున్నాయి. ఐటీ రంగానికి హైదరాబాద్ కేరాఫ్ అడ్రస్‌గా మారింది.

# మహిళల భద్రత కోసం 181 హెల్ప్‌లైన్

- జీవీకే సంస్థతో మహిళా,శిశు సంక్షేమశాఖ ఒప్పందం
- త్వరలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతులమీదుగా ప్రారంభం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మాతా, శిశు సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.. తాజాగా మహిళల రక్షణపై ప్రత్యేక దృష్టిని సారించింది. నిత్యం మహిళలు ఎదుర్కొంటున్న లైంగికదాడులు, గృహహింస, అక్రమరవాణాతోపాటు వివిధ రకాల వేధింపుల నుంచి రక్షణ కల్పించి, న్యాయం చేసేందుకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ నూతనంగా 181 హెల్ప్‌లైన్‌ను అందుబాటులోకి తీసుకురానున్నది. జీవీకే సంస్థ సాంకేతిక సహకారంతో రూపొందించిన 'మహిళా హెల్ప్‌లైన్ 181' ను వారంరోజుల్లో మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతులమీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన మహిళా హెల్ప్‌లైన్ 181ను 100, 108 హెల్ప్‌లైన్లతో అనుసంధానం చేయనున్నారు. ఈవ్‌టీజింగ్, లైంగికవేధింపులు, భౌతికదాడులు, గృహహింస, ఆత్మహత్యాయత్నం వంటి సమస్యలపై ఫోన్‌లో ఫిర్యాదు స్వీకరించి సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోనున్నారు. 181 హెల్ప్‌లైన్ సెంటర్ ప్యానెల్‌లో ఆరుగురు కాల్‌సెంటర్ సిబ్బందితోపాటు ఇద్దరు సైకాలజిస్టులు, ఇద్దరు న్యాయవాదులు ఉంటారు. వీరు బాధితులకు అవసరమైన న్యాయసహాయంతోపాటు సలహాలను అందిస్తారు. సమస్య తీవ్రంగా ఉంటే బాధితులు కోలుకునే వరకు 181 హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో వసతిసౌకర్యం కల్పిస్తారు.

## యాసంగికి ముందస్తు ప్రణాళిక

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వర్షాలు వానకాలం పంటలకు బలం చేకూరుస్తుండటంతో వ్యవసాయశాఖ రాబోయే యాసంగిపై దృష్టి సారించింది. వ్యవసాయ ప్రణాళికలపై కసరత్తు మొదలుపెట్టింది. బుధవారం హైదరాబాద్‌లోని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ కమిషనరేట్ కార్యాలయంలో హాకా, మార్క్‌ఫెడ్, సీడ్ కార్పొరేషన్, తెలంగాణ సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీ, ఇతర ఉన్నతాధికారులతో వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ కార్యదర్శి సీ పార్థసారథి సమీక్షా సమావేశం నిర్వహించారు. వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో వానకాలం పంటకు సమస్య ఉండదని అధికారులు అభిప్రాయపడుతున్నారు. వర్షాలతో బోర్లు, బావుల్లోకి నీరు చేరడంతో బోరుబావుల కింద యాసంగి పంట సాగుకు రైతులు సిద్ధమవుతారని అంచనా వేస్తున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచి, ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధంచేస్తున్నారు. వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డితో చర్చించి ప్రభుత్వం ద్వారా సరఫరా చేయనున్న వేరుశనగ, శనగ విత్తనాల ధరలను రెండు, మూడురోజుల్లో ఖరారు చేయనున్నట్టు పార్థసారథి తెలిపారు. సమావేశంలో వ్యవసాయశాఖ కమిషనర్ డాక్టర్ ఎం జగన్‌మోహన్, మార్క్‌ఫెడ్ జీఎం కే రాములు, తెలంగాణ సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీ డైరెక్టర్ డాక్టర్ కేశవులు, హాకా, సీడ్ కార్పొరేషన్, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

## బీసీ స్టడీ సర్కిల్‌లో సివిల్స్ ఫ్యాకల్టీ దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సైదాబాద్ బీసీ స్టడీ సర్కిల్‌లో సివిల్ సర్వీసెస్ శిక్షణ ఇచ్చే ఫ్యాకల్టీ దరఖాస్తు చేసుకోవాలని స్టడీ సర్కిల్ డైరెక్టర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్స్ పేపర్-1, పేపర్-2 సబ్జెక్టులను బోధించడానికి అర్హత, అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తికలిగిన వారు బీసీ స్టడీ సర్కిల్, సైదాబాద్ రోడ్ నంబర్-8, లక్ష్మీనగర్ కాలనీ, ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ ఆఫీసు ఎదురుగా ఉన్న కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.


## టీడీపీలో చేరిన మాజీ ఎంపీ గంగుల

**అమరావతి:** ఏపీలోని కర్నూలు జిల్లా నంద్యాల ఉపఎన్నిక వేళ వైసీపీకి గట్టిషాక్ తగిలింది. వైసీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ గంగుల ప్రతాప్‌రెడ్డి టీడీపీ కండువా కప్పుకున్నారు. మంత్రి అచ్చెన్నాయుడితో కలిసి బుధవారం అమరావతి సచివాలయానికి వెళ్లిన ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యారు. అనంతరం సీఎం సమక్షంలో టీడీపీలో చేరారు. ఇటీవల వైసీపీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన గంగుల ప్రభాకర్‌రెడ్డి ప్రతాప్‌రెడ్డి సోదరుడే కావడం గమనార్హం.

## త్వరలో రైతు రుణవిమోచన కమిషన్ ఏర్పాటు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొన్ని కారణాల వల్ల రైతు రుణవిమోచన కమిషన్‌ను ఏర్పాటుచేయలేదని, త్వరలోనే కమిషన్‌ను ఏర్పాటుచేస్తామని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది శరత్ ఉమ్మడి హైకోర్టుకు నివేదించారు. రైతు రుణ విమోచన కమిటీ ఏర్పాటుపై దాఖలైన వ్యాజ్యాన్ని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారించింది. కమిషన్‌ను ఎప్పటిలోగా ఏర్పాటుచేస్తారో ఈ నెల 21 నాటికి వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కమిషన్ ఏర్పాటు వివరాలను తెలియజేస్తే, తాము తదుపరి ఆదేశాలు జారీచేస్తామని పేర్కొంది.

## ప్రజాప్రతినిధుల విచక్షణకే సీడీపీ నిధుల ఖర్చు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం (సీడీపీ) నిధుల వినియోగంలో పూర్తి అధికారం ప్రజాప్రతినిధులకు ఉంటుందని, వారి విచక్షణ మేరకే నిధులను ఖర్చు చేస్తారని తెలంగాణ అడ్వకేట్ జనరల్ (ఏజీ) దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి హైకోర్టుకు బుధవారం నివేదించారు. సీడీపీ నిధుల ఆడిట్‌పై దాఖలైన పిటిషన్‌ను విచారించిన తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్‌రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం సీడీపీ నిధుల ఆడిట్ వివరాలు సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. నిధుల ఖర్చుపై అంతర్గత లేదా బహిర్గత తనిఖీల వివరాలను సమర్పించాలని స్పష్టంచేసింది. ఏజీ ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ఈ నిధుల వినియోగంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌చార్జి మంత్రులకు పూర్తి అధికారం ఉంటుందని, నియోజకవర్గంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా విచక్షణ మేరకు నిధులు ఖర్చు చేస్తున్నారని వివరించారు. ఆడిట్‌పై పూర్తి వివరాలు సమర్పించడానికి సమయం కావాలని కోరారు. ఈ సందర్భంగా ఎప్పటినుంచి ఆడిట్ నిర్వహించడం లేదనే వివరాలు కూడా ఇవ్వాలని ఆదేశించిన ధర్మాసనం.. తదుపరి విచారణను ఈ నెల 22కు వాయిదా వేసింది.

## నిరుపయోగ బోర్ల పూడ్చివేతల వివరాలివ్వండి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నిరుపయోగ బోరుబావులను పూడ్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై చేపడుతున్న చర్యలను వివరించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, రెవెన్యూశాఖలకు ఉమ్మడి హైకోర్టు బుధవారం ఆదేశాలు జారీచేసింది. బోరుబావుల్లో పడి చిన్నారులు మృతి చెందుతున్న ఘటనలు పెరుగుతున్న దృష్ట్యా, వాటిని నిలువరించడానికి సుప్రీంకోర్టు జారీచేసిన మార్గదర్శకాలను ఏ మేరకు అమలు చేస్తున్నారో వివరించాలని స్పష్టంచేసింది. ఇటీవల రంగారెడ్డి జిల్లా ఇక్కారెడ్డిగూడెంలో బోరుబావిలో పడి చిన్నారి మృతిచెందిన నేపథ్యంలో సదరు యజమానిపై చార్జిషీట్ దాఖలు చేశారా? అని ఆరాతీసింది.

## పీహెచ్‌డీ సీట్ల భర్తీపై హెచ్‌సీయూకు నోటీసులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పీహెచ్‌డీ, ఎంఫిల్ సీట్ల భర్తీ విషయంలో అనుసరిస్తున్న వైఖరిపై వివరణ ఇవ్వాలని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ)కు ఉమ్మడి హైకోర్టు బుధవారం నోటీసులు జారీచేసింది. నోటిఫికేషన్, రాతపరీక్షలు, మౌఖికపరీక్షలు నిర్వహించిన తర్వాత సీట్ల సంఖ్యను కుదిస్తూ వర్సిటీ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్టు ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. నిబంధనలకు సంబంధించి పూర్తిస్థాయి ప్రమాణపత్రం దాఖలు చేయాలని స్పష్టం చేసింది.

## రూ.100 కోట్లు డిపాజిట్ చేయండి: హైకోర్టు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దివాళా తీసిన అగ్రిగోల్డ్ సంస్థను టేకోవర్ చేసేందుకు ముందుకు వచ్చిన సంస్థ.. తన విశ్వసనీయతను నిరూపించుకునేందుకు రూ.100 కోట్లు డిపాజిట్ చేయాలని ఉమ్మడి హైకోర్టు బుధవారం షరతు విధించింది. డిపాజిట్‌దారులకు వేలకోట్ల రూపాయలు ఎగవేసిన వ్యవహారంలో అగ్రిగోల్డ్ సంస్థ స్కాంపై హైకోర్టులో విచారణ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డిపాజిట్‌దారులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లిస్తామని, అగ్రిగోల్డ్ సంస్థను టేకోవర్ చేయడానికి సిద్ధంగా ఉన్నామని, గత విచారణ సందర్భంగా పేరు బహిర్గతపర్చని ఒక సంస్థ హైకోర్టుకు నివేదించింది. దాంతో రూ.100 కోట్లు డిపాజిట్ చేయాలని హైకోర్టు సదరు సంస్థకు స్పష్టం చేసింది.




## వేల జీవితాల్లో వెలుగు నింపి..

**తాను పడిన కష్టం ఇంకొకరికి రాకూడదనుకునే ఆలోచన ఎంత గొప్పది. ఇలాంటి ఆలోచనలు గొప్పవారికే కాదు, మామూలు వ్యక్తులకు సైతం వస్తాయని నిరూపించింది సులోచన. ఇంతకీ ఆమె ఏం చేసింది?**

గోవాలోని మారుమూల పల్లె సియోలిమ్‌లో పుట్టి పెరిగింది సులోచన. వారి ఉమ్మడి కుటుంబంలో ఒక మూఢాచారం ఆమెను చాలా ఇబ్బంది పెట్టేది. నెలసరి సమయంలో పెద్దవాళ్లు పెట్టే కఠినతరమైన నిబంధనలు బాధించేవి. దాహం వేస్తే సొంతంగా నీళ్లు కూడా తాగలేని పరిస్థితి. ఇది తన సమస్య మాత్రమే కాదని, వేలమంది ఆడపిల్లలు ఇలాంటి ఇబ్బందులు పడుతున్నారని గుర్తించింది. ఎలాగైనా ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావాలనుకున్నది. ఒక విదేశీ సంస్థ స్కాలర్‌షిప్‌తో చదువుకొని ఎకనామిక్స్‌లో పట్టా అందుకున్న ఆమె స్వచ్ఛంద సంస్థలతో కలిసి.. నెలసరి సమయంలో ఆడపిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'పెయిడ్ ఆఫ్ పీరియడ్' పేరిట అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నది.

## స్వతంత్రం కోసం.. సాధికారత కోసం..

**డెబ్బై ఏళ్ల స్వతంత్ర భారతంలో కొన్ని ప్రాంతాల్లో కొందరు మహిళలు ఇప్పటికీ మాట్లాడే హక్కును సాధించలేదు. దీని గురించి ఓ టీవీ వ్యాఖ్యాత మనసు విప్పి మాట్లాడింది.**

బుందేల్‌ఖండ్‌కు చెందిన కవిత మొదటిసారి తన టాక్‌షోలో మహిళల స్వాతంత్ర్యం గురించి, వాటికి సంబంధించిన అంశాల గురించి మాట్లాడింది. ఖబర్ లహరియా డిజిటల్ ఛానల్ హెడ్ యాంకర్‌గా పనిచేస్తున్న కవిత తన టాక్ షోలో ఒక ఎపిసోడ్ మొత్తం మహిళల స్వతంత్రం గురించి, హక్కుల మీద నడిపించింది. దేశ స్వతంత్రంలో మహిళల పాత్ర, ప్రస్తుత సమాజంలో అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలు, అమ్మాయిల బాధ్యతలు, మహిళలపై వస్తున్న వ్యతిరేకతపై కూడా గళం విప్పింది. తన స్నేహితురాలు షబానా భర్తతో ఎదుర్కొంటున్న వేధింపుల గురించి కూడా ప్రస్తావించింది. ఈ విషయంపై ప్రేక్షకులు మాత్రం భిన్నవిధాలుగా స్పందించారు. కొందరు పాజిటివ్‌గా స్పందిస్తే ఇంకొందరు మాత్రం తప్పని వాదించారు. ఏదీ ఏమైనా ఒక కార్యక్రమంలో కవిత ఇలా మాట్లాడటం తనలాంటి మహిళలకు ధైర్యం నూరిపోసినట్టయింది.







**ఇంట్లో ఎదురయ్యే ఆర్థిక కష్టాల్ని అధిగమించాలంటే**
**పనికోసం కడప దాటి బయటికెళ్లాల్సిందేనా..!**
**ఇంటి పట్టునే ఉంటూ చేసుకొనే చిరువ్యాపారాలేమైనా ఉంటే ఎంత బాగుంటుంది..!**
**సగటు గృహిణి మెదడులో తరుచూ మెదిలే ఆలోచనలివి..**
**ఏ పని చేయాలన్నా కాస్తో కూస్తో వైవిధ్యం తెలిసుండాలి..**
**మరి అందరికీ అది సాధ్యమవుతుందా అంటే? కచ్చితంగా చెప్పలేం!**
**మరి ఏమిటి పరిష్కారం? మరో మార్గం లేదా? అని టెన్షన్ పడాల్సిన పన్లేదు.**
**అలాంటి ఐడియానే మీతో పంచుకునేందుకు**
**ఈ వారం మనీ మ్యాటర్స్ మీ ముందుకొచ్చేసింది.**



మనీ మ్యాటర్స్
for women

# ఆదాయానికి వెలుగుదివ్వెలు



మోడల్: గీతా భగత్

మనం వేసే ప్రతి అడుగూ ఒక అవసరాన్ని తెలియజేస్తుంది. ఒక రకంగా చెప్పాలంటే జీవితమంతా అవసరాలమయం. ఉదాహరణకి దేవుడి దగ్గర దీపం వెలిగించే ఒత్తులూ ఒక అవసరమే. ఇప్పుడున్న బిజీ లైఫ్‌లో అది కూడా కొనుక్కోవాల్సి వస్తున్నది. కాబట్టి దాన్ని తయారుచేసి మనమే విక్రయిస్తే ! భగవంతుడి సన్నిధిలో దీపం వెలిగించడంతోనే ఆగిపోదు.. కుటుంబానికీ ఆర్థికంగా వెలుగు దొరుకుతుంది. అచ్చం ఇలాగే ఆలోచించి, కష్టపడి విజయం సాధించింది సుగుణమ్మ.

ఒకప్పుడు ఇంట్లో ముసలమ్మలు ఊరికే కూర్చోలేక దూదిని పింజి ఒత్తులు చేసేవారు. రోజులో గంటల తరబడి వాళ్లకు అదే పని. కానీ పట్నం జాగల్లో ఇప్పుడా పరిస్థితులు లేవు. అందుకే దేవుడి దగ్గర దీపం వెలిగించే ఒత్తులు కూడా రెడీమేడ్‌గానే కొంటున్నారు. అవే ఒత్తుల్ని తానెందుకు తయారు చేయకూడదనుకున్నది హైదరాబాద్ శివార్లలో నివాసముండే సుగుణమ్మ. పని చిన్నదే కావొచ్చు, కానీ ఆమె ఆలోచన పెద్దది. అందుకే కుటుంబాన్ని ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించింది.

### ■ చిన్నది, చింతలేనిది..

ఈ వ్యాపారం ప్రారంభించాలనుకున్నప్పుడు.. లక్షల పెట్టుబడేం అవసరం లేదు. చిన్నగా మొదలు పెట్టి ఆర్డర్లు పెరిగితే అప్పుడు మరింత విస్తరించుకోవచ్చు. ఇంట్లోనే తయారు చేసేవి కాబట్టి, మొదట చుట్టుపక్కల వాళ్లకు ఆ తర్వాత రిటైల్, హోల్‌సేల్ షాపులకు సప్లయి చేసుకోవడం ద్వారా ఆర్డర్లను పెంచుకోవచ్చు. ఆర్డర్లు పెరిగితే మెషీన్ల సాయంతో తయారు చేసుకోవచ్చు. రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఒకేసారి హోల్‌సేల్‌లో పత్తిని కొనుగోలు చేసిపెట్టుకుంటే.. ఖర్చు ఆదా అవుతుంది. రోజూ ఎన్ని ఒత్తుల్ని తయారు చేస్తున్నారనే దానిపై పత్తి కొనుగోలు ఆధారపడి ఉంటుంది. ఒత్తులు పరిశుభ్రంగా ఉండాలంటే, నాణ్యమైన పత్తిని ముడిసరుకుగా తీసుకోవడం చాలా ముఖ్యం. అంతకు మించి ఈ చిన్న వ్యాపారంలో చింతలేవీ ఉండవు.



### ■ క్వాలిటీ ముఖ్యం

ఇప్పుడందరూ క్వాంటిటీ కన్నా క్వాలిటీకి ఎక్కువ ప్రిఫరెన్స్ ఇస్తున్నారు. పూజాకార్యక్రమాల్లో మరీ నిష్టగా ఉండాలనుకుంటారు. పూల నుంచి దీపాలు వెలిగించే ఒత్తుల వరకు క్వాలిటీగా ఉండాలనుకుంటారు. కాబట్టి ఒత్తులను కాస్త క్వాలిటీగా తయారు చేయగలిగితే మరిన్ని ఆర్డర్లు వస్తాయి. మార్కెట్‌లో మంచి పేరూ వస్తుంది. దీపాలు కొండెక్కకుండా ఉండేలా క్వాలిటీ పత్తితో చేయగలిగితే మరీ మంచిది.

### ■ ఆర్డర్లకు కొదువుండదు

ఒత్తులు చేస్తాం సరే.. అమ్మడం ఎలా? పబ్లిసిటీ చేసుకునేందుకు ఇదేం పెద్ద విలువైన సరుకేం కాదు కదా! అని అనుకోవద్దు. మార్కెట్‌లో దేని వాల్యూ దానికి ఉంటుంది. ఒత్తులు విలువైనవి కాకపోవచ్చు. కానీ అవసరమైనవి. అలా అనుకొని ముందుకు సాగింది కాబట్టే సుగుణమ్మ.. ఈ వ్యాపారంలో విజయం సాధించగలిగింది. జనాలకు ఇప్పుడంతా రెడీమేడ్ కావాలి. తినే ఫుడ్ నుంచి దేవుడి పూజా సామగ్రి వరకు అన్నీ రెడీమేడ్‌గా ఉండాలి. అందులో ఒత్తులు కూడా భాగమే కాబట్టి అమ్మకాలకు ఢోకా ఏం ఉండదంటున్నది సుగుణమ్మ.

### ■ హోల్‌సేల్‌గా.. రిటైల్‌గా..

కిరాణాషాపుల్లో, పూజాసామగ్రి కేంద్రాల్లో ఈ ఒత్తులు లభిస్తాయి. వాళ్లందరికీ హోల్‌సేల్‌గా సప్లయి చేసుకోవచ్చు. అంతేకాదు ఇప్పుడు మాల్స్‌లో కూడా ఒత్తుల ప్యాకెట్లు దొరుకుతున్నాయి. యాజమన్యాలతో మాట్లాడి వాటికీ సప్లయి చేసుకోవచ్చు. అలా హోల్‌సేల్‌గా అమ్మడంతో పాటు, ఇంటి దగ్గరికొచ్చి కొనుక్కెళ్లే కస్టమర్ల వల్ల కూడా కొంత మౌత్ పబ్లిసిటీ లభిస్తుంది. హోల్‌సేల్‌గా అమ్మడం వల్ల కాస్త తక్కువ ఆదాయం వచ్చినా, రిటైల్‌గా అమ్మగా వచ్చిన సొమ్ముతో దాన్ని భర్తీ చేసుకోవచ్చు. కాబట్టి దీంట్లో లాభమే తప్ప, నష్టానికి తావుండదు.

### ■ నలుగురికీ పని కల్పించేలా

మామూలుగా అయితే ఇంటి దగ్గర ఒక్కరే కూర్చొని ఈ వ్యాపారాన్ని చేసుకోవచ్చు. కాకపోతే చేతిమీద చేసే పని కాబట్టి ఎక్కువ సంఖ్యలో చేయలేం. కాబట్టి మరో నలుగురిని కలుపుకొని గ్రూప్‌గా తయారై మెషీన్ల సాయంతో ఒత్తుల్ని తయారు చేస్తే.. భారీగా ప్రొడక్షన్‌ను పెంచుకోవచ్చు. మామూలుగా అయినా, కాస్త స్టైలిష్ ప్యాకింగ్‌తో అయినా అమ్మవచ్చు.

### ■ ఒత్తిడిలేని వ్యాపారం

ఇంట్లో ఉండే మహిళలకు ఈ వ్యాపారాలు, దాని వల్ల కలిగే టెన్షన్స్ ఇవన్నీ ఎందుకు? అని అనుకుంటారు చాలామంది. అలాంటి వారికి ఈ వ్యాపారం ఎంతో సునాయసమైనది. ఎలాంటి ఒత్తిడీ ఉండదు. ఇంట్లోనే ఖాళీ సమయంలో ఈ ఒత్తులను తయారు చేసుకోవచ్చు. దీనికి పెద్దగా శ్రమించాల్సిన అవసరం కూడా ఉండదు.

## మీరూ ప్రారంభించొచ్చు..

### స్థిర వ్యయాలు..

- ఇంట్లోనే సులభంగా తయారు చేసుకోవచ్చు. కానీ పెద్దగా ప్రారంభించాలనుకుంటే ఒక గది అవసరం.
- రూమ్‌కు అడ్వాన్స్ : రూ. 25,000 (ఏరియాను బట్టి మారొచ్చు)
- మెషీన్, ఇతర సామగ్రి : రూ. 20,000
- ప్రాథమిక + ప్రారంభ వ్యయాలు : రూ. 65,000
- మొత్తం : రూ. 1,10,000

### నెలవారీ ఖర్చు

- ఒత్తులను ప్యాకెట్ల (ఒక్కో ప్యాకెట్‌లో 50 ఒత్తులు ఉంటాయి) ఆధారంగా లెక్కగడితే..
- ఒక్కరోజులో 200 ఒత్తుల ప్యాకెట్లను తయారు చేయగలరనుకుందాం.
- ఒక్కో ప్యాకెట్ తయారీకి అయ్యే ఖర్చు రూ. 10 అనుకుందాం.
- నెలకు 25 రోజులు పనిచేస్తే 5000 ప్యాకెట్లను తయారు చేయవచ్చు.
- అంటే నెలకు 5000x 10= రూ. 50,000
- రూమ్ రెంటు: రూ. 5000 (ఏరియాను బట్టి మారొచ్చు)
- ఇద్దరు పనివాళ్లను పెట్టుకున్నా, వేతనాలకు: రూ. 15,000
- మొత్తం : రూ. 70,000
- పెట్టుబడి : రూ. 1,80,000

### ఏడాది అమ్మితే వచ్చేది..

- రోజుకు 200 ఒత్తుల ప్యాకెట్లను అమ్మగలుగుతాం.
- ఏడాదికి 300 రోజులు పనిదినాలుగా లెక్కేస్తే..
- 200x 300 = 60000 ప్యాకెట్ల ఒత్తుల్ని అమ్మవచ్చు.
- సగటున ఒక్కో ప్యాకెట్‌ను రూ.20కి అమ్ముదామనుకుందాం.
- 60000 x 20= రూ. 12,00,000 ఆదాయం వస్తుంది.

### ఏడాదికి అయ్యే ఖర్చు..

- నెలవారీ ఉత్పాదక వ్యయాన్ని ఏడాదికి లెక్కగడితే..
- 70,000 x 12 = రూ. 8,40,000
- ప్రారంభ వ్యయాలు రూ. 1,10,000
- మొత్తం ఏడాదికి అయ్యే ఖర్చు : రూ. 9,30,000

### లాభం అంచనా..

- ఏడాది మొత్తం వచ్చిన ఆదాయం రూ. 12,00,000
- సంవత్సరంలో అయిన ఖర్చు : రూ. 9,40,000
- తీసేస్తే వచ్చే లాభం : రూ. 2,60,000
- అంటే నెలకు వచ్చే లాభం : సుమారుగా రూ. 20,000

**గమనిక :**
**ఈ లెక్కలు కేవలం అంచనా ప్రకారం వేసినవే. ఆర్డర్ల సంఖ్యను బట్టి ఈ ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంటుంది.**

## పొట్ట తగ్గించుకోండిలా..



- పొట్ట తగ్గాలంటే తిండి తగ్గించడం కాదు. ఆహారంలో పోషక విలువలు చేర్చుకోవాలి. విటమిన్స్ కలిగిన ఆహారపదార్థాలను డెయిలీ డైట్‌లో చేర్చుకోవాలి.
- కీరదోసను అధికంగా తీసుకోవాలి. 90 శాతం నీటిని కలిగి ఉండే కీరాలో కెలరీలు చాలా తక్కువ. భోజనానికి ముందు ఒక్క కీరా తిని, అన్నాన్ని తక్కువ తింటే సరిపోతుంది.
- బాదం పప్పులోని మోనోశాచురేటెడ్ ఫ్యాట్లు శరీరంలో కొవ్వును కరిగించే శక్తిని పెంచుతాయి. దేహంలో నీరు పేరుకుపోకుండా ఉంచుతుంది. మరిన్ని పోషకాలు అందాలంటే బాదంతో పాటు ఇతర నట్స్ కూడా తీసుకోవాలి.
- ఆకలిగా అనిపించినప్పుడు బజ్జీలు, సమోసాలు తినే బదులు పండ్లు ఎంచుకోవడం ఉత్తమం. వీటివల్ల శరీరంలో చక్కెర, కొవ్వు శాతం అదుపులో ఉంటుంది.
- సెనగలూ, బఠాణీలు, పెసర్ల మొలకల్లాంటివి పావు కప్పు తీసుకుంటే కడుపు నిండిపోతుంది. చాలాసేపటి వరకు ఆకలి వేయదు. బరువు తగ్గడానికి ఇది మంచి చిట్కా.
- పొట్ట చుట్టూ కొవ్వు తగ్గాలంటే కోడిగుడ్డులోని తెల్లసొనను తీసుకోవాలి. ఇందులో ఉండే విటమిన్ డి, బీ12, ఒమెగా-3 శరీరానికి ఎంతో మేలు చేస్తాయి.

## మా బాబుకు తలనొప్పి ఎందుకు?

**మా బాబు వయసు 8 సంవత్సరాలు. తరుచుగా తలనొప్పితో బాధపడుతున్నాడు. ఇలా తలనొప్పి వచ్చినపుడు వాంతులు కూడా అవుతున్నాయి. అప్పడప్పుడు కడుపునొప్పి అని కూడా అంటుంటాడు. ఈ సమస్యలతో తరుచుగా స్కూల్ మానెయ్యాల్సి వస్తున్నది. మా అబ్బాయి సమస్యకు మంచి పరిష్కారం చూపగలరు.**

**ప్రదీప్, కాజిపేట**



అడుగండి చెబుతా

ఈ సమస్యలన్నింటికీ ఒకే ఒక చిన్న కారణం.. కేవలం తగినన్ని నీళ్లు తాగకపోవడం. అయితే ఒక్కోసారి పిల్లల్లో వచ్చే మైగ్రేన్‌లో కూడా ఇలాంటి లక్షణాలే కనిపిస్తాయి. పిల్లల్లో వచ్చే మైగ్రేన్‌లో కూడా 'ఆరా' కనిపిస్తుంది. నొప్పి మొదలవగానే వెలుగు చూడలేకపోవడం, తలతిరగడం, వికారంగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు లేకుండా కూడా మైగ్రేన్ సమస్య కావచ్చు. దీన్ని క్లస్టర్ హెడ్ ఎక్స్ అంటారు.
దీనికోసం కొన్ని పరీక్షలు చెయ్యాల్సి ఉంటుంది. ఒక్కోసారి చెవుల్లో, కళ్లలో సమస్య వల్ల కూడా తలనొప్పి రావచ్చు. దీనికి న్యూరాలజిస్ట్, పిడియట్రీషన్, పిల్లలు టీనేజ్ వయసులో ఉన్నవారైతే సైకియాట్రిస్ట్ కూడా అవసరం కావచ్చు.
ఈ నొప్పి తరుచుగా రాకుండా ఉండేందుకు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. మీ బాబు తగినన్ని నీళ్లు తాగేలా చూసుకోండి. చాక్లెట్లు ఎక్కువగా తినడం, కార్బొనేటెడ్ డ్రింక్స్ ఎక్కువగా తాగడం వంటివి సమస్యను మరింత పెంచవచ్చు. కాబట్టి వీటికి దూరంగా ఉంచాలి. స్కూల్‌లో ఉన్నపుడు సరైన భంగిమలో కూర్చోకపోవడం వల్ల కూడా తర్వాత రాత్రి పూట తలనొప్పికి కారణం కావచ్చు. అంతేకాదు, ఎక్కువ సమయం పాటు టీవీ చూడడం, మొబైల్ లేదా టాబ్లెట్ వాడడం కూడా మంచిది కాదు. వీటికి కూడా సమయాన్ని పరిమితం చెయ్యాల్సి ఉంటుంది. ముఖ్యంగా నిద్రకు ముందు ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ వాడకుండా చూసుకోవడం వల్ల గుణం కనిపించవచ్చు.



**డాక్టర్ అంజుల్ దయాళ్**
**కన్సల్టెంట్ పిడియాట్రిషన్, ఇన్‌టెన్సివిస్ట్**
**కాంటినెంటల్ హాస్పిటల్స్**
**హైదరాబాద్**

**మాకు రాయండి**
మీకు ఆరోగ్యపరమైన సమస్యలు, సందేహాలున్నాయా? అయితే మాకు రాయండి. నిపుణులతో సలహాలు ఇప్పిస్తాం. మా అడ్రస్ : నమస్తే తెలంగాణ - అడుగండి చెబుతా(హెల్త్‌డెస్క్), #8-2-3\1\7\8\9, క్రిష్ణాపురం, రోడ్ నెం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. health@ntdaily.news

## ఆరోగ్యానికి మొక్కజొన్న



**మొక్కజొన్న కండెలు వేడివేడిగా కాల్చుకుని తింటే మస్తు మజా ఉంటుంది. ఆ మజాతో పాటే మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసా?**

- మొక్కజొన్నలో పీచు పుష్కలంగా ఉంటుంది. అది జీర్ణక్రియ సక్రమంగా జరిగేందుకు ఉపయోగపడుతుంది. మలబద్దకం, మొలలు వంటి వ్యాధులను నియంత్రిస్తుంది. పేగు క్యాన్సర్‌ను అరికడుతుంది.
- ఈ పసుపు రంగు గింజలలో మినరల్స్ అధికంగా ఉంటాయి. వీటిలో ఉండే మెగ్నీషియం, ఐరన్, కాపర్, పాస్ఫరస్ ఎముకల గట్టిదనానికి ఉపయోగపడుతాయి.
- మొక్కజొన్నలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని కాంతివంతంగా మారుస్తుంది. ఈ విత్తనాలతో చేసిన నూనెను చర్మానికి రాస్తే దద్దుర్లు రాకుండా ఉంటాయి.
- రక్తహీనతను అరికట్టడంలో మొక్కజొన్న అద్భుత ఔషధంగా పనిచేస్తుంది.
- గర్భవతులకు ఇది ప్రధానమైన ఆహారంగా ఉపయోగపడుతుంది. దీనిలోని ఫోలిక్ యాసిడ్ కాళ్లు, చేతులు వాపురాకుండా నియంత్రిస్తుంది. కడుపులోని శిశువు మంచి బరువును కలిగి ఉండేలా చేస్తుంది.

# వాట్సప్!

## ట్వీట్

అనసూయ భరద్వాజ్
@anusuyakhasba



అనసూయను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
175,309



సెక్సీగా ఉండడం అనేది మానసికమైనది. అందరూ శరీరానికి సంబంధించింది అనుకుంటారు. అది మనిషి వ్యక్తిగతాన్ని ప్రతిబింబిస్తుంది.

## సమ్‌థింగ్ స్పెషల్



ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్.. వీడికి లేదు ఫియర్!

## కామన్‌మ్యాన్ వాయిస్

ప్రతిపక్షాలు, మేధావులు ఇటువైపు కూడా చూసి కొంచెం ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వండి. అప్పుడు ప్రజల్లో మీ మీద కొంచెమన్నా నమ్మకం వస్తుంది. అప్పుడు కూడా ప్రభుత్వం పని చేయకుంటే ప్రభుత్వానికి చెడ్డ పేరు, మీకు మైలేజీ వస్తాయ్. ఏమంటారు. ఊకె ధర్నా చౌక్‌లూ, కోర్టు స్టే లేనా?

Sri Nivas

రాహుల్ ఇందిరా క్యాంటీన్ అనబోయి అమ్మా క్యాంటీన్ అన్నాడని కాంగ్రెసోల్లు గింజుకుంటుడ్రు. నిజానికి అమ్మా క్యాంటీన్‌నే కదా కాపీ కొట్టింది?

Sai Yerramsetti

మనుషులుగా ఓడి గేమ్ గెలిస్తే, ప్రపంచాన్ని కోల్పోతారు. ఆత్మగౌరవంతో నిలబడితే గేమ్‌లో ఓడిపోయినా ప్రపంచంలో తలెత్తుకుని నిలబడుతారు. సంయమనం కోల్పోకుండా, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటే అస్తిత్వాన్ని కాపాడుకుంటూ గేమ్‌ని గెలువగలిగినవారు అటు గేమ్‌ని ఇటు ప్రపంచాన్ని గెలుస్తారు. అలాంటి వాళ్ల కోసం అన్వేషణే బిగ్ బాస్.

Mahesh Kathi

పుట్టినప్పుడు ఆనందం. చచ్చిపోయినప్పుడు దుఃఖం. ఈ రెండింటినీ మనం ఇతరులకే పంచుతాం. ఎందుకంటే అవి రెండూ సంభవించినప్పుడు మనకేం తెలియదు కాబట్టి. ఒకటి పసితనం, రెండు శవం. ఈ రెండింటి మధ్య ఎన్నో ఫీలింగ్స్‌తో బతికేస్తాం. కోపం, మోసం, స్వార్థం ఇలా ఎన్నో.. తన సంతృప్తికోసం ఎందరికో తెలిసో తెలియకనో, చేటో.. చెలిమో పంచుకుంటాం. ఆనందానికి, దుఃఖానికి మధ్య నిస్వార్థం అనేది ఒక్కటుంటే లైఫ్ అంతా ఫుల్ సంతృప్తేమో!

–Sangheer Humayun

## వైరల్ వీడియో




అదృష్టం బాగుండి ట్రాఫిక్ పోలీసుల నుంచి తప్పించుకున్న ఓ వ్యక్తి.. అతిగా ప్రవర్తించి అక్కడే దొరికిపోతే ఎలా ఉంటుంది? ఈ ఫన్నీ వీడియో చూడండి. నవ్వుల వర్షం కురుస్తుంది.

Drink and Drive | VIVA
Total views : 363,452+
Published on Aug 15, 2017

## షేరింగ్

దేశభక్తి అంటే..
ఎలుగెత్తి నినదించడం కాదు
ఏడాదికోసారి స్మరించడం కాదు
గుండెలవిసేలా
రోదించడం కాదు
రోమాంచితంగా సినిమాల్లో
చిత్రించడం కాదు
దేశభక్తి అంటే..
ఎదురెళ్లి అన్యాయాన్ని
ఎదుర్కోవడం
ఎదుట ఉన్న అవినీతిని
ఎండగట్టడం
నిను కమ్మేసిన అజ్ఞానాన్ని
పారదోలడం
నీ సాటివాడి ప్రతిభకి
జై కొట్టడం

–ఓ వాట్సప్ మెసేజ్





# ట్రెండింగ్.. డిజిటల్ మార్కెటింగ్!

టెక్ టాక్

**వ్యాపారం స్థాపించాలంటే పెట్టుబడి ఎంత అవసరమో స్థాపించిన ఆ వ్యాపారానికి మార్కెటింగ్ అంతే అవసరం. మార్కెటింగ్ ఎన్ని రకాలున్నా.. ప్రస్తుతం డిజిటల్ మార్కెటింగ్ హవానే నడుస్తున్నది ఆఫ్‌లైన్ మార్కెటింగ్ ఎంత ఉన్నా.. ఆన్‌లైన్ మార్కెటింగ్ ఊపందుకున్నది అంతర్జాతీయ సంస్థలకు డిజిటల్ మార్కెటింగ్ సేవలందిస్తున్న సంస్థ థింకింగ్‌హ్యాట్. హైదరాబాద్ నుంచి బంగ్లాదేశ్ దాకా వ్యాపారాన్ని విస్తరించిన థింకింగ్‌హ్యాట్ వ్యవస్థాపకుడు సుధీర్ రెడ్డి టెక్నాలజీ ఇది.**

ప్రపంచం చాలా వేగంగా ముందుకెళ్తున్నది.. ఆ వేగంతో పాటు పోటీపడి పరుగెడితే ముందుంటాం. లేకపోతే వెనుకపడిపోతాం. ఒక్కోసారి ఆ వేగానికొచ్చిన గాలికి కొట్టుకుపోతాం. ఇప్పుడు వైరస్‌ను స్కాన్ చేసే ప్రాసెస్‌లు లేవు. అప్‌డేట్ అవుతూ పాత వాటిని అన్‌ఇన్‌స్టాల్ చేసి అప్‌డేటెడ్ వర్షన్‌లను ఇన్‌స్టాల్ చేసుకుంటేనే నిలువగలుగుతాం. ఒకప్పుడు ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలు ఈ ప్రపంచాన్ని ఒక ఊపు ఊపి వదిలిపెట్టాయి. కానీ ఇప్పుడు సోషల్‌మీడియా వాటిని తుడిచిపెట్టేసింది. ఒక అవకాశంగా వచ్చి ఇంకో అవకాశం లేకుండా చేసింది. అలా అవకాశాలను అందిపుచ్చుకొని కొందరు అందనంత ఎత్తుకు ఎదిగారు. సుధీర్ రెడ్డి కూడా అలాంటి కోవకు చెందిన వ్యక్తే. బీటెక్ చదివి ఉద్యోగం చేయాలనుకోలేదు. మార్కెట్‌లో నడుస్తున్న ట్రెండింగ్ నాడిని పసిగట్టి వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించాడు. హైదరాబాద్‌లో ప్రారంభమైన తన డిజిటల్ మార్కెటింగ్ వ్యవస్థను బెంగళూరు మీదుగా బంగ్లాదేశ్‌కు విస్తరిస్తాడు.

**పబ్లిసిటీ.. కెపాసిటీ**

ఒకప్పుడు సంస్థను స్థాపించాలంటే పబ్లిసిటీ చేయాల్సి ఉండేది. పత్రికల్లో, టీవీల్లో యాడ్‌లు ఇవ్వాల్సి వచ్చేది. వాల్‌పోస్టర్లు, పాంప్లెట్లు పంచాల్సి ఉండేది. కానీ ఇప్పుడు.. సోషల్‌మీడియా విప్లవాత్మకమార్పు తీసుకొచ్చింది. తక్కువ శ్రమతో, అతి తక్కువ సమయంలో ఎక్కువమందికి రీచ్ అయ్యేలా చేస్తున్నది. థింకింగ్ హ్యాట్ సంస్థ ముఖ్యంగా కొత్తగా సంస్థను స్థాపించాలనుకునే వాళ్లకు ఆన్‌లైన్‌లో మార్కెటింగ్ స్ట్రాటజీ నుంచి ప్రమోటింగ్, బ్రాండింగ్ అన్నీ చేసి పెడుతుంది. ఆయా సంస్థలకు సంబంధించిన డిజిటల్ మార్కెటింగ్ ద్వారా మంచి ఫలితం తెచ్చిపెడుతుంది. డిజిటల్ మార్కెటింగ్‌తో పాటు సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్, గూగుల్ యాడ్ వర్డ్స్, సోషల్‌మీడియా మార్కెటింగ్, ఈమెయిల్ మార్కెటింగ్, డాటా అనాలసిస్, లీడ్ జనరేషన్ సర్వీసెస్, క్రియేటివ్ మేనేజ్‌మెంట్ వంటి అంశాల్లో సేవలందిస్తున్నది. థింకింగ్ హ్యాట్ ఒక స్టార్టప్‌గా మొదలై విజయవంతంగా నడువగలుగడమే కాకుండా.. పదుల సంఖ్యలో స్టార్టప్‌లకు ఐడియాలిచ్చి నిలబెడుతున్నది.

**విస్తృత సేవలు.. సాంకేతిక ఆవిష్కరణలు**

ఆడి హైదరాబాద్, హోమియోకేర్ ఇంటర్నేషనల్, పాజిటివ్ హోమియోపతి, డ్రీమ్ వ్యాలీ రిసార్ట్స్, ఓక్రిడ్జ్, జావెద్ హబీబ్ వంటి పెద్ద పెద్ద సంస్థలకు థింకింగ్ హ్యాట్ ప్రత్యక్షంగా, పరోక్షంగా సేవలందిస్తున్నది. డిజిటల్ మార్కెటింగ్ రంగంలో హైదరాబాద్‌కు చెందిన పలు కంపెనీలతో థింకింగ్ పోటీపడుతున్నది. హైదరాబాద్‌లో గూగుల్‌తో పార్ట్‌నర్‌షిప్ అందుకున్న మొదటి, ఏకైక కంపెనీగా మంచి పేరు తెచ్చుకున్నది. నలుగురు ఉద్యోగులతో ప్రారంభమైన ఈ సంస్థలో ప్రస్తుతం నలభై మంది ఉపాధి పొందుతున్నారు. మెయిన్ కార్పొరేట్ ఆఫీస్‌తో పాటు ఇప్పటికే హైదరాబాద్‌లో రెండు ఆఫీస్‌లు తెరిచారు. బంగ్లాదేశ్‌లో కూడా థింకింగ్ హ్యాట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. బంగ్లాదేశ్ రాజధాని ఢాకా కేంద్రగా అక్కడి ప్రభుత్వానికి, పలు ప్రైవేట్ కంపెనీలకు థింకింగ్ హ్యాట్ సర్వీస్ ప్రొవైడ్ చేస్తున్నది. ఐటీ, సోషల్‌మీడియా రంగంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించి సమస్యలకు చెక్ పెడుతున్నారు. గూగుల్‌లో సమానంగా అప్‌డేట్ అవుతూ సాంకేతిక పరిష్కారం, నైపుణ్యం, ప్రొఫెషనలిజంతో డిజిటల్ మీడియా రంగంలో ప్రభావవంతమైన పాత్రను పోషిస్తున్నది థింకింగ్ హ్యాట్. నాలుగేళ్ల డిజిటల్ ప్రస్థానంలో కొత్త ఆవిష్కరణలకు ఆజ్యం పోసింది. తనకున్న సాంకేతిక అనుభవం వల్ల వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ ఆన్‌లైన్ మార్కెటింగ్ రంగంలో రాణించగలుగుతున్నది.

### నెక్ట్స్ జనరేషన్.. ఈ ప్రమోషన్

భవిష్యత్తు అంతా ఈ కామర్స్ వెబ్‌సైట్స్‌దే. ఈ ప్రమోషన్‌లదే అంటున్నాడు థింకింగ్ హ్యాట్ అధినేత సుధీర్ రెడ్డి. ఇప్పటికే డిజిటల్ మార్కెటింగ్ వాడుక విపరీతంగా పెరిగిందని, భవిష్యత్తులో మరింత విస్తరించనున్నదని చెప్పాడు. సాధారణంగా ఓ ఫ్లెక్సీ బోర్డు పెడితే ఎంతమంది చూశారు. దాన్ని చూసి ఎంతమంది వచ్చారు? అనే అంశాలు తెలియవు. అదే సోషల్‌మీడియాలో బ్రాండింగ్ చేయడం వల్ల.. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టగ్రాం, యూట్యూబ్ ఇలా ఏ మీడియా నుంచి ఎంతమంది వచ్చారనే లెక్క ఉంటుంది. అంతేకాదు.. ఆఫ్‌లైన్ మార్కెటింగ్‌తో పోల్చుకుంటే ఆన్‌లైన్ మార్కెటింగ్ వ్యాల్యూ తక్కువ ఉంటుందని పేర్కొన్నాడు. కాస్ట్ ఎఫెక్ట్‌తో పాటు ట్రాకింగ్ మెకానిజం ఉంటుంది కాబట్టి మరింత ట్రెండింగ్ అవ్వడం ఖాయమంటున్నాడు. స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్ వాడకం పెరిగాక డిజిటల్ మార్కెటింగ్‌కు విపరీతంగా క్రేజ్ పెరిగింది. ఉత్పత్తుల బ్రాండ్ విషయంలో ఇప్పుడిప్పుడే ఈ ప్రమోషన్ రాకెట్ స్పీడ్‌లో డెవలప్‌అవుతుంది. అంతేకాదు ఈ రంగంలో యువతకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

THINKING | HAT™
Advertising LEVEL: Expert

# మొదటిసారి స్మార్ట్‌ఫోన్!

**కార్బన్ మొదటిసారి 4జీ స్మార్ట్‌ఫోన్‌ని ప్రవేశపెట్టింది. బేసిక్ స్పెసిఫికేషన్, డ్యుయల్ సిమ్‌తో అందుబాటులో ఉంది.**

పేరు : కార్బన్ ఏ 41 పవర్.
డిస్ ప్లే: 4 అంగుళాల వెవిగా డిస్‌ప్లే.
ఆపరేటింగ్ సిస్టమ్ : ఆండ్రాయిడ్ 7.0 నౌగట్.
ప్రాసెసర్: 1.3 గిగాహెడ్జ్ క్వాడ్ కోర్.
ఫ్రంట్ కెమెరా: 0.3 మెగా పిక్సెల్.
రియర్ కెమెరా: 2 మెగా పిక్సెల్స్.
ఫొటో రిజెల్యూషన్: 480 X 800 పిక్సెల్స్.
ర్యామ్: 1 జీబీ.
ఇంటర్నల్ స్టోరేజ్ : 8 జీబీ (32జీబీ వరకు పెంచుకోవచ్చు)
బ్యాటరీ: 2300 mAh
హెడ్ ఫోన్ : 3.5మి.మి. జాక్.
కలర్స్: బ్లాక్, వైట్, గోల్డ్, రెడ్.
బరువు : 130 గ్రా.
ధర: రూ. 4, 099/-




# ఫోన్ పేలిపోకుండా..

**ఈ రోజుల్లో స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతివారినీ వేధిస్తున్న సమస్య బ్యాటరీ. ఎక్కడికి వెళ్లినా ఫోన్‌లో చార్జింగ్ ఉందో లేదో అని టెన్షన్ పడుతుంటారు. ఈ మధ్యకాలంలో జేబుల్లోనే ఫోన్లు పేలిపోతుండడం మరింత కలవరపెడుతుంది. ఈ సమస్యలకు ఈ చిట్కాలు పాటిస్తే మీరూ, మీ ఫోన్ సేఫ్..**



- ఫోన్‌కు చార్జింగ్ పెట్టే సమయంలో కచ్చితంగా కంపెనీ చార్జర్‌నే వాడండి. ఒకవేళ ఆ చార్జర్ అందుబాటులో లేకపోతే దాని ఓల్టేజ్‌కు సమానంగా ఉండే మరో చార్జర్‌ను వాడాలి. లేకపోతే బ్యాటరీ నాణ్యత తగ్గుతుంది.
- చార్జింగ్ పెట్టేటప్పుడు ఫోన్ బ్యాక్ కేస్‌లు తీసేయండి. లేదంటే చార్జింగ్ పెట్టినప్పుడు వచ్చే హీట్ సరిగ్గా బయటకు పోక అది డివైస్‌పై ప్రభావం చూపి.. పేలిపోయే అవకాశం ఉంటుంది.
- ఫాస్ట్ చార్జర్లు, కెపాసిటీ ఎక్కువగా ఉన్న చార్జర్లు వాడితే బ్యాటరీ కచ్చితంగా పేలిపోతుంది.
- రాత్రంతా ఫోన్‌కు చార్జింగ్ పెట్టడం వల్ల బ్యాటరీ లైఫ్ తగ్గిపోయి పేలిపోతుంది. కాబట్టి బ్యాటరీ ఫుల్ అయిన వెంటనే చార్జింగ్ తీసివేయడం మంచిది.
- బ్యాటరీ పవర్‌ను ఆప్టిమైజ్ చేసుకోవాలంటూ ప్లేస్టోర్ నుంచి వచ్చే బ్యాటరీ యాప్స్‌ను వాడొద్దు. ఫోన్ నుంచి వచ్చిన డీఫాల్ట్ యాప్స్‌నే వాడాలి.
- చాలా మంది బ్యాటరీ చార్జింగ్ 100 శాతం అయ్యేంత వరకూ ఉంచుతారు. 80శాతం చాలు. అత్యవసరం అయితే తప్ప 100శాతం చార్జింగ్ పెట్టకండి.
- కొంతమంది చార్జింగ్ కొంత తగ్గగానే వెంటనే చార్జింగ్ పెట్టేస్తారు. ఇది చాలా తప్పు. ఇలా చేస్తే బ్యాటరీ లైఫ్ తగ్గి పేలిపోతుంది. 20శాతం తక్కువ ఉంటేనే చార్జింగ్ పెట్టాలి.
- స్మార్ట్‌ఫోన్లు చార్జింగ్ పెట్టినప్పుడు కాల్స్ చేయొద్దు. ఎందుకంటే చార్జింగ్ అయ్యే సమయంలో వాటి నుంచి హీట్ వస్తుంది. మీరు కాల్స్ చేస్తే ఆ హీట్ మరింత ఎక్కువై పేలిపోయే ప్రమాదం ఉంది.

# గెస్ట్‌మోడ్‌తో.. డేటా సేఫ్



**మన స్మార్ట్ ఫోన్‌ను పక్క వాళ్లకి ఇవ్వాలంటే కొంచెం ఇబ్బందిగానే ఉంటుంది. మన పర్సనల్ ఫొటోలు, వీడియోలు, మెసేజ్‌లు, ఇతర సమచారాన్ని వాళ్లు చూస్తారేమోనని. అయితే గెస్ట్‌మోడ్‌తో నిర్భయంగా ఫోన్ ఇవ్వొచ్చు. ఎలాగంటే..?**

ఆండ్రాయిడ్ ఫోన్లలో గెస్ట్‌మోడ్ అనే ఫీచర్ ఉంటుంది. ఫోన్‌లో పైన నోటిఫికేషన్ బార్‌ను కిందకు లాగాలి. అక్కడ మీ బ్యాటరీ పర్సంటేజ్, సెట్టింగ్స్ ఐకాన్ పక్కన యూజర్ ఐకాన్ ఉంటుంది. దాన్ని ఓపెన్ చేయాలి. కింద ఆప్షన్లు కనిపిస్తాయి. వాటిల్లో ప్రస్తుతం ఫోన్ వాడుతున్న యూజర్ పేరు (మీపేరు) ఉంటుంది. దాని పక్కనే గెస్ట్ అని ఉంటుంది. దాన్ని ఎంచుకుంటే ఫోన్ ఆటోమెటిక్‌గా గెస్ట్‌మోడ్‌లోకి వెళ్తుంది. ఆ తర్వాత మీ ఫోన్‌ను ఎదుటివారికి ఇచ్చినా వారు మీ ఫోన్‌లోని ఫొటోలు, కాల్స్, ఎస్ఎంఎస్‌లు వంటి సమాచారం చూడలేరు. అవన్నీ ఖాళీగా కనిపిస్తాయి. అయితే ఎస్డీ కార్డులో ఉన్న ఫొటోలు, వీడియోలు, ఇతర వివరాలు మాత్రం కనిపిస్తాయి. దీనిని సెట్టింగ్స్‌లోకి వెళ్లి ప్రైవసీ విభాగంలో యూజర్స్ అనే సెక్షన్‌లో కూడా యాక్సెస్ చెయ్యొచ్చు. అయితే ఫోన్‌ను బట్టి గెస్ట్‌మోడ్ లొకేషన్ మారుతుంది. దీనిని డీయాక్టివేట్ (రిమూవ్) చేయాలనుకుంటే మాత్రం మీరు ఫోన్‌కు పెట్టుకున్న ప్యాట్రన్, పిన్ పాస్‌వర్డ్ అడుగుతుంది. ఎంటర్ చేసిన తర్వాత రిమూవ్ ఆప్షన్‌ను ఎంచుకుంటే సరిపోతుంది.

# కలర్ మార్చేయండి

**ఫేస్‌బుక్‌లాగా వాట్సాప్ కూడా ఇక నుంచి కలర్‌ఫుల్‌గా కనపడనుంది. దీంట్లో కూడా రంగు రంగుల్లో టెక్ట్స్ పోస్ట్ చెయొచ్చు. ఎలాగంటే..?**

ఫేస్‌బుక్ మాదిరిగా వాట్సాప్‌లోనూ కలర్‌ఫుల్ టెక్ట్స్ అప్‌డేట్స్‌ను పోస్ట్ చెయ్యొచ్చు. ఈ ఫీచర్ త్వరలోనే అందుబాటులోకి రానున్నట్లు వాట్సాప్ ప్రకటించింది. ప్రస్తుతం ఈ ఫీచర్ బేటా యూజర్స్‌కు మాత్రమే అందుబాటులో ఉంది. వాట్సాప్ బేటా వెర్షన్ 2.17.291లో ఈ ఫీచర్ లభిస్తుంది. వాట్సాప్ కొత్త వెర్షన్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే న్యూ స్టేటస్ అప్‌డేట్ కనిపిస్తుంది. ఇక్కడ మూడు ఆప్షన్లు ఉంటాయి. ఫాంట్, బ్యాక్‌గ్రౌండ్ కలర్, ఎమోజీల్లో మీకు నచ్చినది ఎంచుకోవచ్చు. దాదాపు ఫేస్‌బుక్‌లో మాదిరిగానే బ్యాక్‌గ్రౌండ్ కలర్ ఎంచుకోవచ్చు. బ్యాక్‌గ్రౌండ్ కలర్‌తో స్టేటస్‌ను పోస్ట్ చేయాలనుకునే వారు ముందుగా స్టేటస్ అప్‌డేట్ బాక్స్‌లోకి వెళ్లాలి. దానిపై ట్యాప్ చేస్తే 'వాట్స్ ఆన్ యువర్ మైండ్' అని మెసేజ్ కనిపిస్తుంది. ఇప్పుడు కలర్ ప్యాలెట్‌లో నుంచి కలర్ బ్యాక్‌గ్రౌండ్‌ను ఎంచుకోవాలి. తరువాత టెక్ట్స్ టైప్ చేసి పోస్ట్ చేయాలి.




# స్మార్ట్ ఈ-వస్త్రాలు

**ఇన్నాళ్లూ కరెంట్‌తోనో, సోలార్ పవర్‌తోనో ఫోన్లకు చార్జింగ్ పెట్టుకున్నాం. కొత్తగా ఒంటికి ధరించిన దుస్తులతో కూడా చార్జింగ్ పెట్టుకునే టెక్నాలజీ వచ్చేసింది. వీటిని నిరభ్యంతరంగా ఉతికి ఆరేసుకోవచ్చు.**

పర్యావరణ హితమైన స్మార్ట్ ఈ-వస్త్రాలను తయారు చేసే కొత్త టెక్నాలజీని మాంచెస్టర్ యూనివర్సిటీ బృందం కనుగొన్నది. వేగంగా చార్జింగ్ అయ్యేవిధంగా తేలికపాటి సాధారణ స్క్రీన్ ప్రింటింగ్ టెక్నిక్‌ను ఉపయోగించి వీటిని రూపొందించారు. మనం ధరించిన ఫ్యాబ్రిక్ దుస్తులకే బ్యాటరీ సౌకర్యవంతంగా ఉండేలా అమర్చారు. వీటిని ఉతికినా, ఎండకు ఆరేసినా ఎలాంటి ఇబ్బందులూ ఉండంని యూనివర్సిటీకి చెందిన నజ్మల్ కరీం తెలిపారు. ఫార్మల్ షూ, హ్యాండ్ బ్యాండ్స్, టీ-షర్ట్స్, షర్ట్స్, ప్యాంట్లకు వీటిని అమర్చారు. ఇవి గ్రాఫేన్ ఆక్సైడ్ ఆధారితంగా పనిచేస్తాయి. ఈ ఫాబ్రిక్ టెక్నాలజీ దుస్తులను సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా మార్కెట్‌లోకి తీసుకురావాలని యోచిస్తున్నారు. 2018లో వీటిని అందరికీ పరిచయం చేసే అవకాశం ఉందని కరీం చెబుతున్నారు. ఈ పరిశోధనను అంతర్జాతీయ గ్రాఫేన్ ఇనిస్టిట్యూట్ (NGI) అభినందించింది. ఇంకో విషయం ఏంటంటే ఈ టెక్నాలజీతో స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లకు అనుసంధానం చేసుకోవచ్చు. మరింకెందుకాలస్యం మీరు కూడా ఓ సారి ట్రై చేయండి.






# దేశంలో గిరిజనులు

- 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో ఎస్టీ జనాభా – 10.43 కోట్లు (8.6 శాతం)
- ఎస్టీ జనాభా అత్యధికంగా గల రాష్ట్రం – **మధ్యప్రదేశ్**
- ఎస్టీ జనాభా తక్కువ గల రాష్ట్రం – **సిక్కిం**
- ఎస్టీ జనాభా అత్యధికంగా గల కేంద్ర పాలిత ప్రాంతం – **దాద్రా, నగర్ హవేలీ**
- ఎస్టీ జనాభా తక్కువ గల కేంద్ర పాలిత ప్రాంతం – **డామన్ డయ్యూ**
- ఎస్టీ జనాభా శాతం అత్యధికంగా గల రాష్ట్రం – **మిజోరం**
- ఎస్టీ జనాభా తక్కువ గల రాష్ట్రం – **గోవా**
- ఎస్టీ జనాభా శాతం అత్యధికంగా గల కేంద్ర పాలిత ప్రాంతం – **లక్షదీవులు**
- ఎస్టీ జనాభా శాతం తక్కువ గల కేంద్ర పాలిత ప్రాంతం – **అండమాన్‌నికోబార్ దీవులు**
- ఎస్టీ జనాభా లేని రాష్ట్రాలు – **పంజాబ్ హర్యానా**
- ఎస్టీ జనాభా లేని కేంద్ర పాలిత ప్రాంతాలు – **పుదుచ్చేరి, చండీగఢ్, ఢిల్లీ**

**ముఖ్యమైన గిరిజన తెగలు**

| గిరిజన తెగలు | | ప్రాంతం |
|---|---|---|
| బోటియాలు | – | ఉత్తరప్రదేశ్ |
| చాంగ్ | – | ఈశాన్యరాష్ట్రాలు |
| గదీ | – | హిమాచల్‌ప్రదేశ్ |
| గోండులు | – | గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ |
| ఖారియా | – | మధ్యప్రదేశ్ |
| ఖాస్ | – | ఉత్తరప్రదేశ్ |
| అబోర్లు | – | ఈశాన్య రాష్ట్రాలు |
| భిల్లులు | – | మధ్యప్రదేశ్, రాజస్థాన్ |
| తోడాలు | – | తమిళనాడు |
| అంగామీ | – | నాగాలాండ్ |
| కట్కారీ | – | మధ్యప్రదేశ్ |
| గారో | – | అసోం, మేఘాలయ |
| చుటియా | – | అసోం |
| బిరోర్ | – | మధ్యప్రదేశ్, బీహార్ |
| బైగా | – | మధ్యప్రదేశ్ |
| అవో | – | నాగాలాండ్, అసోం |
| ఆదివాసీలు | – | మధ్యప్రదేశ్(బస్తర్ జిల్లా) |
| బకర్‌వాల్ | – | జమ్ముకశ్మీర్ |
| చెంచు | – | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా |
| భుయా | – | మధ్యప్రదేశ్ |
| అపటామి | – | అరుణాచల్‌ప్రదేశ్ |
| కనికర | – | తమిళనాడు |
| జయంతియా | – | మేఘాలయ |
| గుజ్జరు | – | గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ |
| గల్లాంగ్ | – | ఈశాన్య రాష్ట్రాలు |
| ఇరుళ | – | తమిళనాడు |
| ఖోండ్ | – | మధ్యప్రదేశ్, ఒడిశా |
| వాంఛూ | – | ఈశాన్యప్రాంతం |
| ఒరాన్‌లు | – | బీహార్, ఒడిశా |
| ఓంగె | – | లిటిల్ అండమాన్ |
| ఖాసీలు | – | అసోం, మేఘాలయ |
| మైనా | – | రాజస్థాన్ |
| సంతాల్‌లు | – | శ్చిమబెంగాల్, ఒడిశా, బీహార్ |
| కోల్ | – | మధ్యప్రదేశ్ |
| మోంసా | – | ఈశాన్య రాష్ట్రాలు |
| ముండా | – | బీహార్ |
| నాగా | – | నాగాలాండ్ |
| సెంటినెలీ | – | అండమాన్, నికోబార్ దీవులు |
| లుషాయి | – | త్రిపుర |
| మికిర్ | – | అసోం |
| షాంపెన్ | – | నికోబార్ దీవులు |
| కోలాం | – | ఆంధ్రప్రదేశ్ |
| లాహౌలా | – | హిమాచల్‌ప్రదేశ్ |
| మురియా | – | మధ్యప్రదేశ్ |
| కోటాలు | – | తమిళనాడు |
| లెప్చాలు | – | సిక్కిం |
| కుకీ | – | మణిపూర్ |
| మోపా | – | మణిపూర్ |
| నిషీ | – | ఈశాన్య రాష్ట్రాలు |
| జార్వాలు | – | దక్షిణ, మధ్య అండమాన్ |
| రెంగ్మా | – | ఈశాన్య రాష్ట్రాలు |
| డాపా | – | అరుణాచల్‌ప్రదేశ్ |
| బడగ | – | తమిళనాడు |
| జెలియాంగ్ | – | నాగాలాండ్ |
| డాంగ్స్ | – | గుజరాత్ |







# బ్రిటిష్ సామ్రాజ్య విస్తరణ

గ్రూప్-1 ప్రత్యేకం



- ప్లాసీ యుద్ధభూమిలోనే బెంగాల్‌కు కొత్త నవాబుగా మీర్‌జాఫర్‌ను క్లైవ్ ప్రకటించాడు. మీర్‌జాఫర్ ఇంగ్లిష్‌వాళ్లకి బెంగాల్, బీహార్, ఒరిస్సా రాష్ట్రాల్లో స్వేచ్ఛా వర్తకం చేసుకునే హక్కు ప్రసాదించాడు. కలకత్తా సమీపంలోని 24 పరగణాల మీద కంపెనీకి జమిందారీ హక్కు ఏర్పడింది. కలకత్తా మీద లోగడ జరిపిన దాడికి నష్టపరిహారంగా కొత్త నవాబు కంపెనీకి, వర్తకులకు రూ. 1,70,00,000 సమర్పించుకున్నాడు.
- ఇవిగాక కంపెనీ ఉన్నతాధికారులకు కానుకలు, లంచాల రూపేణా భారీ మొత్తాలు చెల్లించాడు. క్లైవ్ రూ. 20 లక్షలకుపైగా కొట్టేశాడు. వాట్సన్‌కు రూ. 10 లక్షలకుపైగా ముట్టింది. మొత్తం మీద కంపెనీ, కంపెనీ ఉద్యోగులుకీలుబొమ్మ నవాబు దగ్గర రూ. 3 కోట్లకుపైగా వసూలు చేసి ఉండవచ్చునని క్లైవ్ అంచనా. పైపెచ్చు బ్రిటిష్ వర్తకులు, అధికారులు ప్రైవేటుగా చేసుకొనే వ్యాపారం మీద చిల్లిగవ్వ కూడా పన్నుగా చెల్లించనక్కరలేదు. ప్లాసీ యుద్ధం బెంగాల్ మీద, ఆ తర్వాత యావత్ భారతదేశం మీద బ్రిటిష్ ఆధిపత్యానికి బాటలు వేసింది. బ్రిటిష్ ప్రతిష్ఠను ఆకాశానికెత్తింది. ఒక్కదెబ్బతో అది ఇంగ్లిష్ కంపెనీని భారత సామ్రాజ్య ఆధిపత్యానికి ప్రధాన అభ్యర్థి హోదాకి లేవనెత్తింది.
- బెంగాల్ నుంచి వచ్చినప్పుడే పుష్కలమైన ఆదాయంతో ఇంగ్లిష్‌వాళ్లు బలమైన సైన్యాన్ని నిర్మించుకోగలిగారు. బెంగాల్ మీద ఆధిపత్యం ఆంగ్లో–ఫ్రెంచి సంఘర్షణలో నిర్ణాయక పాత్ర వహించింది. ప్లాసీయుద్ధం విజయం ద్వారా కంపెనీ, కంపెనీ ఉద్యోగులు బెంగాల్ ప్రజల కడుపుకొట్టి కోటానుకోట్ల సంపద కాజేశారు. అయితే మీర్‌జాఫర్ నవాబు కావడానికి ఇంగ్లిష్‌వాళ్లే కారణమైనా.. వాళ్లతో జరిపిన లావాదేవీలకు అతడు పశ్చాత్తాపపడ్డాడు. కంపెనీ అధికారులు అదేపనిగా డిమాండ్ చేసే కానుకలు, లంచాలకు ఖర్చుపెట్టిన డబ్బుతో ఖజానా ఖాళీ అయ్యింది.
- క్లైవ్ అంతటివాడే స్వయంగా డబ్బు కోసం పదేపదే నవాబుని అడిగేవాడు. కల్నల్ మాలేసన్ చెప్పినట్టుగా అందినంతవరకు డబ్బుదోచెయ్యడం, ఇష్టమొచ్చినప్పుడల్లా చేతులుచాచి దోసిళ్లతో డబ్బు బయటికి తీసే బంగారు గోనె సంచిలా మీర్‌జాఫర్‌ని వాడుకోవడం కంపెనీ అధికారుల ఏకైక లక్ష్యం అయింది. అంతేకాకుండా కోరికలు తీర్చే కామధేనువు దొరికిందనుకొని బాంబే, మద్రాస్ ప్రెసిడెన్సీల యావత్ పరిపాలనా వ్యయాన్ని బెంగాల్ ఒక్కటే భరించాలని కంపెనీ డైరెక్టర్లు తాఖీదులు పంపారు. అక్కడితో ఆగకుండా ఇండియా నుంచి ఎగుమతి చేసే సరుకులు సమస్తం బెంగాల్ ఆదాయంతో కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీచేశారు.
- ఈ విధంగా కంపెనీ భారతదేశంలో కేవలం వ్యాపారంతో సరిపెట్టుకోలేదు. బెంగాల్ నవాబు మీద తన పెత్తనాన్ని ఉపయోగించుకొని, ఆ రాష్ట్ర సంపదను జలగ మాదిరి పీల్చివేసింది. దీంతో కంపెనీ వాళ్ల గొంతెమ్మ కోరికలు తీర్చడం అసాధ్యమని మీర్‌జాఫర్‌కి బోధపడింది. వారి కోరికలను తిరస్కరించడం మొదలుపెట్టాడు. దీంతో అతని మీద తాము పెట్టుకొన్న ఆశలకనుగుణంగా నవాబు నడుచుకోవడం లేదని కంపెనీ ఉద్యోగుల్లో అసంతృప్తి ప్రబలింది. కంపెనీ మీర్‌జాఫర్‌ని చేతగానిదద్దమ్మ కింద జమకట్టి 1760 అక్టోబర్‌లో గద్దె దింపి అతని అల్లుడు మీర్‌ఖాసీంను నవాబుగా ప్రకటించింది. మీర్‌ఖాసీం కంపెనీవాళ్లు తనకు చేసిన సహాయానికి ప్రతిఫలంగా బర్ద్వాన్, మిడ్నాపూర్, చిట్టగాంగ్ జిల్లాల మీద కంపెనీకి జమిందారీ హక్కు దాఖలు పర్చాడు. ఉన్నతాధికారులందరికీ సుమారు రూ. 29 లక్షల వరకు కానుకల కింద సమర్పించుకున్నాడు. అంతటితో కంపెనీవాళ్లు సంతృప్తి పడి, పరిపాలనా వ్యవహారాల్లో తనని స్వేచ్ఛగా వ్యవహరించనిస్తారని మీర్‌ఖాసీం భావించాడు. తన రాజధాని నగరాన్ని ముర్షిదాబాద్ నుంచి మాంఘీర్‌కు మార్చి బ్రిటిష్‌వారికి దూరంగా ఉన్నాడు.
- మీర్‌ఖాసీం శక్తి, సామర్థ్యం, దక్షత కలిగిన పరిపాలకుడు. తన స్వతంత్రాన్ని పరిరక్షించుకోవాలంటే సమృద్ధిగా ఆదాయం, సమర్థమంతమైన సైన్యం ఉండాలని గ్రహించాడు. అతని ధోరణి ఇంగ్లిష్‌వాళ్లని నిరుత్సాహపర్చింది. రెవెన్యూ వ్యవహారాల నిర్వహణలోని అవినీతిని రూపుమాపి, ప్రభుత్వ ఆదాయాన్ని వృద్ధి చేయడానికి, పాశ్చాత్య పద్ధతుల్లో ఒక ఆధునిక, క్రమశిక్షణాయుత సైన్యాన్ని నిర్మించడానికి మీర్‌ఖాసీం సంకల్పించాడు. ఇది ఇంగ్లిష్‌వాళ్లకి రుచించలేదు.
- 1717 ఫర్మానా ప్రసాదించిన ప్రత్యేక హక్కులను దుర్వినియోగపర్చకుండా నవాబు తీసుకొనే చర్యలు అగ్నికి ఆజ్యం పోశాయి. తమ సరుకులు ఎగుమతి కోసమైతేనేం, దేశంలోపల వ్యాపారానికైతేనేం నవాబు పట్టించుకోకూడదని కంపెనీ ఉద్యోగుల భావన. సొంత వ్యాపారానికి ఉద్దేశించిన సరుకుమీద కూడా తాము సుంకాలు చెల్లించేదిలేదని వాళ్లు మొండికేశారు. ఇది సహజంగా స్వదేశీ వర్తకుల మనస్సుని గాయపర్చింది. విదేశీయులు చట్టవ్యతిరేకంగా పన్ను మినహాయింపు అనుభవిస్తూ, తమచేత పన్నులు కక్కించటం భారతీయ వర్తకులు సహించలేకపోయారు. పైపెచ్చు కంపెనీ అధికారులు తమకు ఇష్టమైన భారతీయ వర్తకులకు చట్టవ్యతిరేకంగా దస్తక్‌లు (ఫ్రీ పాసులు) అమ్మటం ప్రారంభించారు.
- ఆ విధంగా చాలామందికి అంతర వాణిజ్య సుంకాలు ఎగవేయడానికి వీలుపడింది. దానివల్ల నీతిగా, నిజాయితీగా వ్యాపారం చేసే దేశీయ వర్తకులు ఇతరుల అక్రమ పోటీకి తట్టుకోలేకపోయారు. ప్రభుత్వ ఖజానాకు వచ్చే రాబడి పడిపోయింది. వీటికి తోడు కంపెనీ ఉద్యోగులు నవాబు అధికారులను అవమానిస్తూ బెంగాల్ ప్రజానీకాన్ని పీల్చిపిప్పి చేయడానికి పూనుకున్నారు. దేశంలోని వృత్తిపనివాళ్లు, రైతాంగం, వర్తకులకు తమ సరుకుని చౌకగా అమ్మి, కంపెనీ సరుకుని ప్రియంగా కొనుక్కోమని వారిని నిర్బంధించారు. అమ్మబోతే అడవి, కొనబోతే కొరివిలా తయారైన ఈ పరిస్థితిని ఎదురించినవాళ్లని కొరడాలతో కొట్టారు.
- ఈ కాలాన్ని సిగ్గూశరం వదిలేసిన బహిరంగ దోపిడీ యుగంగా ఆధునిక బ్రిటిష్ చరిత్రకారుడు పెర్సివల్ స్పియర్ వర్ణించాడు. ఈ విధంగా అమితమైన సంపదకు పేరుపడ్డ బెంగాల్ క్రమేణా దారిద్ర్యంలోకి కూరుకుపోయింది. ఈ అవినీతి, అవకతవకలు కొనసాగిన పక్షంలో బెంగాల్‌ను పటిష్ఠంగా తీర్చిదిద్దడంగానీ, కంపెనీ అదుపాజ్ఞల నుంచి బయటపడటంగానీ జరగని పని అని మీర్‌ఖాసీం గ్రహించి, దేశం లోపల జరిగే వర్తక వ్యాపారాల మీద పన్నుని రద్దు చేశాడు. ఇది నిజంగా సాహసోపేతమైన చర్య. ఇంగ్లిష్‌వాళ్లు బలవంతంగా గుంజుకున్న రాయితీని మీర్‌ఖాసీం పన్ను రద్దు ద్వారా స్వదేశీ వర్తకులకు ధైర్యం కల్పించాడు. తమకు, భారతీయులకు మధ్య సమాన హోదా ఇవ్వడం ఇంగ్లిష్‌వాళ్లకి నచ్చలేదు. దీంతో భారతీయ వర్తకులపైన మళ్లీ పన్ను విధించమని నవాబుపై ఒత్తిడి తెచ్చారు. దీంతో 1763లో వరుసగా జరిగిన యుద్ధాల్లో మీర్‌ఖాసీం ఓడిపోయి అవధ్‌కు పారిపోయి, అవధ్ నవాబు షుజా ఉద్దౌలాతోను, రాజ్యభ్రష్టుడైన మొఘల్ చక్రవర్తి రెండో షా ఆలంతోను పొత్తు పెట్టుకున్నాడు.

**బక్సార్ యుద్ధం (1764 అక్టోబర్ 22)**

- ఈ ముగ్గురు కలిసి బక్సార్ వద్ద కంపెనీవాళ్లతో తలపడి ఓడిపోయారు. భారతదేశ చరిత్రలో జరిగిన అత్యంత నిర్ణయాత్మక యుద్ధాల్లో బక్సార్ యుద్ధం ఒకటి. ఈ యుద్ధంలో భారతదేశంలోని రెండు పెద్ద రాజ్యాల సంయుక్త సేనల మీద ఇంగ్లిష్‌వారి ఆయుధ బలం ఆధిక్యత వెల్లడయ్యింది. ఇది బెంగాల్, బీహార్, ఒరిస్సా రాష్ట్రాలకు ఇంగ్లిష్‌వాళ్లని ప్రభువులుగా స్థిరపర్చింది.
- 1765లో బెంగాల్ గవర్నర్‌గా తిరిగివచ్చిన క్లైవ్ ఇంగ్లిష్‌వాళ్ల ప్రత్యక్ష రాజ్యాధికారాన్ని స్థాపింపజేయడం కోసం నవాబుల నుంచి సకల ప్రభుత్వాధికారాల్ని క్రమేణా కంపెనీకి బదలాయించడానికి పూనుకున్నాడు. 1763లో కంపెనీ తిరిగి మీర్‌జాఫర్‌ని నవాబుగా చేసింది. యధా ప్రకారం కంపెనీ, కంపెనీ అధికారులు కట్నకానుకలు గుంజుకున్నారు.
- మీర్‌జాఫర్ చనిపోగానే, అతని కుమారుడు నిజాం ఉద్దౌలాని గద్దెనెక్కించి దానికి ప్రతిఫలంగా 1765 ఫిబ్రవరి 20న అతనిచేత ఒక కొత్త ఒడంబడిక మీద సంతకాలు చేయించాడు. దాని ప్రకారం నవాబు తన సైన్యాన్ని పూర్తిగా తగ్గించుకోవాలి. కంపెనీవాళ్లు నియమించిన ఒక ఉపసుబేదారు ద్వారా పరిపాలన నిర్వహించాలి. ఆ ఉపసుబేదారుని తొలగించాలంటే కంపెనీవారి అనుమతి పొందాలి. ఆ విధంగా ఇంగ్లిష్ తూర్పు ఇండియా కంపెనీ బెంగాల్ మీద సర్వాధిపత్యం సంపాదించింది.
- బెంగాల్ కంపెనీ కౌన్సిల్ సభ్యులు నవాబు దగ్గర మళ్లీ రూ. 15 లక్షలు దోచుకున్నారు. మొఘల్ సామ్రాజ్యానికి నామమాత్రపు చక్రవర్తిగా ఉన్న రెండో షా ఆలం నుంచి కంపెనీ దివానీ హక్కు (రెవెన్యూ వసూలు చేసుకొనే హక్కు) రాబట్టుకుంది. దివానీ హక్కు దక్కించుకున్నందుకు బదులుగా కంపెనీవాళ్లు రెండో షా ఆలం చక్రవర్తికి రూ. 20 లక్షల కోరాలు, అలహాబాద్ జిల్లా ఇచ్చాడు. సుమారు ఆరేండ్ల పాటు రెండో షా ఆలం ఇంగ్లిష్ వారి బందీగా అలహాబాద్ కోటలో జీవితం గడిపాడు. అవధ్ నవాబు షుజా ఉద్దౌలా యుద్ధ పరిహారం కింద కంపెనీకి రూ. 50 లక్షలు చెల్లించాడు.

**బెంగాల్‌లో ద్వంద్వ ప్రభుత్వం**

- సుమారు 1765 నుంచి తూర్పు ఇండియా కంపెనీ బెంగాల్ రాష్ట్రానికి నిజమైన యజమానిగా అవతరించింది. రాష్ట్ర రక్షణ బాధ్యత యావత్తు కంపెనీ సైన్యం చేతుల్లోకి పోయి రాజకీయ సర్వాధికారం కంపెనీ హస్తగతమైంది. దివాన్‌గా కంపెనీ ప్రత్యక్షంగా పన్నులు వసూలు చేసుకుంది. ఉప సుబేదారును నేరుగా నియమించి పాలనాధికారం చెలాయించింది. అంటే పోలీసు, న్యాయాధికారాలు కంపెనీ చేతుల్లోకిపోయాయి. ఒకే వ్యక్తి కంపెనీ తరపున ఉప దివాన్‌గాను, నవాబు తరపున ఉప సుబేదార్‌గాను వ్యవహరించడం వల్ల పాలనాబాధ్యతలు, పన్నువసూలు హక్కు దాదాపు కలిసిపోయి బ్రిటిష్‌వారి ఏకచ్ఛత్రాధిపత్యాన్ని చాటాయి.
- ఈ పద్ధతి ద్వంద్వ ప్రభుత్వం పేరుతో చరిత్రకెక్కింది. దీనివల్ల బ్రిటిష్‌వారికి గొప్ప లాభం చేకూరింది. బాధ్యతల బెడద లేకుండా కంపెనీకి అధికారం సిద్ధించింది. ఇంగ్లిష్‌వాళ్లు రాష్ట్ర ఆదాయాన్ని, సైన్యాన్ని నేరుగా తమ చేతుల్లో పెట్టుకొని పాలనా నిర్వహణ మీద పరోక్షంగా అజమాయిషీ చేశారు. నవాబు, అతని కింద అధికారులు పాలనా బాధ్యతలు నెత్తినవేసుకున్నా ఆ బాధ్యతల్ని నిర్వర్తించే అధికారాలు వాళ్లకులేవు. కాబట్టి అవకతవకలకి భారతీయులు బాధ్యత వహిస్తే ఆదాయాన్ని, లాభాల్ని బ్రిటిష్‌వారు దండుకున్నారు. ఈ విధంగా బెంగాల్ యావత్తు కంపెనీ అధికారుల కబంధహస్తాల మధ్య ఇరుక్కుపోయింది. ఇష్టానుసారంగా ప్రజల్ని పీడించుకు తినడం పెరిగిపోయింది.

## ప్రాక్టీస్ బిట్స్

1. **భూములను సర్వే చేసి, ముందుగానే పన్ను లెక్కించే పద్ధతి ఏమిటి? (2)**
   1) జమిందారీ వ్యవస్థ
   2) రైత్వారీ వ్యవస్థ
   3) మహల్‌వారీ వ్యవస్థ 4) ఏదీ కాదు
2. **శాశ్వత భూమిశిస్తువిధానం దేని ప్రత్యేకత? (1)**
   1) 1) జమిందారీ వ్యవస్థ
   2) రైత్వారీ వ్యవస్థ
   3) మహల్‌వారీ వ్యవస్థ 4) ఏదీ కాదు
3. **మద్రాసులో రైత్వారీ పద్ధతిని అమలు చేసింది? (3)**
   1) మాల్కమ్ 2) మెట్‌కాల్ఫే
   3) మన్రో 4) ఎల్ఫిన్ స్టోన్
4. **భారతీయ కర్మాగారాల చట్టం ప్రవేశపెట్టిన సంవత్సరం? (2)**
   1) 1861 2) 1881
   3) 1887 4) 1898
5. **దేశంలో మొదటి రైలు మార్గం ఎప్పుడు ప్రారంభమైంది? (1)**
   1) 1853 2) 1833
   3) 1857 4) 1861
6. **భారతదేశ మొదటి గవర్నర్ జనరల్ (3)**
   1) క్లైవ్ 2) లార్డ్ కానింగ్
   3) లార్డ్ విలియం బెంటిక్
   4) లార్డ్ లిట్టన్
7. **కింది ఏ ఒడంబడికలు ఆంగ్లేయులు, భారత రాజులు చేసుకున్నారు? (4)**
   1) అలహాబాద్ – షుజా ఉద్దౌలా
   2) పూణాసాల్బే – మరాఠాలు
   3) శ్రీరంగపట్నం – టిప్పు సుల్తాన్
   4) పైవన్నీ
8. **లార్డ్ రాబర్ట్ క్లైవ్ ఏ యుద్ధంలో సిరాజుద్దౌలాని ఓడించాడు? (1)**
   1) ప్లాసీ 2) బక్సార్
   3) ముంగర్ 4) వాండివాష్

సాసాల మల్లికార్జున్
అసిస్టెంట్ ప్రొఫెసర్
పెద్దపల్లి డిగ్రీ కాలేజీ
9492 575 006



# ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల మధ్య సంబంధం



- 19వ అధికరణ ద్వారా వ్యక్తి స్వేచ్ఛను పొందే సందర్భంలో ఏ వ్యక్తి అయినా నిర్బంధంలో ఉన్నట్లయితే ఆ వ్యక్తి ఆర్థిక పరిస్థితి సామాజికంగా వెనుకబడిన సందర్భంలో ఆదేశికసూత్రాల్లో పేర్కొన్న 39(ఎ) అధికరణ ద్వారా కల్పించే ఉచిత న్యాయ సేవా సహాయాన్ని పొందడం ద్వారా వ్యక్తి స్వేచ్ఛను కాపాడుకోవచ్చు.
- 21వ అధికరణ జీవించే హక్కును తెలుపుతుంది. వ్యక్తులు జీవించడానికి అవసరమైన కనీస అవసరాలను సమకూర్చుకోవాలంటే జీవనాధారంగా జీవనోపాధిని కల్పించాలి. ఆదేశిక సూత్రాల్లోని 41వ అధికరణ జీవనోపాధిని లేదా జీవనభృతిని కల్పించాలనే అంశం ఈ రెండింటికి మధ్యగల అవినాభావ సంబంధాన్ని తెలుపుతున్నది.
- 21వ అధికరణ జీవించే హక్కును తెలియజేస్తున్నందున ఆదేశిక సూత్రాల్లోని 48(ఎ) అధికరణలో పేర్కొన్న పర్యావరణ పరిరక్షణ అనే అంశం కాలుష్యరహితమైన వాతావరణం, స్వచ్ఛమైన తాగునీరు వంటి అంశాలు వ్యక్తి జీవించే హక్కుకు అంత్యంత అవశ్యకాలు.
- 46వ అధికరణను అనుసరించి రిజర్వేషన్లు అమలుపరిచేందుకు చేసే చట్టాలకు ప్రాథమిక హక్కుల్లోని 15(4), 15(5), 16(4) అధికరణల ద్వారా కల్పించిన సంరక్షణలను ఈ రెండింటికి మధ్యగల అవినాభావ సంబంధాన్ని తెలుపుతుంది.
- 46వ అధికరణను అనుసరించి సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడినవర్గాలకు కల్పించే రిజర్వేషన్లకు ప్రాథమిక హక్కుల్లోని 15(4), 15(5), 16(4) అధికరణలు సంరక్షణ కల్పిస్తున్నాయి.

**ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల మధ్య తేడాలు**

- ప్రాథమిక హక్కులను అమెరికా రాజ్యాంగం నుంచి గ్రహించారు. ఆదేశిక సూత్రాలను ఐర్లాండ్ రాజ్యాంగం నుంచి గ్రహించారు.
- ప్రాథమిక హక్కులు 3వ భాగంలో 12 నుంచి 35 వరకుగల అధికరణల్లో పేర్కొన్నారు. ఆదేశిక సూత్రాలు 4వ భాగంలో 36 నుంచి 51 వరకుగల అధికరణల్లో పేర్కొన్నారు.
- ప్రాథమిక హక్కులు వ్యక్తి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకు ఉద్దేశించినవి. అంటే వ్యక్తి ప్రాతిపదికన ఏర్పాటు చేశారు. ఆదేశిక సూత్రాలు సమాజ సమిష్టి ప్రయోజనాలకు ఉద్దేశించినవి. మొత్తం సమాజ ప్రతిపాదికన ఏర్పాటు చేశారు.
- ప్రాథమిక హక్కులు ప్రధానంగా నకారాత్మక దృక్పథం కలిగి ఉంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయకూడని పనులను తెలుపుతాయి. ఆదేశిక సూత్రాలు ప్రధానంగా సకారాత్మకమైనవి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయాల్సిన పనులను తెలియజేస్తాయి.
- ప్రాథమిక హక్కులను ఉన్నత న్యాయస్థానాలు సంరక్షిస్తాయి. ఆదేశిక సూత్రాల అమలు బాధ్యత ప్రభుత్వాలపై ఆధారపడి ఉంటుంది.
- ప్రాథమిక హక్కులు న్యాయ సంరక్షణ కలిగి ఉన్నాయి. ఆదేశిక సూత్రాలకు న్యాయ సంరక్షణ లేదు.
- ప్రాథమిక హక్కుల అమలు కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు చేయాల్సిన అవసరం లేదు. ఆదేశిక సూత్రాల అమలు కోసం ప్రభుత్వాలు తప్పనిసరిగా చట్టాలు చేయాలి.
- ప్రాథమిక హక్కులను జాతీయ అత్యవసర పరిస్థితి కాలంలో సస్పెండ్ చేయవచ్చు. ఆదేశిక సూత్రాలు ఎల్లప్పుడూ సుప్తచేతనావస్థలో ఉంటాయి.
- ప్రాథమిక హక్కులు రాజ్యాంగ లక్ష్యాలను సాధించడానికి ఇవి సాధనాలుగా ఉంటాయి. ఆదేశిక సూత్రాలు రాజ్యాంగ లక్ష్యాలను ఇవి తెలియజేస్తాయి.
- ప్రాథమిక హక్కులు సర్వకాలాలు, సర్వ వ్యవస్థలలో అందుబాటులో ఉంటాయి. ఆదేశిక సూత్రాలు ప్రభుత్వాల ఆర్థిక స్థోమతను అనుసరించి మాత్రమే అందుబాటులో ఉంటాయి.
- రాజ్యాంగ సవరణలు– సుప్రీంకోర్టు తీర్పులు
- ఆదేశిక సూత్రాల అమలు బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది. అందువల్ల వీటిని అమలుపర్చడంలో భాగంగా మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం 1950లో విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పిస్తూ చట్టాన్ని రూపొందించింది. చంపకం దొరై VS స్టేట్ ఆఫ్ మద్రాస్ మధ్య జరిగిన వ్యాజ్యంలో మొదట మద్రాస్ హైకోర్టు, ఆ తదనంతరం సుప్రీంకోర్టు రిజర్వేషన్ల చట్టం రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కు అయిన సమానత్వ హక్కుకు విరుద్ధంగా ఉండడంతో ఈ చట్టం చెల్లదని తీర్పునిచ్చింది.
- కామేశ్వర్ సింగ్ VS స్టేట్ ఆఫ్ బీహార్ మధ్య జరిగిన వ్యాజ్యంలో అదేవిధంగా బేలా బెనర్జీ VS స్టేట్ ఆఫ్ బెంగాల్ మధ్య జరిగిన వ్యాజ్యంలోనూ సుప్రీంకోర్టు తీర్పునిస్తూ వ్యక్తుల ప్రైవేటు ఆస్తులను స్వాధీనం చేసుకున్నప్పుడు చెల్లించే నష్టపరిహారం న్యాయబద్ధంగా ఉండాలని సుప్రీంకోర్టు పేర్కొన్నది.
- మొదట రాజ్యాంగ సవరణ ద్వారా ఆదేశిక సూత్రాల అమలు కోసం రూపొందించిన చట్టాలకు రక్షణ కల్పిస్తూ 15(4) అధికరణను, 31(ఏ), 31 (బీ) అధికరణలను భారతరాజ్యాంగంలో చేర్చారు.
- 4వ రాజ్యాంగం సవరణ: కామేశ్వర్ సింగ్ కేసులోనూ బేలాబెనర్జీ కేసులోనూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అధిగమించడం కోసం భారత పార్లమెంట్ 4వ రాజ్యాంగ సవరణను చేసింది. దీని ప్రకారం నష్ట పరిహారం విషయంలో ప్రభుత్వాలు చట్టబద్ధంగా నిర్ణయించిన అంశానికి న్యాయ సంరక్షణ కల్పిస్తూ 9వ షెడ్యూల్‌లో చేర్చారు.
- శంకరీ ప్రసాద్ VS యూనియన్ ఆఫ్ ఇండియా మధ్య జరిగిన వ్యాజ్యంలో భారత సుప్రీంకోర్టు తీర్పునిస్తూ మొదటి రాజ్యాంగ సవరణ ద్వారా భారత రాజ్యాంగంలో చేర్చిన రిజర్వేషన్ల సంరక్షణను, భూసంస్కరణ చట్టాలకు సంరక్షణ కల్పించడాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. అదేవిధంగా రాజ్యాంగంలో 13వ అధికరణ ప్రకారం సాధారణ చట్టాలను మాత్రమే న్యాయసమీక్షకు గురిచేస్తాము. 368వ అధికరణను అనుసరించి చేసిన రాజ్యాంగ సవరణలను న్యాయసమీక్షకు గురిచేసే అవకాశం లేదని సుప్రీంకోర్టు పేర్కొన్నది.
- సజ్జన్‌సింగ్VS స్టేట్ ఆఫ్ రాజస్థాన్ మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ 17వ రాజ్యాంగసవరణ ద్వారా భారత రాజ్యాంగంలో చేర్చిన అంశాల ప్రకారం వ్యక్తుల ఆస్తులను ప్రభుత్వాలు స్వాధీనం చేసుకున్నప్పుడు చెల్లించే నష్టపరిహారాలను చట్టబద్ధంగా నిర్ణయించిన వాటికి మాణ్యత ఉంటుందని వాటిని న్యాయస్థానాలు కొట్టివేయరాదని పేర్కొంటూ చేసిన సవరణ రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.
- 1967లో గోలక్‌నాథ్ కేసులో సుప్రీంకోర్టు ప్రాథమిక హక్కులకు ప్రాధాన్యమిస్తూ ఆదేశిక సూత్రాల అమలు కోసం ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంట్‌కు లేదని తీర్పు ఇచ్చింది.
- 1973లో కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు 24వ రాజ్యాంగ సవరణను సమర్థించింది. అంటే ఈ కేసులో సుప్రీంకోర్టు తీర్పు నిర్దేశిక నియమాల ప్రాధాన్యతను తెలియజేస్తుంది.
- 1980లో మినర్వామిల్స్ కేసులో సుప్రీంకోర్టు ప్రాథమిక హక్కులకూ ఆదేశిక సూత్రాలకూ మధ్య సమన్వయం కుదిర్చే ప్రయత్నం జరిగింది.

## ప్రతిభకు పరీక్ష

1. **ప్రపంచంలో ఎత్తయిన జలపాతాలు వరుసగా?**
   1) ఏంజెల్, తగేలా, కుకెనన్, సదర్‌లాండ్, తకాకావ్
   2) ఏంజెల్, సదర్‌లాండ్, తక్కావా, తగేలా, కుకెనన్
   3) సదర్‌లాండ్, తక్కావా, తగేలా, ఏంజెల్, కుకెనన్
   4) తకాకావ్, తగేలా, కుకెనన్, సదర్‌లాండ్, ఏంజెల్
2. **ప్రపంచంలో అతిపొడవైన నదులు వరుసగా?**
   1) అమెజాన్, మిసిసిపి–ముస్సోరి–రెడ్‌రాక్, నైలు
   2) నైలు, అమెజాన్, మిసిసిపి – ముస్సోరి– రెడ్‌రాక్
   3) మిసిసిపి–ముస్సోరి–రెడ్‌రాక్, అమెజాన్, నైలు
   4) అమెజాన్, నైలు, మిసిసిపి –ముస్సోరి–రెడ్‌రాక్
3. **బెర్లిన్ పట్టణం పక్కనుంచి ప్రవహించే నది?**
   1) స్ప్రీ 2) డాన్యూబ్ 3) నైలు 4) రైన్
4. **సమాన ఉష్ణోగ్రతలు తెలిపేవి?**
   1) ఐసోబార్స్ 2) ఐసోథర్మ్స్
   3) డోల్‌డ్రమ్స్ 4) ఐసోహైట్స్
5. **సమాన పీడనాలను కలుపుతూ గీసే రేఖలను ఏమంటారు?**
   1) ఐసోబార్స్ 2) ఐసోటోప్స్
   3) ఐసోనిఫ్ 4) ఐసోహైట్స్
6. **ప్రపంచంలో అతిపెద్ద మానవ నిర్మిత సరస్సు?**
   1) కరేబియా 2) ఓవెన్ ఫాల్స్
   3) హూవర్ 4) జెన్‌పిగ్

సమాధానాలు శుక్రవారం నిపుణలో...

11వ తేదీ ప్రశ్నలకు జవాబులు
1-2, 2-2, 3-2, 4-1, 5-1, 6-3


నాగచైతన్య

# నాగచైతన్య 'సవ్యసాచి'!



చందు మొండేటి

'ప్రేమమ్' సినిమాతో సక్సెస్‌ఫుల్ కాంబినేషన్‌గా పేరుతెచ్చుకున్న హీరో నాగచైతన్య, చందు మొండేటి కలయికలో మరో చిత్రం తెరకెక్కుతున్నది. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవి శంకర్, మోహన్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'సవ్యసాచి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ చిత్ర టైటిల్ లోగోను, ప్రీలుక్ పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. నిర్మాతలు మాట్లాడుతూ 'కథకు తగ్గ టైటిల్ 'సవ్యసాచి'. 'ప్రేమమ్' లాంటి సెన్సేషనల్ హిట్ తరువాత నాగచైతన్య, చందు మొండేటి కలయికలో వస్తున్న సినిమా కావడంతో ఈ చిత్రంపై అంచనాలున్నాయి. పూర్తిస్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాని తెరకెక్కిస్తున్నాం. సవ్యసాచి అంటే రెండు చేతుల్లో సమానమైన బలమున్నవాడని అర్థం. ఆ బలంతో హీరో తనకు ఎదురైన అవరోధాల్ని ఎలా అధిగమించాడనేది ఆసక్తికరంగా వుంటుంది. ఈ పాత్రను నాగచైతన్య ఛాలెంజింగ్‌గా భావిస్తున్నారు. ఆయన పాత్ర చిత్రణ, నటన ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరిచే స్థాయిలో వుంటుంది. నాగచైతన్యపై వచ్చే పోరాట ఘట్టాలు చిత్రానికి హైలైట్‌గా నిలుస్తాయి. సెప్టెంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్న ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాల్ని త్వరలో తెలియజేస్తాం' అన్నారు.


సురేందర్‌రెడ్డి, చిరంజీవి, సురేఖ, రామ్‌చరణ్

# 'ఉయ్యాలవాడ...' మొదలైంది

పదేళ్ల విరామం అనంతరం 'ఖైదీనంబర్ 150' చిత్రంతో చిరంజీవి మరోసారి కథానాయకుడిగా ప్రేక్షకులముందుకొచ్చారు. ఈ సినిమా అనూహ్య విజయాన్ని సాధించడంతో రెట్టించిన ఉత్సాహంతో వున్న ఆయన తన 151వ చిత్రానికి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత కథాంశాన్ని ఎంచుకున్నారు. ఈ చిత్రానికి సురేందర్‌రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. కొణిదెల ప్రొడక్షన్స్ పతాకంపై రామ్‌చరణ్ నిర్మించనున్న ఈ సినిమా బుధవారం లాంఛనంగా ప్రారంభమైంది. చిరంజీవి దంపతులతో పాటు రామ్‌చరణ్, చిత్ర దర్శకుడు సురేందర్‌రెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్క్రిప్ట్‌ని దర్శకుడికి నిర్మాత అల్లు అరవింద్, పరుచూరి బ్రదర్స్ సంయుక్తంగా అందజేశారు. అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కనున్న ఈ చిత్రంలో చిరంజీవి సరసన నయనతార కథానాయికగా నటించనున్నట్లు సమాచారం. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 22న టైటిల్ లోగోతో పాటు మోషన్ పోస్టర్‌ను విడుదల చేయడానికి చిత్ర వర్గాలు సన్నాహాలు చేస్తున్నాయి. చారిత్రక వీరుడిగా చిరంజీవి పాత్ర చిత్రణ భిన్న పార్శ్వాల్లో సాగనుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. దాదాపు 150 కోట్ల బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారని సమాచారం.


వల్లభ, సాయిధరమ్‌తేజ్, కరుణాకరన్, డార్లింగ్ స్వామి, కె.ఎస్.రామారావు

# ఆ మాటను నిలబెట్టుకుంటాను!

పవిత్రమైన, నిజాయితీతో కూడిన ప్రేమకథలతో దర్శకుడు కరుణాకరన్ సినిమాలు చేస్తుంటారు. మరోసారి తన పంథాలోనే సంగీతభరిత ప్రేమకథతో ఆయన రూపొందిస్తున్న చిత్రమిది' అని అన్నారు కె.ఎస్.రామారావు. క్రియేటివ్ కమర్షియల్స్ పతాకంపై కె.ఏ. వల్లభతో కలిసి ఆయన నిర్మిస్తున్న తాజా చిత్రం బుధవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా మొదలైంది. సాయిధరమ్‌తేజ్, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటిస్తున్నారు. ఏ. కరుణాకరన్ దర్శకుడు. ఈ సందర్భంగా నిర్మాత కె.ఎస్.రామారావు మాట్లాడుతూ ' మా సంస్థ నుంచి వస్తున్న 45వ చిత్రమిది. నవతరంతో పనిచేస్తున్నాననే భావన నాలో కొత్త ఉత్సాహాన్ని కలిగిస్తున్నది. 'వాసు' తర్వాత మా సంస్థలో కరుణాకరన్ దర్శకత్వంలో చేస్తున్న మరో చిత్రమిది. ఇప్పటికే సంగీత దర్శకుడు గోపీసుందర్ రెండు చక్కటి పాటలను స్వరపరిచారు. కథతో పాటు నాపై ఉన్న నమ్మకంతో సాయిధరమ్‌తేజ్ ఈ సినిమాను తెరకెక్కించే బాధ్యతను నాకు అప్పగించారు. అతడితో సినిమా అంటే నా కుటుంబ సభ్యుల్లో ఒకరితో సినిమా చేస్తున్న అనుభూతి కలుగుతుంది. ఈ సినిమాతో పెద్ద విజయాన్ని ఇస్తానని అతడికి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటాను. మంచి టీమ్ కలయికలో రూపొందుతున్న ఈ చిత్రం మా సంస్థలో మరో పెద్ద విజయంగా నిలుస్తుందనే నమ్మకముంది. డార్లింగ్‌స్వామి సంభాషణలు, ఆండ్రూ సినిమాటోగ్రఫీ సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తాయి. విజయదశమి నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. వచ్చే ఏడాది మార్చి వరకు చిత్రీకరణ జరుపుతాం. ఏప్రిల్ లేదా మే నెలలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు. రొమాన్స్, కుటుంబ బంధాలు, వినోదం మిళితంగా ఉండే అందమైన ప్రేమకథా చిత్రమిదని, తన కంటే తాను రూపొందించే సినిమానే ఎక్కువగా మాట్లాడుతుందని కరుణాకరన్ చెప్పారు. సాయిధరమ్‌తేజ్ మాట్లాడుతూ 'నిర్మాత కె.ఎస్.రామారావుతో సినిమా చేయాలని ఏడాది నుంచి అనుకుంటున్నాను. కానీ మంచి కథ దొరకలేదు. ఏ కథ ఎవరి కోసం అనేది ముందే రాసిపెట్టుంటుందని చెబుతుంటారు. అలా కరుణాకరన్ సిద్ధం చేసిన కథ నన్ను వెతుక్కుంటూ వచ్చింది. తెలుగులో ఎన్నో గొప్ప సినిమాల్ని నిర్మించిన కె.ఎస్.రామారావుతో సినిమా చేయడం ఆనందంగా ఉంది. మంచి సినిమాగా నిలుస్తుంది' అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: గోపీసుందర్, సినిమాటోగ్రఫీ: ఐ.ఆండ్రూ, ఎడిటింగ్: ఎస్.ఆర్. శేఖర్, సంభాషణలు: డార్లింగ్ స్వామి, నిర్మాతలు: కె.ఎస్.రామారావు, కె.ఏ.వల్లభ.

# మేడమీద అబ్బాయి కలలు


నరేష్, నిఖిల విమల్

'దర్శకుడిగా తన పేరును వెండితెరపై చూసుకోవాలన్నది మేడమీద అబ్బాయి ఆశయం. రామ్‌చరణ్, ప్రభాస్‌లలో ఒకరికి కథ చెప్పి ఒప్పించి పేరు, డబ్బు సంపాదించి జీవితంలో స్థిరపడాలని కలలు కంటుంటాడు. మేడమీద అబ్బాయి కలలు నెరవేరాయా? అందమైన అమ్మాయి పరిచయంతో అతడి జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది? అనేది తెలియాలంటే మా సినిమా చూడాల్సిందే' అంటున్నారు అల్లరి నరేష్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మేడమీద అబ్బాయి'. జాహ్నవి ఫిల్మ్స్ పతాకంపై బొప్పన చంద్రశేఖర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జి. ప్రజిత్ దర్శకుడు. నిఖిల విమల్ కథానాయిక. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు తుది దశకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్ చిత్రమిది. రొటీన్‌కు భిన్నమైన కథ, కథనాలతో సరికొత్త పంథాలో సాగుతుంది. గమ్యం, శంభోశివశంభో తర్వాత సున్నితమైన కథతో నరేష్ చేస్తున్న వైవిధ్యమైన ప్రయత్నమిది. ఆయన శైలి కామెడీతో ఆద్యంతం థ్రిల్‌ను కలిగిస్తుంది. త్వరలో పాటలను, సెప్టెంబర్ మొదటివారంలో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు. అవసరాల శ్రీనివాస్, జయప్రకాష్, తులసి, సత్యం రాజేష్, జబర్దస్త్ ఆది ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఉన్ని ఎస్. కుమార్, సంగీతం: షాన్ రెహమాన్, ఆర్ట్: రాజీవ్‌నాయర్, ఎడిటర్: నందమూరి హరి, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: ఎం.ఎస్.కుమార్. సమర్పణ: శ్రీమతి నీలిమ.


ఆర్.కె.గౌడ్, కవిత, షెరాజ్

# హారర్ థ్రిల్లర్ 'షాలిని'

స్వర్ణ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం 'షాలిని'. ఆమోగ్ దేశపతి, అర్చన, శ్రేయవ్యాస్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. షెరాజ్ దర్శకుడు. పి.వి.సత్యనారాయణ నిర్మాత. ఇటీవల హైదరాబాద్‌లో చిత్ర ప్లాటినమ్ డిస్క్ వేడుకను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ప్రతాని రామకృష్ణగౌడ్, సినీ నటి కవిత చిత్ర యూనిట్ సభ్యులకు ప్లాటినమ్ డిస్క్ జ్ఞాపికల్ని అందజేశారు. చిత్ర సమర్పకుడు సాయివెంకట్ మాట్లాడుతూ 'హారర్ చిత్రమిది. ప్రతి క్షణం ఉత్కంఠను కలిగిస్తుంది. హారర్ ఎక్కువగా వుండటంతో సెన్సార్‌వారు 'ఎ' సర్టిఫికెట్ జారీ చేశారు' అన్నారు. సినిమా విడుదలలో తనవంతు సహాయసహకారాలు అందజేస్తానని రామకృష్ణగౌడ్ పేర్కొన్నారు. సస్పెన్స్, థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఆసక్తిగా సాగే చిత్రమని దర్శకుడు చెప్పారు.



# నీడను పోగొట్టుకుంటే...


ఆనంద్‌రవి, కోమలి

ఆనంద్‌రవి కథానాయకుడిగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'నెపోలియన్'. భోగేంద్రగుప్త నిర్మాత. కోమలి కథానాయిక. ఈ సినిమా ప్రచార చిత్రాన్ని బుధవారం హైదరాబాద్‌లో నిర్మాత దామోదర్‌ప్రసాద్, హీరో సందీప్‌కిషన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సందీప్‌కిషన్ మాట్లాడుతూ 'ఆనంద్‌రవితో పన్నెండేళ్లుగా పరిచయముంది. అవకాశాల కోసం ఎదురుచూస్తున్న రోజుల్లో 'హ్యాపీడేస్' సినిమా కోసం తొలిసారి నన్ను ఆడిషన్ చేశారాయన. అతను ఇప్పటివరకూ చేసిన సినిమాల్లోకెల్లా అద్భుతమైన కథాంశమిది' అని తెలిపారు. ఆనంద్‌రవి మాట్లాడుతూ 'ఎలాంటి అధికారం లేని ఓ సాధారణ వ్యక్తి కథ ఇది. సెటైరికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నాం. సాధారణంగా తన పర్సు పోయిందని, విలువైన వస్తువేదో పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేయడం చూస్తుంటాం. కానీ తన నీడ పోయిందని ఓ వ్యక్తి పోలీస్ స్టేషన్ గడప తొక్కుతాడు. ఆ తర్వాత జరిగే పరిణామాల నేపథ్యంలో ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. సెప్టెంబర్‌లో విడుదలచేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేదార్‌శంకర్, కోమలి, సిద్దార్థ్ సదాశివుని, లక్ష్మీభూపాల్ తదితరులు పాల్గొన్నారు.


కావ్యాసింగ్

# రావోయి మా ఇంటికి

శ్రీధర్, కావ్యాసింగ్, అవంతిక ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రావోయి మా ఇంటికి'. సాకేత్‌సాయిరామ్ దర్శకత్వం వహిస్తున్నారు. డాలీభట్ నిర్మాత. సాకేత్ సాయిరామ్ స్వరాలను సమకూర్చిన ఈ చిత్ర గీతాలను ఇటీవల హైదరాబాద్‌లో దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఆవిష్కరించారు. తొలి ప్రతిని దర్శకుడు రేలంగి నరసింహారావు స్వీకరించారు. దర్శకుడు మాట్లాడుతూ 'కామెడీ థ్రిల్లర్ చిత్రమిది. కథే ఈ సినిమాకు హీరో. ప్రతి సన్నివేశం సరదాగా సాగుతూనే ఉత్కంఠను కలిగిస్తుంది. ఐదు పాటలు అద్భుతంగా కుదిరాయి' అని చెప్పారు. రొటీన్‌కు భిన్నంగా సాగే వినోదభరిత చిత్రమిదని నిర్మాత తెలిపారు.

## ఖైరతాబాద్ గణపయ్యకు
# పోచంపల్లి కండువా

### మగ్గంపై నేస్తున్న చేనేత కళాకారులు

**భూదాన్‌పోచంపల్లి:** హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో ప్రతిష్ఠించే మహాగణపతి మెడలో అలంకరించే కండువాను పోచంపల్లికి చెందిన చేనేత కళాకారులు తయారు చేస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం కనుముక్కుల గ్రామంలోని పోచంపల్లి హ్యాండ్లూం పార్క్‌లో మగ్గంపై నేసిన కండువాను ఉత్సవ కమిటీకి అందజేయనున్నారు. మూడేండ్లుగా హ్యాండ్లూం పార్క్ యాజమాన్యం మహా గణపయ్యకు ప్రత్యేకంగా కండువాను తయారు చేయించి వినాయక చవితి పర్వదినాన సమర్పిస్తున్నారు. ఈ ఏడాది కూడా భారీ కండువాను నేస్తున్నారు. ఈసారి ఖైరతాబాద్‌లో మహాకాళ సదాశివుడు, మహిశాసురమర్ధినితో కలిసి 63 అడుగుల ఎత్తయిన శ్రీ చండీకుమార అనంత మహాగణపతి కొలువు దీరనున్నాడు. దీనికి తగ్గట్టుగా చేనేత కార్మికులు 25 మీటర్ల పొడువైన కండువాను సిద్ధం చేస్తున్నారు. చందనం రంగులో ఉండే కండువాపై సనాతన ధర్మ విశిష్టత ప్రతిబింబించేలా గులాబీ రంగులో మహాశివలింగం, ఢమరుకం, తామర పుష్పం, ఓంకారం, స్వస్తిక్, పూర్ణకుంభం, గణపతి లడ్డూ చిత్రాలు, హ్యాండ్లూం పార్క్ లోగో పీహెచ్‌పీ అక్షరాలు కనిపించేలా రూపొందిస్తున్నారు.



పోచంపల్లి హ్యాండ్లూం పార్క్‌లో తయారవుతున్న ఖైరతాబాద్ మహాగణపతి కండువా

## హైదరాబాద్ కలెక్టర్‌గా యోగితారాణా



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ యోగితారాణాను నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2003 బ్యాచ్‌కు చెందిన యోగితారాణాను నిజామాబాద్ జిల్లా కలెక్టర్ నుంచి హైదరాబాద్ కలెక్టర్‌గా బదిలీ చేశారు. హైదరాబాద్ కలెక్టర్ రాహుల్ బొజ్జా ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లడంతో ఆ బాధ్యతలను తాత్కాలికంగా జాయింట్ కలెక్టర్ ప్రశాంతి నిర్వర్తిస్తూ వచ్చారు. యోగితారాణా జమ్ముకశ్మీర్‌లో పుట్టి అక్కడే ఎంబీబీఎస్ పూర్తి చేశారు. పూర్తిస్థాయి కలెక్టర్ నియామకంతో హైదరాబాద్ జిల్లా పాలనలో పనులు మరింత వేగవంతం కానున్నాయి.

## నేటి నుంచి ఓయూలో న్యాక్ బృందం పర్యటన

**ఉస్మానియా యూనివర్సిటీ:** దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ఉన్నత విద్యాసంస్థలకు గ్రేడింగ్ ఇచ్చే న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) బృందం గురువారం నుంచి ఉస్మానియా యూనివర్సిటీలో పర్యటించనున్నది. ఈ బృందం మూడు రోజులపాటు వర్సిటీలో అన్ని అంశాలను పరిశీలించి, నివేదికను న్యాక్‌కు సమర్పిస్తుంది. ఆ నివేదిక ఆధారంగా వర్సిటీకి న్యాక్ తగిన గుర్తింపును అందజేస్తుంది. న్యాక్‌లో ఉత్తమ గ్రేడ్ సాధించడం ద్వారా కేంద్రం నుంచి అధిక నిధులు పొందే అవకాశం లభిస్తుంది. దాంతోపాటు వర్సిటీలో చదివే విద్యార్థులకు కూడా ప్రయోజనం చేకూరుతుంది.



మెహిదీపట్నం పిల్లర్ నంబర్ 28 వద్ద సంఘటనా స్థలంలో మృతుల బంధువుల ఆందోళన

# ప్రాణాలు తీసిన ప్రహరీ

- మెహిదీపట్నంలో గోడ కూలి ఇద్దరి దుర్మరణం
- తాము చనిపోతూ యువకుడి ప్రాణం కాపాడిన కూలీలు
- ఏడు గంటలపాటు బాధితుల ఆందోళన
- నష్టపరిహారం చెల్లింపునకు బిల్డర్ అంగీకారం



కృష్ణయ్య నాగేశ్ (ఫైల్ ఫొటోలు)

**మెహిదీపట్నం:**

పొట్టకూటికోసం పట్నం వచ్చిన ఇద్దరు కూలీల ప్రాణాలను ప్రహరీ మింగేసింది. గోడ కూలడంతో ఇద్దరు కూలీలు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ హృదయ విదారక ఘటన నగరంలోని ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మెహిదీపట్నంలో బుధవారం ఉదయం జరిగింది. మెహిదీపట్నం పిల్లర్ నంబర్ 28 వద్ద గోల్కొండ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తున్నాడు. జీ ప్లస్ 2 అనుమతులు తీసుకొని అక్రమంగా ఆరు అంతస్తులు నిర్మిస్తున్నాడు. బుధవారం మెహిదీపట్నం భోజగుట్ట వివేకానందనగర్‌కు చెందిన నాగేశ్(37), కృష్ణయ్య(41), శివకుమార్(18) పనులు చేసేందుకు వచ్చారు. కింద ఉన్న ఇనుప రాడ్‌లను భవనంలోకి చేరవేస్తున్నారు. ఈ క్రమంలో భవనం పక్కనే ఉన్న మరో భవనం ప్రహరీ కూలి వీరి మీద పడింది. గోడ కూలుతున్న విషయాన్ని శివ గుర్తించి అరుస్తూ మిగితా ఇద్దరినీ అప్రమత్తం చేసినా ఫలితం లేకుండా పోయింది. తప్పించుకోవడానికి అవకాశం లేకపోవడంతో వారు శివను పక్కకు తోసేయడంతో అతడు ప్రాణాలతో బయటపడ్డాడు. గోడ శిథిలాలు పైన పడడంతో నాగేశ్, కృష్ణయ్య అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న బంధువులు అక్కడికి చేరుకొని కన్నీరు మున్నీరుగా రోదించారు.

**ఏడు గంటలపాటు ఆందోళన**

కర్ణాటక రాష్ట్రం యాద్గిర్ తాలూకా వాడ్ కోట్‌కు చెందిన జీ నాగేశ్ భార్య కవిత, బిడ్డలు మమత(7), నిహారిక(3), కొడుకు కార్తీక్(5)తో కలిసి మెహిదీపట్నం భోజగుట్ట వివేకానందనగర్‌లో నివసిస్తున్నారు. అతడి ఇంటి సమీపంలోనే మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట్ మండలం బూర్కుంటకు చెందిన కృష్ణయ్య(41) భార్య అమృత, కొడుకు సంజు(10), బిడ్డ లక్ష్మి(7)తో కలిసి నివాసం ఉంటున్నారు. వీరు రోజువారి కూలీలుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం నాగేశ్ మామ సాయిలు మెహిదీపట్నం పిల్లర్ నంబర్ 28 వద్ద నిర్మాణంలో ఉన్న భవనంలో పని కోసం వెళ్లాలని నాగేశ్, కృష్ణయ్య, శివకుమార్‌ను పంపాడు. పనికి వెళ్లిన కొద్ది సేపటికే ఘోర ప్రమాదం జరిగింది. సంఘటనా స్థలానికి చేరుకున్న సాయిలు.. వారిని తానే పనికి పంపానంటూ గుండెలు అవిసేలా రోదించడం ప్రతి ఒక్కరినీ కలిచి వేసింది. పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు, రాజకీయ నాయకులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు మృతదేహాలను వెలికి తీసి, పోస్ట్‌మార్టం కోసం తరలించేందుకు ప్రయత్నించగా బాధితులు, బస్తీవాసులు అడ్డుకున్నారు. తమకు న్యాయం జరిగేవరకు మృతదేహాలను కదులనిచ్చేది లేదంటూ ఆందోళనకు దిగారు. దీంతో ఏడు గంటలపాటు మృతదేహాలు సంఘటనా స్థలంలోనే ఉండిపోయాయి. పలుమార్లు చర్చల అనంతరం మృతుల కుటుంబాలకు రూ.6.5 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించేందుకు బిల్డర్ పాషా అంగీకరించడంతో ఆందోళన విరమించారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ రంగ కార్మికుల కోసం ప్రవేశ పెట్టిన స్కీంలో నాగేశ్, కృష్ణయ్య ఉండడంతో నిబంధనల ప్రకారం ఒక్కో కుటుంబానికి రూ.6 లక్షల బీమా, దహన సంస్కారాల నిమిత్తం రూ.30 వేలు అందిస్తామని కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. భవనానికి జీ ప్లస్ 2 అనుమతులు మాత్రమే ఉండగా ఆరు అంతస్తులను నిర్మించారని తేలిందని, ఈ విషయమై నోటీసులు జారీ చేసినట్టు సెక్షన్ ఆఫీసర్ మహేందర్ తెలిపారు. నిర్మాణదారుపై చర్యలు తీసుకుంటామని సెంట్రల్ జోన్ జోనల్ కమిషనర్ రఘు ప్రసాద్, టౌన్ ప్లానింగ్ సిటీ చీఫ్ ప్లానర్ వసంత్‌రావు, ఆసిఫ్‌నగర్ ఏసీపీ గౌస్‌మొయినుద్దీన్ తెలిపారు.

# కళానికేతన్ కేసులో 'కాస్మోస్'కు లింకు?

- పార్ట్‌నర్‌షిప్ పేరుతో మిత్రుడి ఆస్తులు తనఖా పెట్టించిన లీలాకుమార్
- కాస్మోస్ బ్యాంకుకు రూ.60 కోట్లు టోకరా
- బ్యాంకు సిబ్బంది పాత్రపై అనుమానం.. నోటీసులు జారీచేసిన పోలీసులు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** కుట్రపూరితంగా బ్యాంకుల నుంచి అప్పులు తీసుకొని ఎగ్గొట్టేస్తున్న వారిపై సీసీఎస్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ మోసాల్లో బ్యాంకు సిబ్బంది, అధికారుల ప్రమేయంపైనా పోలీస్ అధికారులు దృష్టి పెడుతున్నారు. తాజాగా ఓ బ్యాంకుకు సీసీఎస్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. చీటింగ్ కేసులో అరెస్టయిన కళానికేతన్ టెక్స్‌టైల్స్ అండ్ జ్యువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ వీ లీలాకుమార్‌కు సంబంధించిన కేసుల్లో విచారణ వేగవంతం చేశారు. లీలాకుమార్ గతంలో వ్యాపారం కోసం పలువురి నుంచి పెట్టుబడులు తీసుకొని మోసం చేసిన కేసులో అరెస్టయ్యారు. ఆ తర్వాత తన వ్యాపారం విస్తరిస్తున్నానని చెప్పి బ్యాంక్ లోన్ కోసం ఓ వ్యక్తి నుంచి సహాయం పొంది.. తీరా రుణం తీసుకున్న తర్వాత ఆ వ్యక్తిని నిండా ముంచేసిన కేసు వెలుగులోకి వచ్చింది. వెంకటేశ్వర రవి ప్రసాద్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీసీఎస్ పోలీసులు లీలాకుమార్‌పై కేసు నమోదు చేశారు. ఈ కేసులో బ్యాంకు అధికారుల పాత్రపైనా ఆరా తీస్తున్నారు. హైదరాబాద్‌లోని కాస్మోస్ బ్యాంకుకు నోటీసులు జారీ చేశారు.

**నమ్మించి మోసం చేశాడు**

తెలంగాణ, ఏపీ, తమిళనాడులో మరిన్ని కళానికేతన్ శాఖలను ప్రారంభించాలని లీలాకుమార్ ప్లాన్ చేసుకున్నాడు. వ్యాపారాన్ని విస్తరించేందుకు కాస్మోస్ బ్యాంకు నుంచి అప్పు తీసుకోవాలని ప్రయత్నించాడు. అయితే బ్యాంకులో అప్పు తీసుకొనేందుకు తాకట్టుగా ఆస్తి చూపాల్సి ఉంటుంది. దీనికోసం లీలాకుమార్.. వెంకటేశ్వర రవిప్రసాద్ అనే వ్యక్తిని కలిశాడు. తాను వ్యాపారాన్ని విస్తరిస్తున్నాని, అప్పు ఇచ్చేందుకు బ్యాంకు సిద్ధంగా ఉన్నదని చెప్పాడు. ష్యూరిటీగా కొంత ఆస్తి పెడితే లోన్ వచ్చేస్తుందని అతడిని నమ్మించాడు. బ్యాంకులో ఆస్తిని మార్ట్‌గేజ్ చేస్తే తన ఆదాయంలో 3 శాతం వాటా, ఇతర లాభాలు ఇస్తానని, బిజినెస్ పార్ట్‌నర్‌గా చూసుకుంటానంటూ నమ్మబలికాడు. అతడి మాటలు నమ్మిన రవిప్రసాద్ తనకు కర్నూలు ప్రాంతంలో ఉన్న రూ.35 కోట్ల ఆస్తులను కాస్మోస్ బ్యాంకులో తనఖా పెట్టాడు. దీంతో బ్యాంకు లోన్ ప్రక్రియ పూర్తయి, లీలాకుమార్‌కు రూ.60 కోట్ల రుణం మంజూరయ్యింది. రుణం పొందిన తర్వాత లీలాకుమార్ 21 కొత్త షోరూంలను ప్రారంభించాడు. అనంతరం ఒక పథకం ప్రకారం రవిప్రసాద్‌కు తెలియకుండా ఆయా షోరూంలలోని రూ.68 కోట్ల విలువైన ఆస్తులను విక్రయించేశాడు. లీలాకుమార్ చేసిన మోసంపై రవిప్రసాద్ సీసీఎస్ పోలీసులను ఆశ్రయించారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు లీలాకుమార్‌ను అరెస్ట్ చేశారు. షోరూంలలోని ఆస్తులను ఎలా విక్రయించాడనే విషయంపై పోలీసులు ఆరా తీశారు. లీలాకుమార్ షోరూంలలోని ఆస్తులను విక్రయిస్తున్నట్టు బ్యాంకు అధికారులకు తెలిసినా పట్టించుకోలేదని గుర్తించారు. రూ.60 కోట్లు రుణం తీసుకొని ప్రారంభించిన షోరూంల విక్రయం జరుగుతున్నా ఎందుకు అడ్డుకునే ప్రయత్నం చేయలేదో తెలుసుకొనేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. లీలాకుమార్ పన్నిన కుట్రలో బ్యాంకు అధికారుల పాత్ర ఉండే అవకాశం ఉన్నదని అనుమానిస్తున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని కాస్మోస్ బ్యాంకుకు నోటీసులు జారీ చేశారు. దర్యాప్తు పూర్తయితే ఈ కుంభకోణంలో బ్యాంకు అధికారుల పాత్ర తేలనున్నది.

# గాంధీలో బాలుడికి పునర్జన్మ

### శ్వాసకోశ నాళానికి అరుదైన శస్త్రచికిత్స చేసిన డాక్టర్లు
### చేతులెత్తేసిన ప్రైవేట్ దవాఖాన వైద్యులు.. మంత్రి జోగు రామన్న సహకారంతో గాంధీలో చేరిక
### ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన కుటుంబసభ్యులు



గాంధీ దవాఖానలో శ్రీకాంత్‌కు చేసిన అరుదైన ఆపరేషన్ వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

**బన్సీలాల్‌పేట:** శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడంతో ఓ బాలుడు మూడు నెలలు నరకం అనుభవించాడు. ప్రైవేట్ దవాఖానకు వెళ్తే శ్వాస నాలంలో గడ్డ ఉన్నదని, తొలిగించడానికి రూ.4 లక్షలు ఖర్చు అవుతాయని చెప్పారు. అయినా బతుకుతాడని గ్యారెంటీ ఇవ్వలేమన్నారు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచక నిరుపేద తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. అలాంటి స్థితిలో ఉన్న బాలుడికి గాంధీ దవాఖాన వైద్యులు అరుదైన ఆపరేషన్ నిర్వహించి పునర్జన్మ ప్రసాదించారు. ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్, సిటీ సర్జరీ విభాగం హెడ్ ప్రొఫెసర్ జీ రవీందర్, అనస్థీషియా విభాగం హెడ్ డాక్టర్ సురేశ్ చంద్ర కలిసి బుధవారం మీడియాకు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం పరిడి-బి గ్రామానికి చెందిన అంకోథ్ సంతోష్, రమ దంపతుల కుమారుడు శ్రీకాంత్ (16) ఇంటర్ చదువుతున్నాడు. మూడు నెలల కిందట దగ్గు, దమ్ము రావడంతో ఆదిలాబాద్‌లోని రిమ్స్ దవాఖానలో చూపించగా.. హైదరాబాద్ గాంధీ దవాఖానలోనే సరైన చికిత్స లభిస్తుందని సూచించారు. పేదరికం.. కేవలం దగ్గు, దమ్ము కారణంతో 320 కిలోమీటర్లు ప్రయాణించి హైదరాబాద్ రావడం ఇష్టం లేని తల్లిదండ్రులు మహారాష్ట్ర యావత్‌మల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. రూ.15 వేలు ఖర్చు చేసినా తగ్గలేదు. దీంతో మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు వెళ్లి మరో ప్రైవేట్ దవాఖానలో చూపించారు. సీటీస్కాన్ చేయించగా.. ఊపిరితిత్తుల నుంచి గాలిని తీసుకెళ్తున్న శ్వాసకోశనాళం మధ్యలో గడ్డ ఏర్పడిందని, ఈ కారణంగానే బాలుడికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉందని చెప్పారు. గడ్డ తొలిగించాలంటే రూ.4లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పారు. ఆపరేషన్ తర్వాత బాలుడు బతుకుతాడని కచ్చితంగా చెప్పలేమన్నారు. మారుమూల గ్రామంలో వ్యవసాయం చేసుకొని జీవిస్తున్న వారు అంత డబ్బు చెల్లించలేక, తమ కుమారుడు కండ్ల ముందే బాధపడుతుంటే చూడలేక ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. వారి ఆవేదనను చూసిన బాలుడి మేనమామ మంచాల మధుకర్, తాత మంచాల గంభీర్ కలిసి జిల్లాకు చెందిన అటవీశాఖ మంత్రి జోగు రామన్నను కలిశారు. శ్రీకాంత్ అనారోగ్య సమస్యను వివరించారు. స్పందించిన మంత్రి జోగు రామన్న వెంటనే గాంధీ దవాఖానకు తీసుకెళ్లాలని సూచించి, దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తన కుమారుడు జోగు మహేందర్‌ను వెంట ఇచ్చి ఆగస్టు 1వ తేదీన గాంధీ దవాఖానకు పంపించారు. శ్రీకాంత్ ఆరోగ్య సమస్యను పరిశీలించిన డాక్టర్ జీ రవీందర్, డాక్టర్ సురేశ్ చంద్ర పరిస్థితి తీవ్రత దృష్ట్యా అదేరోజు సాయంత్రం శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. సాయంత్రం 6:30 గంటల నుంచి తెల్లవారుజామున 2 గంటల వరకు ఆపరేషన్ చేసి విజయవంతం అయ్యారు. గతంలో ఇలాంటి క్లిష్టమైన ఆపరేషన్ చేయలేదని, సిబ్బంది సహకారంతో శ్వాసకోశ నాళం మధ్యలో ఉన్న గడ్డ (ట్యూమర్)ను తొలిగించామని చెప్పారు. శ్రీకాంత్ ఇప్పుడు సాధారణ స్థితికి చేరుకున్నాడని వైద్యులు వెల్లడించారు. ఈ మీడియా సమావేశంలో సిటీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ అరుణ్ కానాల, డాక్టర్ సర్తాజ్, అనస్థీషియా విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భాను లక్ష్మి, పీజీ విద్యార్థి డాక్టర్ బెనెడిక్టా తదితరులు పాల్గొన్నారు. శ్రీకాంత్ ప్రాణం నిలబెట్టిన వైద్యులకు ఎప్పుడూ రుణపడి ఉంటామని అతడి తండ్రి సంతోష్, మేనమామ మధుకర్ పేర్కొన్నారు. తమకు సహకారం అందించిన మంత్రి జోగు రామన్న, ఆయన కుమారుడు జోగు మహేందర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



చిన్నారిని ఐసీడీఎస్ సీడీపీవోకు అప్పగిస్తున్న గణేశ్ దంపతులు

## ఆడపిల్లను సాకలేమని..

### ఐసీడీఎస్ అధికారులకు అప్పగించిన తల్లిదండ్రులు

**ఇబ్రహీంపట్నం రూరల్:** ఆడపిల్లను సాకలేమని తల్లిదండ్రులు ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల పరిధిలోని ముచ్చర్లకుంటతండాకు చెందిన ఉదావత్ బోడి గణేశ్ దంపతులకు ఇప్పటికే నలుగురు ఆడపిల్లలు ఉండగా, ఐదో కాన్పులోనూ ఆడశిశువు జన్మించింది. దీంతో భారంగా భావించిన చిన్నారి తల్లిదండ్రులు బుధవారం అంగన్‌వాడీ కార్యకర్త, మండల సూపర్‌వైజర్ ద్వారా ఇబ్రహీంపట్నం సీడీపీవో శాంతిశ్రీని కలిశారు. దంపతులకు సీడీపీవో కౌన్సెలింగ్ ఇచ్చినప్పటికీ, ఉన్న పిల్లలనే సాకలేకపోతున్నామని, ఈ ఐదో ఆడబిడ్డను సాకడం తమ వల్ల కాదని చెప్పారు. దీంతో ఆ పసిగుడ్డును శిశువిహార్‌కు తరలించినట్టు సీడీపీవో తెలిపారు.

## భవనం పైనుంచి పడి కూలీ మృతి

**చందానగర్, నమస్తే తెలంగాణ:** నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం పైనుంచి కింద పడి ఓ కూలి మృతిచెందిన ఘటన హైదరాబాద్ చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన దేబేంద్ర నామసుద్ర(24) నల్లగండ్ల అపర్ణ హిల్‌పార్క్‌లో కొత్తగా కడుతున్న బహుళ అంతస్తుల భవనంలో కూలీగా పనిచేస్తున్నాడు. ఏడో అంతస్తులో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు దర్యాప్తు చేస్తున్నారు.

# లింగోజుగూడలో జైళ్ల శాఖ పెట్రోల్ బంక్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జైళ్లశాఖ ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మరో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో నగరంలో పెట్రోల్ బంక్‌ల సంఖ్య ఆరుకు చేరనున్నది. శిక్ష పూర్తి చేసుకొని విడుదలైన వంద మందికి వీటిలో ఉపాధి కూడా దక్కింది. ఒకపక్క సంస్కరణలు, మరోపక్క ఖైదీల పరివర్తనలో మార్పు, విద్యాదానం, ఉన్నతి వంటి కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్న జైళ్లశాఖ.. మరోపక్క ఆదాయం దిశగా కూడా అడుగులు వేస్తున్నది. ఇందుకు పెట్రోల్ బంక్‌లు, పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించింది. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చంచల్‌గూడ, చర్లపల్లి కేంద్ర కారాగారాల పరిధిలో ఐదు పెట్రోల్ బంక్‌లు పని చేస్తున్నాయి. ఈ బంక్‌ల్లో సత్ప్రవర్తన కలిగిన ఖైదీలతోపాటు శిక్ష పూర్తి చేసుకొని విడుదలైన దాదాపు 80 మంది పనిచేస్తున్నారు. ఒక పెట్రోల్ బంక్ ప్రత్యేకంగా శిక్ష అనుభవిస్తున్న, పూర్తిచేసుకున్న మహిళలతో నడిపిస్తున్నారు. బంక్‌ల ఏర్పాటుతో ఆశించిన ఫలితాలు వస్తున్నాయి. మరోపక్క ఉపాధి అవకాశాలు కూడా లభిస్తున్నాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వంద పెట్రోల్ బంక్‌ల ఏర్పాటే లక్ష్యంతో జైళ్లశాఖ ముందుకు సాగుతున్నది. ఈ క్రమంలోనే సరూర్‌నగర్‌లోని లింగోజుగూడలో మూతపడిన ఓ బంక్‌ను సంబంధిత ఆయిల్ కంపెనీ సహాయంతో జైళ్లశాఖ సేకరించింది. ఈ పెట్రోల్ బంక్‌ను శిక్ష పూర్తి చేసుకొని విడుదలైన వారితో నిర్వహించేందుకు నిర్ణయించారు. చాలా మంది శిక్ష పూర్తిచేసుకొని విడుదలైన తర్వాత సరైన ఉపాధి అవకాశం లేక తిరిగి నేరాల బాటపడుతూ జైలుకు వస్తున్నారని జైళ్లశాఖ అధికారులు తెలిపారు. ఉపాధి అవకాశం కల్పించినట్టయితే నేరాల బాట పట్టే అవకాశం ఉండదన్నారు. ఒక్కొక్కరికి రూ.12 వేల వరకు జీతాలు ఇస్తున్నట్టు చెప్పారు.

### సౌండ్ పొల్యూషన్ కేసు..
## నలుగురికి జైలు శిక్ష

**సీతాఫల్‌మండి:** సికింద్రాబాద్ చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో సౌండ్ పొల్యూషన్‌కు కారకులైన నలుగురికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. చిలకలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్‌గూడ ఏకే ఫంక్షన్‌హాల్ నిర్వాహకుడు అహ్మద్‌అస్లాం, మేనేజర్ షేక్ ఇర్షాన్‌లు ఈనెల 12న అర్ధరాత్రి డీజే ఏర్పాటు చేశారు. వారాసిగూడ అంబర్‌నగర్‌కు చెందిన చౌకి మధు ఇంటి ముందు కారులో డెక్ పెట్టి ఫుల్ సౌండ్ పెట్టాడు. ఈనెల 5న ఈశ్వరిబాయినగర్‌కు చెందిన గోపు గణేశ్ పెండ్లి భరాత్ ఊరేగింపులో అర్ధరాత్రి వేళ సౌండ్ పొల్యూషన్‌కు పాల్పడ్డారు. వీరి సౌండ్ పొల్యూషన్ కారణంగా ఇబ్బందులకు గురైన పరిసర ప్రాంతవాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలగూడ పోలీసులు ఈనెల 14న కేసులు నమోదు చేశారు. నలుగురు నిందితులను బుధవారం కోర్టులో హాజరుపరుచగా రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ సికింద్రాబాద్ 15వ స్పెషల్ ఎంఎం కోర్టు న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

# అగ్నిప్రమాదాల కారణాలపై అధ్యయనం

### ఆయా ప్రాంతాలకు అనుగుణంగా అవగాహన కార్యక్రమాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అగ్నిమాపకశాఖ 'వి సర్వ్ టు సేవ్' పేరుతో నిర్వహిస్తున్న అవగాహన సదస్సులకు ప్రజల నుంచి వస్తున్న స్పందనకు అనుగుణంగా ఉన్నతాధికారులు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలపై సమాచారం సేకరిస్తూ మరింత సులభంగా అర్థమయ్యేరీతిలో అధ్యయనం చేస్తున్నట్టు తెలిపారు. ప్రమాదాల నివారణ కోసం ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇప్పటికే సదస్సులు, మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నారు. గత ఏడాది ఏప్రిల్ 24వ తేదీన 'వి సర్వ్ టు సేవ్' పేరుతో మొదలైన అవగాహన కార్యక్రమాలు 2,873 ప్రాంతాల్లో నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రజల నుంచి వస్తున్న అభిప్రాయాల మేరకు ఎప్పటికప్పుడు సదస్సుల్లో పాల్గొంటున్న జిల్లా సిబ్బందితో సమీక్షించి, తగిన సూచనలు చేస్తున్నామని ఉన్నతాధికారులు చెప్తున్నారు. ప్రతి శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా వంద గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ప్రాంతీయ అగ్నిమాపకశాఖ అధికారి పాపయ్య తెలిపారు. నివాసాలు, విద్యాసంస్థలు, వ్యవసాయ క్షేత్రాలు, పరిశ్రమలు, దవాఖానలు, షాపింగ్ మాల్స్, కమర్షియల్ కాంప్లెక్స్‌ల్లో జరుగుతున్న ప్రమాదాలు వేర్వేరుగా ఉంటాయన్నారు. అగ్నిప్రమాదం జరిగితే 9949991101కు ఫోన్‌చేయాలన్నారు.



ఫతేనగర్‌లో పోలీసులకు చిక్కిన గంజాయి విక్రయ ముఠా

## గంజాయి కేసు.. ఏడుగురి అరెస్ట్

### 27 కిలోల గంజాయి, ఆటో స్వాధీనం

**కంటోన్మెంట్/బాలానగర్:** నగరంలో గంజాయి తరలిస్తున్న ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేసి, 27 కిలోల గంజాయిని, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలి ప్రాంతానికి చెందిన కృష్ణప్రవీణ్‌కుమార్(41) ఓ కేసులో జైలుకు వెళ్లినప్పుడు నిత్యానంద దాస్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. బయటికి వచ్చిన తర్వాత నగరంలో గంజాయి సరఫరా చేయడానికి ప్లాన్ వేశారు. ఇందుకు కూత్బుల్లాపూర్‌కు చెందిన త్రిలోచన్‌మహంతి అలియాస్ సమీర్(26), బాలానగర్ పిట్టలబస్తీకి చెందిన సోమరాజు(19)ను జత చేసుకున్నారు. కృష్ణప్రవీణ్‌కుమార్ ఒడిశా నుంచి నగరానికి వచ్చే గంజాయిని వివిధ ప్రాంతాల్లో పలువురికి విక్రయిస్తున్నాడు. ఈ నెల 15న పోలీసులు బోయిన్‌పల్లి చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా, బైక్‌పై వెళ్తున్న ఈ ముగ్గురు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని పట్టుకుని, తనిఖీ చేయగా, 12 కిలోల గంజాయి లభించింది. పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించారు. ప్రధాన నిందితుడైన నిత్యానందదాస్ పరారీలో ఉన్నాడని ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు. మరో కేసులో.. దూల్‌పేటకు చెందిన మారుతి(19), ఓ మహిళ (21), ఆటో డ్రైవర్ రాజ్‌కుమార్(45) బుధవారం ఆటోలో దూల్‌పేట నుంచి ఫతేనగర్‌కు గంజాయిని తీసుకెళ్తున్నారు. అప్పటికే ఫతేనగర్‌లో నిఘా పెట్టిన ఎక్సైజ్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న 8 కిలోల గంజాయితోపాటు మారుతి ఇంట్లో ఉన్న మరో 6 కిలోల గంజాయి, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో నిందితుడిగా ఉండి తప్పించుకు తిరుగుతున్న ఫతేనరగ్‌కు చెందిన సురేశ్‌సింగ్‌ను అదుపులోకి తీసుకొని కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నలుగురినీ రిమాండ్‌కు తరలించారు.




బుధవారం టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు. చిత్రంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అంజయ్యయాదవ్ ఉన్నారు.

# పాలమూరు కరువును పారదోలుతాం

- 15 లక్షల ఎకరాలను సాగులోకి తీసుకొస్తాం
- అందుకే పాలమూరు-రంగారెడ్డి జిల్లా ప్రాజెక్టు
- రూ.35 వేల కోట్లు కేటాయించిన సీఎం కేసీఆర్
- కాంగ్రెస్ నాయకులవి మొసలి కన్నీళ్లు
- పాలమూరు ప్రాజెక్టులపై బహిరంగ చర్చకు సిద్ధమా?
- కాంగ్రెస్ నేతలకు మంత్రి జూపల్లి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి సవాల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పాలమూరు జిల్లా కరువు పారదోలాలని, వలస వెళ్లిన వారిని వెనుకకు తీసుకురావాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పాలమూరు-రంగారెడ్డి జిల్లా ప్రాజెక్టుకు రూ.35వేల కోట్లు కేటాయించారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జిల్లాలో పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ పథకాల ద్వారా 14 నియోజకవర్గాల్లో 15-20 లక్షల ఎకరాలకు నీరందించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ ప్రణాళికలు సిద్ధం చేయించారన్నారు. 60 రోజుల్లో 120 టీఎంసీలను కృష్ణానది ద్వారా తీసుకొని పాలమూరు కరువు పారదోలడానికి చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. బుధవారం టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు ఎస్ నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అంజయ్యయాదవ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 70 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్ల నిర్మాణం జరుగుతుందని, కల్వకుర్తి కింద మరో 20 టీఎంసీల రిజర్వాయర్‌కు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని అన్నారు. కృష్ణానదిలో తెలంగాణకు 299 టీఎంసీల నికర జలాలు కేటాయించారని, మరో 150 టీఎంసీల మిగులు జలాలు ఉంటాయన్నారు. మిగులు జలాల్లో 100 టీఎంసీలను లెక్కలోకి తీసుకున్నా 400 టీఎంసీలు ఉంటాయన్నారు. ఇలా ఏవిధంగా లెక్కవేసినా రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు పోను 200 టీఎంసీలు పాలమూరు జిల్లాకు అందుబాటులో ఉంటాయి. ఈ నీటి ద్వారా 20 లక్షల ఎకరాలు సాగు చేయవచ్చనే విషయాన్ని గ్రహించాలని ప్రతిపక్ష నాయకులకు సూచించారు. జిల్లాకు చెందిన ప్రతిపక్ష నాయకులు ఇంకా సమైక్య రాష్ట్రంలో ఉన్నట్లుగానే మాట్లాడుతున్నారని, మన రాష్ట్రానికి ప్రత్యేకంగా నీటి కేటాయింపులు చేశారనే విషయాన్ని వారు మరిచారని జూపల్లి అన్నారు. ప్రజలను మభ్యపెట్టాలని ప్రతిపక్ష నాయకులు చూస్తున్నారని విమర్శించారు. అధికారంలో ఉండగా ఏనాడూ ప్రాజెక్టుల గురించి ఆలోచించని నాయకులు ప్రతిపక్షంలో ఉండగా మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. జిల్లాలో ఎకరం భూమికి కూడా నష్టం, అన్యాయం జరుగనివ్వబోమని, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు మహబూబ్‌నగర్ జిల్లా మీదుగానే నీళ్లు పోవాలనే విషయాన్ని గుర్తుచేశారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై సీఎల్పీ నేత జానారెడ్డి తమ వైఖరేంటో చెప్పాలని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టులపై నాలుగుగోడల మధ్య కాదు.. బహిరంగ చర్చకు సిద్ధంకావాలని సవాల్ విసిరారు. జాతీయ పార్టీ నాయకులకు జిల్లాకో విధానం ఉంటుందా అంటూ నిలదీశారు. ఇక్కడ కేసులు వేసి అడ్డుకోవాలనే కాకుండా, అడ్డుకోవడానికి ఆంధ్ర ప్రాంతం వారికి అవకాశమిచ్చేలా కాంగ్రెస్ నాయకులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లాలు, ప్రజల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకోవడానికి కాంగ్రెస్ నాయకులు యత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. అన్యాయం చేసేలా వ్యవహరిస్తే ప్రజలు క్షమించబోరని స్పష్టంచేశారు. ఈ ఏడాది 5.50 లక్షల ఎకరాలకు నీరందించామన్నారు.

## కేంద్రానికి అంశాలవారీగానే మద్దతు

కేంద్రప్రభుత్వంలో చేరే ఆలోచన లేదు: టీఆర్ఎస్ ఎంపీ జితేందర్‌రెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్రంలోని ఎన్డీయే సర్కారుకు అంశాలవారీగానే మద్దతు ఇస్తామని, ఆ ప్రభుత్వంలో చేరే ఆలోచన ఏమీలేదని టీఆర్ఎస్ లోక్‌సభ పక్షనేత ఎంపీ జితేందర్‌రెడ్డి అన్నారు. అదే సమయంలో ప్రతిపక్ష కూటమిలో కూడా చేరబోమని స్పష్టంచేశారు. బుధవారం ఆయన పీటీఐ ప్రతినిధితో మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధే లక్ష్యంగా టీఆర్ఎస్ కార్యాచరణ ఉంటుందని, అభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టులు, నిధులు తెచ్చుకుంటామని చెప్పారు. తెలంగాణ ప్రయోజనాలకు సహకరించే వరకు పార్టీ మద్దతిస్తామని, ఒకవేళ రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగే పరిస్థితి వస్తే పోరాటం చేస్తామని అన్నారు. ఇందులోభాగంగానే పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు తెలిపామన్నారు. తెలంగాణలో వచ్చే ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ పార్టీయే అధికారంలోకి వస్తుందని జితేందర్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. ప్రజల సంక్షేమం కోసం నిత్యం పరితపించే సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు.

## పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్రతపై దృష్టి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పారిశుద్ధ్యం నిర్వహణ, పరిశుభ్రతపై దృష్టిసారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ అన్నారు. పారిశుద్ధ్య సమస్య సత్వర పరిష్కారానికి కొత్త సూచనలు ఇవ్వాలని అధికారులను కోరారు. తెలంగాణ స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణం) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో సాంకేతిక కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, డీఆర్డీవోలు, జిల్లా పరిషత్ సీఈవోలు, యూనిసెఫ్ బృందంతో కలిసి 'స్వచ్ఛ హ్యాకథాన్ 1.0' కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పౌరులంతా పాలుపంచుకోవాలనే ఉద్దేశంతో 'స్వచ్ఛ హ్యాకథాన్' కార్యక్రమాన్ని కేంద్రం ప్రారంభించిందని సీఎస్ చెప్పారు. రాష్ట్రంలో రెండువేల గ్రామాలు బహిరంగ మలవిసర్జన రహిత పంచాయతీలుగా మారాయని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్ చెప్పారు. రాష్ట్రంలో 53 శాతం వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించామని కమిషనర్ నీతూప్రసాద్ తెలిపారు. సమావేశంలో శానిటేషన్ స్పెషలిస్ట్ (యూనిసెఫ్), ఎస్ఐటీఈఎం పీడీ అనురాగ్ జయంత్, కేంద్ర స్వచ్ఛ భారత్ మిషన్ అడిషనల్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.



బుధవారం హైదరాబాద్‌లోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో కమిషనర్ సీవీ ఆనంద్‌ను అభినందిస్తున్న ఆ శాఖ సిబ్బంది తదితరులు

## నిజాయితీగా పనిచేస్తే గుర్తింపు: సీవీ ఆనంద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు నిజాయితీగా పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు వస్తుందని పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. పౌరసరఫరాలశాఖ కమిషనర్‌గా ఉత్తమ సేవలందించినందుకు రాష్ట్ర ప్రభుత్వం పంద్రాగస్టు రోజున సీవీ ఆనంద్‌కు 'ఎక్సలెన్స్' అవార్డును అందజేసింది. బుధవారం పౌరసరఫరాలశాఖ, లీగల్ మెట్రాలజీ ఉద్యోగులు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సీవీ ఆనంద్‌ను కలిసి అభినందించారు. ఈ అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందని సీవీ ఆనంద్ అన్నారు. పౌరసరఫరాల శాఖ సిబ్బంది సమిష్టి కృషితో ఎక్సలెన్స్ అవార్డు వచ్చిందని ఆయన తెలిపారు.

## చందుకు పునర్జన్మ



ఏపీలోని గుంటూరు జిల్లా వినుకొండ మండలం ఉమ్మడివరంలో బోరుబావిలో నుంచి సురక్షితంగా బయటపడ్డ కుమారుడితో తల్లిదండ్రులు

# మృత్యుంజయుడు

- గుంటూరులో బోరుబావిలో పడిన బాలుడు క్షేమం

హైదరాబాద్ /అమరావతి, నమస్తే తెలంగాణ: బోరుబావిలో పడ్డ చిన్నారి చంద్రశేఖర్ మృత్యుంజయుడయ్యాడు. బావి నుంచి చిన్నారిని బయటకు తీసేందుకు జోరువానలో సహాయబృందాలు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఏపీలోని గుంటూరు జిల్లా వినుకొండ మండలం ఉమ్మడివరంలో మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు బోరుబావిలో పడ్డ రెండేండ్ల బాలుడు చంద్రశేఖర్ ప్రాణాలతో బయటపడ్డాడు. సుమారు 15 అడుగులకు పైగా లోతులో చిక్కుకున్న బాలుడిని 11 గంటలపాటు శ్రమించి బుధవారం తెల్లవారుజామున 2.45 గంటల సమయంలో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు బయటకుతీశాయి. చిన్నారి చందును చూసిన తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. బాలుడి తల్లిదండ్రులు అనూష, మల్లిఖార్జునరావు అందరికీ నమస్కారం పెడుతూ దేవుడున్నాడయ్యా.. అంటూ సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. బాలుడు క్షేమంగా బయటకు రావడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఊపిరిపీల్చుకున్నారు.

### వాటర్‌షెడ్‌పై అధ్యయనం కోసం

## కర్ణాటకకు అధికారుల బృందం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కర్ణాటక రాష్ట్రంలో అమలవుతున్న వాటర్‌షెడ్ కార్యక్రమ అధ్యయనం కోసం రాష్ట్ర అధికారుల బృందం బుధవారం బెంగళూరు బయలుదేరి వెళ్లింది. అధికారుల బృందం బస్సుకు పంచాయతీరాజ్ కమిషనర్ నీతూప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. వాటర్ షెడ్ విభాగంలో పనిచేస్తున్న మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, జోగుళాంబ గద్వాల, సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి-భువనగిరి జిల్లాలకు చెందిన 35 మంది అధికారుల బృందం కర్ణాటకలో నాలుగు రోజులు పర్యటించనున్నది. కామరాజనగర్ జిల్లాలోని హరావే సుజల వాటర్‌షెడ్ పథకం ఫలితాలను అధికారులు అధ్యయనం చేయనున్నారు.

## నంద్యాలలో జనసేన తటస్థం

ఏ పార్టీకీ మద్దతు ఇవ్వబోమన్న పవన్ • 2019 ఎన్నికలే టార్గెట్ అని వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నంద్యాల ఉప ఎన్నికలో ఏ పార్టీకీ మద్దతు ఇవ్వడం లేదని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ బుధవారం ప్రకటించారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా తటస్థ వైఖరి అనుసరిస్తామని చెప్పారు. పార్టీ నిర్మాణం జరిగే వరకు ఏ ఎన్నికల్లో పోటీ చేయబోమన్నారు. 2019 ఎన్నికలే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీకి పవన్ కల్యాణ్ మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో తమకు జనసేన మద్దతు ఉన్నదని ఎవరైనా చెపితే అది తప్పని, జనసేన పార్టీకి సంబంధించిన నిర్ణయాన్ని తానే స్వయంగా ప్రకటిస్తానని స్పష్టంచేశారు. పవన్ కల్యాణ్ తాజా ప్రకటన నంద్యాల ఉప ఎన్నికలో టీడీపీకి అశనిపాతంగా మారింది. నువ్వా నేనా అన్నట్లు సాగుతున్న ఉప పోరులో పవన్ నిర్ణయంతో టీడీపీ నేతలు డీలా పడిపోయారు. ఈ ఎన్నికలో టీడీపీకి నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని పరిశీలకులు భావిస్తున్నారు.

## సెన్సెక్స్
**31,771**
322

## నిఫ్టీ
**9,897**
103

### బంగారం ధరలు
ముంబై

| | |
|---|---|
| 24 క్యారెట్లు | 28,805 |
| 22 క్యారెట్లు | 28,655 |
| వెండి (కిలో) | 38,255 |

### ముడి చమురు (బ్రెంట్)
50.33

### టాప్‌టెన్ గెయినర్స్

| | | |
|---|---|---|
| Shreyas Shippin 364.30 (303.60) 19.99% | ▲ | 60.70 |
| Tyche Ind 71.80 (59.85) 19.97% | ▲ | 11.95 |
| Rishiroop 62.85 (52.40) 19.94% | ▲ | 10.45 |
| Murudeshwar Cer 45.85 (38.85) 18.02% | ▲ | 7.00 |
| Kirloskar Ind 1,638.55 (1,413.95) 15.88% | ▲ | 224.60 |
| Womens Next 51.75 (45.00) 15.00% | ▲ | 6.75 |
| Shree Rama News 27.20 (23.75) 14.53% | ▲ | 3.45 |
| Godfrey Phillip 1,040.05 (912.40) 13.99% | ▲ | 127.65 |
| Suraj 41.75 (36.70) 13.76% | ▲ | 5.05 |
| Rane Brake 1,326.50 (1,173.40) 13.05% | ▲ | 153.10 |

### టాప్‌టెన్ లూసర్స్

| | | |
|---|---|---|
| Narayani Steels 22.80 (28.50) 20.00% | ▼ | 5.70 |
| Athena Constr 21.30 (26.50) 19.62% | ▼ | 5.20 |
| Religare Enterp 69.75 (82.70) 15.66% | ▼ | 12.95 |
| Phyto Chem 44.75 (50.75) 11.82% | ▼ | 6.00 |
| Shree Ajit Pulp 184.95 (206.80) 10.57% | ▼ | 21.85 |
| Solitaire Mach 44.85 (50.00) 10.30% | ▼ | 5.15 |
| RTS Power Corp 30.05 (33.50) 10.30% | ▼ | 3.45 |
| Amrapali Fincap 38.25 (42.50) 10.00% | ▼ | 4.25 |
| CIL Securities 31.15 (34.60) 9.97% | ▼ | 3.45 |
| Auro Labs 62.85 (69.80) 9.96% | ▼ | 6.95 |

### విదేశీ మారకం

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలర్ | 58.48 | 67.80 |
| ఆస్ట్రేలియా డాలర్ | 45.80 | 52.98 |
| బహ్రెయిన్ దినార్ | 158.43 | 181.47 |
| యూరో | 68.63 | 79.60 |
| జపాన్ యెన్/100 | 52.83 | 61.27 |
| కువైట్ దినార్ | 175.94 | 219.17 |
| ఒమన్ రియాల్ | 155.03 | 177.41 |
| ఖతార్ రియాల్ | 16.95 | 19.47 |
| సౌదీ రియాల్ | 15.43 | 18.29 |
| సింగపూర్ డాలర్ | 42.76 | 50.65 |
| స్టెర్లింగ్ పౌండ్ | 75.25 | 87.26 |
| యూఏఈ దిర్హామ్ | 15.92 | 18.61 |

### కోడిగుడ్ల ధరలు

| | నెక్ | హెచ్‌ఎల్‌ఎఫ్‌పి |
|---|---|---|
| హైదరాబాద్ | 355-00 | 355-00 |
| రంగారెడ్డి | 355-00 | 355-00 |
| మెదక్ | 355-00 | 355-00 |
| కరీంనగర్ | 357-00 | --- |
| వరంగల్ | 357-00 | --- |
| రిటైల్ ప్రైస్ | 4-15 | 4-15 |

### చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర | 76.00 |
| రిటైల్ లైవ్ | 90.00 |
| డ్రెస్డ్ | 126.00 |
| స్కిన్‌లెస్ | 149.00 |

# స్వల్పకాలిక పంట రుణాలకూ ఆధార్!

- సకాలంలో చెల్లించే రైతులకు 4% వడ్డీకే..
- రూ.3 లక్షల వరకు రుణం పొందే అవకాశం



**ముంబై, ఆగస్టు 16:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రైతులకు 7 శాతం వడ్డీకే రూ. 3 లక్షల వరకు స్వల్పకాలిక పంట రుణం పొందే అవకాశం కల్పిస్తున్నట్లు ఆర్బీఐ తెలిపింది. ఈ రుణాన్ని సకాలంలో తిరిగి చెల్లించే వారిపై వడ్డీభారం 4 శాతానికి తగ్గనుంది. 'వడ్డీ రాయితీ పథక ప్రయోజనాలందించడంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు 2017-18 ఆర్థిక సంవత్సరానికిచ్చే స్వల్పకాలిక పంట రుణాలకు రైతుల ఆధార్ నంబర్ అనుసంధానాన్ని తప్పనిసరి చేయాలి' అని బ్యాంకులకు జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఆర్బీఐ ఆదేశించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రైతులకిచ్చే స్వల్పకాలిక పంట రుణాల వడ్డీరేటులో బ్యాంకులకు 2 శాతం రాయితీ లభించనుండగా.. సకాలంలో తిరిగి చెల్లింపులు జరిపే రైతులకు మరో 3 శాతం సబ్సిడీ లభించనుంది. గిట్టుబాటు ధర రాని సమయాల్లో ధాన్యాన్ని గిడ్డంగుల్లో దాచుకునేలా ప్రోత్సహించుకునేందుకు పంట రుణ పథకంలో మరింత వెసులుబాటు కల్పించారు. కిసాన్ క్రెడిట్ కార్డులు కలిగిన చిన్న, సన్నకారు రైతులకు పంట చేతికొచ్చాక మరో ఆరు నెలలపాటు వడ్డీరాయితీ ప్రయోజనాలను అందించనున్నారు. అయితే, ఈ ప్రయోజనాలను పొందేందుకు ధాన్యాన్ని గిడ్డంగిలో నిల్వ చేసినట్లు రుజువు చేసే రశీదులు సమర్పించాల్సి ఉంటుంది. ఆ గిడ్డంగి వేర్‌హౌజింగ్ డెవలప్‌మెంట్ రెగ్యులేటరీ అథారిటీ (డబ్ల్యూడీఆర్‌ఏ) గుర్తింపు పొంది ఉండాలి. ప్రకృతి విపత్తు ప్రభావిత ప్రాంత రైతులకు ఊరటనిచ్చేందుకు సైతం ఈ పథకంలో వెసులుబాటు ఇచ్చారు. ఆ ప్రాంతంలోని రైతులకు పునర్వ్యవస్థీకరించిన రుణాలపై బ్యాంకులకు ఏడాదిపాటు 2 శాతం వడ్డీ రాయితీ ప్రయోజనాలను అందించనుంది. రెండో ఏడాది నుంచి మాత్రం సాధారణ వడ్డీరేటు వర్తిస్తుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వడ్డీ రాయితీ పథక పంట రుణాలపై సబ్సిడీ ఇవ్వడానికి రూ.20,339 కోట్లు కేటాయించేందుకు జూన్‌లో కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

# ఈఐఎల్ షేర్ల బైబ్యాక్.. కేంద్రానికి 659 కోట్ల ఆదాయం

**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** ప్రభుత్వ రంగ సంస్థ ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్‌లో (ఈఐఎల్) కేంద్రం వాటా 57.02 శాతం నుంచి 54.17 శాతానికి తగ్గింది. గతనెల 25 నుంచి ఈనెల 7వరకు ఈఐఎల్.. సెకండరీ మార్కెట్ నుంచి 4.19 కోట్ల షేర్లను ఒక్కొంటిని రూ.157 చొప్పున తిరిగి కొనుగోలు (బైబ్యాక్) చేసింది. అందులోభాగంగా ప్రభుత్వం తన వాటా షేర్ల నుంచి కొన్నింటిని సంస్థకు విక్రయించింది. తద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.658.80 కోట్ల ఆదాయం సమకూరింది. బైబ్యాక్ కార్యక్రమంలో కొనుగోలు చేసిన మొత్తం షేర్లలో 99.96 శాతం ప్రభుత్వానికి చెందినవేనని రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ఈఐఎల్ వెల్లడించింది. సంస్థలో రిటైల్, సంస్థాగత ఇన్వెస్టర్ల వాటా 43 శాతం నుంచి 45.83 శాతానికి పెరిగిందని తెలిపింది.

# భారత మొబైల్ యూజర్లపై డ్రాగన్




**మీరు చైనాలో తయారైన ఫోన్ వాడుతున్నారా..? అయితే, మీ వ్యక్తిగత సమాచారం ఇప్పటికే చైనాకు చేరిపోయి ఉండొచ్చు. చైనీస్ ఫోన్ తయారీదారులు భారత మొబైల్ యూజర్ల పర్సనల్ ఇన్ఫర్మేషన్‌ను చోరీ చేస్తున్నారని ప్రభుత్వం అనుమానిస్తున్నది. దేశీయ మార్కెట్లో మొబైళ్లు విక్రయిస్తున్న వివో, ఒప్పో, షియోమీ, జియోనీ వంటి చైనా కంపెనీలతోపాటు మొత్తం 21 మంది హ్యాండ్‌సెట్ తయారీదారులకు కేంద్రం ఈ విషయంపై ఇప్పటికే నోటీసులు జారీ చేసింది.**

**న్యూఢిల్లీ, ఆగస్టు 16:**

దేశీయ మొబైల్ యూజర్ల వ్యక్తిగత సమాచారాన్ని హ్యాక్ చేస్తున్నారన్న అనుమానాలతో వివో, ఒప్పో, షియోమీ, జియోనీ వంటి చైనా కంపెనీలతోపాటు మొత్తం 21 స్మార్ట్‌ఫోన్ తయారీదారులకు కేంద్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. డోక్లామ్‌పై చైనాతో వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ తాజా చర్య ప్రాధాన్యం సంతరించుకున్నది. భారత్‌లో స్మార్ట్‌ఫోన్లు విక్రయిస్తున్న కంపెనీలు, ముఖ్యంగా చైనాకు చెందిన తయారీదారులు వారి హ్యాండ్‌సెట్ యూజర్ల కాంటాక్ట్ లిస్ట్, మెసేజ్‌లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలిస్తున్నాయేమోనని ప్రభుత్వం ఆందోళన చెందుతున్నది. చైనాయేతర సంస్థల్లో ఆపిల్, సామ్‌సంగ్‌తోపాటు దేశీయ స్మార్ట్‌ఫోన్ కంపెనీ మైక్రోమ్యాక్స్‌కు కూడా కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ నోటీసులు జారీ చేసింది. భద్రతా ప్రమాణాలపై వివరణ ఇచ్చేందుకు కంపెనీలకు ఈనెల 28వరకు గడువు ఇచ్చింది. అంతేకాదు, సంస్థలు భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నాయా..? లేదా..? అని తెలుసుకునేందుకు ప్రభుత్వం కూడా ఆడిట్ చేపట్టనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. భద్రతా ప్రమాణాలను ఉల్లంఘించాయని ఆడిట్‌లో తేలితే కంపెనీలపై ఐటీ చట్టం 43(ఏ) ప్రకారం భారీ జరిమానా విధించనున్నట్లు ఓ అధికారి వెల్లడించారు. చైనా నుంచి పెద్ద ఎత్తున దిగుమతవుతున్న ఎలక్ట్రానిక్స్, ఐటీ ఉత్పత్తుల్లో డాటా భద్రతపై ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో కొద్దికాలం క్రితమే ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టి పెట్టింది. దేశంలో మొబైల్ ద్వారా ఈ-కామర్స్ లావాదేవీలు, డిజిటల్ చెల్లింపులు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో యూజర్ల డాటా భద్రత చాలా కీలక అంశంగా మారిందని అధికారి అన్నారు. కేంద్ర ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఈనెల 14న తన మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు, సెర్ట్-ఇన్ ప్రతినిధులు, ఇతరులతో సమావేశమై పరిస్థితిని సమీక్షించారని అధికారి తెలిపారు.

# విక్రయానికి జీఎంఆర్ విద్యుత్ ప్లాంట్

### రూ.403 కోట్లకు డీల్ కుదిరిందన్న సంస్థ

**హైదరాబాద్, ఆగస్టు 16:** మౌలిక రంగానికి చెందిన జీఎంఆర్ గ్రూపు.. కాకినాడలోని 220 మెగావాట్ల గ్యాస్ ఆధారిత విద్యుత్ ప్లాంట్‌ను 6.3 కోట్ల డాలర్లకు విక్రయించనుంది. మన కరెన్సీలో ఈ విలువ రూ.403 కోట్లకుపైమాటే. ఈ ప్లాంట్ విక్రయానికి సంబంధించి జీఎంఆర్ ఎనర్జీ లిమిటెడ్ త్వరలోనే కొనుగోలుదారుతో ఒప్పందం కుదుర్చుకోనుందని రెగ్యులేటరీ ఫైలింగ్‌లో జీఎంఆర్ గ్రూపు తెలిపింది. అయితే, కొనుగోలుదారు ఎవరనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. సహజవాయువు కొరత కారణంగా 2013 సంవత్సరం నుంచి ఈ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి జరుగడం లేదు. ఈ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.600 కోట్లు. అంటే, ప్లాంట్‌ను నష్టానికే విక్రయించనుందన్నమాట. జూన్ 30తో ముగిసిన త్రైమాసికంలో గ్రూపు విద్యుత్ ఉత్పత్తి వ్యాపార విభాగం రూ.179.95 కోట్ల నష్టాన్ని చవిచూసింది.

# యెస్ బ్యాంక్ సేవింగ్స్ డిపాజిట్ల వడ్డీలో ఒక శాతం వరకు కోత

**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ సేవల సంస్థ యెస్ బ్యాంక్ కూడా పొదుపు ఖాతా డిపాజిట్లపై చెల్లించే వడ్డీలో కోతపెట్టింది. రూ. లక్షలోపు డిపాజిట్లపై చెల్లించే వడ్డీరేటును ఒక శాతం తగ్గించి 5 శాతానికి కుదిస్తున్నట్లు బ్యాంక్ ప్రకటించింది. రూ.లక్ష నుంచి రూ.కోటి వరకు డిపాజిట్లపైన మాత్రం యధావిధిగా 6 శాతం వడ్డీ లభించనుంది. రూ.కోటికి పైగా డిపాజిట్లపైన వడ్డీరేటును 6.5 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గించింది. సవరించిన వడ్డీరేట్లు వచ్చేనెల 1 నుంచి అమలులోకి వస్తాయని బ్యాంక్ వెల్లడించింది. దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకైన ఎస్‌బీఐ తొలుత సేవింగ్ అకౌంట్ డిపాజిట్ రేట్లను అర శాతం తగ్గించి 3.5 శాతానికి కుదించింది. ఆ తర్వాత బ్యాంక్ ఆఫ్ బరోడా, కర్ణాటక బ్యాంక్‌లు సైతం వడ్డీరేట్లను తగ్గించాయి.

# 24 క్యారెట్ బంగారం ఎగుమతిపై నిషేధం

**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** ఇరవై రెండు క్యారెట్ల కంటే అధిక స్వచ్ఛత కలిగిన బంగారు ఆభరణాలు, పతకాలు, ఇతర ఉత్పత్తుల ఎగుమతిపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. బంగారం రౌండ్ ట్రిప్పింగ్ ద్వారా అక్రమంగా ప్రోత్సహకాలు పొందే ఎగుమతిదారులకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. 8 నుంచి 22 క్యారెట్ల వరకు స్వచ్ఛత కలిగిన బంగారు ఆభరణాలు, ఇతర ఉత్పత్తులను ఎగుమతి చేసేవారికి మాత్రమే ప్రోత్సాహకాలు లభిస్తాయని తాజాగా జారీ చేసిన నోటిఫికేషన్‌లో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) తెలిపింది.

# మార్కెట్లో సానుకూల పవనాలు

### సెన్సెక్స్ 322 పాయింట్లు అప్ ■ 9,900 స్థాయిని తాకిన నిఫ్టీ



**ముంబై, ఆగస్టు 16:**

అమెరికా-ఉత్తర కొరియా మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల తీవ్రత క్రమంగా తగ్గుముఖం పడుతుండటంతో అంతర్జాతీయ మార్కెట్లతోపాటు దలాల్‌స్ట్రీట్ వర్గాలు ఊపిరి పీల్చుకున్నాయి. సానుకూల గ్లోబల్ సంకేతాలతోపాటు ఆటో, బ్యాంకింగ్, ఎఫ్‌ఎంసీజీ స్టాకుల్లో కొనుగోళ్లు పుంజుకోవడంతో దేశీయ స్టాక్ సూచీలు వరుసగా రెండో రోజు లాభాల బాటలో పయనించాయి. సూచీలు గడిచిన నెలరోజుల్లో ఎన్నడూ లేనంతగా లాభపడ్డాయి. బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో ట్రేడింగ్ ముగిసేసరికి సెన్సెక్స్ 321.86 పాయింట్లు (1.02 శాతం) ఎగబాకి 31,770.89 వద్ద స్థిరపడింది. ఈనెల 9 తర్వాత సూచీకిదే గరిష్ఠ ముగింపు స్థాయి. నిఫ్టీ 103.15 పాయింట్లు (1.05 శాతం) పెరిగి 9,897.30 వద్ద ముగిసింది. ఒకదశలో సూచీ 9,903.95 స్థాయికి చేరుకున్నప్పటికీ చివర్లో మళ్లీ కాస్త కిందికి జారుకుంది. ప్రధాన షేర్లతోపాటు చిన్న, మధ్య స్థాయి స్టాకులకు సైతం కొనుగోళ్ల ఆదరణ లభించింది. దాంతో బీఎస్‌ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 1.31 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.26 శాతం పెరిగాయి.

సెన్సెక్స్ లిస్టెడ్ షేర్లలో టాటా మోటార్స్ 3.57 శాతం లాభపడి టాప్‌గైనర్‌గా నిలిచింది. సిప్లా 3.54 శాతం, ఐటీసీ 3.01 శాతం, హిందుస్థాన్ యూనిలీవర్ 3శాతం ఎగబాకాయి. సన్‌ఫార్మా మార్కెట్ విలువ మరో 2.69 శాతం పెరిగింది. కొటక్ మహీంద్రా బ్యాంక్, ఎస్‌బీఐ, హీరోమోటోకార్ప్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, టాటా స్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ , మారుతి సుజుకీ సంస్థల షేర్లు ఒక శాతానికిపైగా లాభపడ్డాయి. ఎన్‌టీపీసీ, ఏషియన్ పెయింట్స్ స్టాకులు మాత్రం ఒక శాతానికిపైగా నష్టపోవాల్సి వచ్చింది. రంగాలవారీగా చూస్తే.. బీఎస్‌ఈలోని ఎఫ్‌ఎంసీజీ సూచీ 2.49 శాతం పుంజుకుంది. మెటల్, ఆటో, బ్యాంకింగ్, హెల్త్‌కేర్ రంగ సూచీలు సైతం ఎగువముఖంగానే పయనించాయి. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, క్యాపిటల్ గూడ్స్ ఇండెక్స్‌లు మాత్రం నేలచూపులు చూశాయి.

# ఓపెన్ ఆఫర్ నుంచి మినహాయింపు!

- ఒత్తిడిలో ఉన్న సంస్థల్లో వాటా కొనుగోలు..
- రుణదాతలకు నిబంధనల్లో సడలింపు

**న్యూఢిల్లీ:** ఒత్తిడిలో ఉన్న కంపెనీల్లో వాటా కొనుగోలుకు సంబంధించి రుణదాతలకు నిబంధనల్లో సడలింపు లభించింది. ఈ సంస్థల్లో వాటా కొనుగోలు సందర్భంగా షేర్‌హోల్డర్లకు ఓపెన్ ఆఫర్ ప్రకటించాల్సిన అవసరం లేకుండా వాటికి రుణాలిచ్చిన బ్యాంకులకు మినహాయింపునిస్తూ క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి 'సెబీ' నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే, కొన్ని షరతులకు లోబడి ఈ మినహాయింపు లభిస్తుంది. ఒత్తిడిలో ఉన్న సంస్థల నుంచి రుణదాతలు వాటా కొనుగోలు చేసేందుకు షేర్‌హోల్డర్లు ఆమోదం తెలుపాల్సి ఉంటుంది. దేశీయ బ్యాంకింగ్ రంగంలో రూ.8 లక్షల కోట్ల స్థాయికి చేరిన మొండిబకాయిల సమస్యను పరిష్కరించేందుకు కేంద్రం, ఆర్బీఐ కలిసి చర్యలు ప్రారంభించాయి. మొండిబకాయిదారులపై అవసరమైతే దివాలా చట్టం ప్రకారంగా చర్యలు తీసుకునేందుకు వీలుగా బ్యాంకులను ఆదేశించేందుకు చట్టంలో మార్పుల ద్వారా ఆర్బీఐకి ప్రభుత్వం విశేషాధికారాలు కల్పించింది. మొత్తం మొండిబకాయిల్లో 25 శాతం వాటాకు సమానమైన 12 సంస్థలపై దివాలా కోడ్ ప్రయోగించాలని ఆర్బీఐ ఇప్పటికే బ్యాంకులను ఆదేశించింది. బ్యాంకులు ఈ తరహా కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు వీలుగా సెబీ తాజా నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఒత్తిడిలో ఉన్న లిస్టెడ్ కంపెనీల పునరుద్ధరణకు ఈ నిబంధన సడలింపు దోహదపడుతుందని, తద్వారా ఆ సంస్థలకు రుణాలిచ్చిన వారితోపాటు షేర్‌హోల్డర్లకు సైతం ప్రయోజనం కలుగుతుందని సెబీ భావిస్తున్నది.

# చైనా రసాయనాలపై మరో ఐదేండ్లు దిగుమతి సుంకం

**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** చైనా నుంచి భారత్‌కు వస్తున్న పాలీ టెట్రా ఫ్లోరో ఎథిలీన్ (పీటీఎఫ్‌ఈ)పై మరో ఐదేండ్లపాటు దిగుమతి నిరోధక సుంకం విధించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. పెనం ఇంకా ఇతర వంటసామాగ్రిపై నాన్ స్టిక్ కోటింగ్‌గా ఉపయోగించే ఈ రసాయనంపై దిగుమతి సుంకం విధింపు గడువును పొడిగిస్తూ రెవెన్యూ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. చైనా నుంచి దిగుమతయ్యే పీటీఎఫ్‌ఈపై టన్నుకు 2,637 డాలర్ల సుంకం విధిస్తున్నట్లు తెలిపింది. తొలుత ఈ సుంకాన్ని ఐదేండ్లపాటు అమలయ్యేలా ఆగస్టు 2011లో విధించారు. తాజాగా మరో ఐదేండ్లు పొడిగించారు. దేశీయ పరిశ్రమ ప్రయోజనార్థం కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది.

**మరిన్ని రసాయనాలపై సుంకం విధింపు యోచన**

చైనా నుంచి దిగుమతి అవుతున్న మరిన్ని రసాయనాలపై సుంకం విధించాలని కేంద్రం యోచిస్తున్నది. చైనాతోపాటు కెనడా, యూరోపియన్ యూనియన్ నుంచి వస్తున్న సోడియం క్లోరేట్‌పై టన్నుకు 120.14 డాలర్ల మేర దిగుమతి నిరోధక సుంకం విధించే అవకాశం ఉంది. ఈ రసాయనాన్ని రంగులు, ఔషధాల తయారీలో ఉపయోగిస్తారు. చౌక దిగుమతుల నుంచి దేశీయ తయారీదారుల ప్రయోజనాలను రక్షించేందుకు కేంద్రం సుంకం విధించాలనుకుంటున్నది.

# షెల్ కంపెనీలపై దర్యాప్తునకు ప్రత్యేక బృందం



**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** మనీలాండరింగ్ కార్యకలాపాలకు ప్రధాన మార్గంగా మారిన షెల్ కంపెనీలపై దర్యాప్తు చేసేందుకు ప్రధాని మోదీ.. ఉన్నతస్థాయి అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 2 లక్షల షెల్ కంపెనీలను మూసేయాలని గతనెల అధికారులు ఆదేశించారని, ప్రభుత్వం మరిన్ని లక్షల సంస్థలపై దర్యాప్తు చేస్తున్నదని మోదీ సహాయకుల్లో ఒకరు తెలిపారు. గత ఏడాది నవంబర్ 8న కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్లను రద్దు చేసింది. రద్దు చేసిన నోట్లను బ్యాంకులు, పోస్టాఫీసుల్లో జమ చేసేందుకు గత ఏడాది చివరివరకు గడువు ఇచ్చింది. ఆ సమయంలో షెల్ కంపెనీల ద్వారా పెద్ద మొత్తాల్లో నగదు డిపాజిట్ అయినట్లుగా ప్రభుత్వం దృష్టికి వచ్చింది. నల్లధనాన్ని దాచుకోవడానికి, అక్రమ నిధుల లాండరింగ్‌కు షెల్ కంపెనీలు ఏ స్థాయిలో ఉపయోగపడుతున్నాయో ప్రభుత్వానికి అప్పుడు అర్థమైందని అధికారి అన్నారు. దాంతో షెల్ కంపెనీల ఆటకట్టించేందుకు ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) ఉన్నత స్థాయి అధికారులతో ప్రత్యేక దరాప్తు బృందాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం నల్లధనంపై యుద్ధం ప్రకటించిందని, షెల్ కంపెనీల తీవ్ర ప్రభావం పడనుందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోనూ ప్రధాని మోదీ షెల్ కంపెనీలపై చేపట్టిన చర్యలను ప్రస్తావించారు. ఇప్పటివరకు 1.75 లక్షల షెల్ కంపెనీలను మూసివేయడం జరిగిందన్నారు.

# హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాద సంస్థ

- ప్రకటించిన అమెరికా


**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** హిజ్బుల్ ముజాహిదీన్‌ను విదేశీ ఉగ్రవాద సంస్థగా గుర్తిస్తున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించిందని హైదరాబాద్‌లోని ఆ దేశ కాన్సులేట్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవల కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వర్తిస్తున్న హిజ్బుల్ ముజాహిదీన్ పలు దాడులకు పాల్పడింది. ఆ సంస్థ అధిపతి సయ్యద్ సలాహుదీన్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా రెండు నెలల క్రితమే అమెరికా ప్రకటించింది. ప్రస్తుతం హిజ్బుల్ ముజాహిదీన్‌ను ఉగ్రవాద సంస్థ అని ప్రకటించింది.



**రెండు రోజులు కురిసిన వర్షాలతో బెంగళూరులోని ఓ అపార్ట్‌మెంట్ పార్కింగ్ స్థలంలో వరద నీటిలో మునిగిన వాహనాలు . నగరంలో 13 సెంటిమీటర్ల వర్షపాతం నమోదైంది. 1890 తరువాత బెంగళూరులో ఇంత భారీస్థాయిలో వర్షపాతం నమోదు కావడం ఇదే మొదటిసారి. ఈ వర్షాలతో సాఫ్ట్‌వేర్ నిపుణులు అధికంగా నివసించే కోరమంగళ, హెచ్‌ఎస్‌ఆర్ లేఅవుట్, ఎజిపురా, జయనగర్, జేపీనగర్ తదితర ప్రాంతాలలో భవనాలు మొదటి అంతస్తు వరకు నీట మునిగాయి.**

# నివాసయోగ్య నగరాల్లో మెల్‌బోర్న్ ప్రథమం

- చివరన కరాచీ, ఢాకా



**న్యూయార్క్, ఆగస్టు 16:** ప్రపంచంలోనే అత్యంత నివాసయోగ్యమైన నగరంగా ఆస్ట్రేలియా రాజధాని మెల్‌బోర్న్ నిలిచింది. ఆ తర్వాత వియన్నా, కెనడాలోని వాంకోవర్ రెండు, మూడుస్థానాలను కైవసం చేసుకున్నట్టు సర్వేలో వెల్లడయింది. ఎకానమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయూ) 140 దేశాల్లో సర్వే నిర్వహించి ప్రపంచ నివాసయోగ్య నగరాల నివేదికను తయారుచేసింది. తొలిపది నగరాల్లో భారత్‌కు చోటుదక్కలేదు. టాప్ పదిలో నిలిచిన మిగతా నగరాల్లో నాలుగోస్థానంలో టొరంటో నిలువగా.. ఆ తర్వాత వరుసగా కాల్గరీ, ఆడిలైడ్, పెర్త్, ఆక్లాండ్, హెల్‌సింకి, పదోస్థానంలో హాంబర్గ్ చోటుదక్కించుకున్నాయి. చాలా నగరాల్లో అస్థిరత నెలకొన్నదని, ఉగ్రవాదం మరింత విస్తరిస్తున్నదని సర్వేలో తేలింది. ముఖ్యంగా ఫ్రాన్స్, బ్రిటన్ దేశాల్లో తరుచూ దాడులు జరుగుతున్నాయని, ఉగ్రవాద హెచ్చరికలు పెరుగుతున్న నేపథ్యంలో అక్కడి నగరాలు ఈ జాబితాలో స్థానం దక్కించుకోలేకపోయాయని సర్వే నివేదికలో వెల్లడయింది. ఇరాక్, లిబియా, సిరియా, టర్కీ, నైజీరియా తదితర దేశాల్లో అంతర్యుద్ధాలు, సాయుధ పోరాటాలు చెలరేగుతున్నాయని ఈ నివేదికలో గుర్తుచేసింది. అమెరికాలో నల్లజాతీయుల ఉద్యమం, అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న విధాన నిర్ణయాల వల్ల ఆందోళనలు జరుగుతున్నాయని నివేదిక పేర్కొన్నది. సర్వే ప్రకారం నివాసయోగ్యమైన నగరాల్లో చిట్టచివరన దమస్కస్ 140వ స్థానంలో నిలువగా, ట్రిపోలి, ఢాకా, ఆల్జీర్స్, కరాచీ, హరారే, డౌఆలా, కీవ్ చివరిస్థానాల్లో నిలిచాయి. స్థిరత్వం, ఆరోగ్యసంరక్షణ, సంస్కృతి, పర్యావరణం, విద్య, మౌలికసదుపాయాల్లో పలు అంశాలను పరిశీలించి ర్యాంకులను నిర్ణయించారు.

# కశ్మీర్ ఎన్‌కౌంటర్‌లో లష్కరే కమాండర్ హతం

- సోమవారం నాటి దాడిలో గాయపడిన కానిస్టేబుల్ మృతి

**శ్రీనగర్, ఆగస్టు 16:** జమ్ముకశ్మీర్‌లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కరే కమాండర్ అయూబ్ లెహరీ హతమయ్యాడు. పుల్వామా జిల్లా కాకాపోరా ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అయూబ్ లెహరీ మృతి చెందాడని పోలీసు అధికార ప్రతినిధి తెలిపారు. మరోవైపు ఈ నెల 14న బుద్గాం జిల్లాలోని మాగం ప్రాంతం బట్‌పోరా వద్ద రోడ్డుపై వెళుతున్న సీఆర్పీఎఫ్ రోడ్ ఓపెనింగ్ పార్టీపై మిలిటెంట్లు విసిరిన గ్రనేడ్లతో గాయపడిన రియాజ్ అహ్మద్ అనే కానిస్టేబుల్ మరణించారని పోలీసులు తెలిపారు.

# పూంచ్ జిల్లాలో పాకిస్థాన్ కాల్పులు

**శ్రీనగర్, ఆగస్టు 16:** కాల్పుల విరమణ ఒప్పందాన్ని పాకిస్థాన్ యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నది. కశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వద్ద భారత సైన్యంపై, పౌరులపై పాకిస్థాన్ సైనికులు కాల్పులు జరిపారు. ఐదురోజుల్లో వరుసగా ఎల్వోసీ వద్ద తొమ్మిదిసార్లు కాల్పుల విరమణ ఒప్పందాన్ని పాకిస్థాన్ సైనికులు ఉల్లంఘించారు. గత నెలరోజుల నుంచి పాకిస్థాన్ సైనికులు జరుపుతున్న కాల్పుల వల్ల నలుగురు జవాన్లు, ఒక మహిళ మృతిచెందారు.

# పలు జిల్లాల్లో మోస్తరు వాన



ఖమ్మం నగరంలో కురుస్తున్న వర్షం

**న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ:** బంగాళాఖాతంలోని పశ్చిమ ప్రాంతం నుంచి కోస్తా జిల్లాల వరకు ఉపరితల ఆవర్తనం, ఒడిశా నుంచి రాయలసీమ మీదుగా దక్షిణ తమిళనాడు వరకు మరో ఉపరితల ద్రోణి కారణంగా బుధవారం పలు జిల్లాల్లో చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసింది. ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లో వర్షం పడింది. పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వర్షం కురిసింది. భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట, కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని 23 మం డలాలు, నాలుగు మున్సిపాలిటీల్లో వర్షపు జల్లులు కురిశాయి. కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, తిమ్మాపూర్, జమ్మికుంట, చిగురుమామిడి, మానకొండూర్, సైదాపూర్, హుజూరాబాద్‌లో వర్షం కురిసింది. అత్యధికంగా శంకరపట్నం మండలంలో 3 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

**కిన్నెరసాని నుంచి దిగువకు నీరు**

**పాల్వంచ రూరల్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని కిన్నెరసాని రిజర్వాయర్ నుంచి బుధవారం రాత్రి 5వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. రెండు రోజులు గా కురుస్తున్న వర్షాలకు రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరుగడంతో ఒక గేటు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా, ప్రస్తుత నీటి మట్టం 405.9 అడుగులు ఉంది.



ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి నీళ్లు వదులుతున్న ఎమ్మెల్యేలు రాజయ్య, రమేశ్, సతీశ్‌కుమార్

## 'ధర్మసాగర్' నీటి విడుదల

**ధర్మసాగర్(వరంగల్) :** వరంగల్ అర్బన్ జిల్లా ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి నక్కల తూము, ఉత్తరకాల్వ ద్వారా ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. స్టేషన్ ఘన్‌పూర్, వర్ధన్నపేట, హుస్నాబాద్ ఎమ్మె ల్యేలు రాజయ్య, ఆరూరి రమేశ్, సతీశ్‌కుమార్ సం యుక్తంగా తూము తెరిచి నీటిని బుధవారం వదిలారు. అనంతరం ధర్మసాగర్ సర్పంచ్ కొలిపాక రజిత అధ్యక్షతన ఏర్పా టు చేసిన సమావేశంలో ఎమ్మెల్యేలు మాట్లాడారు. ఆరు దశాబ్దాల కిందట మూసేసిన ధర్మసాగర్ నక్క తూమును తెరిపించేందుకు రాష్ట్ర సర్కార్ రూ.63.40 లక్షలతో మరమ్మతు పనులు చేపట్టిందన్నారు. తూము పునరుద్ధరణతో 60 ఏండ్ల రైతుల కల నెరవేరిందన్నారు. కార్యక్రమంలో దేవాదుల ఈఈ సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సినీ ఫక్కీలో చోరీ

- నోట్ల కట్టలు సరిచేస్తూ నగదు అపహరణ
- పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు
- సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుల గుర్తింపు






1. మెట్‌పల్లి ఆంధ్రాబ్యాంకులో మహిళ వెనుకాల నిల్చున్న నిందితుడు 2. నోట్ల కట్టలు తీసుకొని సరి చేస్తూ..(సీసీ ఫుటేజీలో)

**మెట్‌పల్లి, నమస్తే తెలంగాణ:** ఖాతాలో డబ్బులు జమ చేసేందుకు బ్యాంక్‌కు వచ్చిన ఓ మహిళ దృష్టిని మళ్లించి రూ. 18,500 నగదు అపహరించుకు వెళ్లిన ఘటన జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని ఆంధ్రాబ్యాంకులో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మండలం ఆరపేటకు చెందిన శ్రీరాం కవిత మహిళా సమాఖ్య సభ్యురాలు. సంఘానికి చెందిన రూ. లక్ష నగదును తమ సంఘం ఖాతాలో జమ చేసేందుకు బుధవారం బ్యాంక్‌కు వచ్చింది. క్యాష్ కౌంటర్‌లో ఇచ్చేందుకు వరుసలో ఉండగా ఇద్దరు వ్యక్తులు ఆమె వద్దకు వచ్చారు. నోట్లు అలా కాదు ఇలా పెట్టాలంటూ ఒకడు తీసుకుని లెక్కిస్తుండగా మరొకడు ఆమె దృష్టిని మరల్చేలా మాటల్లో దింపాడు. అంతలోనే సరిచేసినట్టుగా చెప్పి నోట్ల కట్టలను ఆమె చేతిలో పెట్టాడు. వాటిని తీసుకుని క్యాష్ కౌంటర్‌లో ఇచ్చేసరికి అందులో రూ.18,500 తక్కువగా ఉన్నట్టు తేలింది. దీంతో నోట్లకట్టలను సరిచేస్తామని చెప్పిన వ్యక్తుల కోసం చూడగా అప్పటికే వారు అక్కడి నుంచి జారుకున్నారు. బాధితురాలు ఈ విషయాన్ని బ్యాంక్ అధికారులకు తెలిపింది. సీసీ ఫుటేజీలను పరిశీలించి, ఇద్దరు వ్యక్తులను గుర్తించి వారి కోసం గాలించినా ఫలితం లేకపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అశోక్ తెలిపారు.

## ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటి నిల్వ వివరాలు



(జూన్1 నుంచి ఇప్పటివరకు 371.417 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి)

**కృష్ణా బేసిన్**

| ప్రాజెక్టు | ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | పూర్తినీటిమట్టం (అడుగుల్లో) | ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో) | పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో) | ప్రస్తుతం (టీఎంసీల్లో) |
|---|---|---|---|---|---|---|
| ఆల్మట్టి | 6003 | 6003 | 1705 | 1704.72 | 128.72 | 128.19 |
| నారాయణపూర్ | 4900 | 11752 | 1615 | 1609.76 | 37.646 | 29.44 |
| జూరాల | 2441 | 4791 | 1045 | 1039.08 | 9.66 | 6.263 |
| తుంగభద్ర | 10550 | 466 | 1633 | 1617.33 | 100.86 | 51.31 |
| శ్రీశైలం | 1058 | 30 | 885 | 779.1 | 215.807 | 20.05 |
| నాగార్జునసాగర్ | 641 | 641 | 590 | 500.40 | 312.045 | 115.943 |
| పులిచింతల | 1686 | 0 | 175 | 118.94 | 45.77 | 3.55 |
| ప్రకాశం బ్యారేజీ | 8432 | 8432 | 54.95 | 55.65 | 3.070 | 2.72 |

**గోదావరి బేసిన్**

| ప్రాజెక్టు | ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | పూర్తినీటిమట్టం (అడుగుల్లో) | ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో) | పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో) | ప్రస్తుతం (టీఎంసీల్లో) |
|---|---|---|---|---|---|---|
| జైక్వాడ్ | 0 | 3333 | 1522 | 1511.55 | 102.732 | 64.77 |
| కడెం | 1070 | 654 | 700 | 685.53 | 7.6 | 4.401 |
| ఎస్సారెస్పీ | 0 | 174 | 1091 | 1054.90 | 90.313 | 9.214 |
| సింగూరు | 0 | 355 | 1717.93 | 1708.69 | 29.91 | 17.60 |
| నిజాంసాగర్ | 617 | 135 | 1405 | 1380.50 | 17.803 | 1.394 |
| ఎల్లంపల్లి | 2688 | 418 | 485 | 472.77 | 20.175 | 10.88 |
| లోయర్‌మానేరు | 0 | 129 | 920 | 893.50 | 24.07 | 7.333 |
| ధవళేశ్వరం | 152171 | 152866 | 45 | 45 | 2.93 | 2.93 |

## పేదలు ఆత్మగౌరవంతో బతుకాలి

**బాన్సువాడ రూరల్ /నస్రుల్లాబాద్:** పేదలు ఆత్మగౌరవంతో బతుకాలని, అందుకే ప్రభుత్వ డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇస్తున్నదని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం దేశాయిపేట్, తాడ్కోల్, నస్రుల్లాబాద్ మండలం సంగెంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సింగూరు నీటి విషయంలో పలువురు రాజకీయాలు చేస్తున్నారని, దీనిపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం తాడ్కోల్‌లో 500 డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలకు భూమిపూజ చేస్తున్న మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి

## ఎంపీటీసీ భర్తపై హత్యాయత్నం

**మేళ్లచెర్వు:** సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు-2 ఎంపీటీసీ సభ్యురాలు బత్తుల రమాదేవి భర్త నాగరాజుపై హత్యాయత్నం జరిగింది. నాగరాజు బుధవారం ఉదయం బైక్‌పై వస్తుండగా గ్రామంలోని సబ్‌స్టేషన్ వద్ద ముఖానికి ముసుగులు ధరించిన కొందరు వ్యక్తులు అడ్డగించి గొడ్డలితో దాడిచేశారు. దీంతో నాగరాజు తల, చేతికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని హుజూర్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. నాగరాజుకు స్థానికంగా ఉన్న మరో వర్గానికి ఎన్‌ఎస్‌పీ కాల్వ వద్ద ఉన్న స్థలం విషయంలో వివాదాలు ఉన్నాయని, ఇటీవల ఇరువర్గాలపై కేసులు నమోదైనట్టు ఎస్సై రవికుమార్ తెలిపారు.

## గంజాయి మొక్కల ధ్వంసం

**కంగ్టి:** కందిలో అంతరపంటగా సాగుచేస్తున్న గంజాయి మొక్కలను పోలీసులు బుధవారం ధ్వంసం చేశారు. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం ఎన్కెమూరి తండా శివారులో రాథోడ్ మారుతి, రాథోడ్ మరోనీబాయిలకు చెందిన రెండు ఎకరాల్లో కందిలో అంతర పంటగా సుమారు 18 గుంటల్లో గంజాయి పంట వేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు గంజాయి పంటపై దాడులు నిర్వహించి, మొక్కలను పెకిలించినట్టు కంగ్టి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి యాదవ్ తెలిపారు. దీని విలువ సుమారు రూ.5లక్షల వరకు ఉంటుందన్నారు.

# గుడుంబా తయారీపై ఉక్కుపాదం

- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్



**వరంగల్ ప్రధాన ప్రతినిధి-నమస్తే తెలంగాణ:** ' సీఎం ఆదేశం మేరకు గుడుంబా తయారీపై ఉక్కుపాదం మోపుతున్నాం. గుడుంబా తయారీదారులకు, విక్రయదారులకు ప్రత్యామ్నాయ ఉపాధిపై ప్రభుత్వం దృష్టిసారించింది' అని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ తెలిపారు. బుధవారం వరంగల్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎక్సైజ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లో డ్రగ్స్ వ్యవహారానికి సంబంధించి 11 కేసులు నమోదయ్యాయని, ఇప్పటి వరకు 22 మందిని అదుపులోకి తీసుకొని విచారించామని, రోజుకు ఇద్దరు ముగ్గుర్ని విచారిస్తున్నామని చెప్పారు. పూర్తి వివరాలు, ఆధారాలు సేకరించి డిసెంబర్‌లో ఆయా కేసులపై చార్జిషీట్ వేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గుడుంబా నియంత్రణ విషయం లో వరంగల్ రూరల్ జిల్లా రాష్ట్రంలోనే అగ్రభాగాన ఉందన్నారు. గంజాయి రవాణాపైనా రైల్వే , సివిల్ పోలీస్‌ల సహకారంతో ప్రత్యేక వ్యూహాన్ని అమలు చేసి అరికడుతున్నట్టు చెప్పారు. త్వరలో ఎక్సైజ్ ఎస్సై, కానిస్టేబుళ్ల బదిలీలను నిర్వహించనున్నట్టు తెలిపారు.



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని విజయ డెయిరీలో మేలుజాతి ఆవుదూడల పెంపక కేంద్రాన్ని బుధవారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న ప్రారంభించారు. ఆయన వెంట ఎంపీ నగేశ్, డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ లోక భూమారెడ్డి తదితరులున్నారు.




దక్షిణాఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని ఈ నెల 14న నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం పిరట్వాన్‌పల్లికి చెందిన చరణ్‌రాజ్ అధిరోహించాడు. హైదరాబాద్‌లోని కేశవ మెమోరియల్‌లో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఇతడు 13మంది సభ్యులతో కలిసి 5,895 మీటర్ల ఎత్తున్న శిఖరాన్ని అధిరోహించి త్రివర్ణపతాకాన్ని ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం సీఎం కేసీఆర్ ఫొటోను ప్రదర్శించారు. - ఉప్పునుంతల

## వచ్చే ఏడాదికల్లా కాళేశ్వరం పూర్తి



**మహాదేవ్‌పూర్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ సస్యశ్యామలం కానుందని సీఎంవో అదనపు కార్యదర్శి స్మితాసబర్వాల్ అన్నారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం అంబట్‌పల్లి పరిధిలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపడుతున్న మేడిగడ్డ బ్యారేజీని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. బ్యారేజీ పనులను పరిశీలించారు. వచ్చే ఏడాదికల్లా కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో సీఎం కేసీఆర్ ఉన్నారని, ఎప్పటికప్పుడు ప్రాజెక్ట్ పనుల పురోగతిపై నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

## 'కుంతియా మాటల్లో నిజం లేదు'

**పానగల్:** పీసీసీ నాయకత్వంలో ఎలాంటి మార్పు ఉండబోదని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా మాటల్లో వాస్తవం లేదని సీఎల్పీ ఉపనేత, నల్లగొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. అతి త్వరలో యువరక్తంతో కొత్త నాయకత్వం ఏర్పడుతుందన్నారు. ఈ మేరకు రాహుల్, సోనియాగాంధీని కలిసి చర్చించనున్నట్టు చెప్పారు. బుధవారం ఆయన నల్లగొండలోని మర్రిగూడలో సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి విలేకరులతో మాట్లాడారు. కుంతియా మాటలునమ్మి కార్యకర్తలు నిరుత్సాహానికి గురికావద్దన్నారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, తాను సీఎం కావడం ఖాయమంటూ జోస్యం చెప్పారు.



# కాయ్ రాజా కాయ్

### నంద్యాల ఉప ఎన్నికల్లో జోరుగా బెట్టింగ్‌లు.. రూ. వెయ్యి కోట్ల వరకు పందేలు కాస్తున్న వైనం

### రెండు పార్టీల అభ్యర్థుల ఖర్చు రూ.400 కోట్ల పైమాటే ?.. ఓటుకు రూ. ఐదు వేలపైనే

**జోగులాంబ గద్వాల, నమస్తే తెలంగాణ ప్రతినిధి :** నంద్యాల ఉప ఎన్నిక పలువురికి కాసుల పంట పండిస్తున్నది. అభ్యర్థుల గెలుపోటములపై బెట్టింగ్‌లు రూ. వెయ్యి కోట్లు దాటినట్టు తెలుస్తున్నది. పందెం అంటేనే గుర్తుకు వచ్చే కర్నూల్, అనంతపురం జిల్లాలు నంద్యాల ఎన్నికపైనే కన్నేశాయి. ఇక రెండు ప్రధాన పార్టీల మధ్య సాగుతున్న హోరాహోరీ పోరు కురుక్షేత్ర సంగ్రామాన్ని తలపిస్తుండటం గమనార్హం. నంద్యాల సెగ్మెంట్‌లోని 2.18 లక్షల మంది ఓటర్లకు కాసుల వర్షం కురుస్తున్నది. రెండు పార్టీలు విచ్చలవిడిగా డబ్బులు కుమ్మరిస్తున్నాయి. మా పార్టీ మీటింగ్‌కు రావాలంటూ ఒకరు, వేరే పార్టీ మీటింగ్‌కు వెళ్లవద్దంటూ ఇంకొక పార్టీ వాళ్లు పోటీలు పడి డబ్బులు పంచుతున్నారు. ప్రస్తుతం రోజుకు రూ.5 కోట్ల మేరకు ఇద్దరు అభ్యర్థులు ఖర్చు చేస్తున్నట్టు తెలుస్తున్నది.

**బెట్టింగ్ మాఫియా..**

నంద్యాల బెట్టింగ్ సరిహద్దులు దాటింది. ఇటు కర్నూల్, అటు బెంగళూర్ అడ్డాగా చేసుకొని బెట్టింగ్‌లు సాగుతున్నాయి. అధికార టీడీపీ నుంచి బ్రహ్మానందారెడ్డి, ప్రతిపక్ష వైసీపీ నుంచి శిల్పా మోహన్‌రెడ్డి పోరులో నిలిచారు. ఇంకా కాంగ్రెస్, రాయలసీమ పరిరక్షణ సమితి పేరిట పలువురు అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ వైసీపీ, టీడీపీ అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇదిలా ఉండగా నంద్యాలలోని ఆయా ప్రాంతాల్లో హిందూపూర్ ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణ, నంద్యాల, చింత అరుగులో వైసీపీ అధినేత జగన్ బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ నెల 23న పోలింగ్ జరుగనుండగా ఇప్పటి వరకు రూ.వెయ్యి కోట్ల బెట్టింగ్ పెట్టినట్టు రాజకీయ నేతలు చర్చించుకుంటున్నారు. ఇంత భారీ స్థాయిలో బెట్టింగ్ సాగడం ఇది రెండోసారిగా చెబుతున్నారు. గతంలో కడప పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సాగిన బెట్టింగ్‌ల కంటే ఈసారి ఎక్కువని తెలుస్తున్నది.

**భారీ ఖర్చు..**

నంద్యాల ఉపపోరు రణరంగంలో కోట్లు పారుతున్నాయి. ఒక్కో అభ్యర్థి రోజుకు రూ.2 కోట్ల నుంచి రూ.2.50 కోట్లు ఖర్చు పెడుతున్నట్టు తెలుస్తున్నది. ఇక్కడ ఓటుకు రూ.5 వేల వరకు పంపిణీ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ ఉప ఎన్నికలకు ఒక్కో పార్టీ అభ్యర్థి రూ.200 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు లెక్కలేస్తున్నారు.



హన్మకొండలో క్షీరాభిషేకం చేస్తున్న టీఆర్‌ఎస్వీ నాయకులు

## సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

**హన్మకొండ/జహీరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉద్యోగాలను భర్తీ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంపై కేయూ టీఆర్‌ఎస్వీ విభాగం విద్యార్థి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు విద్యార్థి విభాగం అధ్యక్షుడు బైరుపాక ప్రశాంత్ ఆధ్వర్యంలో బుధవారం కేయూ మొదటి గేటు వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తక్కళ్లపెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 27,660 పోస్టులను భర్తీ చేసిందని, ఈ ఏడాది మరో 84,676 పోస్టులను భర్తీ చేయనున్నట్టు సీఎం ప్రకటించడంపై నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కేయూ ఇన్‌చార్జి జెట్టి రాజేందర్, కోఆర్డినేటర్లు రంజిత్, రాజ్‌గోపాల్, సుధాకర్, రాకేశ్ పాల్గొన్నారు. కాగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి టీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్వీ జహీరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.




జహీరాబాద్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీఆర్‌ఎస్వీ నేతలు

## రూ.6 కోట్లతో అనంతగిరిలో ఆయుష్ దవాఖాన

**వికారాబాద్ కలెక్టరేట్:** వికారాబాద్ జిల్లా పరిధిలోని అనంతగిరి కొండల్లో ఆయుష్ దవాఖాన ఏర్పాటుకు రూ.6 కోట్లు మంజూరైనట్టు కలెక్టర్ దివ్య తెలిపారు. ఆయుష్ దవాఖాన ఏర్పాటు, టూరిజం అభివృద్ధిపై బుధవారం ఆమె ఆయుష్ డైరెక్టర్ రాజేందర్‌రెడ్డి, అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ పీకే ఝాలతో కలిసి అనంతగిరి అటవీ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. కలెక్టర్ దివ్య మాట్లాడుతూ అనంతగిరిలో 50 పడకలతో ఆయుష్ దవాఖాన ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అటవీ ప్రాంతంలో ఔషధ మొక్కలను పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. పర్యాటకావృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. సందర్శకులు గుట్టపైకి వెళ్లేందుకు వీలుగా బ్యాటరీ వాహనాలు ఏర్పాటు చేస్తామన్నారు. కోటి రూపాయలతో హరిత హోటల్ పునరుద్ధరణ పనులు చేపడుతామని చెప్పారు.

## 19న సూర్యాపేటలో విప్రహిత భవనానికి శంకుస్థాపన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సూర్యాపేటలో నిర్మించనున్న విప్రహిత భవనానికి ఈనెల 19న రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ భవన నిర్మాణానికి సూర్యాపేట డాక్టర్ ఏ రామయ్య విజయవాడ జాతీయ రహదారికి సమీపంలో ఎకరం స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. కోటి రూపాయల అంచనా వ్యయంతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు.

## జమ్మికుంటలో 'టాస్క్‌ఫోర్స్' దాడులు

**జమ్మికుంట:** కరీంనగర్ జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం జమ్మికుంటలో దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున కల్తీ సరుకులను పట్టుకున్నారు. సీఐ ఎండీ గౌస్‌బాబా ఆధ్వర్యంలో 15 మంది సిబ్బంది పలు దుకాణాలు, గోదాములు, ఆయిల్ మిల్లుల్లో తనిఖీలు చేశారు. మొదట బచ్చు వీరమల్లు ఆయిల్ మిల్లులో పటికతో నూనె తీస్తున్న విషయాన్ని గుర్తించిన అధికారులు ఆశ్చర్యపోయారు. గుడుంబా తయారీలో వాడే పటిక నిల్వలపై ఆరా తీశారు. వెంటనే నూనె నమూనాలు సేకరించి ఆయిల్ మిల్లును సీజ్ చేశారు. శివాలయానికి సమీపంలోని గణేశ్ ఫ్లోర్‌మిల్లులో తనిఖీచేయగా కారం, పసుపులో ఇతర పదార్థాలను కలిపిన విషయాన్ని గుర్తించారు. 300 కిలోల కారం, 20 కిలోల పసుపును స్వాధీనం చేసుకున్నారు. రేండ్ల మొగిళి, రేండ్ల సమ్మయ్య దుకాణంలో రూ.లక్ష విలువజేసే నిషేధిత గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు. కటకం రవీందర్‌కు చెందిన మహేశ్వర కిరాణంలో ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం, 18 లీటర్ల కిరోసిన్, రూ.5 వేల విలువజేసే గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మిర్యాలకారి రాజు వద్ద అక్రమంగా నిల్వ ఉన్న 80 లీటర్ల కిరోసిన్ పట్టుకున్నారు. ఆర్‌ఎస్‌కే ఏజెన్సీ నిర్వాహకులైన రమేశ్, శేఖర్ దుకాణం, గోదాముల్లో టాస్క్‌ఫోర్స్ దాడుల్లో రూ.10 లక్షల విలువజేసే కాలం చెల్లిన సరుకులు, ఆహార పదార్థాలు పట్టుబడ్డాయి.

## చంద్రన్న వర్గం సానుభూతిపరుడి హత్య

**కొత్తగూడెం ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీలోని రెండు వర్గాల మధ్య జరుగుతున్న వివాదాల నేపథ్యంలో ఓ వ్యక్తి హతమయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం నర్సంపేటకు చెందిన రాయల భాస్కర్ (56) కొంతకాలంగా న్యూడెమోక్రసీలోని చంద్రన్న వర్గానికి సానుభూతి పరుడిగా ఉన్నాడు. నాలుగు నెలల కిందట అంతర్గత విభేదాలతో రాయల వర్గంలో చేరాడు. నర్సంపేటకు సమీపంలోని రాజీవ్‌నగర్ కాలనీలో పోడు భూములను సాగు చేసుకొని జీవిస్తున్నాడు. చంద్రన్న వర్గానికి చెందిన రామన్న అజ్ఞాత దళం సభ్యుడు మోరె రవి సుమారు 15 మంది సాయుధులు బుధవారం ఉదయం భాస్కర్ ఇంటికి వచ్చారు. గమనించిన భాస్కర్ పారిపోయేందుకు ప్రయత్నించగా వెంబడించి పట్టుకొని ఇంటి వద్దకు తీసుకొచ్చి తీవ్రంగా కొట్టడంతో ప్రాణాలు వదిలాడు. ఎస్పీ అంబర్ కిషోర్‌ఝా పాల్వంచ ప్రభుత్వ దవాఖానలో భాస్కర్ మృతదేహాన్ని పరిశీలించారు.

## నదిలో మునిగి ముగ్గురి గల్లంతు

- ప్రాణహితలో ఇద్దరు బాలికలు
- చెన్నూర్ వద్ద గోదావరిలో యువకుడు

**కాళేశ్వరం/చంద్రాపూర్/చెన్నూర్:** వేర్వేరు చోట్ల బుధవారం ముగ్గురు గల్లంతయ్యారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ తాలూకా కేంద్రానికి సరిహద్దులో ఉన్న ప్రాణహిత నదిలో కాళేశ్వరం వద్ద త్రివేణి సంగమంలోని అవతలి వైపు గల ప్రాణహిత నదిలో ముగ్గురు బాలికలు ప్రమాదవశాత్తు మునిగారు. వీరిలో ఒకరు ఒడ్డుకు చేరుకోగా, మరో ఇద్దరు గల్లంతయ్యారు. చెన్నూర్ వద్ద ఓ యువకుడు గోదావరిలో మునిగిపోయాడు. పోలీసుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన పస్తామ తిరుపతి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన సారయ్య వలస కూలీలు. వీరు తమ కుటుంబాలతో కాళేశ్వరం నుంచి గోదావరి నది దాటి మహారాష్ట్రలో వలస జీవనాన్ని సాగిస్తున్నారు. ప్రాణహిత నది ఒడ్డున తాత్కాలిక గుడారాలు వేసుకొని ఉంటున్నారు. తిరుపతి కూతుళ్లు స్వరూప(13), స్వప్న (11), కటుబోంజి సారయ్య కూతురు వెంకటరమణ (12) బుధవారం ప్రాణహిత నదిలోకి స్నానానికి దిగారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో నదిలో నీటి ప్రవాహం ఉధృతంగా ఉంది. ఇది తెలియక పిల్లలు నదిలోకి దిగడంతో ముగ్గురు మునిగిపోయారు. కొద్దిసేపటికి స్వరూప అతికష్టం మీద నది ఒడ్డుకు చేరుకోగా.. స్వప్న, వెంకటరమణ గల్లంతయ్యారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు గజ ఈతగాళ్లను రప్పించి, ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకూ ఇద్దరి ఆచూకీ లభించలేదని సిరొంచ డీఎస్పీ గజానంద్ రాథోడ్ తెలిపారు.

**పుణ్యస్నానానికి వచ్చి యువకుడి గల్లంతు**



తిరుపతి (ఫైల్)

మంచిర్యాల జిల్లా చెన్నూర్ సమీపంలోని గోదావరి నదిలో ఆలం తిరుపతి(19) గల్లంతయ్యాడు. భీమారం మండలం రెడ్డిపల్లికి చెందిన తిరుపతి తన కుటుంబ సభ్యులు ఆరుగురితో ఆటోలో పుణ్య స్నానం చేసేందుకు గోదావరికి వెళ్లారు. కుటుంబ సభ్యులు నది తీరంలో స్నానం చేస్తుండగా, తిరుపతి కాస్త లోపలికి వెళ్లగా లోతు ఉండటంతో గల్లంతయ్యాడు. గజ ఈతగాళ్లతో గాలిస్తున్నామని ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.



శ్రీలంక క్రికెట్ అభిమానులతో భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ, బాలీవుడ్ తార అనుష్కశర్మ సందడి. చిత్రంలో చీఫ్ కోచ్ రవిశాస్త్రి

## కాస్పరోవ్‌తో ఆనంద్ డ్రా

**సెయింట్ లూయిస్:** ప్రపంచ మాజీ చాంపియన్ గ్యారీ కాస్పరోవ్‌తో జరిగిన సెయింట్ లూయిస్ ర్యాపిడ్ చెస్ ఆరోరౌండ్ గేమ్‌ను భారత సూపర్ గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్‌డ్రాతో సరిపెట్టాడు. దాదాపు 12 ఏండ్ల అనంతరం వీరిద్దరూ మళ్లీ ముఖాముఖి తలపడ్డారు. చెస్ అభిమానులంతా ఎంతో ఉత్కంఠగా వీరిమధ్య మ్యాచ్‌ను తిలకించారు. ఇద్దరూ ఎలాంటి సాహసాలకు పోకుండా డ్రాతో సరిపెట్టుకోవడంతో ఫ్యాన్స్ నిరాశ పడ్డారు. ఆరు రౌండ్లు ముగిసిన ఈ టోర్నీలో ఆనంద్ 5 పాయింట్లు మాత్రమే సాధించి కాస్పరోవ్, కర్జాకిన్‌లతో సంయుక్తంగా 9వ స్థానంలో కొనసాగుతున్నాడు. రష్యా గ్రాండ్ మాస్టర్ ఇయాన్ నెపోమినియాచి 8 పాయింట్లతో తొలిస్థానంలో కొనసాగుతున్నాడు.

**హారిక విజయం**

అబుదాబి అంతర్జాతీయ చెస్ ఫెస్టివల్‌లో భాగంగా జరుగుతున్న మాస్టర్స్ టోర్నమెంట్‌లో తెలుగు అమ్మాయి ద్రోణవల్లి హారిక దూసుకెళుతున్నది. అజర్‌బైజాన్‌కు చెందిన రౌఫ్ మామెదోవ్‌పై విజయంతో టోర్నీలో వరుసగా రెండో విజయం నమోదు చేసింది. ప్రపంచ నంబర్ 9 ర్యాంక్ ప్లేయర్ హారిక ఈ గేమ్‌లో తెల్ల పావులతో బరిలోకి దిగింది. అటాకింగ్ వ్యూహంతో ఆడిన హారిక 56 ఎత్తుల్లో మూడో ర్యాంకర్ రౌఫ్ ఆట కట్టించింది.

## బౌన్సర్‌కు పాక్ యువ క్రికెటర్ బలి

**కరాచి:** బ్యాటింగ్ చేస్తూ హెల్మెట్ ధరించకపోవడంతో పాకిస్థాన్ దేశానికి చెందిన యువ క్రికెటర్ జుబైర్ అహ్మద్ దుర్మరణం పాలయ్యాడు. ఆ దేశంలోని మర్దాన్‌లో ఈనెల 4న ఓ క్లబ్ మ్యాచ్‌లో జుబైర్ ఆడుతున్న సందర్భంగా బౌలర్ విసిరిన బౌన్సర్ అతని తలను బలంగా తాకడంతో అక్కడికక్కడే మరణించాడు. మంచి బ్యాట్స్‌మన్‌గా పేరు తెచ్చుకుని ఎంతో భవిష్యత్ ఉన్న యువ బ్యాట్స్‌మన్ ఇప్పటికి నాలుగు లిస్ట్ ఏ మ్యాచ్‌లాడాడు. టీ 20 గేముల్లో క్వెట్టా బియర్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. జుబైర్ మృతికి పాకిస్థాన్ క్రికెట్ బోర్డు సంతాపం ప్రకటించింది. 'జుబైర్ అహ్మద్ మరణం తీవ్రంగా కలిచివేస్తుంది. ఈ అకాల మరణం ప్రతి క్రికెటర్ మరింత జాగ్రత్తగా ఉండాలన్న విషయాన్ని చెబుతుంది. అన్ని వేళలా తప్పకుండా అందరూ హెల్మెట్ ధరించాలి. జుబైర్ కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాం' అని పీసీబీ అధికారిక ట్విట్టర్ ద్వారా పేర్కొంది.



జుబైర్ అహ్మద్

**వార్నర్‌కు తప్పిన ముప్పు**

ప్రాక్టీస్ మ్యాచ్ ఆడుతున్న ఆస్ట్రేలియా జట్టు ఉప సారథి డేవిడ్ వార్నర్‌కు పెను ప్రమాదం తప్పింది. మంగళవారం ఆసీస్ రెండు జట్లుగా విడిపోయి మ్యాచ్ ఆడుతున్న సందర్భంగా జోష్ హాజిల్‌వుడ్ బౌలింగ్‌లో హుక్‌షాట్‌కు ప్రయత్నించిన వార్నర్ మెడకు బౌన్సర్ బలంగా తాకడంతో క్రీజులో మోకాళ్లపై కూలబడి నొప్పితో విలవిలలాడాడు. దీంతో అతన్ని గ్రౌండ్ బయటకు తీసుకెళ్లారు. అనంతరం చికిత్సతో కోలుకున్న వార్నర్‌కు అంత పెద్ద దెబ్బ తగలలేదని ఆసీస్ జట్టు యాజమాన్యం ప్రకటించింది. దీంతో వార్నర్ .. బంగ్లాదేశ్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్‌కు అందుబాటులో ఉండేది ఖాయమైంది. ఆస్ట్రేలియా క్రికెటర్ పిలిఫ్ హ్యూస్ బౌన్సర్ తగిలి గాయపడి చనిపోయిన సంగతి తెలిసిందే.





యువరాజ్‌సింగ్

## 'యో-యో' పరీక్షలో యువీ, రైనా ఫెయిల్

**న్యూఢిల్లీ:** శ్రీలంకతో వన్డే సిరీస్‌కు సీనియర్ క్రికెటర్లు యువరాజ్‌సింగ్, రైనాను సెలెక్టర్లు ఎందుకు ఎంపిక చేయలేదో తెలిసిపోయింది. జాతీయ క్రికెట్ అకాడమీలో నిర్వహించిన 'యో-యో' సామర్థ్య పరీక్షలో విఫలమైన కారణంగానే వీరిద్దరిని పక్కకు పెట్టినట్లు బోర్డు అధికారి ఒకరు పేర్కొన్నారు. సిరీస్‌లకు జట్టును ఎంపిక చేసే క్రమంలో ప్రతి ఒక్కరు కూడా 'యో-యో' పరీక్ష తప్పక పాస్ కావాల్సి ఉంటుంది. ఇంతకుముందున్న 'బీప్' పద్ధతికి అడ్వాన్స్‌గా వచ్చిన ఈ 'యో-యో' సామర్థ్య పరీక్షలో కచ్చితమైన ఫలితం వస్తుంది. ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాలంటే ప్రతి ఆటగాడు 19.5 నుంచి ఆ పై స్కోరు నమోదు చేయాల్సి ఉంటుంది. కానీ యువీ, రైనా ఇద్దరు ఇందులో ఫెయిల్ అయ్యారు. యువీ కనీసం 16 పాయింట్లను కూడా అందుకోలేకపోయాడు. మరోవైపు కెప్టెన్ కోహ్లీ, జడేజా, మనీశ్‌పాండే మాత్రం రెగ్యులర్‌గా 21 పాయింట్లను అందుకుంటారట. ఇక ఆస్ట్రేలియా క్రికెటర్లు అయితే సగటున 21 మార్క్‌ను సులువుగా నమోదు చేస్తారట.



రైనా

## టెస్టు సిరీస్ ఓటమిపై నివేదిక ఇవ్వండి



లంక క్రీడామంత్రి జయశేఖర, చీఫ్ సెలక్టర్ జయసూర్య

**కొలంబో:** భారత్ చేతిలో వైట్ వాష్ ఓటమిపై శ్రీలంక క్రీడా శాఖ.. ఆ దేశ క్రికెట్ బోర్డును నివేదిక కోరింది. క్లీన్‌స్వీప్ కావడానికి గల కారణాలను మాత్రమే తెలుసుకోవాలని ఆశిస్తున్నామని, ఇందులో జట్టు సామర్థ్యాన్ని కించపరిచేలా వ్యవహరించడంలేదని శ్రీలంక క్రీడామంత్రి దయసిరి జయశేఖర బుధవారం మీడియాకు తెలిపారు. 'జట్టు సామర్థ్యంపై మేం ఎలాంటి సందేహాలు వ్యక్తం చేయడం లేదు. 0-3 తేడాతో ఓడిపోవడానికి గల కారణాలను మాత్రం మేం తప్పనిసరిగా తెలుసుకోవాలి కోరుకుంటున్నాం. అందుకే ఈ విషయంలో సవివరమైన నివేదిక సమర్పించాలని శ్రీలంక క్రికెట్ బోర్డు (ఎస్ఎల్‌సీ)ని ఆదేశించాను. భారత్ ప్రపంచ నంబర్‌వన్ జట్టు అని కూడా తెలుసు. ఈ పాయింట్‌లో కూడా పరాజయాన్ని చూస్తున్నాం' అని జయశేఖర పేర్కొన్నారు. ఈ ఓటమితో శ్రీలంక అభిమానులు సామాజిక మాధ్యమాల్లో బోర్డుతోపాటు చీఫ్ సెలక్టర్ సనత్ జయసూర్యపై దుమ్మెత్తిపోస్తున్నారు.

# ఫిట్‌నెస్ ఉంటేనే..

- జట్టులో స్థానం
- చీఫ్‌కోచ్ రవిశాస్త్రి

**ఫిట్‌నెస్..ఫిట్‌నెస్ ప్రస్తుతం అందరూ పటిస్తున్న మంత్రం ఇది. ఫిట్‌నెస్ ప్రమాణాలను కచ్చితంగా అందుకోవాల్సిందే, లేకపోతే ఏ స్థాయి క్రికెటర్‌కైనా ఉద్వాసన తప్పదన్న సెలెక్షన్ కమిటీ చైర్మన్ వ్యాఖ్యలు మరువక ముందే చీఫ్ కోచ్ కూడా అదే పంథాలో పయనిస్తున్నాడు. వచ్చే ప్రపంచకప్ నాటికి మేటి జట్లకు దీటుగా రూపొందే క్రమంలో ఫిట్‌నెస్ కీలకమని రవిశాస్త్రి స్పష్టం చేశాడు. ఈ నేపథ్యంలో పలు అంశాలపై శాస్త్రి మీడియాతో మాట్లాడాడు.**



రవిశాస్త్రి

ప్రపంచకప్ గెలువడమనేది ప్రతి ఒక్కరి కల. నాలుగేండ్లకోసారి జరిగే మెగా టోర్నీలో విజేతగా నిలిచేందుకు జట్లన్నీ పక్కా ప్రణాళికలతో సిద్ధమవుతూ ఉంటాయి. ఇందుకోసం దేశవాళీ క్రికెట్‌లో ప్రతిభ చాటుతున్న యువ క్రికెటర్లకు అవకాశం కల్పిస్తూ వారిని వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ ఉంటాయి. సీనియర్లు, జూనియర్ల మేళవింపుతో జట్టును ఎంపికచేస్తూ వరల్డ్‌కప్ నాటికి దుర్భేద్యమైన జట్టును రూపొందించేందుకు సమాయత్తమవుతూ ఉంటాయి. ఈ క్రమంలోనే ప్రస్తుతం భారత్ కూడా అదే పనిలో పడింది. ఓ వైపు సీనియర్ క్రికెటర్ల ప్రాధాన్యాన్ని గుర్తిస్తూనే..కుర్రాళ్లకు అవకాశం కల్పిస్తున్నాయి. శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి మంచి ఊపు మీదున్న కోహ్లీ సేన వన్డే సిరీస్‌కు సిద్ధమైంది. దాదాపు పూర్తిస్థాయి జట్టునే కొనసాగిస్తూ అశ్విన్, జడేజా, షమీ, ఉమేశ్‌కు విశ్రాంతినిచ్చింది. మరోవైపు నిలకడగా రాణిస్తున్న అక్షర్‌పటేల్, చాహల్, కుల్దీప్, శార్దుల్ ఠాకూర్‌లను ఎంపిక చేసింది. ఆదివారం ఐదు వన్డేల సిరీస్‌కు తెరలేవనున్న నేపథ్యంలో టీమ్‌ఇండియా ప్రధా న కోచ్ శాస్త్రి పలు అంశాలను పంచుకున్నాడు.

**గెలుపు, ఓటములు ఆటలో భాగం:**

ఏ ఆటలోనైనా గెలుపు, ఓటములనేవి భాగం. ఆఖరు వరకు విజయం కోసం శ్రమించి ఓడినా కూడా అంత బాధ అనిపించదు. అది అసలు సమస్య కాదు. ఓటమివైపు నిలిచినా..పోరాడారన్న భావన తలెత్తుకునేలా చేస్తుంది. ఇలాంటి క్రమశిక్షణనే మనకు లంకతో టెస్ట్ సిరీస్‌లో స్పష్టంగా కనిపించింది. సిరీస్ మొత్తమ్మీద రెండు నో బాల్స్ మాత్రమే నమోదు కాగా, కేవలం రెండు క్యాచ్‌లు నేలపాలయ్యాయి. దీన్ని భవిష్యత్తులోనూ కొనసాగించాలనుకుంటున్నామని శాస్త్రి అన్నాడు.

**బౌలింగ్ బెంచ్ భేష్:**

ప్రస్తుత భారత జట్టు బౌలింగ్ బెంచ్ పటిష్ఠంగా ఉన్నది. మహ్మద్ షమీ, ఉమేశ్ యాదవ్ ఎలాంటి పిచ్‌లపైనైనా నిలకడగా గంటకు 140-145 కి.మీల వేగంతో బౌలింగ్ చేస్తున్నారు. తమదైన స్వింగ్ బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. మరోవైపు సుదీర్ఘ ఫార్మాట్‌లో టాప్ బౌలర్లుగా కొనసాగుతున్న అశ్విన్, జడేజా తమ సూపర్ ఫామ్‌తో అదరగొడుతున్నారు. సుడులు తిరిగే స్పిన్‌తో ప్రత్యర్థి జట్లను కట్టిపడేస్తున్నారు. జట్టులోని యువ బౌలర్లంతా కోచ్ భరత్ అరుణ్ దగ్గర ఓనమాలు దిద్దినవారే. ఇందులో కుల్దీప్‌యాదవ్, బుమ్రా, అక్షర్‌పటేల్ లాంటి వాళ్లున్నారు. కుల్దీప్ ఇప్పుడిప్పుడే జాతీయజట్టులో నిలదొక్కుకుంటున్నాడు. అద్భుత ప్రతిభ ఉన్న కుల్దీప్‌ను టెస్ట్‌లే గాకుండా వన్డేల్లోనూ అవకాశమిస్తున్నామని శాస్త్రి చెప్పుకొచ్చాడు.

**హార్దిక్ అదనపు బలం:**

హార్దిక్‌పాండ్యా జట్టుకు అదనపు బలంగా మారాడు. టెస్ట్‌లకు అతను కొత్తే అయినా..ఏ మాత్రం తడబాటు లేకుండా దూకుడుగా ఆడుతున్నాడు. కెప్టెన్ కోహ్లీ కూడా ఇదే అన్నాడు. లంకతో సిరీస్ ద్వారా హార్దిక్ రూపంలో అసలైన ఆల్‌రౌండర్ దొరికాడని. భరత్ అరుణ్ పర్యవేక్షణలో హార్దిక్ రోజురోజుకు రాటుదేలుతున్నాడు. ప్రస్తుతం ఆఫ్‌కట్టర్ల మీద దృష్టిపెట్టిన ఈ యువ ఆల్‌రౌండర్ ఎనలేని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నాడని రవి అన్నాడు.

**ఫిట్‌నెస్ ప్రధానం:**

జట్టులో కొనసాగాలంటే ఫిట్‌నెస్ తప్పనిసరి. ఫిట్‌నెస్ లేకుండా నెట్టుకురావడం కష్టం. రానున్న ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని ఆటగాళ్ల ఫిట్‌నెస్ కీలకంగా మారింది. ఫీల్డింగ్‌లో అత్యుత్తమ ప్రమాణాలు అందుకున్న వాళ్లే తుది జట్టులో ఉంటారు. మేటి జట్లకు దీటైన పోటినివ్వాలంటే ఫీల్డింగ్‌లో రాణించాల్సిందే. అలా ఫిట్‌నెస్ ప్రమాణాలను అందిపుచ్చుకోవడంలో విఫలమైన ఏ ఆటగాడైనా..తుది జట్టులో చోటు దక్కించుకోవడం కష్టం. ఫిట్‌నెస్ తమ ప్రాధాన్య అంశాల్లో ఒకటిగా మారింది.

**బ్యాటింగ్ బాధలు తప్పాయి:**

జట్టులో బ్యాటింగ్ బాధలు తప్పాయి. ఇంతకుమందు ఉన్న సమస్యలు తీరాయి. ముఖ్యంగా నిలకడలేమితో సతమతమైన ఓపెనింగ్ జోడీ గాడిలో పడింది. విజయ్ గైర్హాజరీలో జట్టులోకొచ్చిన ధవన్..తన సహజశైలిలో ఆడుతూ రెండు సెంచరీలు నమోదు చేశాడు. మరోవైపు టెస్ట్ స్పెషలిస్టు పుజార తన అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. ప్రత్యర్థి జట్టు ఏదైనా పరుగులు సాధించడమే లక్ష్యంగా బ్యాటింగ్ చేస్తున్నాడు. మిడిలార్డర్ కెప్టెన్ కోహ్లీ, రహానేలతో దుర్భేద్యంగా కనిపిస్తుండగా, హార్దిక్ చేరికతో లోయార్డర్ మరింత బలోపేతమైందని శాస్త్రి పేర్కొన్నాడు.

**ప్రాధాన్యాలు ఏంటో తెలుసు:**

వచ్చే ఏడాది వరుస టెస్ట్ సిరీస్‌లతో పాటు 2019లో ప్రపంచకప్ లాంటి మెగా టోర్నీ ఉంది. నాలుగేండ్లకోసారి జరిగే ప్రపంచకప్ ఉన్న ప్రాధాన్యమేంటో తెలుసు. అభిమానుల అంచనాలకు అనుగుణంగా రాణించాల్సి ఉంటుంది. మరోవైపు టెస్ట్ క్రికెట్ దీనికి పూర్తి భిన్నమైంది. ప్రత్యర్థి జట్లకు తగ్గట్లు ప్రణాళికలు రచించుకుంటూ అడుగులు వేయాల్సి ఉంటుంది. అందుకే దేని ప్రాధాన్యాలు దానికే ఉంటాయి. సుదీర్ఘ ఫార్మాట్ ద్వారా జట్టు సత్తా ఏంటో తెలిసివస్తుందని రవి అన్నాడు.



రోహిత్

## వైస్ కెప్టెన్సీ గొప్ప గౌరవం

**పల్లెకిలె:** భారత వన్డే జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించడం తనకు దక్కిన గొప్ప గౌరవమని రోహిత్‌శర్మ అన్నాడు. శ్రీలంకతో ఐదు వన్డేల సిరీస్ కోసం సెలెక్షన్ కమిటీ రోహిత్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. తన అంతర్జాతీయ కెరీర్‌లో ఎన్నో అద్భుత రికార్డులు సొంతం చేసుకున్న ఈ ముంబైకర్..టెస్ట్ ఫార్మాట్‌లో మాత్రం అంతగా నిలదొక్కుకోలేకపోతున్నాడు. 'వైస్ కెప్టెన్ హోదా దక్కడం గౌరవంగా భావిస్తున్నా. పదేండ్ల క్రితం జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తే చాలనుకున్నాను. తనకు దక్కిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తా. వైస్ కెప్టెన్సీ గురించి అంతగా ఆలోచించడం లేదు. ఆ హోదాను ఆస్వాదించాలనుకుంటున్నా' అని రోహిత్ అన్నాడు.



సాహా

### ధోనీ నీడలో నుంచి బయటపడ్డాడు

భారత వికెట్‌కీపర్, బ్యాట్స్‌మన్ వృద్ధిమాన్ సాహాపై చీఫ్ కోచ్ రవిశాస్త్రి ప్రశంసలు కురిపించాడు. అతని బ్యాటింగ్, వికెట్‌కీపింగ్ నైపుణ్యం అద్భుతమని శాస్త్రి కొనియాడాడు. దేశవాళీ క్రికెట్‌లో ఏండ్లుగా అతను పడ్డ కష్టం ఇప్పుడు కనిపిస్తున్నదని అన్నాడు. ' అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యుత్తమ వికెట్‌కీపర్లలో ఒకడైన ధోనీ వారసునిగా జట్టులోకొచ్చిన సాహా అతని నీడలో నుంచి బయటపడ్డాడు. సిరీస్ సిరీస్‌కు మరింత మెరుగవుతున్నాడు. శ్రీలంకతో ముగిసిన టెస్ట్ సిరీస్‌లో అటు బ్యాటింగ్‌తో పాటు కీపింగ్‌లో రాణించాడు. క్లిష్టమైన లంక పిచ్‌లపై కూడా అతని కీపింగ్ అద్భుతంగా ఉంది. ఇదే అతన్ని ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యుత్తమ వికెట్‌కీపర్‌గా నిలిపింది' అని శాస్త్రి అన్నాడు.

## సిన్సినాటి ఓపెన్‌లో పేస్ జోడీ ఔట్

**న్యూఢిల్లీ:** సిన్సినాటీ ఓపెన్‌లో భారత వెటరన్ లియాండర్ పేస్ పోరాటం ఆదిలోనే ముగిసింది. డబుల్స్ మొదటి రౌండ్‌లో పేస్, అలెగ్జాండర్ జ్వెరెవ్ జోడీ 6-2, 6(2)-7, 6-10 తేడాతో స్పెయిన్ ద్వయం ఫెలిసియానో లోపెజ్, మార్క్ లోపెజ్ చేతిలో ఓడిపోయింది. ఇదే టోర్నీలో రోహన్‌బోపన్నకు తొలి రౌండ్‌లో బై లభించింది.

## బల్గేరియా సెమీస్‌లో లక్ష్యసేన్

**న్యూఢిల్లీ:** బల్గేరియా ఓపెన్ అంతర్జాతీయ సిరీస్‌లో భారత యువ షట్లర్ లక్ష్యసేన్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. గంటా పదినిమిషాల పాటు జరిగిన క్వార్టర్స్‌లో లక్ష్యసేన్ 20-22, 21-18, 21-15 తేడా మైఖేల్ రోగాల్‌స్కీ(పోలండ్)పై విజయం సాధించాడు. గురువారం జరిగే సెమీస్‌లో దినుక కరుణరత్న(శ్రీలంక)తో లక్ష్యసేన్ తలపడుతాడు. మరోవైపు మహిళల క్వార్టర్స్‌లో వైష్ణవి రెడ్డి 21-16, 17-21, 17-21తో మరియా దెల్చెవా(బల్గేరియా) చేతిలో పోరాడి ఓడింది.



# తెలుగు టైటాన్స్‌కు ఏడో ఓటమి



### గుజరాత్ చేతిలో పరాజయం
### హర్యానా, తమిళ్ మ్యాచ్ డ్రా
### ప్రొ కబడ్డీ లీగ్

**అహ్మదాబాద్:** ప్రొ కబడ్డీ లీగ్ ఐదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టు పేలవ ప్రదర్శన కొనసాగుతున్నది. బుధవారం గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్‌తో జరిగిన ఇంటర్ జోన్ మ్యాచ్‌లో 29-19 పాయింట్ల తేడాతో టైటాన్స్ జట్టు ఘోరంగా ఓడింది. ఇటు రైడింగ్‌లోనూ అటు ట్యాకిలింగ్‌లోనూ దుమ్ము రేపిన జెయింట్స్ జట్టు మరో అలవోక విజయం అందుకుంది. గుజరాత్ స్టార్ రైడర్ సచిన్ ఈ మ్యాచ్‌లో 11 రైడింగ్ పాయింట్లతో టైటాన్స్ జట్టు డిఫెన్స్‌ను ఆటాడుకున్నాడు. సుకేశ్ హెగ్డే 7, అబొజోర్ 4 పాయింట్లతో చెలరేగారు. ట్యాకిలింగ్‌తోపాటు రైడింగ్‌లోనూ ఆకట్టుకోలేకపోయిన టైటాన్స్ జట్టు టోర్నీలో ఏడో ఓటమి మూటగట్టుకుంది. స్టార్ రైడర్, కెప్టెన్ రాహుల్ చౌదరి 3 పాయింట్లు మాత్రమే తేవడంతో తెలుగు టైటాన్స్ జట్టు పరిస్థితి దారుణంగా తయారైంది. దీనికి తోడు వికాస్ 3, రాకేశ్ కుమార్ 2 పాయింట్లు మాత్రమే సాధించారు. ఆట ఆరంభం నుంచే గుజరాత్ జట్టు జోరుగా ఆడగా.. ఏ మాత్రం పోటీ నివ్వకుండానే టైటాన్స్ జట్టు వరుసగా పాయింట్లు సమర్పించుకుంది. తొలి అర్ధభాగం ముగిసే సరికి 20-9 పాయింట్లతో గుజరాత్ జట్టు మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించింది. ఇక రెండో అర్ధభాగంలో టైటాన్స్ జట్టు కాస్త పోరాడినా ఈ ప్రదర్శన విజయం సాధించడానికి ఏమాత్రం సరిపోలేదు. జెయింట్స్ 17 రైడింగ్, 9 ట్యాకిల్, 2 ఆలౌట్, 1 ఎక్స్‌ట్రా పాయింట్ సాధించగా.. టైటాన్స్ జట్టు 12 రైడింగ్, 5 ట్యాకిల్, 2 ఎక్స్‌ట్రా పాయింట్లు సంపాదించి ఓటమిపాలైంది.

**హర్యానా స్టీలర్స్, తమిళ్ తలైవాస్ మ్యాచ్ డ్రా**

ప్రొ కబడ్డీ లీగ్‌లో బుధవారం హర్యానా స్టీలర్స్ , తమిళ్ తలైవాస్ జట్ల మధ్య ఉత్కంఠగా సాగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. తలైవాస్ స్టార్ రైడర్ ప్రపంజన్ 7 పాయింట్లతో హడలెత్తించగా.. హర్యానా స్టీలర్స్ రైడర్ సురేందర్ నడా కూడా 7 పాయింట్లతో దుమ్ము రేపాడు. రెండు జట్లు పోటాపోటీగా సమానంగా రైడింగ్, ట్యాకిల్ పాయింట్లు సాధించడం విశేషం. హర్యానా జట్టు 12 రైడింగ్, 10 ట్యాకిల్, 3 ఎక్స్‌ట్రా పాయింట్లు సాధించగా..తలైవాస్ జట్టు 12 రైడింగ్, 10 ట్యాకిల్, 2 ఆలౌట్, 1 ఎక్స్‌ట్రా పాయింట్ సాధించింది. తొలి అర్ధభాగం ముగిసే సరికి 13-10 స్కోరుతో హర్యానా స్టీలర్స్ ఆధిక్యం సంపాదించినా రెండో అర్ధభాగంలో రాణించిన తలైవాస్ జట్టు మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. మ్యాచ్ ఆఖరి నిమిషాల్లో రెండు జట్ల మధ్య ఆధిక్యం చేతులు మారింది. 24-23తో తలైవాస్ జట్టు ఆధిక్యంలో ఉన్న సమయంలో పెనాల్టీ మేట్ సమయంలో హర్యానా స్టీలర్స్ ప్లేయర్ ఆశిష్ చోకర్ 25-24తో ఆధిక్యాన్నిచ్చాడు. తలైవాస్ జట్టు తరపున ఆఖరి రైడ్ వెళ్లిన డాంగ్ జియోన్ పాయింట్ తీసుకురావడంలో సఫలం కావడంతో మ్యాచ్ 25-25 స్కోరుతో డ్రాగా ముగిసింది.

## బీసీసీఐ ఆఫీస్ బేరర్లను తొలిగించండి

### సుప్రీంకోర్టుకు సీవోఏ వినతి

**న్యూఢిల్లీ:** జస్టిస్ లోధా కమిటీ సిఫారసులను అమలు చేయడం లో విఫలమవుతు న్న బీసీసీఐ ఆఫీస్ బేరర్లను తొలిగించాలంటూ బీసీసీఐ పాలకుల కమిటీ (సీవోఏ)సుప్రీంకోర్టును కోరింది. తాత్కాలిక అధ్యక్షుడిగా కొనసాగుతున్న సీకే ఖన్నా, కార్యదర్శి అమితాబ్ చౌదరి, కోశాధికారి అనిరుధ్ చౌదరి సహ అందరినీ తప్పించాలని సూచించింది. జస్టిస్ ఆర్ఎం లోధా కమిటీ సూచించిన సంస్కరణలు అమలు చేయడంలో వీరంతా మూకుమ్మడిగా విఫలమయ్యారని వినోద్ రాయ్, డయానా ఎడుల్జిలతో కూడిన ఇరువురు సభ్యుల కమిటీ ఈ మేరకు ఉన్నత న్యాయస్థానానికి సమర్పించిన స్టేటస్ రిపోర్టులో తెలిపింది. తిరిగి ఎన్నికలు నిర్వహించే వరకు బోర్డు పరిపాలన, నిర్వహణ బాధ్యతలు తమ కమిటీతోపాటు సీఈవో రాహు ల్ జోహ్రీ నేతృత్వంలోని ప్రొఫెషనల్ కమిటీకి అప్పగించాలని కోర్టును కోరింది. అనురాగ్ ఠాకూర్, అజయ్ షిర్కేల తరహాలోనే ప్రస్తుత పాలకులు సంస్కరణలు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించారని ఆరోపించింది. వీరందరి నిర్లక్ష్యం కారణంగా మరో ఆరునెలల సమయం వృథా అయిందని విమర్శించింది. వీరందరూ సంస్కరణలు అమలు చేసేంత దృఢమైన వ్యక్తు లు కారంటూ తేల్చి చెప్పింది. జూలై 26న జరిగిన బీసీసీఐ ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో సుప్రీంకోర్టు నియమించిన ప్రొఫెషనల్ కమిటీ పట్ల వ్యవహరించిన తీరును కోర్టుకు సీవోఏ పూర్తిగా నివేదించింది. సీఈవో జోహ్రీ సహ పరిపాలక సిబ్బందిని సమావేశ హాలునుంచి వెళ్లాల్సిందిగా బీసీసీఐ ఆఫీస్ బేరర్లు కోరారని చెప్పింది.విధులు, బాధ్యతలు అధికారాల విభజనలో ప్రొఫెషనల్ కమిటీతో బీసీసీఐ సరిగా వ్యవహరించిన విధానాన్ని సీవోఏ ఎండగట్టింది.

**కోట్లలో ఖర్చులు!**

బీసీసీఐలో ఆఫీస్ బేరర్ల ఖర్చు కోట్లకు చేరుకుంది. పరిపాలన కమిటీ(సీవోఏ) బుధవారం విడుదల చేసిన ఐదో వార్షిక నివేదికలో పూర్తి వివరాలు వెల్లడించింది. ఇందులో ప్రస్తుతం తాత్కాలిక కార్యదర్శిగా కొనసాగుతున్న అమితాబ్ చౌదరీ రూ.1.56 కోట్లు ఖర్చు చేయగా, అనిరుధ్ చౌదరీ రూ.1.71 కోట్లు ఖర్చులు చేసినట్లు పేర్కొంది. మరోవైపు అజయ్ షిర్కే మాత్రం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకపోవడం విశేషం. ఇక మాజీ అధ్యక్షుడు అనురాగ్ ఠాకూర్(రూ.24 లక్షలు), సీకే ఖన్నా(రూ.6.52లక్షలు) తక్కువలో తక్కువ ఖర్చు చేశారు.

# జోరుగా హరితహారం

- మూడో విడుత లక్ష్యం 40 కోట్లు
- ఇప్పటివరకు నాటిన మొక్కలు 20. 37 కోట్లు

**ప్రత్యేక పతినిధి, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'తెలంగాణకు హరితహారం' మూడోవిడుత కార్యక్రమం లక్ష్యసాధన దిశలో వడివడిగా అడుగులు వేస్తున్నది. నలభై కోట్ల మొక్కలను నాటాలన్న భారీ లక్ష్యంలో ఇప్పటికే సగం పూర్తయింది. జూలై 12 నుంచి ప్రారంభమైన మూడోవిడుత హరితహారంలో 20కోట్ల 37లక్షల మొక్కలు నాటారు. హరితహారం లక్ష్యసాధనను అన్ని జిల్లాల కలెక్టర్లు, అన్నిశాఖల అధికారులు, సిబ్బంది సవాల్‌గా తీసుకోవడం వల్ల గత రెండేండ్లతో పోలిస్తే ఈసారి వేగం పుంజుకున్నది. ఇప్పటివరకు 23,025 గ్రీన్ బ్రిగేడ్లు ఏర్పడ్డాయి. వీటిలో 3,19,368 మంది సభ్యులుగా చేరారు. వీరు నాటిన ప్రతి మొక్కకు జియోట్యాగింగ్ చేస్తున్నారు. పది కోట్ల మొక్కలకు జియోట్యాంగింగ్ చేసినట్లు అధికారులు తెలిపారు. హరితహారం ప్రగతిని అటవీశాఖమంత్రి జోగురామన్న, సీఎస్ ఎస్పీ సింగ్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. సీఎం కేసీఆర్ ఆదేశం మేరకు అన్ని చోట్లా గ్రీన్ బ్రిగేడ్లు ఏర్పాటు చేయాలని మంత్రి జోగురామన్న అధికారులకు సూచించారు.

### మూడో విడుత హరితహారం వివరాలు.. జిల్లాల వారీగా..

| వరుస సంఖ్య | జిల్లా పేరు | ఇప్పటివరకు నాటిన మొక్కలు (కోట్లల్లో) | లక్ష్యంలో సాధించిన శాతం |
|---|---|---|---|
| 1. | నిజామాబాద్ | 1,68,354,00 | 91.00 |
| 2. | ఖమ్మం | 1.63,24,400 | 88.24 |
| 3. | వరంగల్ (రూరల్) | 82,33,600 | 74.85 |
| 4. | భద్రాద్రి | 1,19,66,200 | 74.79 |
| 5. | కామారెడ్డి | 94,03,300 | 69.65 |
| 6. | వరంగల్(అర్బన్) | 36,87,600 | 67.05 |
| 7. | జనగామ | 52,54,700 | 61.82 |
| 8. | మంచిర్యాల | 57,25,500 | 60.27 |
| 9 | సిరిసిల్ల | 47.41,400 | 59.27 |
| 10 | జోగుళాంబ | 45,32,400 | 56.66 |
| 11 | జయశంకర్ | 64,78,100 | 56.33 |
| 12. | కుమ్రం భీమ్ | 60,26,400 | 54.79 |
| 13. | జగిత్యాల | 72,51,400 | 53.71 |
| 14 | మెదక్ | 64,46,900 | 49.59 |
| 15 | సంగారెడ్డి | 97,60,600 | 48.80 |
| 16. | వనపర్తి | 38,85,400 | 48.57 |
| 17. | ఆదిలాబాద్ | 50,66,400 | 48.25 |
| 18. | సూర్యాపేట | 60,95,200 | 46.89 |
| 19. | మేడ్చల్ | 18,46,800 | 46.17 |
| 20. | జీహెచ్ఎంసీ | 45,30,500 | 45.31 |
| 21. | హెచ్ఎండీఏ | 49,21,200 | 44.74 |
| 22. | నాగర్‌కర్నూల్ | 52,53,900 | 42.08 |
| 23. | నల్లగొండ | 81,02,500 | 40.51 |
| 24. | పెద్దపల్లి | 40,29,800 | 40.30 |
| 25. | సిద్దిపేట | 76,99,900 | 38.5 |
| 26. | మహబూబాబాద్ | 44,04,900 | 38.30 |
| 27. | యాదాద్రి | 46,35,400 | 35.66 |
| 28. | కరీంనగర్ | 34,89,900 | 31.73 |
| 29. | నిర్మల్ | 31,21,500 | 31.22 |
| 30. | వికారాబాద్ | 37,60,700 | 30.09 |
| 31. | రంగారెడ్డి | 49,41,400 | 29.07 |
| 32. | మహబూబ్‌నగర్ | 52,87,000 | 26.44 |
| | | 20,37,40,400 | 50.94% |

# టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టండి

- దక్షిణ కొరియా బృందంతో మంత్రి కేటీఆర్
- కంపెనీలకు పార్కులో ప్రత్యేకంగా స్థలం కేటాయిస్తామని వెల్లడి
- టెక్స్‌టైల్‌కు ప్రభుత్వ ప్రాధాన్యం ఆకట్టుకుంది: కొరియా బృందం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**



బుధవారం బేగంపేట క్యాంపు కార్యాలయంలో ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్‌తో సమావేశమైన కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీస్ చైర్మన్, యంగ్‌వన్ కార్పొరేషన్ అధినేత కిహాక్ సుంగ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం. చిత్రంలో మంత్రి మహేందర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో ప్రధాన పెట్టుబడిదారులుగా ఉండాలని దక్షిణ కొరియా టెక్స్‌టైల్ ప్రతినిధుల బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారక రామారావు కోరారు. పార్కులో కొరియా కంపెనీలకు ప్రత్యేకంగా స్థలం కేటాయించడానికి కూడా సిద్ధంగా ఉన్నామని ఆయన వెల్లడించారు. బుధవారం బేగంపేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి కేటీఆర్‌తో దక్షిణ కొరియాకు చెందిన కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీస్ చైర్మన్, యంగ్‌వన్ కార్పొరేషన్ అధినేత కిహాక్ సుంగ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం భేటీ అయింది. ఈ సందర్భంగా మంత్రి.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, అందులోని సౌకర్యాల గురించి కొరియా బృందానికి వివరించారు. రెండువేల ఎకరాల్లో ఏర్పాటుచేసే పార్కు దేశీయ, అంతర్జాతీయ పరిశ్రమలకు వేదిక కాబోతుందని చెప్పారు. ఇందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను కల్పిస్తామని, ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన కంపెనీలకు దేశంలోని ఏ రాష్ట్రంలో లేనివిధంగా రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్మికుల్లో నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేకంగా ఓ శిక్షణ సంస్థను ఏర్పాటు చేస్తున్నామని, దీనిద్వారా అంతర్జాతీయ కంపెనీలకు నైపుణ్యం ఉన్న కార్మికులు అందుబాటులో ఉంటారని చెప్పారు. టీఎస్ఐపాస్ ద్వారా 15 రోజుల్లో అనుమతించే నూతన పారిశ్రామిక విధానాన్ని తీసుకొచ్చామని కొరియా బృందానికి మంత్రి వివరించారు.

**వరంగల్‌లో ఎయిర్ స్ట్రిప్ కోసం ప్రయత్నాలు: కేటీఆర్**

టెక్స్‌టైల్ రంగానికి తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యం తమను ఆకట్టుకున్నదని సుంగ్ చెప్పారు. పార్కుకు అవసరమైన విద్యుత్, కార్మికుల లభ్యత, ప్రోత్సాహకాల గురించి అడిగి తెలుసుకున్నారు. వరంగల్‌లో విమానసౌకర్యం గురించి ఆరా తీశారు. దీనిపై స్పందించిన మంత్రి కేటీఆర్ అంతర్జాతీయ పెట్టుబడిదారులను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి త్వరలోనే వరంగల్‌లో ఎయిర్ స్ట్రిప్‌ను అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. దక్షిణ కొరియా ప్రతినిధులు గురువారం వరంగల్‌లోని మెగా టెక్స్‌టైల్ పార్కు స్థలాన్ని పరిశీలించనున్నారు. ఈ సమావేశంలో రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, చేనేత జౌళీశాఖ డైరెక్టర్ శైలజా రామయ్యార్, టీఎస్ఐఐసీ ఎండీ ఈ వెంకట నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఇంటిపన్ను లెక్కింపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

గ్రామపంచాయతీల్లో ఇంటిపన్ను లెక్కింపు (అసెస్‌మెంట్) సమస్యలు త్వరలోనే పరిష్కారం కానున్నాయి. ఇంటిపన్ను లెక్కింపు మరింత పకడ్బందీగా జరుగనున్నది. పన్నును ఇక కంప్యూటరే లెక్కించి వెల్లడించనుంది. దీనికోసం పంచాయతీ రాజ్‌శాఖ కొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నది. కొత్త ఇంటిపన్ను లెక్కింపు విధానంలో.. ఇల్లు ఉన్న ప్రాంతంలో రిజిస్ట్రేషన్ విలువ ఎంతనేది రిజిస్ట్రేషన్‌శాఖ ద్వారా కంప్యూటర్‌కు అనుసంధానమవుతుంది. అక్కడి భవన స్వరూపం ఆధారంగా దాని విలువ ఎంతనేది ఇంజినీరింగ్‌శాఖ నుంచి లభిస్తుంది. పంచాయతీ సిబ్బంది తొలుత ఇంటిని పరిశీలించి అది ఉన్న ప్రాంతం, దాని విస్తీర్ణం, నిర్మాణ స్వరూపాలను కంప్యూటర్‌లో పొందుపరుస్తారు. ఇల్లు ఏ తరహాకు చెందినదో నమోదు చేస్తే.. వెంటనే పన్ను ఎంతనేది తెలిసిపోతుంది. ఈ విధానం అమల్లోకి వచ్చాక కొత్త ఇండ్లకు, ఇంతవరకు లెక్కింపు చేసుకోని ఇండ్లకు మాత్రమే వర్తించనుంది. ఇప్పటికే పన్ను కడుతున్నవారు మళ్లీ కంప్యూటర్ ద్వారా లెక్కగట్టించుకోవాల్సిన అవసరం లేదు. త్వరలోనే దీన్ని రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి తేనున్నట్లు పంచాయతీరాజ్ శాఖ అధికారులు వెల్లడించారు. సాధారణంగా గ్రామాల్లో భూవిస్తీర్ణం, భవన వైశాల్యం ఆధారంగా పంచాయతీ అధికారులు ఒకసారి ఇంటిపన్ను నిర్ధారించాక .. ఏటా ఆ మొత్తాన్ని యజమాని చెల్లించాల్సి ఉంటుంది. లెక్కలు వేసేది సిబ్బందే కావడంతో పలుచోట్ల ముడుపులు ఇచ్చిన వారికి తక్కువ, ఇవ్వని వారికి ఎక్కువ పన్ను లెక్కిస్తున్న ఘటనలు కన్పిస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగర శివార్లతోపాటు పట్టణ ప్రాంతాలకు సమీప గ్రామాల్లోని పంచాయతీ సిబ్బంది ఈ విషయంలో పెద్దఎత్తున చేతివాటానికి పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొత్త విధానంతో సమస్యలకు చెక్ పడనున్నది.

# వరుస ఉత్సవాలకు సిద్ధమవుతున్న సాంస్కృతికశాఖ

- కాళోజీ జయంతి, తెలుగు మహాసభల కార్యాచరణపై కసరత్తు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్ర భాషా, సాంస్కృతికశాఖ వరుస ఉత్సవాలకు సిద్ధమవుతున్నది. సెప్టెంబర్ 9న కాళోజీ జయంతి ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. అక్టోబర్ 22 నుంచి నిర్వహించతలపెట్టిన ప్రపంచ తెలుగు మహాసభల కార్యాచరణను ఖరారు చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించిన విషయం తెలిసిందే. గత మూడేండ్లుగా నిర్వహిస్తున్న తరహాలోనే ఈసారి కూడా ఘనంగా ఉత్సవాలను జరిపేందుకు భాషా, సాంస్కృతికశాఖ సిద్ధమవుతున్నది. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక, తెలంగాణ జాగృతి, తెలంగాణ సాహిత్య అకాడమీల సారథ్యంలో పెద్దఎత్తున సాహిత్య కార్యక్రమాలను నిర్వహించనున్నారు. కాళోజీ పేరిట తెలంగాణలోని గొప్ప సాహితీవేత్తకు అవార్డును ఇచ్చి సత్కరించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రపంచ తెలుగు మహాసభలకు సంబంధించి వరుసగా సాహితీ మిత్రులతో సమావేశాలను జరుపుతున్నారు. ఈ చర్చల సారాంశాన్ని సీఎం కేసీఆర్‌కు నివేదించనున్నారు. దీంతోపాటు తెలుగు భాషా విశిష్ట కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలను వేగవంతం చేశారు. కేంద్ర ప్రభుత్వం సూచనల ప్రకారం తెలుగు భాషా విశిష్ట కేంద్రం ఏర్పాటుకు ఆర్ట్‌గ్యాలరీలో భవనాన్ని కేటాయించారు.



